


జననం
2-10-1869

నిర్యాణం
30-1-1948

"ధర్మ సంస్థాపనార్థాయ - సంభవామి యుగే యుగే"





వికృతి
మాఘము

భారతి

సంపుటము 28
సంచిక 2

సంక్రాంతి

●

శ్రీ మల్లంపల్లి రామలింగం

ప్రాలేయాచల కందరాంతర చల త్ప్రావృట్పయోవాహా స
ప్రాలంబంబుగ నంపనోచిత సుమ్నగ్రైవేయ సంభాసితుల్
లీల న్గిన్నరరాజు లిచ్చకముల న్లేలీహానాభాసు సం
ధ్యాలక్ష్మీ పరితర్పితారుణదృశా దర్పు ల్చరింతు ర్వడిన్.

రజతగిరిప్రకామ విహార చ్చమరీచయవాలసంచయ
ప్రజనిత వాయుసేవితులు పార్వతిశంకరు లిచ్చమెచ్చుచున్
విజయ జయప్రధాన పదవీముదితాత్ములు సామరాఘు నీ
రజనయనా జయాంకరుచిర శ్రుతిమేదుర పార్శ్వ లాదురో!!

స్మయమాతంగ మదాపనోదగరిమ న్సంక్రాంతి సంపన్నమై
జయచిహ్నాంబుల నంగనామణులు నుత్సాహింతు రశ్రాంత సం
శ్రయసంజాత హసంతికాపరిచయ స్వాదుప్రియాలాప ని
శ్చయవిశ్వాసితలై యహర్ముఖము నాశాసింత్రు బుష్పాంజలుల్.

దేవనదీ నిరంతర వితీరణ మగ్ననభోవలగ్నలన్
శ్రావిత నావికప్రవణ సంకలితప్లవరాగ నాగర
ద్రోవిటసంచయప్రథము దోహదవిత్తముగాఁ, దుషారసం
ప్రావృత శాద్వలస్థలము భాసిలు వాసిత కృష్ణశాబమై.

శీతాంశుఖండ సంశ్రిత మయూఖావళీ - జాతసంతాప మబ్జాతచయము
శరవణ నికర భాస్వరకాండ దత్తావ - కాశము పుండరీక వ్రజంబు
పార్వతీవదన పర్వసుధాంశు భూషిత - ప్రోషిత గంగా శిరోవసథము
శివ వృషసంఘాత శిథిల హిమానీన - ముల్లాసి తాప్సరో వల్లభంబు.
నీలకంఠ కలాలాప నిష్కుటట భు - జగ వినిర్ముక్త నిర్మోక విగళితాశ
శారదవనమ్ము సోపర్వ సమర రమణ - శర్వరీసార్వభౌమ సంవర్ధితంబు
తెలతెల్లనై దిశాలలనల ముఖము ని - శ్వాసించు సరసిజసౌరభమ్ము
నీల తమాలనిర్జిత తామసరుచి - శోభిత కానన ప్రాభవమ్ము
కలహంసకామినీ కలసితగమన ని - శ్వాసిత రథ్యాకవాటలోష్ఠ
ధనురభిధాన సంధాన పౌరందర - చర్చిత శార్ఙ్గ సమర్చనంబు
శీత శీతమ్ము శ్రావణ శ్వేతజలద - విరళవిమలాకసమ్ము శంకరనిరస్త
భస్మకోణప్రమాణ పటు,సుభోగి, - దండకాష్ఠనిర్దాహ హుతాశనమ్ము.

హారిహాయహేతిఘాత పరిహాసిత దీర్ఘహాసా వినూతన
స్ఫురిత నిలింపలోకము; సుశోభిత కుంభజదత్తవారి మే
దుర సుషమావకాశము; విదూర మణిప్రథమావతారమున్
బరశుధరప్రమోహాన సభాశ్రితరామము కార్తికాగమున్.

వారిజేక్షణ లంగణమ్మున వారి జల్లుచు బంతులన్
సారసంబుల నుంచుచున్; బలుసాయము ల్వొనరించుచున్
జారవారము సంతురాత్రి నిశాసమేతము; గొబ్బిళుల్
మీర నర్చనసేసి కొల్చిరి మేదినిం జలివేళలన్.

ఆవుల పెర్మలి నుదవిహాయసలక్ష్మి నలంకరింప శృం
గావృతమున్వొనర్చి; పరిహాస మెలర్పగ దానమాడిరా?
బావలు, బాలులన్ బరిణబంతులు బొమ్మలు జేహళీసమా
జావిలము న్వొనర్చిరి నిజాయతనంబులఁ బౌష్యలక్ష్ములై.

కపురపువన్నియ ల్బలు వికారపు గందపు గిన్నెలందునన్
ద్రప నిడి రంబుజేక్షణలు; రాజిత గుగ్గులుకాండఖండముల్
విపుల విలోచనాపులకవిస్తర రమ్యకపోలదర్పణ
ప్రప వసియింతు రిందుఁ దమిఁ బాలురు బాలికకేళి జాల్ములై

నందనచందనశ్రయిత నాక రమా పరిలబ్ధ మందిర
స్యందితమా హిమాద్రితనయా నివహమ్ములా, నాగ భామినీ
బృందము డెందమందునన భీతలు నేతలు వీడి మత్సరీ
మందుర కందమార్గమున మానిను లేగుదు రుత్సవంబునన్.

కర నైసాల వికాస మానస సుతా కల్పత్రపా మంగళ
త్వరిత ప్రావృతపూజపాత్రలు ధరాతన్వంగుల న్వైరటం
బరుగ న్రమ్మన నేర్చు నిందిరలు నాఁ బంకేరుహాస్యల్ కరం
బరుదై మింతురు నాథసంవరణ సంభావమ్ముఁ దోపింపఁగన్.

హరిణ కిశోరము ల్తరుణ హాలికశాబములు న్నిశావసా
న రచిత ప్రాంగణావసథ నాగరశిల్ప కళారమ స్ఫురిన్
బరిణయవృత్తిఁ బల్తు రభిలాషల సోలుచు నిచ్చఁ దేలుదుర్.
నరవర సౌధవీథుల ననామయము న్బ్రసరింతు రాటలన్

సాయంకాలసమాప తద్భ్రమర నిశ్వాసప్రభాశోభిత
ప్రాయశ్చంపక పుష్పసౌరభవిభ్రాంతి స్ఫురత్స్తోమ ని
ధ్యేయశ్రీచతురప్రియాపరిచయధ్యేయ స్వరాపాదియై
నాయంబుం బొనరించు దేవరలు సంతాపించి సంక్రాంతియున్

ప్రతిదిన దేహళీనిచిత పర్వసరోజ శుభాంకలక్ష్మికిన్
రతి యొనరించి సుందర ధరామరకామినులం గమించు సా
గత తత వేషధారియయి కాళగళు న్వృషభంబు మించులన్
సతమత మందఁ జేయు నవశాత విషాణముల న్గ్రహమ్ములన్.

వందురనేల యీ వెనకు వత్తురె? కామినులో లతాంగి! భా
వేందిర! మందిరాంగణపరీక్షణ నేలనె? వింత యేల? సి
సుందరవక్త్రచంద్ర శుభశోభల! సితలుపు ల్గటాక్ష సం
స్యందిత బాష్పతోయముల జాలుగ నిల్పుము; దారి తప్పితో?
కలువల సారసమ్ములఁ ప్రకాశముగా నిను నర్చసేసిరా?.

వెలపడతు ల్బరేందిర నవీనసుధామయ కుంభసంభృత
చ్ఛలమున మోహము న్గొలిపి సాజముగా నిల భక్తు లాడుచున్.
పలితశిరస్కులై శుభవిపాకులు వత్తురు వోదు రాపథిన్

బావలఁ దన్పుచు న్సరసభాషలఁ గామిను లంగజన్మసం
భావితవాంఛితల్ బవలు పండువుసేసిరి రామ శార్ఙ్గవి
ద్రావితరావణప్రతిమ రాజిత కుర్కురకేళులం గలా
సేవ యొనర్తురే కనుమ శేవధి పామరకోటి కెప్పుడున్

దరియదుగాని ముందర సుదర్పముగ మ్మన మాపటేలు; దే
వర! శరవేగమైత్రిగుణవంచితము న్ప్రసరించు గండలన్
బిరబిరఁ జమ్ముగ్రుమ్ముఁ దలపించును గొమ్ముల నుత్సవేంది రా
పరిణయతోషమైన గరపార్శ్వముల న్నడి సంక్రమంబునన్.

భూకంపాలు

★

శ్రీ ఎ. వి. యస్. రామారావు

గత ఆగష్టు ౧౫వ తేదీని అస్సాంలో అభోర్ కొండలప్రాంతమందు కలిగిన భూకంపాన్ని గూర్చిన వార్తలు వింతయైనవీ, విడ్డూరమైనవీ, హృదయాన్ని కలచివేసేవీ చాలా చదివేము. అక్కడ భూమి సెప్టెంబరు 15వ తేదీవరకూ కూడా కంపిస్తూనే యుంది. సెప్టెంబరు 15 వ తేదీని డిబ్రూఘర్ ప్రాంతంలో భూమి మూడుసార్లు కంపించినట్లూ, ఆగష్టు 15వ తేదీనాటి తీక్ష్ణమైన భూకంపానికి తట్టుకొన్న యిళ్లలో చాలాభాగం ఆనాటి భూకంపపు టదురులకు బాగా దెబ్బతిన్నట్లూ తెలియవచ్చినది. మన తరంలోనే లోగడ క్వెట్టా, బీహారులలో కలిగిన భూకంపాలకంటె ఈ సంవత్సరం అస్సాంలో కలిగిన భూకంపం చాలా తీక్ష్ణమైనదని విజ్ఞు లభిప్రాయ పడుచున్నారు. ఈ భూకంపంవల్ల ధన ప్రాణాలకు ఎంతనష్టం వచ్చిందో ఇంకా పూర్తిగా తెలియదు. కాని హెచ్చు పరిమాణంలోనే నష్టం సంభవించి యుండు ననుటమాత్రం నిశ్చయం. ఆ సమయంలోనే బ్రహ్మపుత్రానదికి వరదలుకూడా బాగా వచ్చుటచే నష్టం మరింత అధికమైంది.

అస్సాంలో ఆగష్టు ౧౫వ తేదీని కలిగిన భూకంపపు టదురు సుమారు 4 నిమిషాలవరకు ఉందిట. ఈ భూకంపంవల్ల ఎక్కువగా నష్టపడింది డిబ్రూఘర్ ప్రాంతం. అక్కడ ఒక చోట భూమి బ్రద్దలై, ఆ పగులులోనుంచి ఇసుకా, నీరు పైకి చిమ్ముటచే, అధిక విస్తీర్ణమైన భాగం ఇసుకమయ మైనది. ఇక ఆ భూకంపపు టదురుకు ఎన్ని ఇళ్లు కూలిపోయినవో! ఎన్ని భవంతులు నివాసమున కనర్హము లైనవో!! ఈ భూకంపం కలిగేముందు ఒక విధమైన భయంకర శబ్దం అక్కడ వినవచ్చినదట. ఆ శబ్దస్వభావాన్ని గూర్చి నలుగురు నాలుగు రీతులుగా చెప్పుచున్నారు.

ఈ భూకంపంవలన సంఘటించిన వింతైన విషయ మొకటి-హిమాలయపర్వతాల ఎత్తు 200 అడుగులు అధికం కావడం.


ఈ సంవత్సరం కలిగినంత తీక్ష్ణమైన భూకంపం అస్సాంలో కలగడం యిదే మొదటిసారి కాదు. 1897లో కూడా చాలా తీక్ష్ణమైన భూకంపమే యొకటి అస్సాంలో కలిగింది. భూకంపం అనుభూతమైన ప్రదేశమందంతటా భూకంప తీక్ష్ణత ఒకే పరిమాణంలో ఉండదు. పరిమితమైన ప్రదేశంలో దాని తీక్ష్ణత చాలా ఉద్ధృతంగా యుండి, ఆ ప్రదేశాన్నుండి దూరానికి పోయినకొలది క్రమంగా దాని తీక్ష్ణత తగ్గుతుంది. భూకంపతీక్ష్ణత చాలా ఎక్కువగా నున్న ప్రదేశానికి 'మైజోసీస్మల్ ఏరియా' (*Meizoscismal area*) అని పేరు. భూకంపంవల్ల భూమి పొందే మార్పులన్నీ ఎక్కువగా యీ ప్రదేశానికే పరిమితమై యుంటవి. భూకంపంవలన ఆస్తికీ, ప్రాణానికీ సంభవించే నష్టమంతా ఈ ప్రదేశంలోను, దాని పరిసర ప్రాంతంలోను కలుగుతుంది. 1897 అస్సాం భూకంపంలో ఈ 'మైజోసీస్మల్ ఏరియా' విస్తృతి సుమారు 6, 000 చతురపు మైళ్ళవరకు ఉంది. అంత హెచ్చువిస్తీర్ణపు 'మైజోసీస్మల్ ఏరియా' లు గల భూకంపాలు చరిత్రలో చాలా తక్కువగనే యున్నవి. ఈ భూకంప ఫలితంగా అధిక విస్తృతమైన ఆ భాగంలో భూపటలపు ఆకారమంతా పూర్తిగా వికలమైనది. షిల్లాంగ్‌లో భూమి కేవలం తుపాను సమయంలోని సముద్రంవలె అల్లాడడం ఆరంభించినది. కాని ఆశ్చర్య మేమిటంటే, భూమి అట్లా అల్లాడడం కేవలం అనుభూత మగుటయేగాక దృగ్గోచరం కూడా అగుటయే! అది చాలా అపురూపమైన సంఘటన. ఇక ఆ తీక్ష్ణ భూప్రకంపనఫలితంగా భూతలము నుండి రాళ్లు అధిక వేగంతో పైకి త్రుళ్లిపడ్డవి; కొన్ని చోట్ల పర్వతపు గుట్టలు భూమిలోనికి దిగిపోయినవి. నదుల శయ్యాలలో మిట్టపల్లము లేర్పడి, తన్మూలంగా ప్రవాహాలకు పలుచోట్ల పెద్ద అడ్డంకు లేర్పడగా ప్రవాహముల గతులే చాలా ప్రదేశాలలో మారిపోవడం, మరికొన్ని తావులలో ఆ ప్రవాహాలు గుండా

లుగా పరివర్తనం చెందడం సంభవించినది. కొన్ని పర్వతప్రదేశాలలో సుదీర్ఘమైన పగుళ్లేర్పడుటచే ఆ పర్వతాల వాలులందున్న చెట్లు తుత్తునియలై పోయినవి, కొన్నిచోట్ల రాళ్ళు పిండి గుండా అయిపోవడము, మరికొన్నిచోట్ల ఒక ప్రదేశము నుండి వేరొక ప్రదేశమునకు విసరివేయబడడము జరిగింది. అ ఏర్పడిన పగుళ్ళలో ఒకదాని నిడివి రమారమి ౭ మైళ్ళవరకును ఉన్నది. మరికొన్ని ప్రదేశాలలో భూతలముపై పగుళ్ళు ఏమీ లేకుండగనే, పర్వతాలలో కొంతభాగం దిగబడిపోయి,అక్కడ కది అనుదైర్ఘ్యం(*Lengthwise*)గాను, నిటారుగాను నరుక్కుపోయిన ట్లయినవి. ఇట్లేర్పడినవాటి నిడివి ఒక్కొక్కచోట ౧౨. మైళ్ళవరకును ఉందట! ఆ కొంప నరకులఎత్తు, గరిష్ఠపరిమాణ మున్నచోట, సుమారు ౩౫ అడుగులు !!

పైన పేర్కొనిన బీభత్సం అంతా కేవలం 'మైజోసీస్మల్ ఏరియా'లో జరిగింది మాత్రమే. కాని ఆ భూకంపంవల్ల వచ్చిన నష్టమంతా అంతమాత్రమే కాదు. రమారమి ౧,౬౦,౦౦౦ చతురపుమైళ్ళ వైశాల్యంలోనున్న కట్టడాలన్నీ ఆ భూకంపంవల్ల దెబ్బతిన్నవి. ఇక ఆ భూకంపఫలితంగా చనిపోయినవా రెందరో! ఎంత ఆస్తి నష్టమైనదో!! ఆ భూకంపపు టదురు సుమారు ౧౭,౫౦,౦౦౦ చతురపు మైళ్ళప్రదేశంలో అనుభూతమైనదట !!

భూకంప మండలాలు :

ప్రపంచమొత్తంమీద శతాబ్దాలనుండీ సంభవించిన భూకంపాలను పరిశీలిస్తే, భూగోళమం దంతటా అవి సమంగా వ్యాప్తిచెంది లేవనీ, కొన్ని ప్రదేశాలకు మాత్రమే అవి పరిమితమై యున్నవనీ విశద మవుతుంది. అనాదినుండి మానవుడు భూకంపాలను గుర్తిస్తూనే యున్నాడు; వాటి ఫలితాలను అనుభవిస్తూనే యున్నాడు. అయితే ౧౯ వ శతాబ్ది చివరిభాగం నుండిగాని వాటినిగూర్చిన క్రమబద్ధ పరిశీలన కాతడు పూనుకొన లేదు. అంతటినుండియు గావింపబడిన పరిశోధనలవలన ప్రపంచంలో స్థూలంగా రెండు భూకంపమండలా లున్నవనీ(*Earth Quakc Belts*) భూగోళంపై కలిగే భూకంపాలలో ఎక్కువభాగం యీ మండలాలకే సంబంధించి యున్నవనీ విశదమైనది. వీటిలో ఒక మండలానికి 'మధ్యధరామండలము, లేక, 'అల్పినో—కకేషియన్—హిమాలయ' మండలమని పేరు. ఈ మండలము అటు స్పెయిన్ దేశమునుండి, యిటు హిమాలయపర్వతప్రదేశాన్ని దాటి బర్మావరకును వ్యాపించియున్నది. ఇక రెండవ మండలానికి పసిఫిక్ సముద్రావృతమండ



గీతలున్న భాగములు భూకంపమండలములు

ముల (*Circum - Pacific belt*) లేక, ఇండో-జపానీజ్ - మలయన్ మండలమనీ పేరు. దక్షిణఅమెరికా లోని ఆండీజ్ పర్వతప్రదేశము, ఉత్తర అమెరికా లోని రాకీ పర్వతప్రాంతము, జపాన్, చైనా, ఇండో - చైనా, తూర్పు - ఇండియాదీవులు, ఆస్ట్రేలియాలోని ఆగ్నేయభాగము—ఈ మండల మందున్న ముఖ్య ప్రదేశములు.

మాంటేసస్ (*Montessus*) విజ్ఞాన పరిశోధనల ఫలితంగా మొత్తం భూతలంపై కలిగిన ప్రతి ౧౦౦ భూకంపాలలోను ౩౪ భూకంపాలు పసిఫిక్ సముద్రావృత మండలంలోను, ౫౩ భూకంపాలు మధ్యధరాసముద్రమండలంలోను, ౯ ఇతర ప్రదేశాల లోను కలుగుచున్నవని విదితమైంది. ఈ మండలాలను నిర్ణయించుటలోను, వాటియందు కలిగే భూకంపాల నిష్పత్తిని కనుగొనుటలోను, చిన్నవీ, పెద్దవీ, అన్నింటిని కలిపి మొత్తం ౧, ౬౦, ౦౦౦ భూకంపాలను అతడు పరిగణించేడు. మానవునకు అనుభూతం కాక కేవలం భూకంపలేఖినుల వలననే తెలియవచ్చినవాటినికూడా అతడు గణన లోనికి తీసికొన్నాడు. ఇక నీ మండలాలలోనైనా అంతటా సమంగా భూకంపాలు వ్యాప్తమై లేవు. కొన్ని భాగాలలో చాల తక్కువగనే భూకంపాలు కలగడం, మరి కొన్ని తావులలో మరీ ఎక్కువగా కలగడం జరుగుచున్నది.

౧౯ వ శతాబ్ది మొత్తంమీద ప్రపంచమంతటి లోను మిక్కిలి విధ్వంసకరంగా పరిణమించిన భూకంపాలను మాత్రమే పరిగణించినట్లయితే ౩౯ చైనా లోను, ౨౨ జపాన్‌లోను, ౨౧ ఫిలిప్పైనులలోను, ౧౯ గ్రీస్‌లోను, ౧౬ ఇటలీలోను, ౧౧ చిలీలోను, ౭ పెరూలోను, ౧—భారతదేశంలోను కలిగినట్లు విశదమవుతుంది.

పర్యవసానం :

పై విషయాలనుబట్టి ఇటలీ, చైనా, జపాన్, గ్రీస్, చిలీ, పెరూ మున్నగు దేశాలలో భూకంపాలు తరచు కలుగుచుండుననీ, అవి చాలా విధ్వంసకరమైనవనీ, స్విట్జర్‌లాండ్, గ్రేట్‌బ్రిటన్‌వంటి దేశాలలో చాల అరుదుగ మాత్రమే భూకంపాలు సంభవిస్తవనీ, అవియైనా ఎక్కువ విధ్వంసకరమైనవి గావనీ విదిత మవుతుంది. పోగా రష్యా, దక్షిణాఫ్రికా, మధ్యయూరప్ మున్నగు భూభాగాలలో సాధారణంగా—ఇంచుమించు ఎన్నడూకూడా—భూకంపాలే కలుగవు.

ఇంతవరకు మనం చర్చించినదానినిబట్టి మరియొక విషయంకూడా ద్యోతకం కాకపోదు. ప్రపంచంలో క్రొత్తగా ఏర్పడిన భూభాగంలోనే భూకంపాలు కలుగుచున్నవనీ, పురాతనభాగంలో ఏవీ కలుగుటలేదనీ స్పష్టమవుతుంది.

మాంటేసస్‌విజ్ఞాని నిశిత పరిశోధనల ఫలితంగా ఇంకొక విషయంకూడా శాస్త్రజ్ఞులు తెలిసికోగలిగేరు. "భూకంపమండలాలలోకూడా సాధారణంగా భూమి ఏటవాలుతనం ఎక్కడ ఎక్కువగా ఉంటుందో అక్కడనే ఎక్కువ భూకంపాలు—మిక్కిలి తీక్ష్ణమైనవీ—కలుగుటకవకాశమున్న" దనేదే ఆవిషయం. జపాన్ దేశాన్ని దృష్టాంతంగా తీసికొంటే మన కావిషయం బాగుగా అవగత మవుతుంది. ౧౮౯౫, ౧౯౦౫ సంవత్సరాల మధ్యకాలంలో జపాన్‌దేశమందు కలిగిన ౨౫౮ భూకంపాలలోను రమారమి ౧౪౫ పసిఫిక్ మహాసముద్రాన్ని చేరియున్న మండలభాగంలోను, ౯ మాత్రమే జపాన్‌సముద్రతీర భాగంలోను కలిగినవి. జపాన్‌సముద్రపులోతు ఎక్కడాకూడా ౧౬౪౬ ఫేదములకంటె ఎక్కువ లేదు. ఆ సముద్రశయ్యా ఏటవాలుతనము ఎక్కువగా ఉన్నచోట* ౬౧ కి, ౧ నుండి తక్కువగా ఉన్నచోట ౨౦౦ కి ౧ వరకు మారుతుంది. ఇక పసిఫిక్‌మహాసముద్రపులోతు ౪౩౮౬ ఫేదముల (నిలువుల) వరకును ఉంది. అంతేగాక దాని ఏటవాలుతనముకూడా చాల హెచ్చు. ౨౮ కి ౧ నుండి, ౧౬ కి ౧ వరకు అది మారుతుంది.

ఇక చాలమంది అగ్నిపర్వతాలకీ, భూకంపాలకీ అవినాభావసంబంధ మున్నదనీ, అగ్నిపర్వతమండలంలోనే భూకంపాలు ఎక్కువగా కలుగుచున్నవనీ అభిప్రాయ పడుచుందురు. కాని అది పూర్తిగ నిజం కాదు. అగ్నిపర్వతప్రకోపంవల్లకూడా భూమి కంపించుట సంభవించినా, ఆ కంపం చాలా తక్కువ తీక్ష్ణతలోనే యుంటుంది. పైగా అది కేవలం స్థానికము మాత్రమే. దానికుదాహరణగాకూడా జపాన్

---

* ౬౧ కి ౧, అంటే ౬౧ యూనిట్లదూరమునకు ౧ యూనిట్ లోతు హెచ్చగుట.

దేశాన్ని మనం పేర్కొనవచ్చు. జపాన్ దేశంలో దేశమధ్యమందు పర్వతమయామై యున్న ప్రాంతం అగ్నిపర్వతమండలం. తీక్ష్ణమైన అగ్నిపర్వత ప్రకోపాలు తరచుగా అక్కడ సంభవిస్తూనే యుంటవి. కాని ఆ ప్రదేశాన్ని 'మైజోసీస్మల్ ఏరియా'గా నేర్పరచుకుని యున్న భూకంపాలు ఇంచుమించుగా ఏమీ లేనేలేవు. మధ్య అమెరికాలో ఇంచుమించు చల్లారిపోయిన అగ్నిపర్వత పార్శ్వముపై నిర్మితమైన పాత గాటిమాలాపట్టణం భూకంపాలవలన రెండు శతాబ్దాలలోను ఏడుసార్లు ధ్వంసమైనది. ఇక చైతన్య స్థితిలోనే యున్న అగ్నిపర్వతానికి చేరువగా కట్టిన క్రొత్తపట్టణానికి భూకంపాల ప్రమేయమే ఇంత వరకు లేదు. దానినిబట్టి అగ్నిపర్వతాలకూ, పెద్ద భూకంపాలకూ సంబంధ మేమి లేదని విదిత మనుతుంది.

సాంకేతిక పదాల వివరణ :

భూకంపాలలో ఎన్ని రకాలున్నావో, వాటి ఫలితాలేమిటో తెలిసికొనుటకు పూర్వం కొన్ని పారిభాషిక పదాలతో పరిచయం చేసికొనుట ముఖ్యం. భూకంపపు టుత్పత్తి స్థానం భూతలంపైగాక ఎల్లపుడు భూగర్భంలోనే ఉంటుంది. ఆ స్థానానికి భూకంపకేంద్రం లేక, భూకంపనాభి (*Focus*) అని పేరు. భూకంపనాభికి నిట్టనిలువుగా భూతలంపై నున్న స్థానాన్ని ఉత్కేంద్రం (*Epicentre*) అని పేర్కొందురు. భూకంపతీక్ష్ణత ఉత్కేంద్రందగ్గర అత్యధికంగా ఉండి, దానినుండి దూరానికి పోయిన కొలది తగ్గుతుంది. భూకంపపు అదటు తీక్ష్ణత సమంగా ఉన్న ప్రదేశాలగుండా గీసినరేఖలకు సమభూకంప తీక్ష్ణరేఖలని (*Isoseismous lines*) పేరు. భూకంపతీక్ష్ణత చాల ఉద్ధృతంగా ఉండి, తత్ఫలితంగా భూపటల ఆకారంలో ఎంత మేరవరకు మార్పులు వచ్చునో, ఆ విస్తీర్ణానికి 'మైజోసీస్మల్ ఏరియా' (*Meizoseismal area*) అని పేరు. ఇక పరికరసహాయం లేకుండగ భూకంపపు అదటు ఎంత వరకు అనుభూత మగుతుందో ఆ ప్రదేశానికి వికలిత ప్రదేశమని (*Disturbed area*) సాంకేతికనామము. భూకంపం తెరలుతెరలుగా వచ్చినపుడు మిక్కిలి తీక్ష్ణమైనట్టియు, ముఖ్యమైనట్టియు అదరుకు ప్రధానపు అదరనీ (*Prnicipal shock*) దానికి ముందువచ్చిన వాటికి 'ముందటి అదురులనీ' (*Fore-shocks*) వెనుక వచ్చినవాటికి 'వెనుకటి అదరులనీ (*Aftershocks*) పేర్లు.

భూకంపాలలో రకాలు:

పెద్ద భూకంపాలకు, అగ్నిపర్వతాలకు సంబంధం ఏమీ లేకపోయినా, పైన పేర్కొనినట్లు అగ్నిపర్వత ప్రకోపాలతో అవినాభావ సంబంధ మేర్పరచుకొన్న భూకంపాలు కొన్ని లేకపోలేదు. అగ్నిపర్వతాలతో సంబంధమున్న భూకంపాలకూ, వాటితో సంబంధంలేని వాటికీ గల వ్యత్యాసాన్ని చాలకాలం క్రిందటనే శాస్త్రజ్ఞులు గుర్తించేరు. హోర్నస (*Hoernes*) అనే విజ్ఞాని భూకంపాలను పెక్కింటిని జాగ్రత్తగా పరిశీలించి, వాటిని మూడు తెగలుగా విభజించేడు. శిలాపాత భూకంపము (*Rock-tale*), అగ్నిపర్వతీయ భూకంపము (*Volcanic*) టెక్టోనిక్ భూకంపము (*Tectonic*) అని వాటికి పేర్లు.

శిలాపాత భూకంపం|:

పెద్ద కొండ ఏదైనా విరిగిపడితే తన్మూలంగా అక్కడి భూమి కంపించవచ్చు అది కేవలము స్థానికము. అట్లు కలిగినవే శిలాపాతభూకంపాలు. ఇవి అంత ముఖ్యమైనవి కావు. వాటివల్ల ఆస్తికీ, ప్రాణానికీ ఏమీ నష్టంకూడా సంభవించదు. దక్షిణాఫ్రికాలో జోహన్నుబర్గు ప్రాంతమందు కలిగే భూకంపాలు ఇట్టివే. జోహన్నుబర్గుకు దక్షిణంగా ఉన్న బంగారుగనులను త్రవ్వటలో ఒక్కొక్కపుడు పెద్ద పెద్ద రాళ్లు విరిగి ప్రక్కగోతిలోనికి పడవచ్చును. అట్టి సమయాలలో ఆరాతిపై ఆనియున్న భూభాగము సర్దుకొనుటలో కొద్దిగా చలింపగా, అదియే భూకంపంగా పరిసరప్రాంతాలలో అనుభూత మగుతుంది.

అగ్నిపర్వతీయ భూకంపం :

ఇక అగ్నిపర్వతీయ భూకంపాలు అగ్నిపర్వత ప్రదేశాలకే పరిమితమై యుంటవి. కాబట్టి అవికూడా 'స్థానికములే' అని చెప్పవచ్చు. ఈ భూకంపాల ముఖ్యలక్షణం, వాటి వికలితప్రదేశవిస్తీర్ణం చాల తక్కువగనే యుండుట. ౧౦౦ లేక, ౨౦౦ చతురపు మైళ్ల విస్తీర్ణాన్ని మించి అది యెన్నడూ ఉండదు. ఈ

భూకంపాల తీక్ష్ణత నాభిదగ్గర మరీ హెచ్చుగా ఉంటుంది. పై రెండులక్షణాలను బట్టి, ఆ భూకంపాల నాభులు భూపటలానికి దిగువను చాల చేరువలోనే, ఒక మైలుకంటె కూడా తక్కువలోతులోనే యుండునని విశదమవుతుంది. తన్మూలంగా అగ్నిపర్వతగర్భంలో కాని, లేక దానికి కొద్దిగా దిగువను కాని భూకంపనాభి ఉంటుందని మనం ఊహింపవచ్చు. అగ్నిపర్వతీయ భూకంపాల మరియొక ముఖ్య లక్షణం అగ్నిపర్వతప్రకోపానికి ముందే భూకంపం కలిగి, అగ్నిపర్వతం ప్రకోపించుట ప్రారంభించిన వెంటనే భూకంపం తగ్గిపోవుట. కాని ఒక్కొక్కపుడు—చాలా అరుదుగా మాత్రమే—అగ్నిపర్వతం చల్లారిపోయిన కొన్ని నెలలతరువాతకూడా ఆ ప్రదేశాలలోభూకంపాలు కలుగుతుంటవి. వాటి కన్నిటికీ హేతువులరయుట అంత కష్టం కాదు. అగ్నిపర్వతం ప్రకోపించినపుడు, అగ్నిపర్వత ముఖములనుండి ఎక్కువ బలంతో 'లావా' పైకి నెట్టబడుతుంది, లేక అగ్నిపర్వతమందే యున్న పగుళ్ళలోని కది త్రోయబడుతుంది. ఆ సందర్భంలో ఆ ఆవేగానికి భూమి కంపించి, భూకంపం మనకు అనుభూత మగుతుంది. ఇక అగ్నిపర్వతపు పగుళ్ళలోనికి (Craters) వాటికి సన్నిహితంగా నున్న భూభాగం జారుట చేతనే అగ్నిపర్వతప్రకోపానంతరం కొన్ని నెలలకు గాని, లేక చల్లారిపోయిన అగ్నిపర్వతాలుగల ప్రదేశాలలోగాని కలిగే భూకంపాలు సంభవిస్తున్నవి. అగ్నిపర్వతగర్భమందు ద్రవస్థితిలోనున్న పదార్థ (దానికి *Magnei* - అని పేరు) మొక్కొక్కపుడు ఆకస్మికంగా సంకోచించుటచేకూడ అగ్నిపర్వతీయ భూకంపాలు కలుగుతవి.

టెక్టోనిక్ భూకంపం :

భూకంపాలలో ఎక్కువ భాగం టెక్టోనిక్ తరగతికి చెందినవే. సూర్యునినుండి విడివడిన ఆదిలో భూగోళతాపక్రమం అత్యధికమై యుండియుండునని వేరే చెప్పనక్కరలేదు. ఆ తరువాత క్రమంగా దాని ఉష్ణసంచయమందు అధికభాగం ప్రదేశంలోనికి వికీర్ణమైపోవుటలో, దాని గోళోపరితల తాపక్రమం వడిగా క్షీణించి, అది ఘనస్థితిలో నున్న పటలంగా ఏర్పడింది. కాని నేటికిని భూగర్భద్రవ్యతాపక్రమం అత్యధికంగానే యుండి, అది యింకా మార్పులకు లోనగుచునే యున్నదనుటలో సందేహం లేదు ఇట్టిది పొందే మార్పులలో ముఖ్యంగా పేర్కొనవలసింది దాని సంకోచము. భూగర్భద్రవ్యము చల్లబడి, సంకోచము నొందుటలో అన్ని పొరలలోని ద్రవ్యము ఒకేరీతిగా ప్రవర్తించదు. భూమ్యంతర పొరలల్లో భిన్నరీతులగా సంకోచించుటచే, భూపటలమున కది మొసంగు 'దాపు' సమానంగా ఉండదనుట నిశ్చయము. ఘనస్థితియందున్న భూపటలానికి కొంత దార్ఢ్యం (*Rigidity*) ఉందికాబట్టి, భూమ్యంతరపొరల 'దాపు' సరిగా లేకపోయినా, అది కొంతవరకు నిలబడగలుగుతుంది. కాని భూమ్యంతరపొరలందు వచ్చిన మార్పు మరీ అధికమైనపుడు, ఆ దాపు సరిగా లేని ప్రదేశాలలో భూపటలము దిగువకు దిగబడిపోతుంది. ఈ సంఘటనయందు భూపటలమందలి పొరలు లేక స్తరములు (*Strata*) దిగువకు దిగబడును కాబట్టి, దీనిని 'స్తరచ్యుతి' అని సాంకేతికంగా పేర్కొందురు. ఇట్టి స్తరచ్యుతి కలుగుటలో సంభవించిన చాంచల్యఫలితంగా భూమి కంపిస్తుంది. అదియే భూకంపం. ఒక్కొక్కపుడు భూమ్యంతర బలములు భూగర్భంలోని శిలాద్రవ్యాలు పైకి నెట్టి భూతలమందు కొండలను ఏర్పరుస్తవి. తత్ఫలితంగా జనించిన చాంచల్యఫలితంగాకూడా భూమి కంపించి, భూకంపం అనుభూత మగుతుంది.

భూగర్భంలో స్తరచ్యుతి గుభిల్లున ఒక్కసారి జరుగదు. కొద్దికొద్దిగా, క్రమంగా జరిగి, చివర నొక్కసారిగా అక్కడి పొరలు గుభిల్లున దిగబడుతవి. భూమి దిగువ పొరలలో ఎట్టి చాంచల్యములు సంభవించినా, తదనుగుణముగనే భూమికూడా కంపిస్తుంటుందని వేరే చెప్పనక్కరలేదు. కాబట్టి, కొన్ని మైళ్ళపొడవున స్తరచ్యుతి యేర్పడిన, తన్మూలంగా ఎక్కువ తీక్ష్ణమైన భూకంపం ఏర్పడుటకు పూర్వం తక్కువ తీక్ష్ణతగల భూకంపాలుకూడా ఆ ప్రదేశంలో అనుభూత మగుతవి.

భూకంపాలు కలిగే ప్రతిప్రదేశంలోను ఒక తీక్ష్ణమైన భూకంపానికి, మరియొక తీక్ష్ణమైన భూకంపానికి మధ్య, కొన్ని సంవత్సరాల వ్యవధి ఉంటుంది. ఈ వ్యవధి ఒక్కొక్కపుడు కొన్ని శతాబ్దాలవరకూ కూడా ఉండవచ్చు. ౧౭౫౫ లో లిస్బన్‌లో కలిగిన భూకంపంతరువాత అంత తీక్ష్ణమైన భూకంపం మళ్ళీ

ఇంతవరకు అక్కడ కలుగలేదు. పెద్ద భూకంపం కలిగే ముందు, భూపటలం తాళుకోలేనంతఅధిక పరిమాణంలో మార్పులు భూగర్భంలో ఒకచోట సమకూడుతవని భావింపవచ్చు. స్తరచ్యుతి పెద్దయెత్తున జరుగుటకు పూర్వం, ఆ ప్రదేశంలో భూమ్యాంతరమందే భూమిపొరలలో కొద్దికొద్ది సర్దుబాటులు జరుగుతవి. వీటి ఫలితంగా 'ముందటిఅదరులు' వస్తవి. ఇక అధికవైశాల్యంగల ప్రదేశంలో స్తరచ్యుతి ఒక్కసారిగా జరిగినపుడు, ఆ అధిక భూచాంచల్యఫలితంగా ప్రధానపు టదరు కలుగుతుంది. ఆతరువాత పెద్దయెత్తున జరిగిన ఆ స్తరచ్యుతి కనుగుణంగా నావైకల్యము సంఘటించిన ప్రదేశంలో భూగర్భమందలి పొరలు సర్దుకొనుటకు ప్రయత్నిస్తవి. ఈ సర్దుబాటు ఎక్కువగా స్తరచ్యుతికి పార్శ్వభాగాలలోను, ఊర్ధ్వభాగమందును జరుగుతుంది. కాబట్టి ఈ సర్దుబాటుఫలితంగా కలిగే 'అదరులు' ఆదిలో "మైజోసీస్మల్ ఏరియా" యొక్క అవధులందును, మధ్యభాగమందును ఎక్కువగనుండి చివరకు క్రమంగా మధ్యభాగమందే కలుగుతవి. ఈ "అదరులే" వెనుకటి "అదరులు". భూమ్యాంతరమందు పొరలలో సర్దుబాటు పూర్తియగువరకు ఇవి కలుగుచునే యుంటవి.

సాధారణంగా తీక్ష్ణమైన భూకంపం కలిగిన తర్వాత ఉత్కేంద్రందగ్గరనున్న ప్రదేశం కొన్ని రోజులవరకు ఎడతెరిపి లేకుండా కంపిస్తూనే యుంటుంది. ఆతరువాత కూడా కొన్ని నెలలవరకూ చాల తరచుగనే 'వెనుకటి అదరులు వస్తవి. ఏ తీక్ష్ణమైన భూకంపాన్ని ఉదాహరణగా గైకొన్నా మన కీవిషయం అవగాహన మవుతుంది. ౧౮౯౧ అక్టోబరు ౨౮ వ తేదీన కలిగిన 'మైనో—ఒవారి' (*Mino Owari*) భూకంపఫలితంగా ౧౮౯౩ సంవత్సరాంతానికి ౩౩౬౪ అదరులను 'గైఫూ' దగ్గర భూకంపలేఖిని 'రికార్డు' చేసింది. సాధారణంగా ఈ "వెనుకటి అదరుల" తీక్ష్ణత చాల తక్కువగనే యుంటుంది. కాని ఒక్కొక్కపుడు—చాల అరుదుగ మాత్రమే—ఈ వెనుకటి అదరులలో ఏదైనా తీక్ష్ణమైనది యుంటే దానివలనకూడా ఎక్కువ విధ్వంసకరఫలితాలు కలిగి, దీనికి మరల వెనుకటి—అదరులు ఉంటుంటవి. పైన పేర్కొనినట్లు ఈ వెనుకటి అదరులు ఆదిలో కొంచెం హెచ్చుగనే యున్నా, క్రమంగా తగ్గుతవి. మైనో—ఒవారి భూకంపంతరువాత మొదటి వారం రోజులలోనూ క్రమంగా ౩౧౦, ౧౬౩, ౧౨౬, ౯౯, ౯౨, ౭౧, ౬౬ అదరులు కలిగినవి.

భూకంపాలతో శబ్దం :

చిన్నచిన్న భూకంపాలు కలిగినపుడు మొదట సాధారణంగా మెల్లని ఉరుమువంటి ధ్వని వినవస్తుంది. ఆతరువాత క్రమంగా ఆ శబ్దతీక్ష్ణత వృద్ధిచెంది, ఒకటి రెండు సెకనుల కాలంలోనే భూకంపం అనుభూత మవుతుంది. ఆతరువాత క్రమంగా ముందు స్పందనం, తరువాత శబ్దం సమసిపోతవి. ఈ కార్యక్రమంఅంతా జరుగుటకు పది సెకనులకంటె ఎక్కువ కాలం పట్టదు.

పెద్దపెద్ద భూకంపాలలోకూడా మొదట శబ్దం, ఆతరువాత భూకంపం అనుభూత మగుతవి. కాని వీటిలో భూకంప తీక్ష్ణత మిక్కిలి హెచ్చుగనుండి, కంపన కాలపరిమితికూడా కొంచెం ఎక్కువగనే యుంటుందని వేరే చెప్ప నక్కరలేదు. పెద్ద భూకంపాలలో ఈ కార్యక్రమమంతా జరుగుటకు 4, 5 నిమిషాలుకూడా ఒక్కొక్కపుడు తీసికొంటుంది.

భూకంపంతో వచ్చే ధ్వని గర్జనధ్వనియై యుంటుంది. అందుచే చాలమంది దానిని వినిపించుకొనలేకపోవచ్చును. ఇక బాగా వినిపించుకొన్నా కూడా దానిలోని కొన్ని తరంగాలు స్ఫుటంగా వినిపించవు. అందుచే ఆ శబ్దాన్ని పలువురూ పలురీతులుగా పోల్చి చెప్పుచుందురు. లారీ పెళ్ళుచున్నదనీ, రైలు పరుగిడుచున్నదనీ, ఉరుము ఉరుముచున్నదనీ, గాలి వీచుచున్నదనీ, రాళ్ళు పడుచున్నవనీ, ఉత్స్ఫోటకం కలిగిందనీ—ఆ శబ్దాన్ని పలువురు పలువిధాలుగా చెప్పవచ్చు. పెద్దపెద్ద భూకంపాలలో ఉత్కేంద్రం నుంచి చాలాదూరంవరకు శబ్దం వినబడక పోవచ్చును. కాని చిన్నచిన్న భూకంపాలలో సంక్షుభితప్రదేశంకంటె శబ్దం వినిపించిన ప్రదేశమే ఎక్కువగా ఉంటుంది.

భూకంపాలలో శబ్దం వినిపించుటకు కారణం భూమిలోని పొరలు ఒకదాని నొకటి రాపిడి చేసికొనుటయే యని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

భూకంప ఫలితాలు :

పెద్దపెద్ద భూకంపాల ఫలితంగా భూపటలంలో సుదీర్ఘమైన పగుళ్ళు ఏర్పడి, అక్కడ భూమి పొరలు దిగబడిపోతవి. కొన్ని భూకంపాలలో భూపటలంలో ఎట్టి పగుళ్ళూ గోచరం కావు గాని, అక్కడ భూపటలం బాగా మెలిదిరిగి యుంటుంది. అయితే అది చాలా అపురూపమైన సంఘటన.

భూకంపపు టుత్కేంద్రం సముద్రశయ్యాయందున్నపుడు, ఆ భూకంపపు అదటు తీరప్రదేశమందంతటా అనుభూత మగుటతోబాటు, విపరీతమైన సముద్రకెరటము వచ్చి, తీరభాగాని కంతటికీ అధిక నష్టాన్ని కలిగిస్తుంది. ౧౮౯౬ లో కలిగిన సేంరిఖు (జపాన్) భూకంపఫలితంగా సుమారు ౯౩ అడుగుల ఎత్తుగల సముద్రకెరటమువచ్చి జపాన్ దేశానికి అమిత నష్టాన్ని కలుగజేసింది. సముద్రశయ్యయందేర్పడిన వైకల్యఫలితంగా ఆ సముద్రకెరటము జనించినదని వేరే చెప్పనక్కరలేదు.

పర్వతప్రదేశాలలో తీక్ష్ణమైన భూకంపాలు కలిగినపుడు, అంతవరకు వృక్షసంభరితములై యున్న పర్వతములు బోడిగ తయారై, పెద్దపెద్ద గండశిలలుగా పరివర్తనము చెందుతవి. ఈ శిలలు కూలి ఆ పరిసరములం దున్న నదీప్రవాహముల కడ్డుతగిలిన యెడల వాటి గతి పూర్తిగా మారిపోవచ్చును; లేదా ఆ ప్రవాహములు సరస్సులుగా పరివర్తనము చెందవచ్చును. ఈసంవత్సరము అస్సాంలో కల్గినభూకంప ఫలితంగా ఇట్టి సంఘటన లెన్నో జరిగినవి. మంచు కప్పిన పర్వతప్రదేశాలలో భూకంపాలు కలిగినయెడల ఆ మంచుకొండలనుండి మందముగా దిగజారుచున్న పెద్ద పెద్ద హిమానీనదములు ఆ భూకంపపు అదరుకు ఒక్కసారిగా విచ్ఛిన్నమై, అధిక వేగంతో పయనింప ప్రారంభిస్తవి.

ఇక సమమట్టమం దున్న మైదానభాగంలో తీక్ష్ణమైన భూకంపం సంభవించినచో, అక్కడి ఒంప్రుమట్టి సంకుచించుటచే ఆ ప్రదేశమం దనేకమైన మార్పులు వస్తవి. ౧౮౯౭ లో అస్సాంలో కలిగిన భూకంపఫలితంగా అస్సాం, వంగరాష్ట్రాలలోని వరిచేలమట్టంలో విపరీతమైన మార్పులువచ్చినవి. సముద్రంలో తరంగాలు ఎక్కువగా ఉన్నపుడు, సముద్ర జలతలంపై ఎట్టి మిట్టపల్లాలు గోచరిస్తవో, అట్టి మిట్టపల్లాలే అప్పుడక్కడ భూమిపై ఏర్పడినవి. అనేక తావులందు 'గ్రైత్వైలైను'లు మెలికలు తిరిగినవనీ, నేల బీటవారిందనీ వేరే చెప్పనక్కరలేదు.

భూకంపం నదీపరిసరాలలో కలిగినయెడల నదిప్రక్క నేలకు ఒకవైపున (నదివైపున) సరియైన అండ ఉండదు, కాబట్టి. అక్కడ గట్టువెంబడే నేలలో పెద్ద బీట యేర్పడుతుంది. సాధారణంగా ఈ బీట కొన్ని మైళ్ళ పొడవును, కొన్ని అడుగుల వెడల్పును కలిగి, చాల లోతుగ ఉంటుంది. ఇట్లు బీటపడిన ప్రదేశంలో, ఆ బీట లోతులో ఉన్న భూమి పొరలలో దేనిగుండానైనా నీరు ప్రవహించుచుండి, ఆపొరకుపైన యిసుకపొర యుండినట్లయిన, ఆ నీరు ఆ బీటగుండా పైకి ఎగజిమ్మి, పైపొరలోని ఇసుకనుకూడ పైకి నెట్టును. కొంత సేపయిన తరువాత కారణాంతరములచే ఆ నీరు ఎగజిమ్ముట ఆగిపోయినచో, ఆ ప్రదేశమందు విశాలమైన ఇసుక పళ్ళెరము, ఆ పళ్ళెంలో మధ్య పెద్ద రంధ్రము గోచరిస్తవి.

ఇంక జనపదాల సమీపంలోనూ, పారిశ్రామిక ప్రదేశాలలోనూ భూకంపాలు సంభవిస్తే; కలిగే ధన, ప్రాణనష్టానికి మితి యుండదు.


భూకంపాలనుగూర్చిన సమగ్రజ్ఞానం మానవునికింతవరకును లేదు :

భూకంపాలు చాలకాలంనుంచీ మానవునకనుభూత మగుచునే యున్ననూ, వాటివల్ల విపరీతమైన నష్టం ప్రపంచంలో తరచు ఎక్కడో ఒకచోట సంభవిస్తూనేయున్ననూ, వాటినిగూర్చిన పరిపూర్ణజ్ఞానం మానవున కింతవరకునూ లేదు. భూమియొక్క కంపనాలను 'రికార్డు' చేసే స్వయంగ్రాహక పరికరాన్నొకదానిని గతశతాబ్దమందే శాస్త్రజ్ఞులు నిర్మించేరు. దానికి 'భూకంపలేఖిని' యని పేరు. భూకంపాలను గూర్చి యీనాడు మన కున్న పరిమితజ్ఞానమైనా దానివలననే లభ్యమైంది. సాధారణంగా ప్రతి వేధశాలలోను భూకంపలేఖిని ఉంటుంది. ఒకే ఒక భూకంపానికి కనీసము మూడు వేధశాలలోని భూకంపలేఖినులు రికార్డుచేసిన భూకంపపు రికార్డులను పరిశీలించి, భూకంపం ప్రపంచంలో ఎక్కడ కలిగిందో, అది ఎంత తీక్ష్ణమైనదో చెప్పవచ్చు.

భూకంపం కలిగినపుడు మూడు రకాల తరంగాలు ఉత్పన్నమగుతవి. వీటిలో ఒక తరగతి భూకంప తరంగాలకు ప్రారంభ తరంగాలని (*Preliminary wavs*) పేరు ఈ తరంగాలు భూకంపనాభిదగ్గిర బయలుదేరి, భూగర్భమందు వ్రటుమార్గముల ననుసరించి పయనించి, వేధశాలలను చేరుకొంటవి. ఇవి *Longitndinal* తరంగములు. వీటి వేగము సెకనుకు ౫ మైళ్ళవరకును ఉంటుంది. రెండవతరగతి భూకంపతరంగాలు కూడా భూకంపనాభిదగ్గిరనే బయలుదేరుతవి గాని అవి *Transverse* తరంగములు. వాటి వేగము సెకనుకు 3 మైళ్ళకంటె ఎక్కువయుండదు. ఇక మూడవతరగతి తరంగములు ఉపరితల తరంగములు. ఇవి కేవలము భూతలముపైననే సంచరిస్తవి. మన మొక చెరువులోనికి బెడ్డను విసరినట్లయిన ఆ చెరువులో నీటి ఉపరితలముపై ఎట్టి తరంగములుత్పన్నమగునో అట్టివే యీ తరంగములుకూడా. భూకంపపు శక్తిలో చాలభాగము వీటికే వ్యయమవుతుంది. భూకంపాలవలన కలిగే నష్టాలన్నింటికీ యీ ఉపరితలతరంగాలే కారణాలు. ఈ తరంగముల *Amplitude* ఎంత హెచ్చుగా ఉంటే, వాటివల్లనష్టం అంత అధికంగా ఉంటుంది. భూకంపపు ఉత్కేంద్రములనుండి దూరానికి పోయినకొలది యీ తరంగముల శక్తి తదనుగుణంగా వాటి *Amplitude* తగ్గుతుంది కాబట్టి భూకంపపు ఉత్కేంద్రమునుండి దూరంగా పోయినకొలదీ వాటివల్ల నష్టంకూడా తగ్గుతుందని వేరే చెప్పనక్కరలేదు.

భూకంపలేఖినుల సహాయమున భూకంపాలెక్కడ కలిగినవో శాస్త్రజ్ఞులు చెప్పగలుగుచున్నారు. గాని ఇంతవరకు పెంపొందిన విజ్ఞానాన్నిబట్టి అవి ఎక్కడ, ఎప్పుడు కలుగునో చెప్పజాలకున్నారు. అది యింతలో సాధ్యమగుననికూడా భావింపలేము. అయితే భూకంపాలనుగూర్చి యిటీవల జరిగిన తీవ్రతరపరిశోధనలవలన ఏమండలంలో తీక్ష్ణమైన భూకంపాలు కలుగుతవో విశదమైంది కాబట్టి, భూకంపాల ధాటికితట్టుకోగల "రియిన్‌ఫోర్స్‌డ్—ఫెర్రో—కాంక్రీట్" గృహాలనే ఆ మండలాలలో నిర్మించుకొని, కొంతవరకు తన భద్రతను మానవుడు కాపాడుకొనవచ్చును. ఇక తీక్ష్ణమైన భూకంపాలు కలుగుటకుముందు సాధారణంగా చిన్నచిన్న భూకంపాలు ఆ ప్రదేశంలో కలుగుతవి కాబట్టి, వాటిని గుర్తించి, ఏ ప్రదేశంలో పెద్ద భూకంపం కలుగుటకవకాశ ముందో ముందుగనే స్థూలంగా గ్రహించి, ఆ ప్రదేశమునుండి ప్రాణికోటిని తక్షణమే మరియొక ప్రదేశానికి మరల్పుటద్వారా ధనానికి కాకపోయినా, ప్రాణానికైనా నష్టం రాకుండా కొంతవరకు కాపాడవచ్చు !

భూకంపాలవల్ల విపరీతమైన నష్టం కలుగుచున్నా, వాటివలన ఒక్క లాభంకూడా లేకపోలేదు. భూగర్భస్థితిని తెలిసికొనుటకు భూకంపతరంగాలను మించిన సాధనాలు మరి లేవు !!



భూకంపతరంగాలు

హేమంతము

★

శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి

హేమించి నేమించు హిమకణమ్ముల నల - జడివాన యను నూహఁ గొలుపువానిఁ,
దుందముల్ నిండ నిందిందిరమ్ములకుఁ గ్రొ - వ్వాలపువిందులు వెట్టు మెలపువానిఁ,
జూడ లెక్కకు రాక సురభిలమ్ములఁ బరా - గముల నువ్వెత్తున గగనమునకు
నెత్తి, యప్పాటన మొల్లవలంకుల - మొగముల వెదఁజల్లు తగవు వెనిచి
కపిత కుంకుమాంక స్తన కనక కలశ
భర సమాస్ఫాల నోద్గతి నిరతి నెరయఁ,
ద్రావి హరిణలోచనల సీత్కారిముఖము,
మెలయుచున్నాడు హేమంత మారుతుండు.

* * * *

చలి ముదురం బున్నాగము
వెలవెలనై విరియబాఱె వేవేగమ పూ
వులదుప్పటి కప్పుకొనెన్
నిలువెల్లం బల్లవించు నిగనిగ నిగుడన్.

వ్యసనములట్లు సాంద్ర హిమవారిదపంక్తులు నల్దెసల్ మలీ
మసములు గాఁగఁ గ్రమ్మి, తెరమాటున మంటిని మింటి నిల్పి, ఆ
త్మసఖుప్రతాపముల్ జడము మందమునుం బొనరించి, హైమనా
వసరము, పద్మినీ ప్రసవ భాసురసంపద లూడ్చెఁ జెర్వులోన్.

మన గ్రామమ్మున నెల్ల నేటిదనుకన్ మాన్యస్థితిం గ్రొత్తమం
డనమై యేర్పడియున్న ఆ కమలఖండం బిప్డు డీదుష్ట హై
మనకాలమ్ముబలమ్ముచేత నొనరింపంగాఁబడెం గంటె! నె
ట్టన లూనమ్మయి యుమ్మసెడ్డ తిలవాటమ్మట్లుగా; అత్తయా!

అడవులయందు స్కంధకలితానల కీలల, నూళులందు నే
ర్పడిన తృణాదికమ్ముల, సురక్షితుఁ డీ పథికుండు నిల్చి యి
ప్పుడు పురిలోపలన్, వెతల ముంచియిడంబడుచున్నవాడు, క్రు
క్కుడి చలిగాలిచేత, వెనుకం గల కోపము వెంచియట్లుగా.

చేరి దరిద్రజానపదసీమమునందలి గ్రామదేవతా
గారపు ద్వారమందుఁ, జలిగాలికి నీల్గుచు బాటసారి, చ
ల్లారిన చెత్తనిప్పుమసి యాఱిన కుప్పను నూఁది నోటితో,
సారెకుఁ జీల్పసాగెఁ బడి చచ్చిన పెద్ద యెలుంగునుంబలెన్.

పొలములలోఁ బలాలములముక్కలు గీఱుకుపోయి, గాయముల్
బలిసిన కాయముం దడవి పల్మఱుఁ బాంథుడు బండవార్పుకోఁ
దలపడినాఁడు, నిండుచలి దాడి యొనర్పు ప్రభాతవేళలోఁ,
గలవడి యాచమించు నుదకమ్మున నార్ద్రితమైన చేతితోన్.

కొనకొని మాలతీకుసుమగుచ్ఛము లం దలనూఁడ్చి నూఁడ్చి నం
తనె, పనిదీఱి నిర్వృతిఁగొనం గలిగెం జలికాల, మంచు నె
మ్మనమున నెంచఁగాఁ జనకుమా, గుణహీనములైన మొల్లపూ
ననలను గూడఁ బెంపవలె, నాటి నిరూఢ సమృద్ధ సంపదన్.

ఎంతయుం బ్రొద్దుగలుగు హేమంత రాత్రు
లందు నిద్దుర చాలక, కొందు విటులు
పవ లొడలు తెలియని నిద్ర, పడతి! నేటె
చిరము ప్రోషితపతికవై చిక్కియుండి ?

మాఘమాసాన హాలిక కుమారకుండు
కొమరు ప్రాయపు ప్రియురాలి తిమురుచనుల
బిగువు కనిపెట్టి, దుప్పటి వేగ మమ్మి,
బిక్క బలిసిన గిత్త నాయూరఁ గొనియె.

ఏఱుపిడకల చిచ్చు నేపాఱు కంపు
వాఱి పొగ చూఱి చినిఁగిన ప్రాంతముఱికి
బట్టతో ప్రేలుచున్నాడు, పచ్చిపుండు
వంటి యీచలిలోన దౌర్భాగ్యుఁ డితడు.

మదన పటలాపన వ్యాజ ముదటు సూప,
వ్రణిత మధురాధరపుటమ్ముపైని, అదిగొ,
లలన, అల్లనఁ దెల్లమలాముపట్టి
వేయుచున్నది యిపురాకు ప్రేలితోడ.

పడిన మంచుచే వెల్లని పంట నూవు
పొలములోఁ బ్రొద్దుపొడుపునఁ బొలము కాపు,

హారితదీర్ఘము కులటారహస్య మార్గ
ముం గని విషాద మంతగా బూరయఁ డయ్యె.


చలిరోజులలో వేడిమి,
చలువయు వేసంగియుఁ, దొసంగుట యరుదా?
అలినీలాలక ఘనకు చ
కలశమ్ములేని దొకటి గలదా జగతిన్?

చలికిఁ బోలెఁ గలికి కులికి వడంకున
ముచ్చముడుఁగు మగలు, పుండువంటి
చలిని బాపుకొనిరి కలికి చన్నులవేడి
కౌఁగిలింతలందుఁ గడు మునింగి.

సీత్కృతుల్ నేర్పె, వ్రణితముఁ జేసె మోవిఁ,
గడఁగి తొడిగించె రోమాంచ కంచుకంబు;
నాగరికుఁ డెవ్వఁడేని సందర్భపడెనె ?
కాదుకా, దిది చెలి! చలిగాలి మహిమ.

తీఱ వెన్ని జాములకును దీర్ఘరాత్రు,
లనిమిషమ్ములై కన్నులఁ గునుకు రాదు,
ప్రబలి చలిగాలి వడవడ వడఁకఁజేయు,
నుసుఱుఁ బీల్చు హేమంత మయుక్తజనుల.

అందముగఁ గట్టికొని బూజుచాందినీలు,
బెండువడి ముడుంగక గూటఁ బుండువంటి
శీతగాలికిఁ, దన పిల్లజెల్లతోడ
నిలిచియున్నాఁడు సాలీఁడు నిబ్బరముగ.



వాల్మీకి - రస సిద్ధాంతము

★

శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి

సంస్కృతాలంకారశాస్త్రమునందు ననిమిది విధములగు సాహిత్యసిద్ధాంతములు గలవు. అవి రసము, అలంకారము, గుణము, రీతి, ధ్వని వక్రోక్తి, అనుమానము, ఔచిత్యము నని. వీనిలో రససిద్ధాంతము ప్రాచీనతమ మైనది. నాట్యాచార్యు డగు భరతముని తన నాట్యశాస్త్రమునం దీ సిద్ధాంతమును బ్రతిపాదించెను. తరువాత వచ్చిన భామహాదులు రసమును కేవలము నాటకమునకు సంబంధించినదని తలంచిరి. అందుచేత వారు కావ్యమునుగుఱించి వేరుగా నూహించిరి. ధ్వనికర్తయగు నానందవర్ధనాచార్యుడు రసము కావ్యమునకు సంబంధించినదని తలంచినను నా రసము ధ్వనిలో నంతర్భూతమని సిద్ధాంతీకరించెను. తరువాత వచ్చిన యాలంకారికులందరును నీరసము కావ్యమునకుగూడ సంబంధించినదనియే తలంచిరి. వారిలో వారికి మతభేదము లున్నను, గావ్యమునందు రసము పరమప్రయోజనమని వారెల్లరు తలంచిరి. నవీనకాలమందు గావ్యమునుగురించి యనేక చిత్రవిచిత్రసిద్ధాంతములు బయలుదేరుచున్నవి. వీనిలో నెక్కువభాగము పాశ్చాత్యదేశములనుండి దిగుమతి యైనవి. పాశ్చాత్యనాగరికతాదాసులచేత బ్రచారము గావింపబడుచున్నవి. తక్కినవి దేశమునం దున్నవి. వివిధరాజకీయకక్షులకు సంబంధించినవి. ఆయా పార్టీల రాజకీయాభిప్రాయములను దేశమునందు బ్రచారము గావించుటయే ప్రధానలక్ష్యములుగా నిర్మితములైనవి. ఈ నవీనసిద్ధాంతము లేవియు తర్కసహములుగా గన్పింపవు. వానిని బ్రచారము చేయువారి సంఖ్యాబలము, భుజబలము నివియే వీని బలము. పైగా వీని కొక స్థితి లేదు. ఇవి యన్నియు గాలిమాటలు. దినదినము వీని స్వరూపము మారుచుండును. అందుచే వాని నూహింతమన్నను వీలు లేదు, విమర్శించుట యెట్లు ?

మఱియు వీని ప్రాబల్యము పెద్దపెద్ద కవులని యనిపించుకొన్నవారియందుగూడ విశేషముగా నున్నవి. మరి వేయేల ? వీని యొద్దశచే దేశమునం దచ్చమైన కావ్యరసజ్ఞత యన్నది చచ్చిపోయినది.

అందుచేత నవీనకాలమున నీ రససిద్ధాంతమును గురించి చెప్పవలసిన యావశ్యకత యున్నది. ఇట్లు చెప్పుటవలన గొంతకు గాకపోయిన గొంతయైన రసజ్ఞత యన్నది సముద్ధరింపబడవచ్చును.

ఆలంకారికసిద్ధాంతములలో బ్రాచీనముగుట చేతనే గాక, ప్రపంచకములో మొట్టమొదటి కవి యయిన వాల్మీకి,కవియగుటకు హేతువయిన గాథను బట్టి కూడ, రససిద్ధాంతమున కున్న యుత్కృష్టత తెలియనగును. ఈ గాథను బరిశీలించినచో రసమునుండియే కావ్య ముద్భవించుననియు, నందుచేత రసమునందే పర్యవసించుననియు మన మెరుంగవచ్చును. వాల్మీకి గాథకును రససిద్ధాంతమునకు నంత దగ్గర చుట్టరిక మున్నది. కావున కావ్య మెట్లు పుట్టెనో, దాని స్వరూప మేమియో, ప్రయోజన మేమియో, యెఱుంగుటకు వాల్మీకిగాథతప్ప మనకు వేరే ప్రమాణ మక్కఱ లేదు. మఱి యీ గాథ కల్పితము గాదు. సత్యముగా జరిగినదియే. కాళిదాసు, భవభూతి మున్నగు మహాకవులు, దీనినిగురించి తమ కావ్యములందు బ్రస్తావించిరిగాన శంకింపనక్కర లేదు.

ఇది యా గాథ. ఒకనాడు వాల్మీకిముని దర్భలు సమిధలు తెచ్చుకొనుటకై యరణ్యమునకు బోవుచుండెను. త్రోవలో నొక కిరాతుడు చెట్టుపై నున్న క్రౌంచమిథునము నొకదానిని బాణముతో గొట్టెను. ఆ దెబ్బ తగిలి మగపక్షి క్రిందపడి మరణవేదన బొందుచుండెను. ఆడుపక్షి సహచరవియోగముచే దుఃఖించుచుండెను. వాల్మీకి యీ దృశ్యము

జూచెను. తోడనే యా మహర్షినోటినుండి యాకస్మికముగా నిట్లు వెలువడెను.

"మా నిషాద ప్రతిష్ఠాం త్వ
మగమ శ్శాశ్వతీ స్సమాః
య త్క్రౌంచమిథునా దేక
మవధీః కామమోహితమ్,"

తన నోటినుండి యాకస్మికప్రత్యవభాసితమైన యీ ప్రవృత్తికి వాల్మీకి యచ్చెరువడెను. ఆయన దీనినిగుఱించి బాగుగా నాలోచించి యిట్లు చెప్పెను.

"పాదబద్ధోఽక్షరసమ స్తంత్రీలయ సమన్వితః
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు
నాన్యథా"

ఇది వాల్మీకిగాథ. దీనిని జాగ్రతగా నాలోచించినచో గావ్యరహస్యమంతయు మనకు గరతలామలకము గాగలదు చూడుడి. ఈ గాథయందు రెండు విషయము లున్నవి. ౧ కావ్యము, ౨ తత్పర్యాలోచనము. మా నిషాదేత్యాది కావ్యము. పాదబద్ధోఽక్షరసమ ఇత్యాది తద్రహస్యబోధనము. ఇట్లిది రెండు భాగములు.

"పాదబద్ధోఽక్షరసమ స్తంత్రీలయసమన్వితః" అనగా ఛందోయుతమై రాగతాళసమన్వితమైనదని యర్థము. "శోకార్తస్య మే ప్రవృత్తః" అనుటవలన నిది యాకస్మికప్రత్యవభాసితమని యర్థము. అనగా శ్లోకావిష్కరణకాలమందు వాల్మీకికి గర్తృత్వజ్ఞానము లేదన్నమాట. మఱియు నీ శ్లోకము ప్రవృత్తమగుటలో వాల్మీకి శోకార్తుడగుట హేతువు. శోకార్తుడైన వాల్మీకికి నొడలు తెలియని స్థితిలో నా శోకమే ఛందోయుతమై రాగతాళయుక్తమైన శ్లోకముగా బహిర్గతమైనదని యేతచ్ఛ్లోకమువలన మనకు దెలియుచున్నది.

మఱియు నిచ్చట 'శోకార్తస్యమే' యనగా నేమో? విచారించవలయును. ఇచ్చట శోకమనగా నేమి? ఈ శోకశబ్దమునకు 'స్వ' యనిగాని 'పర' యనిగాని విశేషణము లేదు. వాల్మీకి యనుభవించింది స్వశోకమనిగాని పరశోకమనిగాని చెప్పుటకు వీలు లేదు. శోకము తనకు సంబంధించినదిగను, నితరులకు సంబంధించినదిగను యనుభూతమైనయపు డది దుఃఖపర్యవసాయి యగును. అట్లు స్వపరభేదముచే ననుభూతమైన శోకము లౌకికశోకము. ఇట్లు స్వపరభేదము లేక యున్నచో నది వట్టి శోకము. భావరూపము. వాల్మీకి యనుభవించిన దిట్టి స్వపరసంబంధశూన్యమైన, సాధారణమైన, భావరూపమైన శోకము. ఇట్టి భావరూపమైన శోక మలౌకికము. ఆనందపర్యవసాయి. ఆయన యనుభవించిన దిట్టి శోకము కావుననే సామాన్యముగా 'శోకార్తస్య' యనినాడుగాని స్వ యనిగాని పర యనిగాని విశేషణము చేర్చలేదు.

మఱియు వాల్మీకి యనుభవించిన శోక మలౌకికమని ప్రమాణాంతరములచేగూడ సాధింపవచ్చును. ౧ ఆయన మునియగుట. ౨ శోకము శ్లోకముగా బరిణమించుట. ౩ ఆ శ్లోక మాకస్మికప్రత్యవభాసితమగుట. ఈ మూడును వాల్మీకి యనుభవించిన శోక మలౌకికమనుటకు వినిగమకములు.

ముని యనగా యోగి యన్నమాట. యోగము గలవాడు యోగి. యోగ మనగా జిత్తవృత్తినిరోధము. ప్రతిజంతువునకు జిత్తమునందు బీజరూపముగా గొన్ని వృత్తు లుండును. వీనినే సంస్కారము లందురు. ఈ సంస్కారములు జన్మాంతరములనుండి వచ్చుచునేయుండును. ఆయా సంస్కారము లుద్బుద్ధము లగుటకనువైన శరీరము జీవునకు గల్గినపు డాయా సంస్కారముల యవభాసము గలుగుచుండును. ఈజన్మాంతరాగతసంస్కారములే జీవులకుసుఖదుఃఖహేతువులు. ఇవి యిప్పటినుండి మొదలైనవని చెప్పుటకు వీలులేదు. అనంతకాలమునుండి యివి జీవుని వెంటాడుచునే యుండును. నాకెల్లప్పుడు సుఖములే కల్గుచుండవలయును. సుఖసాధనములతో నాకెప్పుడెడబాటు కల్గరాదు. నాకెప్పుడు దుఃఖము కల్గరాదు. దుఃఖసాధనములతో నాకెప్పుడును బొందు కల్గరా, దని ప్రతిజీవి కోరుచుండును. ఈ కోరికయే మోహము, ఇదియేయజ్ఞానము, దీనిని యోగశాస్త్రమునందు "ఆశీః" అందురు. మహామోహరూపమగు నీ యాశీః నిత్యము. ఇది యీ సంస్కారములకెల్ల కారణము. దీనిని దాటినపుడే యీసంస్కారములు నశించును. సంస్కారనాశమువలన జీవుడుపరిశుద్ధుడై వెలుగొందును. అదియే ముక్తి. అది కైవల్యము. కావున సర్వప్రయత్నములచే నీ సంస్కారమును నశింపజేయుట యోగులవిధి. దీనికి మార్గము వీని నుద్బుద్ధములు

గాపండ నిరోధించుట. యమనియమాసనప్రాణాయామాదులచే నింద్రియములను జయించి యోగులీ సంస్కారముల నిరోధింతురు. మరి వాల్మీకి యట్టి యోగి, ఆయన యోగిగియోగి శోకింపడుగదా! అట్లు శోకించినచో నాయన యోగి కాకపోవలసివచ్చును. అందుచేత వాల్మీకి పొందినది దుఃఖము కాదంటిమి.

రెండవ కారణము శోకము శ్లోకముగా బరిణమించుట. లోకములో మనసు గల్గిన కోపతాపాదులను మాటలలో వెల్లడింతురు. కోపమువచ్చినచో దిట్టుటయో, కొట్టుటయో చేయుదురు. దుఃఖముగల్గినచో నేడ్తురు. సాధారణజనులు దుఃఖము గల్గినచో నేడ్తురు గాని సంగీతము పాడరుగదా! మరి వాల్మీకి పొందిన దిట్టి దుఃఖమైనచో నది ఛందోయుతమును, రాగతాళయుతమునైన శ్లోకముగా బరిణమించిన దేమి? కావున వాల్మీకి యనుభవించిన శోకము లోకసాధారణము గాదు. లౌకికశోక మిట్లు పరిణమించుట నెక్కడను వినియుండలేదు. కావున నిది యలౌకికశోకమని యొప్పుకొనక తప్పదు.

మూడవ కారణము వాల్మీకికి శ్లోక మాకస్మిక ప్రత్యవభాసిత మగుట. అనగా నాయన కాసమయమున తచ్ఛ్లోకకర్తృత్వజ్ఞానము లేదన్నమాట. శోకానుభవకాలమునం దాయన యొడలు తెలిసిన స్థితిలో లేడు. త్రిపుటినాశము కలిగినగాని యిట్టి స్థితి సంభవింపదు. మాతృ, మితి, మేయములు త్రిపుటి. మాత యనగా ననుభవించువాడు. మితి యన ననుభవము. మేయమనగా ననుభవింపబడునది. త్రిపుటినాశమనగా త్రిపుటిలోని పరిమితత్వము విగళిత మగుట. త్రిపుటిజ్ఞానమున్నచో బరిమితత్వ ముండనే యుండును. వాల్మీకి కప్పుడీ శ్లోక మాకస్మికప్రత్యవభాసితము కావుటకు వీలులేదు. అది యటయినది కావున వాల్మీకి కాసమయమున త్రిపుటిజ్ఞానమున్నదనుటకు వీలులేదు. త్రిపుటి నశించినతరువాతనే యనుభవమైనను నానందరూపమే యగును. ఇట్టి యనుభూతి యలౌకికమే గాని లౌకిక మెన్నడును గాదు. కాన శ్లోక మాకస్మికప్రత్యవభాసిత మగుటచే గూడ వాల్మీకి యనుభవించినది యలౌకికశోకమని తేలుచున్నది.

ఇచట నొక శంక. యోగియనగా జిత్తవృత్తులు నిరోధించువాడని గదా! యర్థము చెప్పితిరి. ఈ శోకము చిత్తవృత్తియే గదా! వాల్మీకి యోగియయినప్పుడాయన యీ చిత్తవృత్తిని నిరోధించలేదేమి? ఇది యుద్బుద్ధమైనచో గదా యలౌకికమగుట. అసలీశోక ముద్బుద్ధమగుట కాయన మునిత్వము బాధకమగుచున్నదిగదా యని. మునిత్వము శోక మలౌకిక మనుటకు సాధకము. శోక ముద్బుద్ధమగుటకు బాధకము, ఇది దోషముగదా! యని. ఇచ్చట నీ శంకకు దావు లేదు. ఏలనన శోక ముద్బుద్ధమగుటకు మునిత్వము బాధకముకావుననే యది యలౌకికశోక మంటిమి. అట్లు శోక ముద్బుద్ధమగుటకు మునిత్వము బాధకము గానిచో నది లౌకికశోకమే యగును. మునికి మునిత్వరూపజ్ఞానము విగళితమైనతరువాతనే శోక ముద్బుద్ధమై చర్వణాయోగ్యమైనది. ఆయన యొడలు తెలియని స్థితిలో నీశోక ముద్బుద్ధమైనది గాన నిది యలౌకిక మంటిమి. అలౌకికమైన యే యనుభవమైనను రసశబ్దవాచ్య మగును.

ప్రపంచమునం దిట్టి రసానందము తొలుదొల్తగా బొందినది వాల్మీకి. ఆయన పొందిన యీ రసానందము మానిషాదేత్యాది శ్లోకముగా బరిణమించినది. ఈ శ్లోకము రసానుభూతినుండి బయలుదేరినది గావున మరల దానియందే పర్యవసింపవలయును. కాన కావ్యము రసమునుండి పుట్టినది రసమునే యొసంగుచున్నది.

ఇప్పటికి వాల్మీకి పొందినది రసరూపమగు నలౌకికశోకమని తెలిసికొంటిమి. ఇట్టి రసానుభూతి కలుగుటకు క్రౌంచద్వంద్వవియోగము హేతువు. ఈ రసానుభూతి యలౌకికము గాన దద్ధేతువులుగూడ నలౌకికములే గావలయును. అందుచేత నిహత సహచరవిరహకాతరక్రౌంచ తదాక్రందనాదులు విభావానుభావములు కావలయును. వాల్మీకి యనుభవించినది రసానుభూతిగాన నాయన కివి విభావానుభావము లయ్యెనని యొప్పుకొనవలయును. అనగా వాల్మీకికి తథాభూతక్రౌంచ తదాక్రందనాదులు సాపేక్షకములే గాక సాధారణములై భాసించెనన్నమాట. ఇట్టివి సాధారణత్వము భజించుటకు వాల్మీకిలోని సహృదయత్వసహకృతమగు భావనాశక్తి కారణము. సహృదయత్వమనగా దన్మయీభావనయోగ్యమైన నిర్మలహృదయము గలిగియుండుట. భావన యనగా బునఃపునరనుసంధానము చేయుట. వాల్మీకి హృదయదర్పణ

మందు ప్రతిబింబితములై పునఃపున రనుసంధానము గావింపబడినవిగావున క్రౌంచపదాక్రందనాదులు సాధారణత్వము బొంది విభావానుభావశబ్దవాచ్యము లైనవి.

ఇప్పుడీ నిహత సహచరక్రౌంచరూపమగు విభావము వాల్మీకిచిత్తమునందు నిద్రురబోవుచున్న శోకభావమును మేల్కొల్పెను. ఉద్బుద్ధమైన శోకరూపచిత్తవృత్తియందు క్రౌంచాక్రందనాది రూపమగు ననుభావము వాల్మీకికి దన్మయత్వము గల్పించెను. ఇట్లీ విభావానుభావములచేత శోకమను చిత్తవృత్తి హృదయసంవాదతన్మయీభవనక్రమముతో వాల్మీకికి జర్వణాయోగ్య మయ్యెను. ఇంతే గాదు. ఈ విభావానుభావములు శోకమును జర్వణాయోగ్యదశను బొందించుటలో మఱికొన్ని క్షణస్థితికములగు చింతాది సంస్కారరూపము లగుచిత్తవృత్తులనుగూడ జర్వణాగోచర మొనర్చుచున్నవి. ఈ చింతాదిభావములను వ్యభిచారిభావము లందురు. ఇట్లు చర్వణాగోచరమైన వ్యభిచారిభావములు ముఖ్యచిత్తవృత్తి యగుశోకము చర్వణాగోచరమగుటలో ఘాతప్రతిఘాత రూపమున సాహాయ్యపడుచున్నవి.

ఈవిధముగా విభావానుభావ వ్యభిచారిభావములు శోకమను స్థాయీభావమును జర్వణాగోచర మొనర్చుటలో గారణము లగుచున్నవిగాన నివి చర్వణోపయోగికారణములు.

చర్వణాగోచరమైన స్థాయిభావమే రసము. కావున రసము చర్వణాప్రాణము. ఇది జ్ఞప్తి కాదు. నిష్పత్తి గాదు. మఱి యభివ్యక్తి. ఇది జ్ఞప్తియనుట కిట్టి యనుభవము ప్రమాణాంతరములవలన బూర్వము గలుగలేదు. నిష్పత్తియనుట కిది ప్రమాణాంతరముల వలన నుత్పన్నము గాలేదు. కాన నీ చర్వణ యలౌకికము.

అలౌకికమగు నీ చర్వణ కభివ్యంజనమని పేరు. అభివ్యంజనమనగా చర్వణ యన్నమాట. రసము చర్వణాసారముగాన నిది యభివ్యక్తి. ఈ రసవ్యక్తి యందు విభావాదు లుపయోగించుచున్నవిగాన నవి వ్యంజకములు. కావున విభావాదివ్యవహార మలౌకికము.

లోకమున గారణసామగ్రి రెండు విధములు కారక కారణములు, జ్ఞాపక కారణములు. దండచక్రాదులు ఘటమును బుట్టించుటలో గారణ మగుచున్నవిగాన నివి కారక కారణములు. విభావాదు లిట్లు రసమును బుట్టించుటలేదు. అట్లు పుట్టించె ననుటకు వీలులేదు. ఎందుచేతననగా లోకమునందు గారణము నశించినను గార్య ముండుచు నేయున్నది. మఱి విభావాదులు నశించినచో రసచర్వణ యుండుటలేదు. కాన విభావాదులు కారకహేతువులు గావు.

మఱి జ్ఞాపకహేతువులును గావు. చీకటిలోని బల్లను మనము చూడవలయుచో నొక దీప ముండవలయును. దీపము బల్లను గుర్తింపజేయుచున్నది గాన జ్ఞాపకకారణము. దీపము లేకున్నను బల్ల యుండుచు నేయున్నది. మఱి విభావాదులు లేనిచో రసచర్వణ లేదుగాన నవి జ్ఞాపకహేతువులును గావు. మఱి యేమి? పైన జెప్పినట్లు విభావాదులు రసచర్వణయం దుపయోగించుచున్నవిగాన నివి చర్వణోపయోగులు.

అనగా స్థాయిభావ ముద్బుద్ధమై చర్వణాగోచర మగుటలో విభావాదు లుపయోగించుచున్నవి. ఇట్టి కారణములు లోకమునందు గాన్పించుటలేదు. గాన నివి యలౌకికములని యొప్పుకొనక తప్పదు.

ఇంతవఱకు గావించిన చర్చయొక్క సారాంశ మిది. బాహిరములగు కారణ (నాయికాది) కార్య (అశ్రుపాతాది)ములు సహృదయహృదయమునందు బ్రతిబింబించును. అట్లు ప్రతిబింబించినవానిని సహృదయుడు పునఃపున రనుసంధానము గావించును. అట్లు భావింపబడినపు డవి స్వవిశిష్టములైగాక సాధారణములై భాసించును. అప్పు డవి విభావానుభావము లని చెప్పబడును. ఈ విభావము సహృదయహృదయమునందు దదుచితచిత్తవృత్తిని మేలుకొల్పును. అనుభావము వానియందు సహృదయునకు దన్మయత్వము గల్గించును. ఈ చిత్తవృత్తులలో నొకటి ముఖ్యముగను దక్కినవి క్షణస్థితికములుగ నుండును. ఈ ముఖ్య చిత్తవృత్తిని స్థాయిభావ మందురు. అముఖ్యచిత్తవృత్తులను వ్యభిచారు లందరు. ఈ వ్యభిచారిభావములుగూడ స్థాయిభావము చర్వణాగోచరమగుటలో ఘాతప్రతిఘాతరూపముగా సాహా

పడును. ఇట్లు విభావానుభావ వ్యభిచారులు స్థాయి భావమును చర్వణాగోచర మొనరించుచున్నవి.

మఱియు నీ విభావానుభావ వ్యభిచారిభావములు స్థాయిభావమును చర్వణాగోచర మొనరించుటలో నింకొక కార్య మాచరించుచున్నవి. పూర్వము పరిశుద్ధుడైన జీవునకు మహామోహరూపమగు నాశ యావరకముగా నున్నదనియు నిదియే సుఖదుఃఖములకు గారణమనియు జెప్పితిమి. ఇప్పు డీ విభావానుభావ వ్యభిచారిభావము లీ యాశ యనబడు నజ్ఞానమును దొలగించివేయుచున్నవి. అట్లు తొలగింపనిచో స్థాయి చర్వణాగోచర మగుటకు వీలు లేదు. శోకాది చిత్తవృత్తు లలౌకికత్వము నొందినప్పుడే చర్వణాగోచరము లగుననియు త్రిపుటి తొలగినగాని చిత్తవృత్తు లలౌకికములు గావనియు బూర్వము చెప్పితిమి. మఱి యీ త్రిపుటి యజ్ఞానము నశించినగాని పోదు. కాన స్థాయి చర్వణమునందు నజ్ఞానధ్వంసన మావశ్యకము. ఇట్లీ యజ్ఞానము ధ్వంసముకాగా పరిశుద్ధుడైన జీవునకు స్వాత్మదర్శనము గలుగుచున్నది. ఇప్పుడీ జీవుడు నిరవధిక సుఖస్వరూపుడు. స్వయం ప్రకాశుడు. ఆనందమయుడు. ఇట్టి యానందమయుడగు జీవునకు గలితముగాని దీ స్థాయిరూపమగు చిత్తవృత్తి యొక్కటే మిగిలియున్నది. ఉద్బుద్ధమైన యీ స్థాయిభావము ద్వారముననే జీవునకు స్వాత్మదర్శనము గలిగినది. ఈ స్థాయిసుఖముననే స్వాత్మానంద మనుభవింపబడుచున్నదిగాన రసమనగా స్థాయిసుఖమున ననుభూయమానమగు స్వాత్మానందమని సిద్ధాంతము.

మఱి యీ యానందము విభావాదుల నాశ్రయించి యనుభూతమైనదిగాన నిది నిర్విషయకము గాదు. స్థాయిసుఖమున ననుభూతమైనదిగాన నిర్విశేషణకము గాదు. మఱి సవిషయకము సవిశేషణక మగుచున్నది. అయినను నలౌకికముగాన రసమని వ్యవహారికపబడుచున్నది. పై రెండు కారణములచేత యోగులు సాధించు నిర్వికల్పమగు బ్రహ్మానందసుఖకంటె నొక మెట్టు క్రిందిదిగాన నీ రసానందము బ్రహ్మానంద సబ్రహ్మచారి యని చెప్పబడుచున్నది. ఇట్టి బ్రహ్మానందసబ్రహ్మచారి యగు రసరూపస్వాత్మానందమును శోకరూపస్థాయిసుఖమున వాల్మీకి యనుభవించెను. కావున నాయన యనుభవించినది కరుణరసము. ఈ కరుణరసనిష్యందమే మానిషాదేత్యాది శ్లోకము. ఆ శ్లోకము రసనిష్యందిగావుననే యది పాదబద్ధము, అక్షరసమము తంత్రీలయ సమన్వితము నై, యనగా ఛందోబద్ధమై, రాగతాళయుక్తమై యాకస్మికప్రత్యవభాసముగా నా మహర్షినోటినుండి వెడలినది. ఆయన పొందిన యనుభూతి యలౌకికముగాన దాని యావిష్కృతికూడ నలౌకికము. ఆ యావిష్కృతియొక్క స్వరూపము గూడ నలౌకికము. అందుచేత గవితానంద మలౌకికమనియు, గావ్యస్వరూప మలౌకికమనియు బైవాల్మీకిగాథవలన మనకు దెలియుచున్నది. ఇందుచే వ్యావహారికభాషలో గావ్యములు వ్రాయవలయు ననుట వట్టి యజ్ఞానవిలసనమనియు నట్టి వాదము కావ్యతత్త్వానభిజ్ఞులుమాత్రమే చేయుచుందు రనియు స్పష్టము.

ఈ రసానందము ననుభవించుటయు, నది కావ్యరూపమున వెలయుటయు బ్రపంచమున దొలుదొల్తగా వాల్మీకికి సంభవించెనుగాన నాయన యాదికవి. ఇంతియే గాదు. యనుభూతియొక్కయు దాని యావిష్కృతి యొక్కయు స్వరూప మిట్టిదని పాదబద్ధేత్యాది శ్లోకమునం దాయనయే నిర్ణయించెనుగాన వాల్మీకి కవియు సహృదయుడును నగుచున్నాడు. ఆయన కవిసహృదయుడు. కవిసహృదయు డనగా సరస్వతీ తత్త్వము సమగ్రముగా నెఱింగినవా డన్నమాట. "సరస్వత్యా స్తత్త్వం కవిసహృదయాఖ్యం విజయతే" యని శ్రీమదాచార్యాభినవ గుప్తపాదులు సెలవిచ్చిరి. కవిసహృదయు డనగా మహాకవి యన్నమాట. ఈ భారతదేశమున కావ్యసరస్వతి మహాకవులకే వెలసినది. ఆ తల్లి వాత్సల్యముతో బ్రియబాలురగు వారికి దివ్యమగు నానందరసమును బ్రస్రవించినది. వాల్మీకి యా మహాకవులకు శిరోభూషణము. ఆ మహర్షి నోటినుండి కావ్యసరస్వతీ ప్రథమావతరణమును, రసభారతీప్రథమనిష్యందమును గుఱించిన గాథకు సర్వకవులు ఋణపడిరి. సర్వసహృదయులు ఋణపడిరి. ఓహో! యేమి వాల్మీకి! ఏమి గాథ!

"ఈ సంసార మి దెన్నిజన్మలకు నే
నీ మాని వాల్మీకిగా
భాసంక్రాంతఋణంబు దీర్పఁ గలదా
తత్కావ్యనిర్మాణ రే
ఖాసానుగ్రిఋణంబు దీర్పఁగలదా?"
—(విశ్వనాథ సత్యనారాయణ గారు)

నందివర్ధనము

శ్రీ సూరంపూడి భాస్కరరావు

నందివర్ధనము నవ్వింది !
ఓ మనిషీ - నీ
మనసుకంటె తెల్లగ చల్లగ
నందివర్ధనము నవ్వింది !

కాంతి సుంత ప్రసరించని
గంటి కొకే వెలుగై,
చితికిన నీ మానవతకు
గతిచూపెడి నేత్రై,

నందివర్ధనము నవ్వింది!
ఓ మనిషీ! నీ
మనసుకంటె తెల్లగ చల్లగ
నందివర్ధనము నవ్వింది

నిన్ను మించి నీలో బరువెక్కిన
నీ యేడ్పుల కోదార్పై,
నిన్ను మించి నీలో పరువెత్తిన
రణ చణ భీషణ ఘోషకు
శాంతి ప్రవచనమై,

నంది [illegible]ర్ధనము నవ్వింది!
ఓ మనిషీ - నీ
మనసుకంటె తెల్లగ చల్లగ
నందివర్ధనము నవ్వింది!

యుగయుగముల స్వార్థపరత
రగిలించిన పిరికితనము

నలుపై కన్నులపై నీ
నాగరికత రూపొందగ
నందివర్ధనము నవ్వింది!
ఓ మనిషీ - నీ
మనసుకంటె తెల్లగ చల్లగ
నందివర్ధన[illegible] నవ్విం[illegible]!

నాకములో కాని నర
లోకములో ఉన్నానని
నందనవని సితస్మితా
వందనమై పలికినట్లు

నందివర్ధనము నవ్వింది!
ఓ మనిషీ - నీ
మనసుకంటె తెల్లగ చల్లగ
నందివర్ధనము నవ్వింది!

శ్రీ అరవిందుని యోగ జీవితము

★

శ్రీ పి. గణపతిశాస్త్రి

ఇటీవల సంభవించిన శ్రీ అరవిందుల నిర్యాణంతో భారతదేశంలో ప్రాచీనమహర్షులకోవకు చెందిన ఒక పరిపూర్ణమహాపురుషులు అస్తమించినారని చెప్ప వచ్చును. వీరి నిర్యాణవార్త విని భారతదేశమే కాక ప్రపంచంఅంతా దుఃఖాశ్రువులు విడిచింది. ప్రళయ మేఘాలు క్రమ్ముకొనే ఈప్రపంచవిపత్సమయంలో శ్రీ అరవిందులు ఇంకా కొంతకాలంవరకు తమ దివ్యాధ్యాత్మికసందేశం లోకానికి వినిపిస్తూ మానవ జాతిని సముద్ధరించగలరని అనేకులు ఆశించారు. కాని విధివిలసితం అన్యథా జరిగింది.

అరవిందులు వందేమాతరంరోజులలో తమ సర్వస్వము దేశాని కర్పించి స్వాతంత్ర్యరణరంగములో ఉరికిన ధీరులు; ఆనాడు అరితేరిన దేశీయ నాయకులలో అగ్రగణ్యులైనారు. అంతేగాక వీరు గొప్ప కవిగా, వాఙ్మయ విమర్శకులుగా, విఖ్యాత తత్వవేత్తగా, పత్రికా రచయితగా, భారతీయ సంస్కృతివ్యాఖ్యాతగా, ద్రష్టగా, మహాయోగిగా ప్రపంచంలో అంతటా ప్రఖ్యాతికెక్కారు. చాలాకాలంనించీ పుదుచ్చేరి అరవిందాశ్రమంలో యోగనిమగ్నులై ఏకాంతంగా నివసిస్తున్నా, వారు అనుక్షణము, వివిధ ప్రపంచసమస్యలపై తమ దృష్టి కేంద్రీకరిస్తూ తమ రచనలద్వారా భారతీయజీవన పథానికి వెలుగులు చూపిస్తూనేవున్నారు. వారి ఆశ్రమం, దేశదేశాలలోని సత్యాన్వేషకులైన మేధావు లనేకుల నాకర్షించింది. భారతీయుల కనేకుల కది కేవలము ఒక దివ్యపుణ్యక్షేత్రమే అయింది.

అరవిందుల జీవితము

అరవిందుల మాతామహులు సుప్రసిద్ధ బ్రహ్మసామాజికులయిన రాజనారాయణబోసు. వీరు సంస్కృతాంగ్లాది భాషలలో మహావిద్వాంసు లని కూడా తెలుస్తున్నది. చివరికాలంలో వీరు బ్రహ్మసమాజం విడిచి హిందూమతాభిమానులైనారట. వీరి కుమార్తె శ్రీమతి స్వర్ణలతాదేవి అరవిందుల జనని. అరవిందుల జనకులు కృష్ణధనఘోష్. వీరి పూర్వులు బ్రహ్మసమాజవిరోధులైనా వీరుమాత్రం బ్రహ్మసమాజంపట్ల అభిమానం చూపిస్తూ ఉండేవారట. కనకనే వీరు బ్రహ్మసమాజకన్యను వివాహం చేసుకొన్నారు. ఈ వివాహానికి మహర్షి దేవేంద్రనాథ ఠాకూర్ స్వయంగా పౌరోహిత్యం జరిపారట. ఈ వివాహం వల్ల కృష్ణధనఘోష్ అనేకమైన ఇబ్బందులపాలయ్యారు. కృష్ణధనఘోష్ స్వప్రయత్నంవల్ల బాగా ధనం ఆర్జించి విదేశాలకు వెళ్లి ఐ. యమ్. యస్. పరీక్షలో కృతార్థు లయినారు. స్వర్ణలతా కృష్ణధన ఘోషులు ఖుల్నానగరంలో నివసిస్తూ బహుళంగా సాంఘికసేవలోనే తమసర్వస్వమూ ధారపోస్తూ ఉండేవారు.

వీరిద్దరికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. వీరిలో మొదటి కుమారుని పేరు వినయభూషణుడు. రెండవవాడు మనోమోహనుడు. మూడవ వాడు అరవిందులు. ఈయన ౧౮౭౨ ఆగస్టు ౧౫వ తేదీని జన్మించారు. నాలుగవ సంతానము కుమార్తె. ఈమె పేరు సరోజినీదేవి. ఆఖరి సంతానము వారీంద్రుడు. ఈతడు ఆకాలంలో వంగదేశంలో ప్రఖ్యాత విప్లవవాదిగా ప్రసిద్ధి కెక్కాడు. మనూమోహనుడు కలకత్తా రాజధానీ కళాశాలలో ఆంగ్లభాషాచార్యుడుగా ఉంటూ తన రచనలవలన ఆంగ్ల దేశంలో కవిగా పేరు సంపాదించాడు. సరోజినీదేవి ఆజన్మ బ్రహ్మచారిణి అయి ఆధ్యాత్మిక గవేషణాపరురాలయింది.

కృష్ణధన ఘోషుకు ఆంగ్లవిద్యమీద అభిమానం ఎక్కువ. అందుచేత బాగా చిన్నతనంలో అరవిందుని డార్జిలింగ్ పంపించి అక్కడ సెంటుపాల్ స్కూల్‌లో చదివించాడు. అయినా ఈ విధమయిన ఆంగ్లవిద్యాభ్యాసంతో తృప్తిపడక కృష్ణధనఘోష్ తన ముగ్గురు కుమారులతోను, కుమార్తెలతోను కలిసి పిల్లల ఆంగ్ల విద్యాభ్యాసం కోసం ఇంగ్లండు వెళ్లిపోయాడు.

అక్కడే వీరి కనిష్ఠకుమారుడు వారీంద్రుడు జన్మించాడు. కాని కొంతకాలంనుంచీ స్వర్ణలతాదేవి ఉన్మాదవ్యాధితో బాధపడుతూండడం వల్ల ముగ్గురు కుమారులను ఇంగ్లండులో విద్యాభ్యాసానికి విడిచిపెట్టి, కృష్ణధనఘోష్ తిరిగి భారతదేశం వచ్చివేశాడు.

అరవిందులు కుటుంబంతోసహా ఏడేళ్ళ వయస్సులోనే ఇంగ్లండు వెళ్లారు. ఆ తరవాత అయిదేళ్లవరకు మాంచెస్టరులోనే చదువుకొన్నారు. ఆ పిమ్మట అరవిందులు లండన్‌లో చదువుకున్నారు. ఆ తరవాత కొంతకాలానికి ఈయన తమ ౧౮ వ ఏటనే ఐ. సి. యస్. పరీక్షకు హాజరై గ్రీక్, లాటిన్ భాషలలో అత్యుత్తమతరగతిలో ఉత్తీర్ణు లయినారు. తరవాత రెండేళ్ళు ఆంగ్లభాష అభ్యసించి ట్రైపాస్‌లో ఉత్తీర్ణు లయినారు. ఈ పరీక్షకు చదివేటప్పుడు అరవిందులు విద్యార్థివేతనానికై ఒక పోటీ పరీక్షలో పాల్గొన్నారు. ఇది షేక్స్పియర్—మిల్టను మహాకవుల తారతమ్య నిర్ణయానికి సంబంధించిన వ్యాసరచన. పోటీపరీక్షలో అరవిందులు ఉత్తీర్ణు లయినారు. ఆ పోటీ వ్యాసా లన్నీ పరిశీలించిన బ్రౌనింగ్ కవి అరవిందుల వ్యాసం అత్యధికంగా ప్రశంసించాడని తెలుస్తున్నది. అరవిందులు తమ విద్యాభ్యాసకాలంలో ఐ. సి. యస్. పరీక్షలకు సంబంధించిన అన్ని పరీక్షలలోను ఉత్తములుగా ఉత్తీర్ణు లయినా, గుర్రపుస్వారీ పరీక్షకు వెళ్లడం మానివేశారు. ఆ కాలంలో వీరిలో రేకెత్తుతున్న తీవ్రరాజకీయభావాలే దీనికి కారణం అయి ఉండవచ్చును. ఈ విద్యాభ్యాసకాలంలోనే అరవిందులు ఇటాలియను, జర్మన్ భాషలు పాశ్చాత్య సాహిత్యాలు, పాశ్చాత్య సభ్యతా చరిత్రలు, వారి రాజ్యాంగాదులచరిత్రలు కూలంకషంగా అభ్యసించారు. ఇంచుమించుగా ౧౮౯౩ వరకు ఈయన ఆంగ్లదేశంలోనే ఉండిపోయారు. ఈ సమయంలోనే అరవిందుల జనకులు కృష్ణధనఘోషు మరణించాడు. ఈకాలంలోనే అంటే అరవిందుల ౨౧ వ సంవత్సరంలోనే బరోడా మహారాజుకు వీరితో పరిచయం కలిగింది. తండ్రి మరణించిన నాలుగైదు నెలలకు అరవిందులు తిరిగి స్వదేశం వచ్చివేశారు.

ఆ తరవాత కొంతకాలంపాటు అరవిందులు బరోడా మహారాజుకు ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేశారు. ఆపిమ్మట కొంతకాలమే రెవెన్యూ శాఖలో పనిచేసి, చివరికి బరోడా ఆంగ్లకళాశాలలో ఉపాధ్యాయులుగా కుదురుకున్నారు. ఈ ఉద్యోగం ౧౮౯౩ మొదలుకొని ౧౯౦౬ వరకు అంటే ౧౩ సంవత్సరాలు సాగింది. ఈ సమయంలోనే వీరు సంస్కృతంలోను, హిందీ, బెంగాలీ, గుజరాతీ మొదలయిన దేశభాషలలోను అఖండపాండిత్యం గడించుకొన్నారు. అప్పుడు వీరు సంపాదనలో చాలాభాగం కొత్తపుస్తకాలకోసం ఖర్చుపెట్టేవారట. అరవిందులకు 22 వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెసు మితవాద విధానం మీద ఏవగింపు బయలుదేరింది. ఆ సమయంలో ఈయన కాంగ్రెసువిధానం విమర్శిస్తూ వ్రాసిన వ్యాసాలు కాంగ్రెసునాయకులలో బాగా అలజడి కలిగించాయి. ఈ వ్యాసాలలోనే అరవిందులు ఆనాడు సోషలిజం మీద తమకున్న అభిమానం వెల్లడించారు. బరోడాలో ఉన్నంతకాలము మహారాజు అరవిందులపై అత్యంతాదరం కనబరుస్తూ అనేక ప్రధాన విషయాలలో వీరి సలహాలు తీసికొంటూ ఉండేవారు. విద్యార్థు లందరు వీరిమీద అత్యధిక భక్తిభావంతో మెలగేవారు. ఈ విధంగా బరోడా కళాశాలాధ్యాపకత్వం ఎంతోకాలం జరగలేదు. అప్పటికాలంలో వంగదేశ విభజనవల్ల వంగదేశంలోను, భారతదేశంలోను అలజడి బాగా ఇమనుడించింది. ఇక అరవిందులు ప్రశాంతంగా తమ బరోడా ఉద్యోగంలో ఉండలేకపోయారు. అప్పటికి ఆయనకు బరోడాలో నెలకు తొమ్మిదివందల రూపాయల జీతము. అయినా వారీ ఉద్యోగం 1906 జూలై నెలలో తృణప్రాయంగా విడిచిపెట్టివేశారు.

అరవిందులు బరోడాలో ఉన్నప్పుడే— అంటే ౧౯౦౧ వ సంవత్సరంలో మృణాలినీదేవిని వివాహమాడి గృహస్థాశ్రమంలో ప్రవేశించారు. అప్పటికి వీరికి ౨౮ ఏండ్లునిండాయి. అప్పటివరకు వివాహం చేసుకోవడమూ, మానివేయడమూ అని ఆలోచిస్తూ ఉండడంవల్ల వీరి వివాహం ఇంత ఆలస్యం అయిందని తెలుస్తున్నది. గార్హస్థ్యంలో ఉన్న స్వల్పకాలలోను వీరు, తమ సహధర్మచారిణిని దేశభక్తురాలినిగా ఆధ్యాత్మికచింతాపరాయణురాలినిగా దిద్దితీర్చుకున్నాడు. శ్రీ అరవిందులు మృణాలినీదేవిగారికి

వ్రాసిన లేఖలను బట్టి అప్పటికే వారిలో తీవ్రంగా మొలక లెత్తుతున్న ఆదర్శాంతర ప్రభావం గ్రహింపవచ్చును. బరోడాలో ఉన్నప్పుడు అరవిందులకు ఆధ్యాత్మిక జిజ్ఞాస మిక్కుటమవుతూ ఉండేది. ఈసమయంలో వీరు నర్మదా తీరంలో నివసిస్తున్న మహాత్ముల నసేవలను సందర్శిస్తూ ఉండేవారు. అప్పుడే వీరికి బ్రహ్మానందస్వామితోను, సుప్రసిద్ధ మహారాష్ట్ర యోగి విష్ణుభాస్కర లెలేతోను పరిచయం కలిగింది. వీరి సాంగత్యం అరవిందులలోని ఆధ్యాత్మికతృష్ణను మరింతగా అభివృద్ధి పొందించింది. ఆ పిమ్మట అరవిందులు తీవ్రంగా రాజకీయాలలో ప్రవేశించినా, లోలోపల వీరి ఆధ్యాత్మికతృష్ణకూడా ఇనుమడిస్తూనే ఉన్నది.

రాజకీయాల్లో ప్రవేశము : పత్రికా సంపాదకత్వము

వంగదేశ విభజనవల్ల, వందేమాతరం ఉద్యమం వల్ల ఆరోజుల్లో వంగదేశంలోను, భారతదేశంలోను రాజకీయ సంచలనం బాగా ఇనుమడించినదనుకున్నాము. వంగదేశ ప్రముఖులు కొందరు పాశ్చాత్య విద్యాలయాలు కేవలం గుమాస్తాలను తయారు చేసే కార్ఖానాలుగా మారాయని గుర్తించి, కలకత్తాలో జాతీయకళాశాల స్థాపించాలని నిశ్చయించారు. ఈ కళాశాల ౧౯౦౬ నవంబరులో స్థాపించారు. ఈ కళాశాలా స్థాపకులు అరవిందులను దీనికి ప్రధానాచార్యులుగా రావలసినదని కోరారు. అరవిందులు ౭౫ రూపాయల జీతంతోనే ఈ కళాశాలాచార్యపదవి నిర్వహించడానికి అంగీకరించారు. అయితే వీరు ఈ కళాశాల ప్రభుత్వసంబంధం లేని పూర్ణమైన జాతీయకళాశాలగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పాలకవర్గం ఇంతటి తీవ్రసంస్కరణ కంగీకరించలేదు. అందుచేత అరవిందులు వెంటనే ఈ ఉద్యోగంలోనుంచి విరమించుకున్నారు. అప్పటి వీరి పదవీ విరమణం విద్యార్థుల కందరికీ ఎంతో సంతాపం కలిగించింది.

కళాశాలాచార్య పదవి విడిచిన తరువాత అరవిందులు వందేమాతరం పత్రికాసంపాదకత్వం స్వీకరించారు. అంతకు పూర్వం వారపత్రికగా ప్రచురింపబడుతున్న ఈ ఆంగ్లపత్రిక అరవిందుల సంపాదకత్వంలో దినపత్రిక అయింది. ఈ పత్రికమూలంగా జాతీయతత్త్వం వంగదేశాన్ని ఉర్రూతలూగించింది. క్రమంగా వీరి జాతీయసందేశం భారతదేశం అంతటా అల్లుకోవడం మొదలుపెట్టింది. ఈ సమయంలో ఆంగ్ల ప్రభుత్వం వీరిని రాజద్రోహ నేరంమీద శిక్షించాలని ప్రయత్నించింది. కాని నేరం బుజువు కాకపోవడం వల్ల ప్రభుత్వం వీరిని ఏమీ చెయ్యలేకపోయింది.

అరవిందు లీసమయంలోనే 1907 డిసెంబరులో జరిగిన సూరత్ కాంగ్రెస్ మహాసభకు జాతీయపక్షు నాయకులుగా హాజరైనారు. అక్కడ మితవాదులకు జాతీయపక్షునాయకులైన అరవిందప్రభృతులకు మధ్య తీవ్రవిభేదాలు బయలుదేరాయి. చివరికా కాంగ్రెస్ మహాసభ ఛిన్నాభిన్నం అయిపోయింది. జాతీయపక్షు నాయకు లందరు అరవిందుల నాయకత్వంతో వేరుగా ఒక సమావేశం జరిపి దేశాభివృద్ధికరమైన మార్గం ఆదేశించారు. ఈ సమావేశానంతరం అరవిందులు అనేకప్రదేశాలలో సంచారం చేసి దేశంలో బాగా జాతీయోత్తేజం కలిగించారు.

అటుతరవాత వీరిపై అలీపూరు బాంబుకేసు నడిచింది. అరవిందుల కనిష్ఠసోదరుడు వారీంద్రుడు విప్లవకారుడుగా పేరుమోగినవాడు. అందుచేత ప్రభుత్వం అరవిందులకు కూడా దీనితో సంబంధం ఉండవచ్చుననే అపోహతో వీరిని నిర్బంధించి వీరి మీద ఈబాంబుకేసు ఆరోపించింది.

ఈకేసు నడిచిన సమయంలో అరవిందులు జైలులో అనేకకష్టాల పాలయ్యారు. ఈ సందర్భంలోనే వీరికి అత్యాశ్చర్యకరమైన ఆధ్యాత్మికానుభవాలనేకం కలిగాయి. ఈఅనుభూతులలో వీరికి ఆధ్యాత్మికజీవన పథానికి వెలుగులు కనిపించాయి. ఈ ఆలీపూరు బాంబుకేసులో చిత్తరంజనదాసు స్వయంగా అరవిందులపక్షాన న్యాయవాదిగా పనిచేశారు. చివరికి న్యాయాధికారి అరవిందులు నిర్దోషులని తీర్పు ఇచ్చి వీరిని ౧౯౦౯ మే లో జైలునుంచి విడుదల చేశారు.

౧౯౦౮ లోనే 'వందేమాతరం' ఆగిపోయింది. ఆ రోజుల్లో బెంగాల్లో ప్రభుత్వ దమన విధానం, బాగా తీవ్రతరం కావడం ప్రారంభించింది. ఈ పరిస్థితి ఎదుర్కోవడం కోసం అరవిందులు 'కర్మయోగి' అనే ఆంగ్లపత్రిక, 'ధర్మ' అనే వంగపత్రిక ప్రారం

స్థించారు. జాతీయసంస్కృతి పునరుద్ధరణమే ఈ పత్రికా ప్రారంభోద్దేశ్యాలని అరవిందులు ప్రకటించారు.

ఈపత్రికల నిర్వహణ సమయంలోనే అరవిందులు తీవ్రంగా యోగాభ్యాసం చేసేవారు. ఈకాలంలోనే అంతర్వాణి ఆదేశానుసారంగా పుదుచ్చేరి వెళ్లిపోవాలని నిశ్చయించినట్లు తెలుస్తున్నది. తమఆధ్యాత్మికమార్గం ముందుగానే తెలుసుకోవటంవల్లనే వీరు స్వయంగా రాజకీయాలలో నుంచితొలగిపోయి పుదుచ్చేరినివాసం నిశ్చయించారని కూడా అరవిందజీవితచరిత్ర చెబుతున్నది. ఈయన ౧౯౧౦ ఏప్రెల్ ౪ వ తేదీని రహస్యంగా పుదుచ్చేరిచేరుకున్నారు. ఈసంవత్సరం మార్చిలోనే 'కర్మయోగి'పత్రిక నిలిచిపోయింది. అరవిందులు పుదుచ్చేరి చేరుకున్నాక ప్రభుత్వం మళ్లీ రాజకీయ నేరం ఆరోపించడానికి ప్రయత్నించింది కాని ఆనేరం కూడా రుజువుకాలేదు. ఈ కర్మయోగి పత్రికలోనే 'కాళిదాసు' 'జాతీయకళాప్రాశస్త్యము' మొదలైన వీరి గ్రంథాలు వ్యాసరూపంలో వెలువడ్డాయి. తరవాత ఆశ్రమంలో ఏకాంతవాసములో ఉండేటప్పుడు కూడా అరవిందులు 'ఆర్య' పత్రిక ప్రకటిస్తూ తద్వారా తమ నూతన దర్శన విషయకమైన అభిప్రాయాలు విరివిగా ప్రకటించారు. క్రమక్రమంగా అరవిందుల తత్త్వజిజ్ఞాసువులైన అనుచరులనేకులు అరవిందులసన్నిధికి రావటం మొదలుపెట్టారు. ఈ సాధకులందరితోను అరవిందాశ్రమం ప్రారంభమైనది. దీనికి శ్రీజనని పర్యవేక్షకురాలుగా ఉంటున్నారు. ఈ ఆశ్రమప్రారంభం మొదలుకొని ఇంచుమించుగా నిర్యాణ పర్యంతము—ఇంచుమించుగా ౪౦ ఏళ్ళపాటు అరవిందులు యోగసాధనలోనే నిమగ్నులైనారని చెప్పవచ్చును.

అరవిందుల ఆధ్యాత్మిక దర్శనము

అరవిందులు ఏకాంతంగా ఎక్కడో ఎవరికీ కనబడకుండా ముక్కు మూసుకుని కూర్చుని ప్రపంచంతో సంబంధంలేని యోగి అని సామాన్యదృష్టికి తోచవచ్చును. కాని కొంచెం నిశితంగా వీరి ఆధ్యాత్మిక దృక్పథము, దర్శన తత్త్వము పరిశీలిస్తే ఇది నిజం కాదని తేలిపోతుంది. ప్రస్తుత జీవితదుఃఖాలలో నుంచి తప్పించుకొని పరబ్రహ్మంలో విలీనమైపోవటం వీరి ఆదర్శం కాదు. ఈవిషయంలో వీరికీ శంకరభగవత్పాదులచే ప్రవర్తితమైన అద్వైతానికీ చాలా భేదాలు కనిపిస్తున్నాయి. అద్వైతవాదులు ఒక బ్రహ్మకే సత్యత్వంఅంగీకరిస్తారు. మిగిలిన వ్యావహారిక ప్రపంచము దానికి సంబంధించిన మూల్యాలు (Values) మిథ్య, లేక మాయ అని నిర్వచిస్తారు. అద్వైతులలో మళ్లీ కొన్ని విభేదాలున్నాయి. గౌడపాదకారికలు వ్రాసిన గౌడపాదులు అజాతివాద ప్రవర్తకులు. ఈవాదము అసలు సృష్టే జరగలేదనీ, అలాంటప్పుడు, దానికి కారణంగా బ్రహ్మకీ భిన్నమైన పదార్థం నిర్దేశించవలసిన అవసరమే లేదనీ ప్రతిపాదిస్తుంది. ఇది మాండూక్యోపనిషత్తులో సవిస్తరంగా ప్రతిపాదితమైనది. ఇక రెండవది దృష్టిసృష్టివాదము. ఇది దృష్టినిబట్టి సృష్టి జరిగినదని ప్రతిపాదించే వాదము. మూడవది వాస్తవికవాదము. ఇది బ్రహ్మకు (Reality) వాస్తవికతకు (Objcetivity) ఉన్న భేదం అంగీకరించి తద్వారా మాయావాదాన్ని కూడా ఒప్పుకుంటుంది. ఒక్క అజాతివాదంలో తప్ప మిగిలిన ఏ అద్వైతవాదంలోనైనా మాయాప్రతిపాదన జరగక తప్పదు. అద్వైతసాధన బ్రహ్మజ్ఞానమాత్రంతోనే పరిసమాప్తమవుతుంది. ఈ అద్వైతజ్ఞాని 'బాలోన్మత్త పిశాచివత్' లోకంలో కర్మాచరణం సాగిస్తూ ఉంటాడు. మాయ అంగీకరించిన అద్వైతులు జగత్తు వ్యావహారికసత్యమని అంగీకరించి ఈమాయను వ్యావహారిక జగత్తుకు ఒకవిధమైన 'కారణం'గా ప్రతిపాదిస్తారు.

అరవిందుల దర్శనంలో మాయాప్రమేయమే లేదు. అద్వైతవాదంలో బ్రహ్మపై జగత్తు అధ్యాసితమై వివర్తంగా భాసిస్తుంది. అరవిందులది ఒక విధమైన ఆధ్యాత్మిక పరిణామవాదమని నిర్వచింపవచ్చును. అయితే అరవిందులు ద్వైతవాదులని భ్రమించకూడదు. అరవిందదర్శనం పరిశీలించిన వారికి వంగదేశంలో ప్రచలితమైన తాంత్రికతత్త్వ ప్రభావం స్పష్టంగా గోచరిస్తుంది. వంగదేశంలో ప్రచలితమైన తాంత్రికతత్త్వము, అద్వైతవేదాంతము సమన్వయపరచి అరవిందులు తమ నూతన పూర్ణదర్శనం ప్రతిపాదించారని అనవచ్చును.

ఇందుచేత అరవిందులు భారతదేశంలో వ్యాపించిన వివిధసిద్ధాంతాలు పరిశీలించి వాటి సమ

స్వయంతో నూతనదర్శనం ప్రతిపాదించారని భావించకూడదు. భారతదేశ వేదాంతు లెవరు కేవలం మేధాబలంతో నూతన ప్రస్థానాలు బయలుదేరదీయ లేదు. అచంచలమైన సాధనతో దివ్యానుభూతులు అందుకొని ఆ అనుభూతిబలంతోనే వారు ఆ యా సిద్ధాంతాలు ప్రతిపాదించి లోకంలో వాటికి వ్యాప్తి కలిగించారు. అరవిందులు అద్వైతులు ప్రతిపాదించే నిర్గుణ పరబ్రహ్మ ఆధ్యాత్మికానేష్వణ సాధనలో ఒక మెట్టుమాత్రమే అనీ, దినికి పైన అతిమానసిక భూమికలు క్రమక్రమంగా అనేకం ఉన్నాయనీ, అన్నింటికీ పైన విజ్ఞానభూమిక (Supra mental Plane) ఉన్నదనీ చెబుతున్నారు. ఆ భూమికల కన్నింటికీ దిగువ సైకోఎనాలిసిస్ చెప్పే (Sub concious) అవ్యక్తమనస్సు కూడా ఉన్నదని అంగీకరిస్తారు. ఈ రెండు భూమికలకు మధ్యన ఇంకా అనేకమైన భూమిక లున్నవని ప్రతిపాదించి అరవిందులు ఆయన భూమికలనుగురించి సవిస్తరంగా వ్యాఖ్యానించారు. అయితే ఈ భూమిక లన్నిటిలోను దివ్యచైతన్యం అంతర్గతమై ఉన్నదని, క్రమంగా ఊర్ధ్వంగా అధిరోహించినకొలదీ ఈ చైతన్యం స్వయంప్రకాశమానమౌతున్నదని అరవిందుల అభిప్రాయము.

అరవిందుల తాత్త్వికదృక్పథంలో గమనించవలసినది ఒక అతిముఖ్యమైన విషయం ఉన్నది.. ఇంతవరకు ప్రపంచంలో పదార్థమూ, (Matter) ప్రాణశక్తి (Vital Force) మనస్సులు (Mind) మాత్రమే ఆవిర్భవించాయనీ, వీటితో ఆధ్యాత్మిక పరిణామం నిలిచిపోలేదనీ క్రమంగా మనస్సుకు పైబడిన ఉన్నత భూమికలు కూడా పృథివిపై అవతరించగలవనీ ఇదే ఆధ్యాత్మికపరిణామంలోని అంతరార్థమనీ అరవిందులు ప్రవచించారు. దీనికి, వారు ఇంతవరకు జరిగిన జీవన పరిణామాన్నే ఉదాహరణగా ఇస్తున్నారు. మానవునితోను మానవమనస్సుతోను ఈ పరిణామం నిలిచిపోదనీ క్రమంగా అధిమానవ (O.er Mind Plane) భూమిక కూడా ఈ భూమిపై అవతరించగలదనీ, ప్రస్తుత ప్రపంచచరిత్రలో ఈ అధిమానవభూమికావతరణం జరగబోతున్నదనీ వీరు ప్రతిపాదిస్తున్నారు. దీనినిబట్టి క్రమక్రమంగా భూమిమీద అధిమానవజాతి అవతరించగలదని అరవిందులు ప్రతిపాదిస్తున్నారన్నమాట. ఈ ప్రతిపాదన ఏదో కట్టుకథగా ఉన్నదని ఎవరన్నా అనుకోవచ్చును. అయితే అరవిందులే ఈ పరిణామం అనుకున్నంత సులభంగా కాదనీ, దీనికోసం మానవజాతి అతిక్లిష్టమైన సోపానాలు అధిరోహించవలసిఉన్నదనీ, ఈ అధిమానవభూమికావతరణ మానవజాతి ఎంతో శ్రమించి, సాధించవలసిన మహాత్కార్యం అనీ, ఇది ఇంతకాలంలో జరగగలదని చెప్పడం కూడా చాలాకష్టమనీ, సర్వము మానవజాతి సాధనానిరతిపై ఆధారపడి ఉన్నదనీ అన్నారు. అరవిందుల పరిణామవాదం డార్విన్ పరిణామవాదాన్నీ, ఫ్రెంచితత్త్వశాస్త్రజ్ఞుడు హెన్రీ బెర్గ్‌సన్ సృజనాత్మక పరిణామవాదాన్నీ (Creative Evolution) కూడా అధిగమించిన, సర్వాంగసుందరమైన దివ్యపరిణామవాదము. వీరు తమ దర్శనంలో ఏ జీవితాంశమూ నిరుపయోగకరమైనదని గాని, మిథ్య అని గాని తోసివేయ్యరు. మానవశరీరం మొదలుకొని మనస్సువరకు గల అన్ని భూమికలు వీరి సాధనలో ప్రస్ఫుటించి వికసిస్తాయి. ఇంకా మనస్సుకు పైభాగంలోని అన్ని ఉన్నతభూమికలు వికసించి క్రమంగా మానవుడీ భూమిమీదనే పరిపూర్ణ దివ్యపురుషు డవుతున్నాడు. చరాచరాత్మకమైన సృష్టిఅంతా క్రమంగా ఈ దివ్యపరిణామానికే అధిగమించిపోతున్నదని వీరు ఘంటాపథంగా నొక్కి చెబుతున్నారు.

అరవిందులు తమ సిద్ధాంతాలన్నీ 'దివ్యజీవనము' (Life Divine) అనే తాత్త్వికగ్రంథంలో కూలంకషంగా చర్చించి సయుక్తికంగా సిద్ధాంతీకరించారు. ఈగ్రంథం నేటికాలంలో వెలువడిన తాత్త్వికగ్రంథాలలో మహోత్కృష్టమైనదని తత్త్వశాస్త్రజ్ఞులనేకులు ప్రశంసించారు. ఇంకా వీరు రచించిన అనేకమైన తాత్త్వికగ్రంథాలలో తమ భావాలన్నీ సర్వతోముఖంగా చర్చించారు. వేదకాలంలో ఈ విధమైన తాత్త్వికసిద్ధాంతా లున్నాయని, క్రమంగా అవి మరుగుపడిపోయి శంకరాచార్యుల మాయావాదం బయలుదేరినదనీ ఇది సమగ్రమైన తాత్త్వికసిద్ధాంతం కాదనీ, బాగా ఇటీవల బయలుదేరిన వేదసాయణభాష్యంలో కూడా ఈ ప్రాచీనసత్యం మరుగుపడిపోయినదనీ వీరు అభిప్రాయపడుతున్నారు. ఈఅభి

ప్రాయంతోనే వేదాలకు కొరొక నూతనతాత్త్విక వ్యాఖ్యానం ప్రతిపాదించారు. ఈభావంతోనే ఈశోపనిషత్తుకు కూడా ఒక వ్యాఖ్యానం రచించారు. వీరు రచించిన గీతావ్యాసాలు(Essays on Gita) మొదలైన గ్రంథాలన్నీ పై అభిప్రాయాలే వ్యక్తపరుస్తున్నాయి.

కేవలం గ్రంథరచనతోను, అభిప్రాయ ప్రకటనతోను తృప్తిపడక అరవిందులు తమ ఆశయ సాధనకై అనుదినము మహాతపస్సు చేశారు. తమ ఆశ్రమంలో సాధనచేసే వందలకొలది సాధకులకు, అంతేవాసులకు మార్గదర్శకులై వారిలో చాలామందికి తమ దివ్యప్రబోధను, ఆదర్శము సాక్షాత్కరింప జేశారు. అనుదినము అరవిందదర్శనము నూతనాంతేవాసులను, సాధకులను ఆకర్షిస్తూ నలుదెసలా వ్యాపిస్తున్నది.

తాత్త్వికదృష్ట్యా, అరవిందదర్శనంలో హేతువాదానికి అతీతమైన అతీంద్రియానుభూతి (Mystic Experience)పరమ ప్రమాణంగా అంగీకరించక తప్పదని తోస్తున్నది. అయితే అరవింద తత్త్వవాదులు ఇది అరవిందదర్శనానికి ఒక లోపం కాదనీ, ఈ దర్శన తాత్త్వికతలో సామాన్య హేతువాదానికి అతీతమైన హేతువాద దృక్పథం ఉన్నదనీ చెబుతున్నారు. ఏమయినా అరవిందులదర్శనం భారతదేశంలో అతినవీనము, సమగ్రము అయిన తాత్త్విక దర్శన మని అంగీకరించకతప్పదు.

అరవిందుల సాహిత్య విమర్శ

అరవిందులు పూర్ణపురుషులు. మిగిలిన తాత్త్విక సిద్ధాంతాలలో లేని పరిపూర్ణత వీరి దర్శనంలో ఉన్నది. కనుకనే లలితకళ లేవీ వీరు హేయాలని విసర్జించలేదు. స్వయంగా అరవిందులు ఆంగ్లభాషలో గొప్పకవులు. ఇంతేకాక సాహిత్యవిమర్శలో వీరొక నూతన దృక్పథం కూడా సూచించారు. వీరి సాహిత్యసిద్ధాంతాలకు, తాత్త్వికసిద్ధాంతాలకు చాలా సన్నిహిత సంబంధం ఉన్నది. అరవిందులు ప్రముఖులయిన ఆంగ్లకవుల రచన లన్నీ సమగ్రంగా విమర్శించారు. భారతీయకవులపై ఈయన వ్రాసిన విమర్శలలో చాలా కొత్తపోకడలు కనిపిస్తున్నాయి. కాళిదాసుపై వీరు వ్రాసిన విమర్శ అత్యంత సమగ్ర విమర్శ. దీనిలోనే వీరు ఇంతవరకు నీతి ప్రధానము మేధాప్రధానము, రసప్రధానము అయిన కవిత్వం మాత్రమే వచ్చిందనీ, ఆధ్యాత్మికమైన కవిత ఇక అవతరించవలసి ఉన్నదనీ, వాల్మీకి, వ్యాస కాళిదాసులు పై మూడువిధా లయిన కవితలో మహోత్తము లనీ, అన్నారు. వీరు రచించిన (Mystic Poetry) 'మార్మిక కవిత' అనే విమర్శవ్యాసంలో ఈ కవిత నిర్వచించి, మహాకవుల రచనలనుంచి దీనికి ఉదాహరణ లిచ్చారు. కవిత్వం ఇంతవరకు పొందిన పరిణామము, ఇకముందు రావలసిన పరిణతి వివరిస్తూ ఈయన వీరిభావికవిత, అనే మరి ఒక విమర్శకవ్యాసం రచించారు. ఇదికూడా కవిత్వవిమర్శలో అతినూతనమైన దృక్పథం ప్రదర్శిస్తున్నది.

అరవిందులు సాహిత్యంమీదనేకాక భారతీయ కళాపరిణతిని గురించి, సంస్కృతిని గురించి, మానవ సౌభ్రాత్రాన్ని గురించి· అనేకమైన వ్యాసాలు గ్రంథాలు వ్రాశారు. భారతీయసంస్కృతి కళావగాహనలకు ఇవి చాలా ముఖ్యమైన గ్రంథాలు.

అరవిందుల కవిత

అరవిందులు ఆంగ్లదేశంలో చదువుకునే రోజుల్లో-అంటే తమ 14 వ ఏటనుంచీ కవితా రచన కుపక్రమించారని తెలుస్తున్నది. 'Love and Death' అనే కావ్యం వీరు చాలా చిన్నతనంలో రచించినది. ఇది భారతంలోని ప్రమద్వర కథ. ఇదిగాక వీరు అనేకమైన ఖండాంగ్లకావ్యాలు కూడా వ్రాశారు. భర్తృహరి శతక త్రయము, కాళిదాసమహాకవి విక్రమోర్వశీయము ఆంగ్లభాషలోకి అనువదించారు. కొన్ని ఆంగ్లకావ్యాలలో వీరు ఇంతకు పూర్వం ఆంగ్లభాషలో అపూర్వమైన నూతన చ్ఛందస్సులు కూడా వాడారు. వీరి 'Six Poems' అనే ఖండకావ్య షట్కం, అపూర్వమైన ఆధ్యాత్మిక ఖండకావ్యషట్కము. దీనిని భావి ఆధ్యాత్మిక కవితకు ఉదాహరణగా తీసుకోవచ్చును. వీటి అన్నిటిలోను శివునిపై రచించిన ఖండకావ్యం మహోత్కృష్ట మైనది. ఈకావ్యం సహృదయదృష్టితో పఠించేవారికి అపూర్వమైన గంభీర తాత్త్వికానుభూతి కలిగిస్తుంది. ఈ కావ్యాలేకాగ అరవిందులు అనేకమైన ఆంగ్లపద్యనాటికలు కూడా రచించారు,

వీటిలో నాటక శక్తికంటె కవిత్వ శక్తి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

అరవిందుల మహాకావ్యంగా పేర్కొనదగిన ఆంగ్ల కావ్యం 'సావిత్రి'. ఇది సంపూర్ణమైనదని తెలుస్తున్నది. అయితే ఇంతవరకు ఈ కావ్యంలో మూడు ఖండాలు మాత్రమే ప్రకటించారు. ఇది మహాకావ్యమే కాక చాలా సుదీర్ఘమైన కావ్యము. దీనిలో అంతటా అరవిందుల తాత్త్వికదృక్పథం అంతర్గర్భితమై ఉన్నది.

అరవిందులు ప్రమద్వరగాథ, సావిత్రీకథ కావ్యాలుగా రచించడంలోను ఒక నిగూఢాభిప్రాయము ఇమిడి ఉన్నట్లు తోస్తుంది. అరవిందులు పృథివిపై అజరామరులైన అతిమానవులు క్రమంగా అవతరించగలరని ఆదేశిస్తున్నారు. ప్రమద్వర కావ్యంలో రురుడు మరణించిన ప్రమద్వరను అమరలోకంలోనుంచి తిరిగి భూలోకానికి సజీవంగా తీసుకువస్తాడు. ఇది అతని తపఃప్రభావంవల్ల భారత భూమిపై జరిగిన అపూర్వ సంఘటన. తమ అభిప్రాయాలు దీనిలో అంతర్గర్భితంగా ఉండడంవల్లనే అరవిందు లీకథ స్వీకరించి కావ్యంగా వ్రాశారని అనుకోవచ్చును. అరవిందు లిది యౌవనప్రాదుర్భావంలో రచించిన లలిత కావ్యము. ఈ కావ్యం కేవలం రసదృష్టితోనే రచించినట్లు కనిపిస్తుంది. కాని దీనిలో అరవిందుల తాత్త్వికభావాల వివరణం అంతగా కనబడదు. అయితే వారి అభిప్రాయాలు దీనిలో బీజప్రాయంగా ఉన్నాయి. 'సావిత్రి'లో కూడా ఇలాంటి ఇతివృత్తమే ఉన్నది. దీనిలో సావిత్రి తన పాతివ్రత్యశక్తివల్ల భర్తను మృత్యులోకంనుంచి తీసుకువచ్చి తిరిగి బ్రతికించుకుంటుంది. ఈ మహాకావ్యంలో అరవిందుల మహోన్నత తాత్త్విక భావాలు కేవలము శుష్క వేదాంతోపదేశాలలాగ భాసించక పరిపూర్ణ కవితాభావంలో సత్యస్వరూపం ధరిస్తాయి. ఈ మహాకావ్యం సంపూర్ణంగా ప్రకటిస్తే ఇది ఆంగ్లభాషలో అత్యుత్తమకావ్యమేగాక, ఆధ్యాత్మికకవితకు మేలుబంతికూడా కాగలదని చెప్పవచ్చును. ప్రస్తుత ప్రపంచసంక్షోభాలు, సంగ్రామాలు కేవలం భౌతిక మూల్యాల మీద ఆధారపడిన నాగరికతలకు, వైరుధ్యము, వినాశము తప్పవని రుజువు చేస్తున్నాయి. అరవిందుల ఆధ్యాత్మిక పరిణామవాదము ఈ సంక్షోభంలో ప్రపంచానికి ఒక ఆశాజ్యోతిలా కనిపిస్తున్నది. అరవిందవాఙ్మయము తాత్త్వికులకు, అధ్యాత్మికసాధకులకు, సారస్వతోపాసకులకు కూడా వినూతన లోకాలు ఆవిర్భవింపజేస్తున్నది. వీరందరు అరవిందవాఙ్మయం బాగా పఠించి పరిశోధించవలసిన విషయాలింకా అనేకం ఉన్నాయి. సాధకులు కూడా వీరి అధ్యాత్మికసాధన అవలంబించి అరవిందులు నిర్వచించిన పరమసత్యాల ప్రత్యక్షానుభూతి సాధించవలసిఉన్నది. ఇదీగాక ఎప్పటికైనా అరవిందులు సూచించినట్లు మానవ సౌభ్రాత్రం అధ్యాత్మిక దృక్పథంవల్లనే ఎక్కువగా సాధ్యం కాగలదని క్రమంగా స్పష్టమవుతున్నది. భారతీయులకు అరవిందుని స్వార్థరహితచారిత్రము, వాఙ్మయము ఆరని జీవనజ్యోతులనడం అతిశయోక్తి కాజాలదు!

శుభలేఖ

★

శ్రీ యస్. వి. జోగారావు

కరవున కగ్గమై ప్రజ లొకానొకే ముప్పది మూడు కోట్లు శ్రీ
క్కరిసిన దేశమందు, బ్రదుకే ఘనమంచు ప్రజాప్రభుత్వ మూ
పిరి నిలుపోవ నిచ్చు చిరువృత్తి జరించెడు నా కణా వినా
అరువదియేడు జీత మకటా యిక జీవిత మెట్లు సాగునో!

అస్మదీయ జీవితకోశ మందు, పనికి
రాని పదము లేగాని యర్థములు లేవు—
'నాది' యనుదాని కొండె నానార్థము లగు
పించు బోలెడు, పెండ్లాము, పిల్లలనగ—

ఆలుం బిడ్డల కన్నవస్త్రముల నే యార్జింపలేకున్న నిం
కేలా యీ కసుమాలపుం జదువు, లెందేనొక్క కాంతారపున్
మూలం గూర్చుని ముక్కు మూసికొనియో, నుంఛవృత్తి మో వాసంగనీ
గాలక్షేపము సేయరాదె, యని యీ గాముల్ వితర్కించుచున్,

ఒక్క సెలవు నా, డధికారి డొక్కదరుసు
కాక, తనపుట్టినింటికి పోక నుండు
ఊయెల నూగించు నిల్లాలి లాలిపాట,
తలచుకొనుచుండ, నొక కేక తాకె చెవిని.

ఖాకీ కోకలు గట్టి పెద్ద తలపాగా జుట్టి కేలన్ దవా
లా కీలించి ప్రభుత్వభృత్యు డొక వార్తావాహు డేతెంచి నే
దో కమ్మన్ గొని తెచ్చె పచ్చనిది; తోడ్తోన్ 'భళీ శంభళీ!
నా కై శ్రీమతి పంపెని'న్ననుచు జించన్ మేను గంపించెసిన్.

మొన్నటిరేయి మా యావిడ
కన్నదియట, ఒక్క యాడుకవల ననగ నం
దున్నది చూడ, హా తలవిధీ!
కన్నులు కడుపచ్చబారె కమ్మ పగిదినే.

(యన్. జి. ఓ. నుద్దేశించి)



దిలీప్‌కు ఏ చింతా లేదు



ఉద్యోగంలోనూ, సమాజంలోనూ అతడు అత్యున్నత స్థానంలో ఉన్నాడు. ఎట్టి కార్యమునైనా అతడు అత్యంతోత్సాహంతో, శక్తిసామర్థ్యాలతో నిర్వహిస్తాడు. బోర్న్-విటా ఒసగే అదనపు శక్తిమూలంగానే ఇదంతా అతనికి సాధ్యపడుతున్నది.

ఆరోగ్యానికి ముఖ్యావసరమైన పోషకపదార్థాలు బోర్న్-విటాలో సమృద్ధిగా కలవు. కనుక, మీకుకూడా మీమైసందిన విధుల నిర్వహణకు అవసరమైన శక్తిని అది ఒసగుతుంది. బోర్న్-విటాను సేవిస్తే, శరీరం, మెదడు పోషణకు అవసరమైన పదార్థాలు సరియైన పాళ్లలో కలిసిన సమగ్రమైన ఆహారం మీకు లభిస్తుంది. మానవయంత్రానికి అదనపు శక్తిని చేకూర్చునట్టి ఉత్తమాహారమే బోర్న్-విటా.

జగద్విఖ్యాతిగాంచిన డెయిరీ మిల్క్ చాకొలెట్లు తయారు చేసే క్యాడ్బరీ వారొక్కరే బోర్న్-విటాను తయారు చేస్తున్నారు.

కోల్పోయిన శక్తిని కూడదీసుకోండి. నేడే ఒక టిన్ను కొనండి. జ్ఞాపకం ఉంచుకొని ముఖ్యంగా బోర్న్-విటానే కోరండి.

ఆరోగ్యాభివృద్ధికి సేవించండి



క్యాడ్బరీస్

బోర్న్-విటా

కాల్షియం మరియు ఏ. & డి. విటమినులతో నిండి ఉన్నది

క్యాడ్బరీ-ఫ్రై (ఇండియా) లిమిటెడ్

P. B. 1417, బొంబాయి—P. B. 251, కలకత్తా—P. B. 1725, మద్రాసు.

CFY 8 T.G.

వర మీయని వేలుపు

ఆర్థర్ కోస్లర్

౪

చివరికి ఉద్యోగం పోవటంతో బూర్జువా ప్రపంచపు సంకెళ్ళన్నిటినుండీ విముక్తి పొందాను. ఉల్‌స్టీన్ లిచ్చిన పెద్ద మొత్తాన్ని ఇంటికి తలిదండ్రులకు పంపించాను. అధమం రెండేళ్ళదాకా అయినా దాంతో వాళ్లు గడుపుకోవచ్చు. ఈలోగా విప్లవవిజయంతో "నవశకోదయం" కాగలదు. కాబట్టి వాళ్ల విషయమై నేనిక బెంగపెట్టుకో నక్కరలేదు. అదృష్టం మళ్ళి, పార్టీ దయవల్ల రష్యా వెళ్లగల అవకాశం లభిస్తే అక్కరకు వస్తుందని, అందులో ౨౦౦ మార్కులు (దాదాపు ౧౩౮ రూపాయలు) డబ్బుమాత్రం దగ్గిర మిగుల్చుకొన్నాను. న్యూ వెస్టెండ్‌లో ఖర్చుతక్కువని బోన్నర్‌ప్లాట్జ్ అన్న తూరుపుపేటకు మకాం మార్చాను.

అక్కడంతా కాసు చేతలేని కవిరాజులు, లలితకళోపాసకులూ జీవిస్తుంటారు. వాళ్లంతా విప్లవాత్మకులవటం చేత ఆ ఇళ్లకోవను "ఎఱ్ఱపేట" అనే వాళ్లు. అక్కడ ఉన్న మూడు నెలల జీవితంలో పొందిన హాయీ, పార్టీ సభ్యత్వపు ఏడేళ్ల జీవితంలోనూ, మరెన్నడూ నేను పొందలేదు.

ఉద్యోగం పోగొట్టుకోటానికి కొద్ది కాలం ముందే, ఏదో ఒక సెల్లులో ఇవాన్ స్టీన్‌బెర్గు అన్న పేరుతో చేరేందుకు, ఎడ్గార్ నాకు అనుమతి ఇచ్చే ఉన్నాడు. అప్పటికి వెస్ట్ ఎండ్ లో ఉన్నాను కాబట్టి, తూర్పుపేట బోన్నర్ ప్లాట్జ్‌లో ఉన్న ఒక సెల్‌లో చేరితే ఎవరూ నన్ను గుర్తించలేరు కదా అనుకొన్నాం.

"కామ్రేడ్ ఇవాన్—కొత్త సభ్యు"డంటూ నన్ను పరిచయంచేస్తూంటే అధమం అరడజను మందైనా పూర్వ పరిచితమందహాసంతో నన్నాహ్వానించారు.

మా సెల్‌లో కూడా తక్కిన అన్నిచోట్ల మాదిరిగానే పార్టీ వ్యవహారమంతా "నాయకత్రయం" అధీనంలో నడిచేది. ఈ ముగ్గురిలో ఒకడు రాజకీయ నాయకుడు (పోల్-లీటర్) మరొకడు కార్యనిర్వాహకుడు (ఆర్గ—లీటర్) ప్రచార ప్రబోధాదికాల బాధ్యత అంతా మూడవనాయకు నిది (ఆజిట్—ప్రాప్)

మా పోల్—లీటర్. అల్ఫ్రెడ్ కాంటరోవిట్జ్, కాంటగోవిట్జ్, చాలా ఆర్ద్రహృదయుడు—త్యాగి. స్నేహపాత్రుడు. మనిషిలో మంచి గరువతనం ఉండేది. హాస్యప్రియుడు. కాని ఒక్కటే లోపం. నైతిక స్థైర్యం కొంత తక్కువ. పారిస్‌లో అజ్ఞాతవాసకాలమంతా కూడా ఇద్దరం బాగా స్నేహితులంగా మెలిగాం. పార్టీలోనుంచి నేను వెలుపలికివచ్చేసినప్పుడు నా ముగాన ఊయని సహృదయుడు అతనొక్కడే. ఈనాడు సోవియట్ మహా రచయితలలో ఒకడు. ఇతడు కూడా విప్లవప్రతికూల మాయావాగురలో జిక్కి, అపవాదపడి, భ్రష్టుడైపోకుండా, ఈతని అమాయకత్వమే ఇతన్ని రక్షించుగాత!

మా నిర్మాణనాయకుడు, (ఆర్గ్ లీటర్) మాక్స్ ష్రోడర్—ఆనాటి మ్యూనిచ్ "స్వేచ్ఛాజీవుల" తరహా. రమ్యమైన స్వభావం. సాహిత్యం, శృంగారం, సంపాదన, ఇత్యాది సర్వ విషయాలలోనూ, జీవితంలో, పూర్తిగా విఫలుడై, ఆ వైఫల్య నైరాశ్యాలన్నిటికీ ఉపశమనం పార్టీ భక్తిలో కుదుర్చుకొని ఊరట చెందాడు.

సెల్‌లో చేరిన కొన్నాళ్లకే, ఆజిట్—ప్రాప్, ప్రచార బాధ్యత, ఉద్యోగం నా పాలబడ్డది. యావచ్ఛక్తితోనూ కృషిచేసి ప్రచారంసాగించాను. ఆనాడు నేను వ్రాసిన కరపత్రాలు, చాలమటుకు, అచ్చయిన

విప్లవవిషాదగీతికలుగానే ఈనాటికీ నాకు స్ఫురిస్తూంటాయి.

సెల్ కార్యక్రమంలో సగం చట్టబద్ధమైనా, సగం చట్ట విరుద్ధ చర్యలు కూడా ఉండేవి. సెల్ సమావేశాలన్నీ రాజకీయోపన్యాసంతో ప్రారంభమయేవి. పార్టీ హెడ్ క్వార్టర్సుతో సంప్రదించాక సెల్ రాజకీయనాయకుడే ఈ ఉపన్యాసం తయారు చేసి తెచ్చేవాడు. ఒక్కొక్కప్పుడు హెడ్ క్వార్టర్సునుంచి "గురువు" ఎవరైనా ఒకరు వచ్చి స్వయంగా ఈ ఉపన్యాసం ఇచ్చేవారు. ఆనాటి వివిధ విషయాల విషయంలో పార్టీ విధానం ఎల్లా ఉండాలో సూచించటమే ఆ ఉపన్యాసం ఉద్దేశం.

౧౯౩౨ వేసంగిలో, జర్మనీని భూకంపాలలాగా కదలాడిస్తూ, అనేక ఎన్నిక సంరంభాలు వరుసగా రాసాగాయి. అధ్యక్షుని ఎన్నిక ఒకటి, రీష్టాగ్ సభ్యుల ఎన్నికలు రెండూ,, ప్రష్యన్ శాసనసభల ఎన్నిక లొకటి, మొత్తం నాలుగు, ప్రముఖమైన ఎన్నికలు జరిగాయి. అన్నీకూడా ఎనిమిది నెలల స్వల్పకాలంలో, అంతర్యుద్ధపు తొణుకుతో దేశం ఉడుకెత్తి ఉన్న సంరంభ సమయంలో, జరిగాయి.

ఆ ఎన్నికలలో ఇల్లిల్లూ దిరిగి ప్రచారం చేశాము. పార్టీ సాహిత్యం తోపాటు మా ప్రత్యేక కరపత్రాలు కూడా వేసి, మనిషి మనిషికీ పంచిపెట్టాము. అన్నిటిలోకీ గడ్డుపని ప్రచారం. ఆదివారపు ప్రొద్దున్న కాస్త నలుగురూ ఇళ్ళల్లో ఉండే సమయంలో ఇళ్ళకు పోవటం, తలుపుకొట్టటం, తలుపు కడ్డంగా నిలబడి కరపత్రాలూ, పుస్తకాలూ అందియ్యటం, సరదాగా కబుర్లాడుతున్నట్లు, రాజకీయ చర్చలోకి ఇంటివాళ్ళని దింపటం—ఇక బోధసాగించటం. ఇన్ని మాట లెందుకు—"ప్రపంచ విప్లవాన్ని—" 'బేహార'వస్తువును చేసి—ఇల్లిల్లూ తిరిగి అమ్మకం సాగించాము. చాలామంది గృహస్థులు చిరాకుపడి "దఢేల్"మని తలుపులు మా మొగంమీద మోగించి విరసంగా వెళిపోయేవారు. అయితే కొట్లాటదాకా మాత్రం వచ్చేదికాదు.

అక్కడికీ 'నాజీ'లని తెలిసినవాళ్ల యిళ్లు వదిలే తిరిగేవాళ్లం. మా పేటలో నాజీ లెవరో మాకు చాలా మటుకు తెలుసు. అల్లాగే మమ్మల్ని నాజీలు బాగానే ఎరుగుదురు. మాకూ, నాజీలకుకూడా, దేశం నలుమూలలా అల్లుకొని పోటీ సెల్లులుంటూనే ఉండేవి. జర్మనీ అంతా, పల్లెఅనక పట్టణమనక, ఈ రెండు పక్షాల సెల్లూ, దెయ్యపువలలలాగా దేశమంతా ఆవరించుకొని అల్లిబిల్లిగా అలుముకొని పోయి ఉండేవి; మాస్కో నెత్తివేసాలు నిత్యం మా చేతుల్లో వలలను కదుపుతూ, స్తిమితం ఏర్పడనీయక, వలలమీద మా చేతులపట్టు ఊడిపోయేటట్లు కదిలించి ఉండక పోతే, మేమూ విజయం సాధించేందుకు మంచి అవకాశమేఉండేది. అక్కడ, ఆదర్శము ఉంది; ప్రజల అండ బలీయంగా ఉంది; కావలసిన వన్నీ ఉన్నాయి.

పట్టు తప్పి ఓడిపోయాము. కారణం— మేమే జాలరుల మనుకొన్నాం. కాని జాలరి గాలానికి కట్టిన ఎఱ్ఱలం మాత్రమే నని గుర్తించ లేక పోయాము. ఇల్లా గుర్తించలేక పోవటానికి కారణం మా బుఱ్ఱలు అల్లా తయారయి పోయాయి పైనుంచివచ్చిన ఆజ్ఞలన్నీ, మాహృదయాంతరస్థమైన ఆశయాలూ, అభిప్రాయాలే, అని నమ్మగల స్థితికి వచ్చేశాం. అధ్యక్ష స్థానానికి సోషలిస్టులతో సంయుక్తమయి అభ్యర్థిని నిలబెట్టలేకపోయాము. 'గుడ్డిలోమెల్ల' కదా అని హిట్లరుకు ప్రత్యర్థిగా సోషలిస్టులు హిండెన్ బర్గుకు తమ వత్తాసు ఇచ్చారు. మేము ఏమాత్రమూ ప్రయోజనం లేదని తెలిసి కూడా థాల్మన్‌ను నిలబెట్టాం- ఒక్కటే ప్రయోజనం! కార్మికవర్గం ఓట్లు చీలిపోయి, హిట్లర్ తక్షణమే అధికారంలోకి వచ్చే సందు దొరికింది! మా "గురువుగారు" ఒక ఉపన్యాసంలో "గుడ్డిలోమెల్ల అనేదలేదు. అల్లాంటిభావం, తాత్త్వికంగా, లౌకికంగా, లేక తాంత్రికంగా—ఎల్లా చూసుకున్నా శుద్ధపొరపాటే. అది ట్రాట్స్కీస్టుల, అపమార్గుల, విప్లవ వ్యతిరేకుల, సన్యాసుల, భావనా జన్యము" అంటూ నిర్ఘాటంగా నిరూపించాడు. అప్పటినుంచీ ఆ మాట వాడినవాళ్లను చూసి జాలిపడే వాళ్ళము. అల్లాంటి ఊహాపోహాలు కేవలం "దయ్యపు భ్రమలు" అని నమ్మాం—అసలు అంతకుముందే మాలో ఆ నమ్మకం ఉంది—అరే! ఒక కాలు విగుల్చుకోటంకంటె, రెండుకాళ్లూ తెగగొట్టించుకోటం మంచిదని గ్రహించలేనంతమూర్ఖులు ఎల్లాఉంటారో! రిపబ్లిక్ కుంటిదయిపోయిందంటే ఊతకఱ్ఱలు కూడ

తన్నిపారేయటం కన్నా శిష్టమైన విప్లవ విధానం ఉండదని గ్రహించలేని మూర్ఖత్వం ఏమిటో!

నమ్మకం అనేది బహు విచిత్రమైన విషయం. అది చేయలేని పని లేదు. కేవలం కొండలను కొండలను ఎత్తి అవతల పారేయటమే కాదు, దున్నపోతుని చూసి దేవతాశ్వం అనుకోగల స్థాయినిగూడా నీలో గాఢంగా కల్పిస్తుంది.

కేవలం మా భావనే కాదు. మా భాషకూడా పునఃప్రతిష్ఠితమయింది. 'గుడ్డిలో మెల్ల' "సద్యః ఫలితం" మొదలైన కొన్ని మాటలు మాకు నిషేధాలు. కారణం, ట్రాట్స్కీ తన వాదనలలో ఆ మాట లుపయోగించాడు. అల్లాగే కొన్నిమాటలు మాకు పడికట్టురాళ్లు. కేవలం "శ్రామికప్రజానీకం" లాంటి కమ్యూనిస్టు - ఉపన్యాసధోరణి మాటలే కాదు. "ప్రస్ఫుటం", "పాక్షికం" మొదలైనమాటలు మా అభిమాన పదాలు. (కామ్రేడ్, నీ ప్రశ్న ఇంకా ప్రస్ఫుటంగా ఉండాలి; 'కామ్రేడ్, కేవలం వామ పాక్షికదృష్టి అవలంబిస్తున్నావు' ఇత్యాదః)

భాషనుబట్టికూడా, ట్రాట్స్కీయిస్టో, రిఫార్మిస్టో, మరే బండలిస్టో, ఇట్టే వాసనపట్టేసేందుకు వీలుండేది. అల్లాగే మా భాషనుబట్టి మా ప్రత్యర్థులు కూడా మమ్మల్ని పసిగట్టే అవకాశము చాలా ఉండేది.

కేవలం ఈ పడికట్టుమాటలవల్లే పోలీసులకు, తర్వాత నాజీగెస్టాపోలకు, పట్టుబడ్డ కమ్యూనిస్టులు చాలామంది ఉన్నారు. ఒక యువతి విషయం నే నెరుగుదును. ఆవిడకు వ్యతిరేకంగా సాక్ష్యం ఏ మాత్రమూ చిక్కలేదు. గెస్టాపోపోలీసులు స్టేషనులో అనేకవిధాల ఆమెను క్రాసుపరీక్ష చేశారు. గెస్టాపో పోలీసుల కమిషనర్‌కు విసుగెత్తుతూండి. తన పోలీసులు శుద్ధమూర్ఖంగా ఆ అమ్మాయిని అరెస్టు చేశారనే అనుకొంటున్నాడు. విసుగుతోటే ఆ అమ్మాయి మాటలు వింటున్నాడు. అకస్మాత్తుగా అతనికి మెలుకువ వచ్చింది. ఆ అమ్మాయి, "ప్రస్ఫుటం" అనేమాట రెండోసారి వాడింది. ఒక్క అదటున లేచి, "ఏదీ ఆ మాట మళ్ళీ అను" అన్నాడు. అంతవరకు నిద్రాగా నిలుచున్న మనిషి పట్టుబడి పోయానేమో అన్న కంగారుపుట్టి ఎపిరి తిప్పిరై పట్టుబడి పోయింది.

మా, సాహిత్య, సంగీత, చిత్రకళాద్యభిరుచులు కూడా అల్లాగే పునస్సృజితమయ్యాయి. లెనిన్ ఎక్కడో వ్రాశాడు. బాల్జాక్ నవలలు చదవటంవల్ల ఫ్రాంసునుగురించి తను తెలిసికొన్న విషయాలు ఫ్రెంచి చరిత్రగ్రంథాలు అన్నీ చదివినాకూడా తెలియలేదన్నాడు. కాబట్టి, సర్వకాలాలకు మహా నవలా రచయిత ప్రపంచంలో బాల్జాక్ ఒక్కడే. తక్కిన నవలాకారులందరూ, కుళ్లిపోయిన వాళ్ల సంఘస్థితివల్ల కల్గిన, వికారదృక్పథాలు కలవారు మాత్రమే. చిత్రకళలో ఆనాటి నినాదం 'విప్లవ చైతన్యము.' ఫ్యాక్టరీగొట్టమో, ట్రాక్టరో, లేని చిత్రము, కేవలం ఎస్కేపిస్టుచిత్రమే. అటు ఈ "చైతన్య" నినాదంలో క్యూబిజమ్, ఎక్స్‌ప్రెషనిజమ్, ఇత్యాది ప్రయోగవిధానాల కనేకానికి అపార అవకాశం వచ్చింది. కొద్ది సంవత్సరాల తర్వాత "విప్లవచైతన్య" నినాదం అణగారి దానిస్థానే "సోషలిస్టురియలిజమ్"—నిలచింది. దానితో మునుపటి ప్రయోగవిధానాలన్నీ కుళ్ళిపోయిన కాపిటలిస్టు కంపును ప్రతిఫలించే బూర్జువా లాక్షణికాలుగా, జమకివచ్చి, నిషిద్ధాలయిపోయాయి.

సంగీత నాటకాలలో, బృందగానానికున్న స్థానము ఆనాడు మరి దేనికీ లేదు. అంటే బూర్జువా 'వ్యష్టి' తత్వానికి కాక, పార్టీ 'సమిష్టి' తత్వానికి ప్రబల దృష్టాంతాలుగా నిలవగలిగేవి అవే గనుక! నాటకంలో కేవలం 'పాత్ర'లను ప్రదర్శించకతప్పదు కాబట్టి, అవైనా వర్గీకరణ భావుకాలుగానే, అ-"వ్యష్టి"-కాలై, వర్గీకృతమై, నిలబడి కనపడాలి.

మనస్తత్వశాస్త్రం బహుసూక్ష్మంగా క్రోడీకరింపబడింది. మానవునిలో, మనోధర్మాలు రెండే రెండు. వర్గ సంఘీభావము, కామప్రకోపము—తక్కినదంతా బూర్జువా మెట్ట వేదాంతము—కేపిటలిస్టు ఆర్థిక-స్పర్థాజన్యము.

కామప్రకోపం 'సశాస్త్రీయమే' అయినా—దానివిషయంలో కొంత తిరకాసువచ్చింది. ఏకభార్యాత్వము, కుటుంబసంస్థా, ఇవన్నీ ఆర్థికహీనస్థితి

జవాబులు: వ్యష్టితత్వమూ, కుహనాస్వభావమూ, పెంపొందించి, వర్గపోరాటంనుండి తప్పించుకు తిరిగే గుణాన్ని పెంపొందిస్తాయి. అందుచేత విసర్జింపక తప్పదు. బూర్జువా, వివాహసంస్థ అంతా, వ్యభిచారానికి సంఘం కప్పుతూన్న ముసుగుమాత్రమే—అయితే స్వైరవిహారమూ అంతటి "చెడ్డపనే". రష్యాలోనూ తదితర దేశాలలోనూ కూడ స్వైరవిహారం కొంత ప్రకోపించింది. గ్రామ్యకర్మ కేవలం గ్లాసెడు మంచినీళ్లు త్రాగటంతో సమానం అన్న సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చింది. కాని ఈ "మంచినీళ్లప్రాయ" సిద్ధాంతాన్ని లెనిన్ తీవ్రంగా ఖండించటంతో, ఆ సిద్ధాంతం అణగారిపోయింది. కాబట్టి బూర్జువా నీతి, దాంభికమూ చెడ్డదే—స్వైరవిహారమూ చెడ్డదే-ఇక మంచిపని ఏదయ్యా, అంటే కార్మికులు "స్థిరమైన నడవడి"తో వివాహమాడి, భార్యాభర్తలు శీలవంతులై, కార్మికసంతానాన్ని కనటం, ఒకటే, ఉత్కృష్టవిధానము.

మరి అయితే బూర్జువానీతీ, ఇదీ ఒకటే కాదా? —కాదు, కామ్రేడ్, కాదు! నువ్వింకా యాంత్రికంగానే ఆలోచిస్తున్నావు తప్ప తాత్వికంగా, సిద్ధాంతరీత్యా ఆలోచించలేకపోతున్నావు. పోలీసువాడి చేతిలో తుపాకికి, కార్మిక విప్లవవీరునిచేతిలో తుపాకికి భేదమేమిటి?—పోలీసువాడి చేతిలో తుపాకికీ, కార్మికవర్గానికి చెందిన విప్లవవీరుని చేతిలో తుపాకికీ భేదమేమిటంటే—పోలీసువాడు పాలకవర్గాలవారి 'తైనాతి'; వాడి చేతిలో తుపాకి ప్రజాపీడనకు ఆయుధము—అల్లా కాక, అదే తుపాకి కార్మికవర్గ విప్లవసభ్యుని చేతిలో ఉంటే, పీడిత ప్రజానీకాన్ని విముక్తంచేసే ఆయుధమవుతుంది. వివాహసంస్థ, కాపిటలిస్టు సంఘంలో బూర్జువా కుళ్లుకుచిహ్నము. అదే హేతువాదమహిమవల్ల అనామయమయిన కార్మికసంఘంలో ఆరోగ్యవిషయంగా పరివర్తితమౌతుంది. అర్థమయిందా కామ్రేడ్! లేక ఇంకా ప్రస్ఫుటంగా మళ్లీ చెప్పమంటావా!

చెప్పినమాటే చెప్పటం, ప్రశ్నలోనే జవాబును కూర్చుకోవటం, ప్రశ్ననే తిప్పి జవాబుగా చెప్పటం, పడికట్టు సమాసము వాడుతూండటం, కొరవు విభేదాలతో, విషవ్యంగాలు కొన్నిమాటలకు స్ఫురింపచేయటం—ఇవన్నీ కమ్యూనిస్టు శైలిలో భాగాలు. ఆశైలిలో నిష్ణాత జోసిఫ్ద్జూగాష్విల్లీ (స్టాలిన్) కేవలం రోకంటిపాటగా చెవుల్లో మ్రోగుతూ, విసుగుతో చైతన్యం చంపి, విమోహితులను చేయగల్గుతుంది. ఈ సిద్ధాంతపు టముటమా రెండుగంటలు వినేటప్పటికి, స్త్రీవో, పురుషుడవో తెలియని విభ్రమావస్థలో పడిపోయి, ఏది చెప్తే దానికి, రెంటికీ తలఊపేందుకు సిద్ధమైపోతావు. సోషలిస్టులు (a) నీకు ప్రబల శత్రువులనీ, (b) నీకు సహజమిత్రులనీ కూడా నమ్మేస్తావు. కాపిటలిస్టు దేశాలూ, సోషలిస్టు దేశాలూ (a) ప్రక్కప్రక్కనే శాంతంగానివసించవచ్చుననీ,(b) ప్రక్కప్రక్కనే శాంతంగా నివసించ వీలులేదనీ కూడా నమ్మేస్తావు. ఎంజెల్సు 'ఏకదేశమాత్రంగా సామ్యవాదం అసంభవ'మని అన్నాడంటే నిజంగా సంభవమనే అతని ఉద్దేశమనే నమ్మేస్తావు. కార్యకారణక్రమరీత్యా నిరూపణలుకూడా నీకు చేతఅవుతాయి. నీతో ఏకీభవించనివాడల్లా ఫాసిస్టుతొత్తు. ఎల్లాగంటే, (a) నీతో విభేదించటంతో పార్టీఐక్యాన్ని భంగపరుస్తున్నాడు. (b) పార్టీఐక్యాన్ని భంగపరచటంతో ఫాసిస్టువిజయావకాశాన్ని పెంపొందించినవాడవుతున్నాడు. (c) అంటే, ఒకవేళ యధార్థానికి ఫాసిస్టుల చేతుల్లో సున్నంలోకి ఎముకలేకుండా చితకగొట్టబడ్డవాడయినా, తాత్వికంగా ఫాసిస్టుతొత్తే అవుతున్నాడు.

పార్టీ మామూలు సంభాషణలలోవచ్చే "ఏజెంటు", "ప్రజాస్వామ్యం", "స్వాతంత్ర్యము" ఇత్యాది పదాలకు అక్కడున్న అర్థంవేరు, బైటి ప్రపంచపు అర్థం వేరు. ఆ అర్థాలుకూడా పార్టీ విధానంతోపాటు ఎప్పటికప్పుడు నిత్యనూతన వేషంతో తయారవుతూంటే—"ఆలీస్ ఇన్ వండర్లాండు" కథలో "అరకరాణీ" ఆటల నిబంధనలు మారినట్లే మారిపోయేవి. అయితే ఆ కథలో రాణి, ఆటగాడు పొరపాటు చేసినప్పుడు వాని "తలనరికేయ్"అని ఆజ్ఞమాత్ర మిచ్చేది. ఇక్కడ పార్టీలో ఆ ఆజ్ఞ యథాతథంగా పాలింపబడుతుంది. బ్రతకాలనుకొంటే పార్టీచేత "మంచబ్బాయి" అనిపించుకొనే ప్రవర్తన అలవరుచుకో వలసిందే!

ఆ రోజుల్లో "పార్టీ" జీవితంలో పరోపిశిష్టత—"కార్మికత్వ"సాధన, "పండిత" నిరసనం. కమ్యూనిస్టు

లయినమధ్యతరగతిఅక్షరాస్యులమంతా ఈనిరసనంతో కులవిద్యాసిద్ధ "చండాలత్వం"తో, ఆత్మహైన్యంతో, కుమిలి పోయేవాళ్ళం. ఉద్యమం కేవలం మమ్మల్ని కనికరించి నీడ నిచ్చిందితప్ప నిజంగా మాకు అక్కడ నిలిచే హక్కు లేదు. అహర్నిశలూ, ఈ భావాన్ని మా మెదడుకు మర్దనా చేస్తూనే ఉండేవారు. లెనిన్ మమ్మల్ని సహించమన్నాడు. పైగా డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులు, విప్లవపూర్వపు ప్రాజ్ఞులూ, ఈ వైభవ "విదేశనిపుణులూ" లేనిదే, రష్యాకూ గడవటం కష్టం. అందుకని ఏదో కాస్త వాళ్ళనీ సహించక తప్పదనుకొని క్షమించి నిలవనిచ్చారు. అయితే హిట్లరు, తన అవసరాలనుబట్టి నియమించుకొన్న యూదులను ఎలా సహించాడో—పొరపాటున వాళ్ల అవసరం తీరేలోపలే నాజీ పోలీసులు చంపకుండా వాళ్ళకు భుజకీర్తులిచ్చి ఎల్లా కాపాడాడో—ఆ మాదిరిగా మమ్మల్ని వాడుకోవలసిందే తప్ప, అంతకు మించి నమ్మకం గాని, గౌరవం గాని మాకు ఇయ్యనక్కరలేదు. పార్టీలో "ఆర్యులు", కార్మికులు. ప్రతి అర్థసంవత్సరపు పార్టీ ప్రక్షాళనలలోనూ సభ్యత్వ అర్హతకు, వంశవృక్షాదికాలన్నీ ప్రముఖంగా జమకువస్తాయి. నాజీలకు "ఆర్య"త్వము లాగే ఇక్కడ "కార్మికత్వ"ము ప్రాశస్త్య హేతువు. ఆదర్శ కార్మికులు అంటే రష్యన్ కర్మాగారాలలో పనిచేసేవాళ్లు; అందులోనూ "వసుస్వరూపులు", లెనిన్‌గ్రాడ్ 'పుటిలోవ్' కర్మాగార కార్మికులూ, బాకూ నూనెగనుల కార్మికులూనూ. మేము చదివిన, వ్రాసిన గ్రంథాలన్నిటిలోనూ ఆదర్శకార్మికుని రూపం వర్ణిత మాత్రూండేది.

"వ్యూఢోరస్కుడు, మహాబాహుడు, సాలప్రాంశుడు, మహాభుజుడు, ప్రసన్నవదనుడు, సులభమూర్తి, సౌమ్యరూపుడు, సంపూర్ణ 'వర్గచైతన్య' యుతుడు, స్వాధీనకామప్రకోపుడు, మహాబలశాలి, మౌన ముద్రాలంకితుడు, ఆర్ద్రహృదయుడు— అయినా, అవసరమయితే చండశాసనుడు. అతని పాదాలు పెద్దవి. పనిపాటులవల్ల అతని చేతులు కాయలుకాచి ఉంటాయి. విప్లవగీతాలూ, బృందగీతాలూ పాడేందుకు మంచి మేఘ గంభీరమైన స్వర ముంటుంది—"

అయితే, "కమ్యూనిస్టులు" కాని కార్మికులు నిజమైన కార్మికవర్గానికి చెందరు—వాళ్ళంతా వత్తి జమీందారీ-కార్మికులు.

వీరపురుషమూర్తి లేని విప్లవఉద్యమం అంటూ ఉండదు. లెనిన్‌గ్రాడ్ ప్యూటిలోవ్ కర్మాగారానికి చెందిన ఇవాన్ ఇవనోవిచ్ మా ఆదర్శాల "అగ్గిరాముడు".

పండితవంశంవాడు 'పురం' వేసినా నిజమైన 'కార్మికుడు' కాలేడు. కాని, 'కార్మికత్వానికి' సాధ్యమైనంత సన్నిహితుడయేందుకు ప్రయత్నించటం అతని విధ్యుక్త ధర్మం. నెక్‌టైలు వదిలేసి, స్వెట్టర్లు తొడుక్కొని, గోళ్లు వాడిగా పెంచుకొని, ఈ సామీచీన్యత సంపాదించుకొందామని కొందరు తాపత్రయపడ్డారు. కాని, అది అంతా వట్టి భేషజమనీ, దాంభికమనీ దాన్నికూడా నిరుత్సాహపరచటమయింది. సరిఅయిన విధానమేమిటంటే— నువ్వు మాట్లాడినా, వ్రాసినా, ఆలోచించినా, వీథులు ఊడ్చే మామూలుమనిషికి అర్థం అవని మాటకాని, భావంకాని ఎప్పుడూ రాకుండా అలవాటు చేసికోవాలి. అందుకని 'మాభాషా, భావాల, లగేజీ అంతా, రైలెక్కేందుకు పనికి రాదన్నట్టు, కట్టగట్టి అవతల పారేశాము. వెంట తెచ్చుకోగల తూకంలో అవసరంగా మిగిలినవి; కొన్ని పడికట్టు పార్టీసమాసాలు, హేతువాదమీమాంస కారికలు, మార్క్సుసూత్ర ఉదాహరణలు—"స్టాలినీయ" విశ్వాంతర సాహిత్యదర్పణ సర్వసంభారమంతా ఇదే! అంతోఇంతో బూర్జువా చదువు చదివికొని ఉండటం, ఏ సమస్యనైనా ఏకముఖంగా కాక బహుముఖంగా చూడగలగటం, నామర్దా విషయాలైపోయి అపారమైన మనోవ్యథ కల్గించేవి. అనేకమనస్కులమూ, అప్రతిపన్నబుద్ధులమూ, కావాలని, ఎంతో పరితపించి పోయాము. కామ్రేడ్ ఇవాన్ ఇవానోవిచ్ పోలిక కొంతలో కొంతైనా తెచ్చుకొందామన్న కృషిలో, స్వయం విద్వత్పుంస్త్వ విచ్ఛేదనం, పాటికి రావలసిన పరిత్యాగం కానేకాదు కదా!

౧౨

మళ్లీ సెల్లు జీవితంలోకి వద్దాం. సెల్లు సమావేశాలు ఒకటో రెండో రాజకీయోపన్యాసాలతో ప్రారంభమయేవని చెప్పాను.

ఆ తర్వాత కొంత చర్చ జరిగేది. కాని, ఏ సమస్యవిషయంలోనైనా పార్టీ విధానం నిర్ణీతమైన తర్వాత దాన్ని విమర్శించటం, అపమార్గ గమనంతో పార్టీకి విద్రోహ మాచరించటమే, అనేది, పార్టీశిక్షణ ప్రణాళికలో ప్రాథమిక సూత్రం. పార్టీ నిర్ణయం జరుగకపూర్వం చర్చించవచ్చునని గ్రంథస్థంగాఉంది. కాని, నిర్ణయాలన్నీ సాధారణసభ్యప్రతినిధులతో ఏమాత్రమూ సంప్రదింపు లేకుండా, ఆకాశం నుంచి అవతరించినట్టు దిగివస్తూంటే, సామాన్యసభ్యులకు పార్టీవిధాన నిర్ణయంలో అణుమాత్రమూ ప్రమేయము లేక, చివరికి నిర్ణయంపై తమ అభిప్రాయం వెలువర్చే అవకాశమూ లేకుండా పోయేది. అటు నాయకులకూడా ప్రజాసమూహపు అభిప్రాయాలను అంచనా వేసుకొనే అవకాశంకూడా లేకుండా పోయింది.

“పాదప్రతి వాదాలకు సేనాముఖం స్థానంకాదు—”

అనే, జర్మన్ కమ్యూనిస్టుపార్టీ నినాదం.

“కమ్యూనిస్టు ఎక్కడున్నా, ఎప్పుడూ సేనాముఖంలో ఉన్నట్లే”

అని మరి ఒక నినాదం:

అందుకని మాచర్చ లెప్పుడూ ‘ఏకగ్రీవం’ గానే ఉండేవి. ఇక ఉపన్యాసాలన్నీ చర్చాంశంపై “పార్టీ నిర్ణయానికి” స్టాలినీయ తీర్థంకర శైలిలో అభినందన పాఠాంతరాలు మాత్రమే. పార్టీ నిర్ణయం మా అభిప్రాయానుసరణంగా ఉందని నిరూపించుకొనే చిత్తక్షోభతోపాటు, ఆ నిర్ణయానికి అనువైన మా పూర్వాభిప్రాయాలేవైనా మనసులో ఏ మారుమూలైనా ఉన్నాయేమోనని కంచుకాగడాలుపెట్టి వెదికి వెలికితీసి తెచ్చుకొనేవాళ్లం. చాలామటుకు ఆ మనోవిజయమూ సంపాదించేవాళ్లం. ఎన్నికలలో పార్టీ ప్రముఖనినాదము, “డెబ్భైలక్షల జర్మన్ నిరుద్యోగుల”విషయమూ కాదు; “నాజీల దౌర్జన్య”విషయమూ కాదు. “జపానీబందిపోటుల దురాగతంనుంచి చీనా కార్మికుల రక్షించటం”- మా ఎన్నికల నినాదం. ఇది విన్నప్పుడు నేను బిత్తరపోయానేమో! కాని, బిత్తరపోయిన స్మృతి ఏమీ లేదు. జర్మన్ కార్మిక వర్గానికి బెర్లిన్ పరిస్థితులకన్నా, షాంఘైలో సంఘటనల ప్రాముఖ్యమెంతో వివరిస్తూ, మహోజ్జ్వలమైన కరపత్రం ఒకటి నేను తయారుచేసిన జ్ఞాపకంమాత్రం బాగా ఉంది. ఆ రచనకు జిల్లానాయకులు నన్ను అభినందించారు కూడా!

సాధారణంగా సెల్‌లోని కార్మికసభ్యులు, ఉపన్యాసాలు అవుతూన్నంతసేపూ నిద్రమోతు మొగాలతోనే కూర్చుంటుండేవారు. కనురెప్పల చీలికల్లోంచి అవిశ్వాసపు చూపులతోనే, పార్టీ విధానం అభినందిస్తున్న “అక్షరాస్యుల” ఉపన్యాసాలు స్వీకరించేవారు. ఇంతలో, కాస్త వాళ్ళలో వాళ్ళు ‘నువ్వు లెమ్మంటే’ ‘నువ్వు లెమ్మ’ని, చివరికొకరు లేచి, వేదిక దగ్గరకువచ్చి, తెచ్చిపెట్టుకొన్న పల్లెటి మొరటుతనంతో, వెంకితనానికే నంగినంగిగా మాట్లాడుతున్నట్లు మాట్లాడుతూ, నాయకుని ప్రథమ ఉపన్యాసంలోని నినాదాలనే, మాటమార్పన్నా అవసరంలేకుండా అప్పచెప్పేవారు. నాయకుడు సమావేశం ముగిస్తూ అందరిలోకి ఆ కామ్రేడ్— సమస్యను, చక్కగా, అర్థవంతంగా, ప్రస్ఫుటంగా విపులీకరించాడని అభినందిస్తూ సమావేశం ముగించేవాడు.

౧౯౩౨ లో పార్టీ అజ్ఞాతంలోకి పోదలచుకొన్న సంధిరోజులని ముందే చెప్పాను. ఒకసారి పార్టీ చట్టవిరుద్ధమని ప్రకటన జరిపితే, పార్టీసెల్సు అన్నీ ఒక్కసారి పని ఆపేసి, ఏ శ్రేణి కా శ్రేణిలో ఐదైదుగురి కూటాలుగా దేశమంతటా వెలుస్తాయి. సెల్లులో ౨౦ నుంచి ౩౦ మందిదాకా కామ్రేడు లుంటారు. అజ్ఞాత కార్యక్రమానికి ఇందరిందరుంటే “విభీషణాయి”లు ఎక్కువయిపోయే ఆస్కారముంటుంది. అందుచేత, క్రమబద్ధంగా ఐదుగురైదుగురి శ్రేణిగా పార్టీ నిర్మితమౌతూ, ఈ ఐదుగురిలోకూడా ఒకరొకరిపేరు, చిరునామాలు ఒక్క ఆ ముఠా నాయకునికి మాత్రమే తెలిసేవిగా ఉంటాయి.

అందుచేత సెల్ ఇంకా పనిచేస్తుండగానే ప్రతి సభ్యుణ్ణి ఏదో ఒక ఐదుగురి కూటానికి రహస్యంగా నియోగించసాగారు. ఆ ఐదుగురిలో నాయకునికి తప్ప తక్కినవారి కెవ్వరికీ పార్టీపై శ్రేణులతో పరిచయముండదు. ఒకవేళ ఎవరైనా పట్టుబడినా మహా అయితే ఆ అయిదుగురి పేర్లూ తప్ప బైట పెట్టలేడు.

అయితే, యథార్థానికి ఏ ఐదుగురి ముఠా ఏదో, నిత్యం పరిచితమౌతూనే ఉండేది.

రీష్‌స్టాగ్ తగులబడినరోజునే, గోరింగ్, కమ్యూనిస్టుపార్టీని అథఃపాతాళానికి త్రొక్కేశాడు. ఎక్కడి ముఠాలక్కడ చిందరవందరయిపోయాయి. మా పార్టీరహస్యనిర్మాణ చాతుర్యాన్ని మెచ్చుకొంటూ కూర్చున్నాము తప్ప, అసలు ఆ నిర్మాణారంభ ప్రయత్నంలోనే నాజీలు నెగ్గి తీరుతారని పార్టీ నాయకులు ఒప్పుకొన్నారన్న విషయం గ్రహించలేకపోయాము. పార్టీ నిల్లా ముక్కలు ముక్కలు చేయటంలో, పార్టీ, హిట్లరును సాయుధంగా ఎదిరించబోదనీ, చిలిపిచిలిపి తాటాకుమంటలు రెచ్చగొట్టటంతోనే సంతృప్తిపడనున్నదనీ, గ్రహించలేకపోయాము. ముఠా మూక జనానికి, మా కిదేమీ తెలియనే తెలియదు.

౧౯౩౨ వేసంకాలం పొడుగునా నాజీలతో 'ఎక్కటికయ్యాలు' సాగించుకొంటూనే పోయాము. బెర్లిన్‌లో, ఆరోజుల్లో అథమం ఒకటిరెండు హత్యలుజరగని రోజేలేదు. కార్మికపేటలో ఉన్న చిన్న చిన్న కల్లుపాకలన్నీ, నాజీలకో, కమ్యూనిస్టులకో సమావేశ గృహాలుగా ఉండేవి. చికాగో బందిపోటులలో లాగే తుపాకులు పేలటం జరిగేది. నాజీగాంగ్ ఒక కారులో బయలుదేరి, మా సమావేశాల ఇళ్లదగ్గిరకు నెమ్మదిగావచ్చి, కిటికీల లోకి "టపాటపా" తుపాకులు పేల్చి, ఒక్క ఉరుకున దౌడుతీసేది. మేమూ అంతే: నాజీలకన్నా మాకు కార్లు తక్కువ, ఒక్కొక్కప్పుడు కమ్యూనిస్టు అభిమానుల కార్లు అద్దెకు తీసుకొనేవాళ్లం. మాలో ఈ గురిగాళ్లు, కమ్యూనిస్టు ఆర్. యఫ్. బి. సభ్యులు, కమ్యూనిస్టు యుద్ధనిష్ణాతులు. ఒక్కొక్కప్పుడు నేను ముక్కుమొగం ఎరుగని కామ్రేడ్‌లు కూడా నాకారు అద్దెకు తీసుకొనిపోయేవారు. మా సెల్లులో "మోటారుకారు ఉన్న" సభ్యుణ్ణి, బూర్జువా చిహ్నితుడను, నే నొక్కడనే. కారు ఎందుకు తీసుకెళ్లుతున్నారో మేం అడగం, వాళ్లూ చెప్పరు. ఒకసారి ఒక చిన్న ముద్రాయంత్రం అంతా నా కారులోనే సైలునుంచి బజారులో ఒకనేల కొట్టుకు తీసుకొని వెళ్లవలసివచ్చింది. అదీ నాజీలను వెంటాడటం, రహస్యపత్రాలు రోడ్లలో విరచిమ్మటం, కామ్రేడ్‌లను సురక్షితంగా జేరవేయటం ఇల్లాంటి అనేక పనులకు కార్లు అవసరమయేవి.

ఒక్కొక్కపరి కారుకోసం వచ్చే "గురిగాళ్ల"లో బెర్లిన్ గూండాలూ, ఘాతకులూ ఉండేవారు. టెలిఫోన్‌లో చెప్పివచ్చేసేవారు. కాని వచ్చిన వాళ్లేమళ్ళీరావటం సామాన్యంగా జరిగేదికాదు. ఒక్కొక్కప్పుడు నాజీలు ఎక్కడో ఘాతతల పెట్టనున్నారని అక్కడికి గురిగాళ్ళతో కారులో పోవలసివచ్చేది. నాజీకారు వాసనతగిలేటప్పటికి ఆ చీకటిలో తుపాకులు సిద్ధమౌతున్న 'క్లిక్ క్లిక్'లు వినబడేవి. నిముషాలు స్తంభించి యుగాల్లాగా గడిచేవి చివరికి ఏమీ జరక్కుండానే ఇంటికి తిరిగివచ్చేవాళ్లం. ఆ తుపాకులు కాల్చటం దాకా రావటం నేనెప్పుడూ చూడనేలేదు.

ఒకసారి నాగదికే నల్గురు కామ్రేడ్ "గురిగాళ్లు"వచ్చి, అక్కడే మారువేషాలు వేసుకొని సీదాగా కారు తీసుకెళ్లారు. నాల్గుగంటల్లో తిరిగి కారుతెచ్చియిచ్చి, మామూలు వేషాలతో మరలి పోయారు. ఈ తగాదాలలో ఎప్పుడన్నా పోలీసులెవరన్నా నాకారు నంబరు గుర్తించి నన్నడిగితే, కారుపోయిందనీ, తర్వాత ఎవరో ఎక్కడో వీథిలో విడిచిపోయారనీ సంజాయిషీ చెప్పుకోవలసిందిగా నాకు సలహా.

ఒకసారి నాజీలు మా ఎఱ్ఱపేటను ముట్టడిస్తారని పుకారు తెలిసింది. ఆర్. యఫ్. బి. వాళ్లు వచ్చి పారా కాశారు. ఒకరాత్రి నా ఇంట్లో ముప్పైమంది ముఠాగూడి రాత్రంతా పహరాకాస్తూ గడిపాము. ఆ రాత్రి ఒక స్నేహితుడు-వియన్నాలో నాతో చదువుకొన్న శాస్త్రవిద్యార్థి-నన్ను చూడటానికివియన్నా నుంచి వచ్చాడు.

సిగరెట్లపొగ గదినిండా దట్టంగా అలుముకొని ఉంది. మంచాలు కుర్చీలు, బెంచీలు, నేల, గదులన్నిటి నిండా, కూర్చునీ పడుకొనీ, మనుష్యు లాక్రమించు కొన్నారు. బీరుగ్లాసులూ, లాఠీలూ కలిసి మెలిసి అంతటా కాలు పెట్టే జాగా లేకుండా చిందరవందరగా పడిఉన్నాయి.

బైట పహరా కాయటానికి నావంతు వచ్చేటప్పటికి నా స్నేహితుణ్ణికూడా బైటికి తీసుకొచ్చాను. "ఇదంతా ఏమిటిరా! గొప్ప బందిపోటు ముఠాలను అనుకొంటున్నారా—ఏమిట"ని అడిగాడు. అంతా చెప్పాను. "అది సరేలేవోయ్, నీ జీవితం ఇల్లా తగలేసుకొంటున్నా వేమిటి" అని అడిగాడు. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిస్తున్నా" అని చిరునవ్వుతో చెప్పాను. ఆ ప్రపంచాగ్నీ విప్లవమూ, మన్నూ మశానమూ తన కేమీ కనబడటం లేదన్నాడు. ఏమని అడిగాను. "ఏమో నాకు తెలియదు—విప్లవాలు ఎల్లా నెగ్గుకువస్తారో, అదేమీ నాకు తెలియదు—కానీ పైనున్న మూకను చూస్తుంటే యుద్ధంలో చితక్కొట్టబడి పలపలని మూకగా పారిపోయి వచ్చి కలసిన పందలగుంపును చూస్తున్నట్టే నా కనిపించింది" అన్నాడు.

అతను చెప్పింది నిజమే. విప్లవ సైన్యశ్రేణీ ముఖంలో అగ్రగాములమనే మమ్మల్ని మేము భావించుకొన్నాము. కాని ఛిద్రుపలైపోయిన కార్మికోద్యమపు చిగురుటంచులనంటే జీరాడుతున్నామని గ్రహించుకోలేకపోయాము.

తర్వాత కొద్దివారాలలోనే- వాన్‌పాపెన్, కేవలం ఒక లెఫ్టినెంటు, ఎనమండుగురు మనుష్యులతో, ప్రష్యా-సోషలిస్టు - ప్రభుత్వాన్ని అధికార స్థానంలోనుంచి ఊడ్చిపెట్టేసి, రంగ చాకచక్యమంతా ప్రదర్శించాడు. ౬౦ లక్షల అనుయాయులున్న సోషలిస్టుపార్టీ కిమ్మనలేదు. సోషలిస్టు అధీనంలో ఉన్న ట్రేడ్ - యూనియన్‌లు లాంఛనంగానైనా సమ్మె జరుపలేదు. ఏడాదిక్రింద ఆ సోషలిస్టు ప్రభుత్వానికే వ్యతిరేకంగా నాజీలతో చేతులు కలిపిన మేము, కార్మిక వర్గానికి ప్రబల శత్రువులు సోషలిస్టులే, అని గొంతు బొంగురుపోయేటట్లు అరిచిన మేము—కమ్యూనిస్టులమైన మేము మాత్రం, వెంటనే సర్వరంగాలలో సమ్మెజరగాలంటూ ప్రబల ప్రచారం చేశాము. కాని మా నినాదా లన్నీ జర్మన్ ప్రజలలో చెవిటివానిముందర శంఖం ఊదినట్లు నిష్ఫలమైపోయాయి. జర్మన్ జనానీకానికి మాభాష అర్థరహితమైపోయి, ఇన్‌ఫ్లేషన్‌కరెన్సీనోటు లాగా విలువ లేకుండా పోయింది. అవిఘ్నంగా యుద్ధం ప్రారంభించే లోపలే హిట్లరుతో ఓడిపోయాము.

౧౯౩౨ జూలై ౨౦ దాటేటప్పటికి అంతవరకూ, యూరప్ కమ్యూనిస్టుపార్టీలలో కెల్లా బలీయంగా ఉంటూవచ్చిన జర్మన్ కమ్యూనిస్టుపార్టీ, అండచ్యుతిపొందిన ఇంద్రదేవుని లాగయిపోయి, కేవలం ఉరుముల మెరుపుల డాంబికంతో, తన పుంస్త్వ హీనతను కప్పిపుచ్చుకొంటున్నదని, పార్టీవాళ్ళమైన మాకు తప్ప, అందరకూ విదితమైపోయింది.

ఆ సమ్మె అల్లా చితికిపోయిన మర్నాడు, 'బ్రహ్మాండమైన విజయ'మంటూ, పార్టీ పత్రికలు ప్రకటించాయి. "సోషలిస్టులు చప్పబడిపోయి ఊరుకున్నాకూడా సమ్మెకై ప్రయత్నించటంలో సోషలిస్టు, ఫాసిస్టు నాయకుల కుచ్ఛితాన్నంతా మేము బైటపెట్టగలిగాం."

కొద్దినెలలలోనే అంతా అయిపోయింది. ఆపత్కాలానికని ఇన్నేళ్ళ ప్రయత్నమూ, ఇన్నినాళ్ళ రహస్య ఉద్యమక్రమశిక్షణా అన్నీకూడా, కొద్దిలో ఎందుకూ కొరగాకుండా పోయాయి. అంతటి పార్టీ మహాశక్తీ, గంటలసేపులోనే, దసరా గడ్డివినుగులాగా నేలరాలి ఊడ్చిపెట్టుకుపోయింది. పార్టీ నాయకుడు థాల్మన్‌నీ, అతనిఅనుచరులనూ మొదటి నాల్నాళ్ళల్లోనే నాజీలు గాలించి పట్టేసుకున్నారు. కేంద్ర సంఘము దేశాంతరగతమయింది. జర్మనీ, కాళరాత్రి ముసుగులో కప్పడిపోయింది. ౧౭ ఏళ్ళకు ఈనాటికీ ఆ చీకటి తెరతీయలేదు.

హిట్లరు అధికారంలోకిరావటం, థాల్మన్ జైలులోమగ్గటం, వేలమంది పార్టీసభ్యులు హతులైపోవటం, లక్షలకొద్దీ కమ్యూనిస్టులు కాన్సెన్‌ట్రేషన్ బందిలదొడ్లల్లో బానిసలైపోవటంతో, చివరికి, కోమింటర్న్, తన బాధ్యత తాను గుర్తించగల్గింది. రష్యా జి. పి. యు. కాశేజియూ, విదేశాల

లోని కమ్యూనిస్టు ట్రిబ్యూనల్సుకూడా, పార్టీ 'అంతశ్శత్రువుల"పై నిర్దాక్షిణ్యంగా విచారణలు సాగించాయి—పార్టీఆజ్ఞ సుగ్రీవాజ్ఞగా తలదాల్చేందుకు ఏమాత్రం సణిగినా అంతశ్శత్రువే!—ఫాసిస్టుతొత్తూ, బటాచోరూ!—తద్రీత్యా, జర్మన్ కార్మికవర్గానికి, సోషలిస్టుపార్టీ ప్రథమశత్రువు. కమ్యూనిస్టుపార్టీ ఓడిపోలేదు. కేవలం వ్యూహాగమకపు వరుసనడకలలో వెనుకడుగు వేసింది.

* * * *

సామాన్యంగా, జ్ఞాపకాలు, గత విషయాలకు రామణీయకత కల్పించుకొనేవిగా ఉంటాయి. కాని ఒక మతంలోనుంచి వెలికిరావలసివచ్చినా, ఒక మిత్రుడు ద్రోహంచేసినా, స్మృతి, ఇందుకు ఎదురునడక సాగించుకొంటుంది. ఆ, తెలిసిరావటంవల్ల, అనుభవకాలం నాటి ముగ్ధత్వం నశించి, అనుభవం కలుషితమయి, పుండురేగినట్టు జ్ఞాపకంలో రేగుతూ ఉంటుంది.

ఈ కథనంలో ఆనాటి ఆ ముగ్ధత్వాన్ని అప్పటి సహజ మనస్థితిని, యధాతథంగా పునశ్చరణ మొనర్చుకోవాలని ఎంతో ప్రయత్నించాను. కాని విఫలుడనౌతున్నానని నేనెరుగుదును. ఎప్పటి కప్పుడు, కసీ, కోపం, సిగ్గూ, వ్యంగ్యంగావస్తూ, కుమిలిస్తూ అడ్డు తగులుతూనే ఉన్నాయి. ఆనాటి ఉద్రేకాలు, పైత్యపు చేష్టలుగా వికృతమై కనబడతాయి. ఆనాటి ఆత్మవిశ్వాసము, మద్యపాయి మనోధర్మమైనట్లు వికారమెత్తిస్తుంది. ఖండిత స్మృతి విహార ఆరామానికి అడ్డంగాముళ్ళకంచె నీడ మస్యపడుతుంది. ఆనాటి ఆ మహాభ్రమ మాయావాగురలో చిక్కినవాళ్ళు, ఆనాటిమాయలోపడిపోయి నైతిక మానసిక స్వైరవిహారంలో పూర్తిగా జీవించినవారు, మళ్లీ తద్విరుద్ధమైన మరొక మాయామోహంలో మత్తెక్కించుకోవటమో, లేక జన్మంతా ఆకైపు వదిలిన నిస్సత్తువతో బాధపడటమో తప్ప, వేరు గతిలేదు. "వాళ్లంతా, హతులైన వాళ్ల మిత్రులకు బ్రతికున్న గోరీలు. ఆ శవాలమీాది ముసుగులే వాళ్లజెండాలు" అన్నాడు మేన్సుస్పెర్బర్.

అందుకనే, "రాజకీయ" మధుపాయిలకు, ఏతచ్చికిత్స అంటే అంత తీవ్రమైన సహజప్రాతికూల్యము!

౧౯౩౨ వేసగి ఆఖరయ్యేలోపలే, ఎల్లాగో రష్యావెళ్లటానికి నాకు అనుజ్ఞ లభించింది. "అంతర్జాతీయ విప్లవరచయితలసంఘు" ఆహ్వానం, సాకుగా నాకు ఈ ప్రయాణం తటస్థించింది. రష్యాఅంతనూ పర్యటించి, గ్రంథం వ్రాయవలసిందని వాళ్లు నన్ను ఆహ్వానించారు. రష్యాఅంటే మహావ్యతిరేకాభిప్రాయాలున్న బూర్జువా విలేఖరి మిస్టర్ కే—రష్యా పర్యటించి పంచవర్షప్రణాళిక సత్ఫలితాలను చూసిన కొద్దీ, ఎల్లా దేష్వంవదులుకొని అభిమానుడైపోయి చివరికి కామ్రేడ్ కే-గా ఎల్లా మారిపోయిందీ వర్ణించటమే, ఆ గ్రంథం ఉద్దేశం.

హిట్లర్ ఇంకా ఆరునెలల్లో అధికారంలోకి వస్తాడనగా నేను రష్యా వెళ్ళాను. మాస్కోలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యనిర్వాహక సంఘ ప్రచారాధిపతి, కామ్రేడ్ గోప్నర్ కి ఇక్కడినుంచి పరిచయపత్రం తీసుకొని వెళ్ళాను. మాస్కోలో వాళ్లు "జర్మన్ విప్లవకార్మికరచయితలకు ప్రతినిధి"గా నా కృషికి సోవియట్ అధికారు లందరు సంపూర్ణంగా సహకరించవలసిందంటూ ఒక లేఖ—కేవలం ఆజ్ఞాపత్రమే అనుకోవచ్చు — వ్రాసియిచ్చారు. ఆ పత్రంతో నా రష్యన్ పర్యటనం అంతా నిరాఘాటంగా, పూవులలో పెట్టి తీసికెళ్ళినట్టుగా, ఏ చిన్న ఇబ్బందీకూడా లేకుండా నడిచిపోయింది.

ఏ ఊరువెళ్ళితే, ఆ ఊళ్ళో రచయితల ఫెడరేషన్ కు వెళ్ళి నా లేఖ చూపించటం. అంతటితో ఆ కార్యదర్శి నాకుసమస్తసదుపాయాలూ చూడటం; నాసభలూ, ఉపన్యాసాలూ, సమావేశాలూ, ఏర్పాటుచేయటం; ఊళ్ళో చదువుకొన్నవాళ్లను, రాజకీయ నాయకులను ఆహ్వానించి నాకు విందులు ఏర్పాటుచేయటం; నా అవసరాలన్నీ గమనించటానికి ఒకర్ని వెంటనియ్యడం, స్థానికపత్రికా సంపాదకునితోనూ, ప్రభుత్వప్రచురణ సంస్థశాఖాధికారితోనూ పరిచయం ఏర్పరచటం; నా కథ ప్రచురించాలని ఎన్నాళ్ళనుంచో తపిస్తున్నానని సంపాదకుడు చెప్పటం—జర్మనీలో ఎప్పుడో ప్రచురితమయిన ఒక చిన్నకథ సేమ ఇయ్యటం — ఆ కథకు వరుమానంగా మూడునాలుగువేల రూబుల్లు వెంటనే నా కిచ్చేయటం (ఆ రోజుల్లో మామూలు సోవియట్ వృత్తికారునికి, నెలకు ౧౩౦ రూబుళ్ళు మాత్రమే అందేవి!)

అల్లా పది పట్టణాల్లో నాది ఒకే కథ అమ్ముకోటం, ఇల్లా సాగిపోయేది. ఒక కథ అనేక పత్రికలు కొనుక్కొన్నాయి. నేను ముందెప్పుడో వ్రాయబోయే నవలకు రష్యన్, ఆర్మీనియన్, జర్మన్ యుక్రినియన్ ఇత్యాది భాషల్లో అనువదించే హక్కులకై పెద్దమొత్తాలు బజానాలిచ్చి, అప్పటికప్పుడే కొనుక్కొన్నారు.

ఎంతయినా నేనూ ఉప్పుపులుసూ తింటూన్న మానవుణ్ణాయను! ఈ ఆదరాలు, కనకాభిషేకాలన్నీ, రష్యన్ అధికారులు చుట్టిన తలపాగాకు తప్ప, ఆలోపలి బుఱ్ఱకు కాదని స్వాభిమానం చంపుకొని ఆనాడెల్లా అనుకోగలను! ఎల్లా గ్రహించుకోగలను!

అప్పటికి నేను స్వదేశంలోనైనా ఒక్క పుస్తకం ప్రచురించుకొని ఉండలేదు—బజానా లిచ్చిన వాళ్ళ కొక్కరికీ నా ఊరూ పేరూ కూడా అంతకు ముందు తెలియవు. నాది ఒక్క కథ చదివినవాడైనా లేడు. వాళ్ళంతా ప్రభుత్వ ఉద్యోగులు. సర్వ వ్యాసంగాలూ, ప్రభుత్వపరమైన దేశంలో ప్రచురణ కర్తలూ, రచయితలూ, సంపాదకులూ, విమర్శకులూ, సాహిత్యోపాసకులూ, అందరూ కూడా, యథాతథంగానే ప్రభుత్వోద్యోగులైపోతారు. ఒక రచయితను మింటికెత్తినా, మంటిలోకుక్కినా, పై అధికారి ఆజ్ఞలనుబట్టే జరుగుతుంది. ఒకొక్కప్పుడు కొన్ని మాసాల వారలోనే ఒకే రచయితకు రెండు అనుభవాలూ సిద్ధిస్తాయి.

రష్యా చూడవచ్చిన సామాన్య విదేశ రచయితకు ఇదంతా తెలియటం కష్టం. అతన్ని ప్రతిచోటా కలుసుకొన్న వాళ్ళందరూ, అతని రచనలతో అమిత పరిచయం వెలువరిస్తారు. కేవలం అభిమానశూన్యుడైతే తప్ప, ఇవన్నీ అవసరానికై అధికారులు నేర్పిన 'చిలకపలుకులు' అనుకోటం అసంభవం. ప్రభుత్వ కేంద్ర ప్రచారసంస్థవారు అతని రాబోయే రచనకు కంట్రాక్టు వ్రాయించుకొని లక్షాఏభై వేల కాపీలమీది రాయల్టీ, ముందే కొంట్రాక్టుకు బజానాగా ఇచ్చేస్తారు. మహాప్రసిద్ధుడైన యూరపియన్ రచయితకే, స్వదేశాల ప్రచురణసంస్థలు, ఇందులో పదిహేనోవంతు కూడా రాయల్టీ బజానాగా ఇయ్యబోరు. అయితే రష్యాలో రచయిత కాపిటలిస్టు దేశాల రచయితలాగా దరిద్రుడుగా ఉండనక్కరలేదు! పంచవర్ష ప్రణాళికప్రకారం, ప్రతి రష్యన్ పౌరుడూ, ప్రతి అమెరికన్ పౌరునికన్నా 2½ రెట్లు ఎక్కువ పుస్తకాలు మొదటి సంవత్సరాంతంలోనే కొంటాడు. రెండవ సంవత్సరంనాటికి ఈశాతం మూడు ముప్పాతిక రెట్లకు పెరుగుతుంది. రచయితకు గ్రాసవాస సౌకర్యాలేకాకుండా, మోటారుకారు, వేసంగినిలయము, మొదలైన విలాసాలుకూడా ఉంటూంటాయి. విదేశరచయిత, తనని, కాసుకు గతిలేనివాడనుకొంటారేమో అని, ఈ విలాసాలకు ఏమీ భ్రమచెందనట్లే సంచరిస్తాడు. రష్యాలో రచయితకున్న స్థానం ప్రపంచంలో మరెక్కడా లేదని నమ్మకంతోనే ప్రచారం చేస్తాడు. రష్యాలో అతనికి చిక్కిన అపార ధనరాసులు, బైటిదేశానికి తరలించే అవకాశం లేకపోయినా, ఏనాటికైనా రష్యన్ ప్రభుత్వ ఖజానాలో అతనిపేర డబ్బుండనే ఉంటుంది! కొంత మార్చుకొని వెంటతీసుకొని పోయేందుకు అవకాశమూ కల్గవచ్చును! ఫ్రాంసులో అజ్ఞాతవాసంలో ఉంటూ రష్యానుంచి నెలనెలా డబ్బువస్తున్న ఇద్దరు ప్రఖ్యాత జర్మన్ రచయితలను నే నెరుగుదును. వాళ్ళపుస్తకం ఏదీ రష్యాలో ప్రచురితమైంది లేదు. ప్రజాస్వామ్య దేశాలను తూర్పారబట్టూ అనేక గ్రంథాలువ్రాశారు. కాని సోవియట్ ప్రభుత్వాన్ని విమర్శించిన గ్రంథము, వాక్యం, ఒక్కటైనా లేదు. వాళ్లు లంచాలు మేశారంటంలేదు. ఆ బండపద్ధతినే ఆలోచించక్కర్లేదు. కాని అనూహ్యంగా, భావతత్వంలోనే, "ప్రజాస్వామ్య ప్రచురణకర్తలు, డబ్బుకోసం ఏ చెత్తైనా అచ్చేయటానికి వెనుదీయరు. రష్యా ప్రజాప్రచురణకర్తలు మాత్రం, తమ స్వతంత్రరాజ్య విమర్శనను అణుమాత్రమైనా సహింపరు." అన్న ఊహకుఉండే ఆస్కారం విషయానికై అన్నాను.

రష్యా నిజంగా కళాకారులస్వర్గమే—అయితే ఆ స్వర్గంలోమాత్రం అన్నీ నిషిద్ధ తరుఫలాలూ, ఆ కల్పవృక్షారామాలచుట్టూ వజ్రాయుధాలు ఝుళిపించే వనపాలకులూనూ!

౬

ఒక్క సంవత్సరంపాటు రష్యాలో ఉన్నాను. సగంకాలం పర్యటనంలోనూ, తక్కిన సగం,

ఖార్కోవ్, మాస్కోలలో నివసిస్తూ గ్రంథం వ్రాసుకొంటూనూ, గడిపాను.

వోల్గా నదీతీరాన పారిశ్రామిక కేంద్రాలు చూశాను. దక్షిణానికి మళ్ళీ, ట్రాన్స్ కాకేసియన్ రిపబ్లిక్‌లన్నీ, జార్జియా, ఆర్మీనియా, అజర్‌బైజాన్ పర్యటించి, బాకూనుంచి కాస్పియన్ సముద్రం దాటి, టర్కమెనిస్తాన్, ఉజ్బెకిస్తాన్ మొదలైన మధ్య ఆసియా రిపబ్లిక్కులు చూసుకొంటూ ఆఫ్ఘనిస్తాన్ అంచుదాకా వెళ్ళాను. అక్కడినుంచి మరలి టాష్కెంట్ మీదుగా కజక్‌స్తాన్‌నుంచి, మాస్కో చేరుకొన్నాను.

చాలా దారుణమైన విశేషాలే అనుభవంలోకి వచ్చాయి. కాని ఆ అనుభవాలలోని దారుణాఘాతము మనస్సును వెంటనే పగిలించలేకపోయింది. మనస్సుచుట్టూ దట్టంగా గుడ్డలు చుట్టేసినట్టు, పార్టీ శిక్షణాభ్యాసంలో అలవడిన దృక్పథంలో, తాత్విక వాద కవచరక్షలో, విన్నదీ, కన్నదీ, సర్వమూ గూడా మనస్సులో ప్రాయోవాద క్రమంలో ప్రత్యేకించి ఉంచిన గూళ్ళల్లో ఆయా స్థానాలలో, నిర్భయ హీనంగా, అతి సునాయాసంగా అమరిపోయి— ప్రత్యక్షఘటనాఘాతంతో వెంటనే పగిలిపోకుండా, మనస్సును తాత్కాలికంగా రక్షించాయి. కాని ఆ కవుకు దెబ్బకు అప్పుడే మనస్సు బీటలిచ్చినట్లు తర్వాత పగిలినప్పటిదాకా తెలిసిరాలేదు.

నాకు రష్యన్ భాష కొంత ధారాళంగానే వచ్చును. వెంట ఎవరూ అక్కర్లేకుండానే తిరగగలిగేవాడిని. కాని కేవలం ఉద్యోగులతోనూ, అధికారులతోనూ తప్ప—సామాన్య సోవియట్ పౌరులతో కలిసి మెలిసి సంభాషించటం నాకు కుదరనే లేదు. కుష్టువాడిని ముట్టుకోటంకన్నా, విదేశీయునితో మాట్లాడుతూ కనబడటం చాలా ప్రమాదకరమని సామాన్య సోవియట్ పౌరునికి తెలుసును. ఇక హోటళ్ళలోనూ, రైళ్ళలోనూ, విధిలేక మాట్లాడవలసివచ్చిన వాళ్లు, 'ప్రవ్డా' సంపాదకీయ వాక్యాలతోనే చిలుకపలుకుల్లాగా సంభాషణ అంతా ముగించేసేవారు. ఇదంతా కూడా మంచి సూచనే—విప్లవసుశిక్షితులకూ, బోల్షివిక్ నిత్యజాగ్రస్థితికీ, దేశారోగ్యానికీ, మంచి నిదర్శన మనుకొన్నాను.

యూక్రేన్‌లో ౧౯౩౨-౩౩, క్షామ బీభత్సాన్ని కళ్ళచూశాను. కుటుంబాలు కుటుంబాలు, తండాలు తండాలుగా, బయలుదేరి చిరుగు పేలికలతో దీనవదనాలతో, రైలుస్టేషన్లలోగూడా మూగి అడుక్కొంటూండేవారు. రైలుకిటికీ తెరచేటప్పటికి ఉదరపొట్టలతోటి, ఉబ్బకాళ్ళతోటి తిండిలేక మలమల మాడుతున్న బిడ్డల తల్లులు బిడ్డలనెత్తి చూపిస్తూ దీనంగా రైలు కిటికీలచుట్టూ మూగి ఆక్రందిస్తూ యాచించేవారు. ముసలీ ముక్కా అంతా దిక్కులేనట్టు అక్కడే పడిఉండేవారు. వాళ్ళంతా, ప్రభుత్వ సాముదాయక వ్యవసాయ కృషిలో కలిసిరాక ఎదురుతిరిగిన 'కులక్' రైతులట—పని చేయటంకంటే అడుక్కుతినటమే అపేక్షించే ప్రజాశత్రువులట—అయితే అల్లా కావలసిందే అని నాకూ అనిపించింది. ఖార్కోవ్‌లో హోటల్ రెజీనాలో నేను దిగినప్పుడు నా గది ఊడ్చేందుకు వచ్చిన మనిషి పని చేస్తూచేస్తూ సొమ్మసిలి పడిపోయింది. ఆ అమ్మాయి కొత్తగా పల్లెటదిక్కునుంచి పట్నం పనికి వచ్చింది. ఆ అమ్మాయి రేషన్ కార్డు ఇయ్యటానికి ఏదో తిరకాసు వచ్చి ఇంకా ఇయ్యటం పడలేదట. తిండిలేక ఆకలితో సొమ్మసిల్లి పడిపోయింది. అవును, అంత పెద్ద ఎత్తు ప్రభుత్వపు పనులలో ఈమాత్రం అలసత్వాలు జరగక తప్పదని సమాధానం చెప్పుకొని ఊరటపడ్డాను.

ఆసిగూటికి నివాసుల, జీవనపరిస్థితులెంతో వెనకబడిఉండటం గమనించక తప్పలేదు. నగరాల్లో, గ్రామములలో, రైలుస్టేషనులలో, జనంలో మందకొడితనమూ, నిస్సత్తువయే కనబడుతూండేది. పారిశ్రామికపట్టణాలన్నీ ఏకాండంగా ఒక్కటే దరిద్రపుపేట అయిపోయినట్లు కనిపించాయి. ఒకే గదిలో దండాలు కట్టి గుడ్డలతో అడ్డుగదులు చేసుకొని రెండుమూడు సంసారాలు జీవిస్తూండేవి. సహకార సంఘాలు కరువుబత్తాలకన్నా తక్కువగా ఆహారవస్తువులు సరఫరా చేసేవి. మామూలు బజారులో కొనాలంటే పత్తెడు వెన్నఖరీదు, కూలివాడి నెలజీతానికి పూర్తిగా సరిపోయిఉండేది. జత చెప్పులధర రెండు నెల్ల జీతం!

కాని ఉన్నదున్నట్లు అర్థంచేసుకోటం పొరపాటని శిక్షణ పొందాను. వాట్లను అల్లా జడంగా చూడకూడదు. చైతన్యయుతంగా చూడాలి. జీవనప్రమాణాలు తక్కువగా ఉన్నమాట నిజమే. కాని జారు పరిపాలనలో ఇంతకన్న అధ్వాన్నంగా ఉన్నవి ఇప్పుడు పుంజుకొంటున్నాయి. కేపిటలిస్టు దేశాలలో కార్మికులు ఈనాడు వీళ్ళకన్నా బాగుండి ఉంటే ఉండిఉండవచ్చును. కాని వాళ్ళ జీవనప్రమాణాలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఇక్కడివి అంతకంతకూ పెరుగుతున్నాయి. పంచవర్ష ప్రణాళిక పూర్తిఅయేనాటికి రష్యన్ కార్మికుని జీవనప్రమాణాలముందు విదేశకార్మికుని జీవనప్రమాణాలు దరిద్రమై పడిపోతాయి.

ఈ విధంగా, 'ఇక్కడి క్షామం విధాయకమే' అనే కాకుండా, ఇంకా అనేక విషయాలపైనా సమాధానపడిపోయాను. విదేశస్థులను దేశంలో విచ్చలవిడిగా తిరగకుండా నిషేధించి తీరవలసిందే. విదేశ సాహిత్యం, కాపిటలిస్టులదైనను, మళ్లీ దేశంమీద బురదజల్లకుండా, నిషేధించవలసిందే. కాపిటలిస్టు దేశాలను వికృతరాక్షసరూపాలలో ప్రజలకు చూపించవలసిందే — అన్నీ అవసరాలే, అని నాలో నేను నిరూపించుకొన్నాను.

“బూర్జువాపత్రికలలో నీ, ఉద్యోగం తీయగానే, నీ రేషన్ కార్డు లాగేసి, ఇంట్లోనుంచి నిన్ను తన్ని తరిమేశారంటగా?” “ఫ్రెంచికార్మిక కుటుంబాలలో రోజూ తిండిలేక చచ్చిపోయేవాళ్ళ సంఖ్య (౧) పట్టణాల్లో ఎంతుంటుంది, (౨) పల్లెలలో ఎంత ఉంటుంది?” “కార్మికులలోని సోషల్—ఫాసిస్టు విద్రోహుల ఆసరాతో, కార్మికవర్గాన్ని అణగద్రొక్కేందుకు ధనికవర్గాలు ప్రారంభిస్తున్న యుద్ధకుతంత్రాలను, అక్కడి మన కామ్రేడ్లు ఎంతవరకూ విజయవంతంగా ఎదుర్కొన్నారు?”—ఇలాంటి ప్రశ్నలు నన్ను వాళ్ళు అడిగినప్పుడు ముందు విస్తుపోయాను.

ఆ ప్రశ్నలన్నీ నవీనసోవియట్—స్టాలినీయ శైలిలో, ప్రయత్నపూర్వకంగా తయారుచేసిన వాక్యవిన్యాసాలు. వాట్లన్నిటిలోనూ, నువ్వుగింజంత నిజం లేకపోలేదు—కాని దాన్ని గోరంతని కొండంత చేసి, తేటతెల్లమునర్చి సిద్ధవిధానంలో ప్రచారపుమూసలలో పోస్తారు. అయితే శత్రుమధ్యంలో ఉన్న సోవియట్ యూనియన్ వంటి దేశానికి ప్రచారం తప్పనిసరి అయితీరుతుంది.

అవసరఅబద్ధం; అవసర దుష్ప్రచారం; హ్రస్వదృష్టితో పొరపాట్లు చేయకుండా ప్రజలను అదుపులో ఉంచేందుకు అవసరమైన బెదిరింపు; వ్యతిరేకపక్షాలనూ, వ్యతిరేకవర్గాలనూ, రూపుమాపవలసిన అత్యవసరం; భావితరాల అభ్యుదయంకోసం, ఈ తరాన్ని బలియిచ్చేయవలసిన అవసరం — ఇదంతా బీభత్సంగా కనబడవచ్చును. కాని ఏకాగ్రవిశ్వాస పథంలో ఓలలాడుతూపోతూన్నప్పుడు ఇంతకు ఇంతింతైనా సునాయాసంగా స్వీకరించి సమాధానపడగలం.

ఇదంతా మధ్యయుగాల క్రైస్తవమతపు విక్షిప్తతలలలో, మాయావాద మతకూటవిహారాలలో, చర్వితచర్వణంగా చరిత్రలో జరిగిన విషయమే. మద్యపాయి మానసికప్రపంచాన్ని — ఆ మాయాలోకపు టంచులలో ఎన్నడూ కాలిడనివాడు, ఏనాడూ తనలో తానై విభ్రమకేళీవిహారం సల్పనివాడు—ఎంతమాత్రమూ అర్థంచేసికోలేడు.

౭

౧౯౩౩ లో సోవియట్ రష్యానుంచి తిరిగి వచ్చాను. పార్టీలోమాత్రం ఇంకా నాలుగున్నర ఏళ్ళ పర్యంతం ఉన్నాను—నా విశ్వాసము చాలా దెబ్బతిన్నది. కాని దెబ్బనొప్పి ఇంకా తెలిసిరాలేదు. అనేక బాహ్యవిషయాలు, మానసికతర్కాలూ కూడా ఆ నొప్పి చివరిదాకా తెలిసిరాకుండా కొంత కాపాడాయి. ఆ ముఖ్యవిషయాలలో ఇదొకటి—

౧౯౩౫ లో కోమింటెర్న్ సప్తమ వార్షికోత్సవం జరిగింది. పార్టీ సరిక్రొత్తవిధానం సూచించింది. మునుపటి విధానానికి దాదాపు ఎదురుకోలు విధానమే! కానీ ఎప్పటిలాగే, దాన్ని అమలుపరచవలసిన వాళ్ళూ, మళ్లీ మునుపటి నాయకవర్గాలే!

వర్గపోరాటం, కార్మిక నియంతృత్వం, ఇత్యాది నినాదాలన్నీ కట్టకట్టి అటకమీద పారేశారు. ఇప్పుడంతా “ఫాసిస్టువ్యతిరేక, శాంతికాముక, ప్రజాశ్రేణి”-సహృదయులంతా, సోషలిస్టులు, కేథలిక్కులు, కన్సర్వేటివ్లు, నేషనలిస్టులు—ఎవరైనాసరే ఈ ఉద్యమంలో చేరవచ్చును. మునుపంతా హింసాయుతవిప్లవాన్ని మేము ప్రోత్సహించామనటం అంతా వట్టిబూటకం—యుద్ధకాముకులు, ప్రతీపశక్తులు, ప్రచారంచేసిన నీలాపనింద. ఇప్పుడు మమ్మల్ని మేము బోల్షివిక్కులనీ కమ్యూనిస్టులనీ చెప్పుకోము. బహిరంగంగా ఆ మాటలనడం పార్టీ సహించదు. కేవలం, నమ్మకస్థులమయిన, మామూలు శాంతికాముకులం, ఫాసిస్టు విరోధులం, ప్రజాస్వామ్య రక్షకులం.

పారిస్లో ౧౯౩౫ బాస్టిలీదినంనాటి సమావేశంలో, ఆరితేరిన కమ్యూనిస్టుపార్టీనాయకుడు మార్సెల్ కాషిన్, సోషల్ - ఫాసిస్టు విషసర్పమైన లియోన్ బ్లమును, వేదికపై గాఢాలింగన మొనర్చుకొన్నారు. ప్రజాసమూహం ఉత్సాహోద్రేకాలతో మహాకోలాహలంగా ఫ్రెంచి జాతీయగీతమూ, కమ్యూనిస్టు 'ఇంటర్నేషనల్' గీతమూ మేళవించి ఏకకంఠంతో పాడేశారు. ఆ సమాగమానికి ఆనంద బాష్పాలు కురిసిపోయాయి. చివరికి కార్మికవర్గం ఎల్లాగో ఏకం కాగలిగింది. అంతకన్నా ఏం కావాలి! ౧౯౩౬ ఎన్నికలలో స్పెయిన్, ఫ్రాన్సులలో “ప్రజాశ్రేణి” (Popular Front) పక్షానికి బ్రహ్మాండమైన విజయాలు చేకూరాయి.

ఇదంతా సోవియట్ విదేశనీతిలో కల్గిన మార్పుతో సంభవించింది. రష్యా, లీగ్-ఆఫ్-నేషన్సలో చేరింది. లిట్వినావ్ విధానానికి విజయం చేకూరింది. ఫ్రాంసు, జెకొస్లొవాకియాలతో రష్యా స్నేహ పత్రాలు వ్రాసుకొంది. మళ్లీ ఈ నాడు చూసుకొంటే, (పాప్యులర్ ఫ్రంట్) "ప్రజా శ్రేణి" దినాల విషయాలు, తదుపరి అనుభవంవల్ల కలుషితమయి కనబడ్తాయి. ఈ సౌజన్యకంచుకంలో నిగూఢమై ఉన్న నికృష్ట కాపట్యమూ, తత్ఫలితమై వచ్చిన విషవిద్రోహాలూ — బైటపడ్డాక, జ్ఞాపకాలు కలుషితం కాక తప్పదు. కాని ఆ ఉద్యమం ఉన్నన్నాళ్ళూ, ప్రజాఉద్యమంగా మమ్మల్ని మహోద్రక్తుల నొనర్చి వేసింది.

నేను రష్యాలో ఉండగానే జర్మనీలో హిట్లరు అధికారానికి వచ్చాడు. అందుకని ౧౯౩౩లో పారిస్ అజ్ఞాతకూటంలో ఉన్న మా పార్టీ స్నేహితుల వద్దకు చేరాను. గెస్టాపో పోలీసులు పట్టుకొన్న వాళ్లు తప్ప, తక్కిన మా బెర్లిన్ "ఎర్రపేట" అంతా, మొత్తంగా పారిస్ చేరుకుంది.

ఆ తర్వాత ఐదేళ్లూ నాకు దాదాపు నిత్యోపవాసాలే. కాని పార్టీపనిలో సమ్మగ్రంగా మునిగి పోయి ఉండేవాణ్ణి.

ఆ రాజకీయాలన్నిటికీ కేంద్రం — విలి మున్‌జెన్‌బర్గ్, అనే అతను. పశ్చిమ యూరప్ జర్మనీలకు పార్టీ ప్రచారాధిపతి. పొట్టిగా బలంగా ఉండేవాడు. జన్మతః కార్మికుడు. ఆకర్షణీయుడైన వ్యక్తి. పనులు చేయించటంలో ఘటికుడు. అతను చెప్పింది కాదనేందుకు నోరు రాదు ఎవరికీ. అంతటి రమణీయమైన స్వభావం. నా తర్వాత, ఆరు నెలలకు ౧౯౩౮ లో కమ్యూనిస్టుపార్టీనుంచి వెలికి వచ్చాడు. ౧౯౪౦ లో వేసవిలో, మామూలు "నిగూఢ" పరిస్థితుల్లో ఘాతుకంగా చంపబడ్డాడు. హంతకులెవరో తెలియదు. కాని హత్యాసందర్భంలో దొరికిన "అనుమాన — ప్రమాణాలు", కొద్దిమాత్రం, దిక్సూచీయంత్రాలు ఉత్తరదిశను చూపించినట్టు, ఒకేదిశకు చూపిస్తాయి.

అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేకోద్యమానికి, విలీ 'అరుణజ్యోతి'. ౧౯౩౩ లో లండన్ పారిస్‌లలో, రీష్‌స్టాగ్ — ప్రతికూల విచారణ, న్యాయస్థానాలు నిర్మించుకొంటూవచ్చాడు. హిట్లర్ ప్రభుత్వదురంతాలను ఈ విచారణలు మొదటిసారి ప్రపంచప్రజల ఆరాలోకి తీసుకొనివచ్చాయి. అక్కడనుంచి అనేక గ్రంథాలు, కరపత్రాలు, వార్తాపత్రికలు మొదలైన ఎన్నో ప్రచురించాడు. ఒక్కదానిమీదా ఎక్కడా అతని పేరు కనబడేది కాదు. కాని పెట్టుబడి, నిర్వహణ, అంతా అతని చేతులమీదుగానే జరిగేది. అంతర్జాతీయ సంఘాలు, సమావేశాలు, ఉద్యమాలు అనేకం, విప్రవినోది సంచిలోనుంచి తీసినట్టు ఇట్టే పుట్టించేవాడు. ఫాసిస్టుపీడకు గురిఅయిన వారి బాధానివారణకు సంఘం ఏర్పరిచి చందాలు పోగుచేశాడు. ఈ ప్రతి ఉద్యమంలోనూ, సంఘంలోనూ, పలుకుబడి ఉన్న పెద్దలు, ఇంగ్లీషు జమీందారులు, అమెరికన్ రచయితలు, ఫ్రెంచి మతగురువులు, అనేకులు నిర్వాహకవర్గాలలో ఉండేవారు. వీరిలో ఒక్కరూ ఏనాడూ మున్‌జెన్ బెర్గ్ పేరైనా విని ఉండరు. "కోమింటర్న్" అనేది గోబెల్స్ పుట్టించిన అభూతకల్పన అనే, వారి నమ్మకం.

ఆరోజుల్లో విలీ నిర్మాణచాకచక్యం బహుముఖాలుగా ప్రజ్వలించింది. ఉద్యమనిర్మాణంలో విలీ ప్రతిభ అపారమైనది. అతనికి ప్రచండమైన ప్రచారశక్తి ఉండేది. కోమింటర్న్ విషతంత్రాంగంలో అధికారస్థానం నిలబెట్టుకొనేందుకు అవసరమైన మంత్రతంత్రాంగాలను మించి అతను అవినీతిగా ప్రవర్తించిందీ ఏమీ లేదు. విలీ మున్‌జెన్‌బర్గ్ జీవిత చరిత్ర, ఎప్పటికైనా ఎవరైనా వ్రాస్తే, రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలాన్నిగురించి అనేక విషయాలు చాలా విపులంగా తెలిసి వస్తాయి.

పారిస్ అజ్ఞాతారంభంలో విలీతో కలిసి పని చేశాను. మళ్ళీ స్పానిష్‌యుద్ధంలో ఇద్దరం కలిసే ఉన్నాం. తర్వాత ౧౯౩౮ లో ఇద్దరం కలిసి, అ-స్టాలినీయమూ, నాజీప్రతికూలమూ, అయిన 'డీ జూకుర్ఫ్‌ట్' అన్న పత్రిక ప్రచురించాము.

ఈ మధ్యకాలాలలో పత్రికలకు వ్యాసాలు వ్రాస్తూ గడిపాను. ఒక కమ్యూనిస్టు హాస్యపత్రిక సంపాదకత్వం వహించాను. (ఆ పత్రిక మరీ చౌక బారుగా ఉందని మొదటిసంచికతోనే ఆపేసింది, పార్టీ.) జర్మన్ అజ్ఞాతవీరుల శిశుసంరక్షణాలయంలో పనిచేశాను. అలెక్స్‌రేడో, అనే అతని వార్తాసంస్థలో పనిచేశాను. (ఆ తర్వాత ఇతనే స్విట్జర్లాండులో సోవియట్ మిలిటరీ రహస్యశాఖలో ముఖ్యోద్యోగిగా ఉండేవాడు. ద్వితీయ ప్రపంచసంగ్రామానంతరం రష్యాలో 'మాయ'మై పోయాడు.) ఒక ఏడాదిపాటు ఫాసిస్టువ్యతిరేక పరిశోధకశాఖకు మేనేజింగ్ ఎడిటర్‌గా చాలా తీవ్రమైన కృషి చేశాను. కడుపులో తిండిలేని లోటు కృషిలో ఉత్సాహమే తీర్చిపెట్టేది. మా సంస్థకు ఫ్రెంచి సాహిత్యసంస్థలూ, ట్రేడ్ యూనియన్లూ కొంత చందాలిచ్చి పోషించేవి. మేమంతా జీతాలు లేకుండా రోజుకు పదిపన్నెండు గంటలు, పనిచేసేవాళ్ళం. ఆ

యింట్లోనే వంటగదిలో, మధ్యాహ్నంపూట అందరికీ కలిపి, ఒక కళాయిగిన్నెనిండా బటాణీజావ కాచుకొని తాగేవాళ్ళం. కొన్ని వారాలపాటు ఇదొక్కటే నాకు ఆహారం. ఆ రోజుల్లో మా ఆఫీసుకు దూరాన ఉన్న పేటలో, ఒక అరుబయట పాకశాలలో గడ్డిమేటిప్రక్కన నా నివాసస్థానం. అద్దె ఇచ్చుకోకుండా నిద్రపోయేందుకు అది తప్ప స్థలం దొరక్కపోయేటప్పటికి, రోజూ పొద్దున్న, సాయంత్రం, ఆఫీసుకు కొన్ని మైళ్ళు నడిచిపోయి రావల్సివచ్చినా, అక్కడికే చేరుకునేవాణ్ణి.

కృషికన్నా మాదకరమైన వస్తువు లేదు. అనామకంగా, హృదయపూర్వకంగా, ఒక ప్రయోజనకరమైన పనిని చేస్తున్నామనుకోటంకంటె, అంతరాత్మను వెల్లించేందుకు మంచి లంచం లేదు. స్టాలిన్ ప్రభుత్వమూ, కోమింటర్న్ యంత్రాంగమూ, నెరపిన ఘాతుకాలన్నీ, వెనక్కుపడిపోతాయి. లెక్కకు రావలసిన విషయం ఒక్కటే ఒక్కటి. నాజీలతో పోరాటం—'యుద్ధభయా'న్ని జయించటం.

మరో విషయంకూడా మానసికంగా నాలో పనిచేసింది. ఎంత కళ్ళు మూసుకొన్నా పార్టీ అవకతవకలు మాకు కనబడుతున్నమాట నిజమే—నాతోపాటు అనేకమందికి కనబడ్డాయి. (ఇప్పుడు వాళ్ళు బైటికి రావటమో, అక్కడే 'మాయ' మై పోవటమో జరిగింది) కాని "పార్టీ బాగుపడాలంటే, బైటవాళ్లు కాదు బాగుచేసేది. పార్టీలో లోపలినుంచే శుద్ధికలాపం జరగాలి" అని మాలో మేము చెప్పుకోటానికి అంతూపంతూ ఉండేది కాదు.

ఏ క్లబ్బులోనైనా, లేదా ఏ మామూలు పార్టీలోనైనా చేరితే, అక్కడ నీకు నచ్చకపోతే రాజీనామా పెట్టి చల్లగా బైటికి రావచ్చును. కాని కమ్యూనిస్టు పార్టీతో అల్లా వీలులేదు. కమ్యూనిస్టుపార్టీ కార్మికవర్గ అగ్రశ్రేణి, చరిత్రపోకడకు "అవతార" స్వరూపం. ఒక్కసారి దాంట్లోంచి ఇవతలకు అడుగువేశావంటే, నీకు విశ్వప్రాకార బహిష్కారమే. ఇంక నువ్వేం వాగినా, ఏంచేసినా, పార్టీనడక పిసమెత్తు తొలగదు. తాత్వికంగా సరిఅయిన పద్ధతి ఏమిటంటే—నోరు మూసుకొని వైత్యవికారాలన్నీ మింగుకొని, శత్రువిచ్ఛేదమై ప్రపంచవిప్లవం విజయవంతమయ్యేరోజుకోసం—రష్యా కోమింటర్న్‌లు, ప్రజాస్వామ్యయుతాలయ్యే రోజుకోసం—ఎదురుచూస్తూ గుట్టుప్ప చెప్పి కూర్చోటమే, నువ్వు చేయవలసినపని. ఆనాడు తప్ప ఈలోపల, నాయకుల చర్యలను, పొరపాట్లను, ప్రశ్నించరాదు— ఆనాటికిగాని ఆ ప్రశ్నలు రావు. తప్పించుకొని ఉండవలసిన అపజయాలు, అనవసరంగా ఇచ్చిన బలులు, పార్టీలో ప్రశస్తంగా ఋజుత్వంతో పనిచేసి అతిరథ మహారథులైన కామ్రేడ్లను, దుష్ప్రచార కశ్మలంలో ముంచి, నేరస్థులని ఉరిమి నిహతులను చేసిన, పాపపంకం— ఇవన్నీ ఆనాడే విచారణకు వస్తాయి. అంతవరకూ, నైక్లబ్యం పొందిన నీఆత్మగౌరవాన్ని పోషించుకోవాలనుకుంటే, నువ్వూ మనిషివే అనుకొని బ్రతకాలనుకుంటే, నువ్వూ ఆ నిబంధనలప్రకారం ఆట సాగించవలసిందే— ఔననీ, కాదనీ ఎప్పటికప్పుడు తల ఊపాల్సిందే. మాటలు వెనక్కు తీసుకోవలసిందే. విషం కక్కితే, కుక్కలాగా దిగనాకుకొని మింగవలసిందే!

౧౭, జూలై ౧౯౩౬ నాడు ఫ్రాంకో, స్పానిష్ ప్రభుత్వాన్ని హస్తాదధీనం చేసుకొన్నాడు. స్పానిష్ రిపబ్లిక్ సైన్యంలో నేను చేరేట్టు చూడాలని విల్లీ నడిగాను. ప్రాంతీ కోతలు చేతైనవాళ్లు, ప్రెంచెస్ తప్పూతూ కాలం పాడుచేసుకోటం అతని కిష్టంలేదు. హంగరీ పత్రిక "పెస్టర్ లాయిడ్" విలేఖరినని చెప్పకొని ఆ పాస్ పోర్టుతో ఫ్రాంకో శిబిరంలో కూడా ప్రవేశించవచ్చునని అతను సలహా ఇచ్చాడు. కాని హంగరీ పత్రికతరఫున కాకుండా ఇంగ్లీషుపత్రిక తరఫున వస్తే మంచిదనుకున్నాను. నాకు 'న్యూస్ క్రానికల్' పత్రిక సంపాదకుడు తప్ప తెలిసినవారెవరూ లేరు. ఆ పత్రిక ఫాసిస్టువ్యతిరేకి. అయినా అడిగాను. ఫ్రాంకో స్పెయిన్‌లోకి రానిస్తే పొమ్మన్నాడు.

అల్లాగే లిస్బన్ వెళ్ళి, సెవిల్లీ చేరాను. కాని అక్కడ రెండోరోజుకే కమ్యూనిస్టునని నన్ను గుర్తుపట్టి వైగుచేశారు. కాని వాళ్ల తెలివితక్కువ పుణ్యమా అని చివరి నిమిషంలో ఎల్లాగో జిబ్రాల్టర్ దగ్గర తప్పించుకొని పారిపోయి ఇంగ్లండు చేరాను. ఆ రెండు రోజుల్లోనూ జర్మన్ సైన్యాలు, వైమానికులు, ఫ్రాంకోపక్షాన పోరాడటం చూచానేమో, ఆవిషయాలన్నీ న్యూస్ క్రానికల్ లో ప్రచురింపించి, ఫ్రాంకో ప్రభుత్వపు ఆరాలోకి వచ్చి, వారికి గర్భశత్రువు నయ్యాను.

తర్వాత రిపబ్లిక్ స్పానిష్ సైన్యాలతో విలేకరిగా తిరుగుతుండగా మళ్లీపట్టుబడ్డాను. ఈమాటు వాళ్ళు నన్ను హింసపెట్టకుండా కాల్చిచంపితే, ఎంతో దయచూపినట్లని భావించుకున్నాను.

నాలుగు నెలలు స్పానిష్ జైళ్లలో గడిపాను. ఏరోజు కారోజు కాల్చి చంపబోతున్నారనే అను

కొనసాగించేవాడిని. చాలామటుకు జైలులో ఒంటరి కొట్టు లోనే పడేసి ఉంచేవారు. ౧౯౩౮ లో బ్రిటిష్ ప్రభుత్వం కలుగచేసుకోవటంవల్ల జైలునుంచి అనుకోకుండా బైటపడ్డాను.

నా తల నెరవలేదు. ముఖకవళికలు మారలేదు. ఒక్కసారిగా దైవధ్యాన తత్పరుడనై పోలేదు. కాని మరోవిధమైన యథార్థ్యంతో పరిచయంలోకి వచ్చాను. దానితో నా దృక్పథమూ, ప్రామాణ్యాలూ, విలువలూ, మారిపోయాయి. ఆ మారటంలోనూ, వింత కనబడకుండా, ఎంత గంభీరంగా మారిపోయాయి అంటే, విడుదలైన కొన్నాళ్ళదాకా కూడా నాలో మార్పు వచ్చిన సంగతే నాకు గమనికలోకి రాలేదు.

ఈ మార్పుకు కారణభూతమైన స్థాయీభావాలు మూడు. ఒకటి భయం, రెండు, కరుణ — మూడవ దేదో అంత తేలికగా చెప్పలేను. భయం అంటే కేవలం చచ్చిపోతానని భయం కాదు. చిత్రహింసల, దుర్భర అవమానాల పాలయి, చిత్రవధ చేయబడతానేమోనన్న భయం. నన్ను వదిలిన తర్వాత నా స్నేహితుడు గార్సియా అటాడిల్ — అల్లా చిత్రవధ పాలయ్యాడు. ఆండలూసియా, కేటలాన్ రైతు బిడ్డలు-పసివారు, వాళ్ళని అర్ధరాత్రి వేళల కాల్చిచంపేసేందుకు పట్టుకు లాక్కుపోతూంటే, "అమ్మా! అమ్మా!" అన్న, వాళ్ళ ఆక్రందన వింటూంటే, జాలితో గుండెలు చీల్చుకొనిపోయేవి. ఇక మూడో అవస్థ — సామాన్యంగా యోగవిద్యాప్రకాశిక భాషలోమాత్రమే వర్ణింపబడే మానసికావస్థ — ఒకొక్కప్పుడు అకస్మాత్తుగా మనస్సుకు ఆ స్థితి సంభవించి, మనస్సులో ఒకమాదిరి శాంతిని కల్పించేది. తత్పూర్వముగాని, తదనంతరముగాని, ఆ స్థితి నేను అనుభవించలేదు.

ఆ అనుభవాన్ని, అనుభవవిజ్ఞానాన్ని, మాటలలో వర్ణించుదామని ఎన్నిమాట్లు ప్రయత్నించినా, ప్రతినిత్యం అర్థరహితంగా వాడబడి, పరిపాటిగా పేలవమైపోయిన చప్పిడి మాటలలో తప్ప, చెప్పటం చేతకావటంలేదు.

"మానవునికి అస్తిత్వముంది. గోచరుడు. 'మానవజాతి' అనేది గౌణము. విశేషణమాత్రం — అగోచరం."

"రాజకీయగణితంలో 'అంకాల' మాత్రంగా మనుష్యులను పరిగణించటానికి వీలులేదు. కారణం, మనుష్యులు గణితంలో సాధారణాంకాలకుగాక (జీరో) శూన్య, (ఇన్ఫినిటీ) అనంతాలకు, ప్రతిచిహ్నాలు అవుతారు. ఆ అంశాలు వచ్చినప్పుడల్లా, గణితం, అస్తవ్యస్త మౌతూనే ఉంటుంది."

"ఆదర్శము, అవలంబించిన విధానాన్ని, అతిస్వల్పపరిధులలో మాత్రమే కొంత పునీతం చేయగలుగుతుంది తప్ప, సర్వే సర్వత్ర ఉద్ధరించలేదు."

"ధర్మమూ, నీతీ, కేవలం సాంఘిక పరస్పర ప్రయోజనాలకోసమే పుట్టినవి కావు — 'ఔదార్యం', కేవలం పెట్టిబూర్జువా, అరిపేద, ఆర్ద్ర మనస్కతమాత్రమే కాదు. ఇవి నాగరికతను, గిరితప్పి చెల్లాచెదరైపోకుండా, ఆకట్టి ఉంచే పృథక్ కాంత శక్తులు."

అవాఙ్మానసగోచర అనుభవ విజ్ఞానాన్ని ఇల్లా మాటలతో చెప్పబోతే చప్పబడిపోతుంది తప్ప, లాభం లేదు. కాని ఈ చెప్పిన, అలుపపు వాక్యాలలో కూడా, ఏఒక్కదానికీ నా పంటూన్న కమ్యూనిస్టువిశ్వాసంతో పొత్తుకుదురదు.

కల్పనాకథ అయితే ఈకథ ఇక్కడ ఆపి ఉండాల్సింది. కథానాయకునిలో ఆత్మపరివర్తనం వచ్చేశాక అతడు పూర్వమిత్రుల వద్ద వీడ్కోలు పుచ్చుకొని హాయిగా తనదోవను తాను పోవలసి ఉండేది. కాని నన్ను జైలునుంచి వదిలేటప్పటికి, కమ్యూనిస్టును కాకుండా పోయానని నాకు నాకే తెలియలేదు.

ఇంగ్లండు వెళ్ళాను. లెఫ్టు బుక్ క్లబ్ కమ్యూనిస్టుల తరఫున స్పెయిన్ ననుసరించి ఉపన్యాసాలిచ్చాను. కమ్యూనిస్టుసభ్యులు స్పానిష్ రిపబ్లికన్ పార్టీలోని "ట్రాట్స్కీయిస్టుల" ప్రజాద్రోహచర్యలను గురించి అడిగేవారు. వాళ్ళ పక్షతత్వము వేరవవచ్చుగాని వాళ్లు "ప్రజావిద్రోహులు" అనటానికి వీలులేదన్నాను. ఇంగ్లండు కమ్యూనిస్టుపార్టీ పట్టించుకోలేదుగాని, లేకుంటే అనాడే నాకు "శ్రీముఖం" రావలసి ఉంది.

అప్పుడు, రష్యాలో, పెద్దపెట్టున "పార్టీ ప్రక్షాళన"లు నూకమొత్తంగా జరుగుతున్నాయని తెలిసింది. మా బావా, నా అనుగు మిత్రులిద్దరూ, రష్యాలో ఖైదీలయ్యారని విన్నాను. ఈ ముగ్గురూ జర్మన్ కమ్యూనిస్టుపార్టీ సభ్యులే. మా బావ డాక్టర్ ఎర్నెస్టు ఆషర్. వాల్గాలోని జర్మన్-రిపబ్లిక్-ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడు. అతనికి రాజకీయ తంత్రాంగాలు తెలియవు. వాటిమీద శ్రద్ధలేదు. రోగులకు ఇంజెక్షన్లద్వారా సవాయిరోగం ఎక్కించాడని అతనిమీద మొదటి ఆరోపణ (ఉదా:—పాదరసం పోగబెట్టి మాక్సిం గోర్కీ మీద విషప్రయోగం చేశారని, మాజీ జర్మన్ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు జగోడాను, మరి ముగ్గురు డాక్టర్లనూ శిక్షించారు) సుఖరోగాలకు పూర్తిగా నయమంటూ లేదని ప్రచారం చేసి, రోగులను అవలగొట్టాడని, రెండో ఆరోపణ. ఇక మూడోది, మామూలు ఆరోపణే - విదేశీ గూఢచారి- అని. పన్నెండేళ్ళ క్రింద అతన్ని అరెస్టుచేశారు. ఆ తర్వాత అతని పత్తాయే తెలియదు.

తక్కినఇద్దరు మిత్రులూ, దంపతులు. అలెక్సువిస్‌బర్గు, భౌతికశాస్త్ర నిపుణుడు—ఉక్రేనియన్ భౌతికశాస్త్రవిద్యాసంస్థలో ఉద్యోగి. ఈవా అతని భార్య. ఈ యిద్దర్నీ చాలా ఏళ్ళబట్టి ఎరుగుదును. ఖార్కోవ్‌లో వాళ్ళ ఇంట్లోనే బసచేశాను. ౧౯౩౩ లో రష్యానుంచి వచ్చేటప్పుడు రైలుదాకా వచ్చాడు. అతని వీడ్కోలు సందేశము—"ఏం జరిగినా సరే, సోవియట్ యూనియన్ జండాను విశ్వసంగా నిలబెట్టి ఉంచ"మని. ౧౯౩౭ లో అతన్ని ఖైదుచేశాగ స్టాలిన్, కాగ్గానివ్ లెవలు, వేసంగివేటకు, కాకసస్ పర్వతాలకు ముందెప్పుడో బయలుదేరతారని, అప్పుడు వాళ్లను హతమార్చేందుకు ఇరవైమంది గూండాలను ముందే నియోగించి ఉంచాడని, అతనిమీద నేరం మోపారు. అతన్ని మూడేళ్లు జైళ్ళన్నీ తిప్పారు. నేరం ఒప్పుకొన్నట్టు వ్రాసి యియ్యమన్నారు. అతను ససేమిరా రాసి యియ్యనన్నాడు. తర్వాత రెండేళ్లకు రిబ్బన్‌ట్రాప్-మాలటోవ్ సంధి కుదరగానే, అతన్ని ఇంకా వందమంది ఆస్ట్రియన్, జర్మన్ హంగరీ, కమ్యూనిస్టులతోపాటు గెస్టాపోవాళ్ళకు అప్పచెప్పారు. (ఆ వందమందిలో, జర్మన్ కమ్యూనిస్టునాయకుడు హీన్‌న్యూమన్ భార్య, విల్లీ మునజిన్‌బర్గు వదినగారూ, అయిన గ్రేటా న్యూమన్ బ్యూబర్, ఒకతె. ప్రొఫెసర్ బ్లాకెట్‌తో పనిచేసిన భౌతిక శాస్త్రజ్ఞుడు, ఫీసల్ హాటర్మన్సు ఒకడు.)

అలెక్సు, ఎల్లాగో గెస్టాపో చేతుల్లోంచి బైలుపడి, వార్సా విప్లవంలో పాల్గొనగల్గాడు.

అలెక్సు భార్య, ఈవాను, అంతకు ఒకఏడాది ముందరే ఖైదుచేశారు. ఒక పింగాణీఫ్యాక్టరీలో పని చేస్తుండేది. టీ కప్పుల మీద అలంకరణలో స్వస్తిక చిహ్నాలుంచేదని ఆమెమీద ఆరోపణ. వచ్చే పార్టీ కాంగ్రెసుసమావేశంలో స్టాలిన్‌ను చంపుదామని నిత్యం రెండు పిస్తోళ్లు పరుపుక్రింద దాచిపెట్టి ఉంచిందని, మరో నేరారోపణ. చీయాంకా జైలులో ఏణ్ణర్థం వుంచారు. బుఖారిన్ విచారణ నాటకంలో ఆమెను అప్రూవర్‌గా వాడుదామని జి. పి. యు ప్రయత్నించింది. రక్తనాళాలు తెగగోసుకొని అప్పటికి ఎల్లాగో తప్పించుకొంది. తర్వాత మాస్కోలోని ఆస్ట్రియన్ కాన్సలేట్‌లో ఆమె తల్లి స్నేహితులుండి, అతిప్రయత్నంమీద ఆమె నెల్లాగో విడిపించారు.

విడుదలై రష్యానుంచి వెళ్లగొట్టబడ్డాక ౧౯౩౮లో ఈవాను, కలుసుకొన్నాను. రష్యన్ జైళ్లలో ఆమె అనుభవాలు, నేరం ఒప్పుకొని వ్రాసియ్యమని జి. పి. యు, వాళ్లు పెట్టే యమయాతనలు, ఇవన్నీకూడా, "డార్కునెస్ ఎట్ నూన్" అన్న నా నవలకు ఉపకరించాయి. అలెక్సును విడిపించటానికి నాచేతనైన సహాయం చేస్తానని మాట యిచ్చాను. అప్పటికే, సుప్రసిద్ధ భౌతికశాస్త్రజ్ఞుడు, ఆల్బర్టు ఎయిన్‌స్టీన్, అతన్ని విడిపించటానికి చాలా ప్రయత్నంచేశాడు. నేను స్టాలినుకు ఒక ఉత్తరం వ్రాశాను. మాటలన్నీ చాలా జాగ్రత్తగా వాడాను. ఆ ఉత్తరంమీద, నోబెల్ ప్రైజ్‌లు అందుకొన్న ముగ్గురు ప్రసిద్ధ భౌతికశాస్త్రజ్ఞులు, పెర్రీన్—లాంగ్విన్, జోలియట్‌క్యూరీ,లచేత సంతకాలు పెట్టంచాను. వాళ్ళు నన్నెరక్కపోయినా, అడగ్గానే సంతకాలు పెట్టారు. లాంగ్విన్, జోలియట్‌క్యూరీలు, సోవియట్ అభిమానులు; తర్వాత పార్టీసభ్యులుకూడా అయ్యారు. కాని సోవియట్ విచారణ విధానాల మీద విశ్వాసం ఉన్నవాళ్ళైతే ఎరుగనివాడనైన నా ఉత్తరంమీద అంత తేలిగ్గా సంతకం పెట్టగలిగేవారు కాదేమో! ప్రొఫెసర్ బ్లాకెట్ ఒక్కడే నా ఉత్తరంమీద సంతకం పెట్టనన్నాడు. అంతకుముందే తన అసిస్టెంటు, హాటర్మన్సును విడిపించటానికి శాయశక్తులా కృషిచేసి ఉన్నాడు. మళ్ళీ సంతకం పెట్టితే ఆ ఒక్కణ్ణికూడా రక్షించలేకపోతానేమోనని అతని భయం.

ఇదెందుకు చెప్తున్నానంటే, కమ్యూనిస్టులయిన జోలియట్‌క్యూరీ, బ్లాకెట్‌ల, లాంటి పరమాణు శాస్త్రజ్ఞులు రష్యాలో దురంతాలకు బలిఅవుతున్న వారి విషయం తెలియకుండా ఉన్నారనేందుకు వీలు

లేదని. అధమం ఒకరిద్దరి సహాధ్యాయుల పూర్తి కథ నాకైనా వాళ్లకు ప్రత్యక్షంగా తెలుసు. పరోక్షంగా వందలమంది విషయం విని ఉంటారు. అల్లాగే కమ్యూనిస్టు పాంథులైన రచయితలూ, విలేఖరులూ, పండితులూ, వీరందరికీ కూడా తెలుసును. ఆర్కిటిక్ ఖండంలో కాన్సెంట్రేషన్ కాంపులలో హతమై పోయినవారు, గూఢచారు లనిపించుకొని తుపాకి వాతబడినవారు, అతీ గతీ తెలియకుండా రూపుమాసి పోయినవారు—ఒకరిద్దరు స్నేహితులైనా మాలో ప్రతివారికీ ఉన్నారు. ప్రజాస్వామ్యదేశాల సుఖ వాతావరణంలో, న్యాయవిచారణలోని లోపాలను ఎలుగెత్తి ఉద్ఘోషించాము. కాని, సోషలిస్టు ప్రపంచ షష్టాంకంలో, ఏవిచారణా పాడూ, లేకుండానే మా కామ్రేడులను నిర్మూలిస్తూంటే, ఒక్కళ్లగొంతు పెగలదు; ఒక్క అభ్యంతరం వెలువడదు.

సోవియట్ రష్యాలో చంపబడినంతమంది విప్లవకారులు, బానిసలైపోయినంతమంది విప్లవకారులు, ఏ దేశంలోనూ, ఏ కాలంలోనూ కూడా లేరు. మార్క్సిస్టు-ధ్వజంక్రింద జరిగిన ప్రతి అకృత్యానికీ, మౌర్ఖ్యానికీ, ఏడేళ్లపాటు, తానే తాత్త్వికసమాధానాలు చెప్పుకొంటూ, గడిపిన వ్యక్తికి, అసంస్కృతులైన మూర్ఖులు చేసే ఘోరాలకన్నా, సంస్కారులూ, సహృదయులూ అయినపెద్దలు, ఆత్మప్రతారణంతో, ఈ తాత్త్వికపు గరిడీసామే, మళ్ళీ చేస్తూండటమే, ఎక్కువ హృదయ విదారకంగా కనిపిస్తుంది.

అలెక్సను అరెస్టుచేశారని తెలుసుకొన్నప్పుడే జర్మనీలో ఐదేళ్ల కఠినవరకం అనుభవించి పారిస్ పారిపోయివచ్చిన ఒక స్నేహితుడు, జర్మన్ కామ్రేడ్, కనబడ్డాడు. అతను ఒక అప్పారట్ శాఖలో పనిచేసే వాడు. ఆ అప్పారట్ నాయకులందరినీ, గూఢచారు లని నిందించి అప్పటికే హతంచేశారు. నా స్నేహితుణ్ణీ, అతని భార్యనూ, వాళ్లు చెప్పుకోవలసింది విన కక్కర్లేకుండానే, గెస్టాపో గూఢచారులని పేపర్లలో బొమ్మలు వేసి, కామ్రేడు లెవరూ వీళ్లతో ఏమాత్రం ప్రమేయం కల్పించుకోటం క్షేమకరం కాదని పెద్దగా ప్రచురించారు. (ఈతని భార్యే, 'ప్రస్తుటం' అన్నమాటమీద గెస్టాపో పోలీసులకు పట్టుబడ్డ అమ్మాయి. ఇప్పుడు ఆ దంపతులు పేర్లుమార్చుకొని బ్రిటిష్ దేశాలలో ఉన్నారు.) వీళ్లను మళ్ళీ కలుసుకొనేదాకా, ఇల్లాంటికథలు విన్నప్పుడల్లా కళ్లుమూసుకొని, తాత్త్వికపు గరిడీసాములోనే మనస్సును సమాధాన పరుచుకొంటూ వచ్చాను. కాని, ఏ మతంపేరిట వాళ్లను బలిపుచ్చుకో చూస్తున్నారో, ఆ మతం కన్నా యథార్థ సన్నిహితత్వంతో, ఈ మిత్రులు నాకు గోచరించారు. నేను వాళ్లపక్షం పూనాను.

పార్టీ వెంటనే ఏమీ అనలేదు. అంతవరకూ స్పానిష్ జెయిళ్లలో మగ్గుతున్న 'వీరకామ్రేడ్'నంటూ ప్రచారార్థం నాపేరు ఉపయోగించి ఉన్నారు. ఫ్రాంకో, మికాడో (జపాన్)ల, ఏజెంటు ననేందుకు, అది కొంత చల్లారేదాకా ఆగాలి.

పార్టీతో తెగతెంపులు జరగటమూ, వింతగానే జరిగింది. ౧౯౩౭ మధ్యలో, పారిస్ లోని జర్మన్ కాందిశీకరచయితల సమావేశంలో, స్పెయిన్ నుగురించి నేను ఉపన్యాసం ఇయ్యవలసివచ్చింది. నేను మాట్లాడేముందు పార్టీప్రతినిధి, నాఉపన్యాసంలో చేర్చమంటూ, "స్పానిష్ కమ్యూనిస్టుల్లో చీలిన యు పి. ఓ. యమ్ పక్షాన్ని (ట్రాట్స్కీవాదులు) ఫ్రాంకో తొత్తు లని" తిడుతూ, కొంత వ్రాసి తెచ్చాడు. నేను చేర్చనన్నాను. నే చెప్పబోయే ఉపన్యాసపాఠము ముందు తనకు చూపించమన్నాడు. చూపించనన్నాను. సభలో రెండుమూడువందలమంది కాందిశీకులు, రచయితలూ, పండితులూ, ఉన్నారు. వారిలో సగం మంది కమ్యూనిస్టులు. పార్టీసభ్యునిగా ఇదే నా తుది ఉపన్యాసం అని నాకు తెలుసును.

ఉపన్యాసం స్పెయిన్ లో పరిస్థితిని గురించి. రష్యనుగాని, పార్టీనిగాని ఉపన్యాసంలో నేను పల్లెత్తుమాట అనలేదు.

కాని, నా ఉపన్యాసంలో, ఉద్దేశితంగానే, మూడు వాక్యాలు చేర్చబడ్డాయి. మామూలు జనానికి ఇవి పాతసామెతలుగానే సాధారణంగానే కనబడుతాయి. కాని, కమ్యూనిస్టులకు మాత్రం 'కయ్యానికి కాలుదువ్వటమే'. ఆమాట లివి: 'ఏ ఉద్యమంగాని, వ్యక్తిగాని, పార్టీగాని అమోఘమని చెప్పుకోటానికి వీలులేదు.' 'నీ ఆశయ సాధనకే మరోమార్గం అవలంబించిన స్నేహితుణ్ణి ఖండించటము ఎంత బుద్ధిహీనమో, శత్రువును లాలించ చూపటమూ అంతటి బుద్ధిహీనమే"—మూడవ వాక్యం థామస్ మాన్ నుంచి తీసుకున్నది." "ప్రయోజనకరమైన అబద్ధం కన్నా, హానికరమైన నిజమే మేలు."

ఆవాక్యాలతో నిగ్గు తేలిపోయింది.

ఉపన్యాసం ఆఖరున ఇతర సభ్యులంతా కరతాళ అభినందన లొనర్చారు. కమ్యూనిస్టు సభ్యులు మాత్రం మొగాలు ముడుచుకొని, చేతులుకట్టుకొని బిగదీసు కూర్చున్నారు. నాజీసమావేశంలో, జాతి మత వివక్షతలు లేకుండా జన్మసిద్ధంగా జనులంతా ఒకటే, అని చెప్పినా ఇంతకన్నా పాపం అవదు.

కొద్దిరోజుల్లో పార్టీ కేంద్రసంఘానికి నా రాజీనామా పంపాను.

నా ఉత్తరం, జర్మన్ కమ్యూనిస్టు పార్టీకి, కోమింటర్నుకు, స్టాలిన్ ప్రభుత్వానికీ వీడ్కోలు. కాని, ఆ ఉత్తరంలోనే చివర సోవియట్ యూనియన్ పట్ల రాజభక్తిని వెలువరిస్తూ ముగించాను.

ఇప్పటి విధానాన్ని, అధికార ధూర్వహత్వాన్ని, పౌరస్వాతంత్ర్య నిరోధాలను ఖండించాను. కాని, కార్మిక కర్షక రాజ్యంలో నావిశ్వాసం చెక్కుచెదర లేదనీ, ఎంత అస్తవ్యస్తమయినా, అంతకంతకూ అధఃపతితమై పోతున్న ఈ ప్రపంచంలో, మిగిలిన ఆశారేఖ, సోవియట్ యూనియన్ ఒక్కటే, ననే వెలువరాను. ఆనరాన్నికి భక్తునిగానే మిగిలాను.

గరిడీసాములతాడు పుటుక్కున తెగింది. కాని, క్రిందపడకుండా పరిచి ఉన్న వల అడ్డింది. ఆ వలలో, అప్పటికే ట్రాట్స్కీవాదులు, అభిమాన విమర్శకులు, విపక్షీయులు, స్వపక్షీయులు, నాలాగానే తాత్వికపు గరిడీసాములో తల్లక్రిందులై పడ్డ పండితులంతా కలగాపులగంగా కలిసి ఉన్నారు. కొన్నాళ్లు అల్లా త్రిశంకుస్వర్గంలో పడి ఉన్నాను.

మాస్కోలో రిబ్బన్‌ట్రాప్ రాకకు స్వస్తిక జండాను ఎగరవేసి ఏనాడు ఆహ్వానించారో, ఆనాడు పార్టీతో పూర్తిగా తెగతెంపులై పోయింది. ఆనాటి నుంచీ-"హిట్లర్ మిత్రులు"-నన్ను విప్లవవిరోధిఅన్నా, మరేమన్నా కూడా నాకు లక్ష్యంలేదు.

కమ్యూనిస్టుపార్టీని ఏడేళ్లు సేవించాను. లాబాన్ కుమార్తె రాఖేల్‌ను, వలచి, జాకోబ్, ఆమె తండ్రి వద్ద, కన్యాశుల్కంగా, ఏడేళ్లు ఊడిగం చేశాడు. ఏడేళ్లు పూర్తి అయిన నాటిరాత్రి కన్యతో సంధానం జరిగింది. కాని, తెల్లవారి, జాకోబ్, కనువిప్పి చూసేటప్పటికి, తనతో ఉన్నది, అందాలరాసి రాఖెల్ కాక, అనాకారి 'లియా' అని తెలిసికొన్నాడు.

కేవలం భ్రమలో ఆరాత్రి గడిపానన్న, తెలివి వచ్చిన దెబ్బనుంచి, అతను ఎల్లా తేరుకొన్నాడో, భ్రమపడనే లేదని ఎల్లా సర్దుకొన్నాడో, తెలియదు. కాని, మరి ఏడేళ్లు ఊడిగంచేసి రాఖెల్‌నుపొంది, తన భ్రమను యథార్థం చేసికొన్నాడని బైబిలులో ఉంది. రాఖెల్ పట్ల అతనికున్న ప్రేమలో, మరుసటి ఏడేళ్లూ కూడా, ఏదురోజులలాగా సునాయాసంగా జాకోబ్‌కు గడిచిపోయాయి.

కాని, కథలోని ఆ శుభాంతం మళ్లీ ఎప్పటికైనా, ఎక్కడైనా సంభవమౌతుందా!

(హామిష్ హామిల్టన్ కంపెనీ; బ్రిటిష్ ఇన్ఫర్మేషన్ సర్వీసు; సౌజన్యంతో)

కథానిక:

గాంభీర్యం

శ్రీ పి. గణపతిశాస్త్రి

౧

'ఇది ఎవరి విగ్రహం మల్లన్నా?'

మల్లన్న ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. అతని కింతవరకు రాజనర్తకి రంగనాయకి తన వెనక నిలబడినట్లే తెలియదు. అతడు తదేకధ్యానంగా తనశిల్పంలో నిమగ్నుడైనాడు. తటాలున వెనక్కి తిరిగి రంగనాయకిని చూచి, చకితుడై తన చిరుగుల ఉత్తరీయం ఒళ్లంతా కప్పుకుని, చేతిలోని, ఉలి కింద ఉంచకుండానే కంగారుపడుతూ, యాదాలాభంగా,

"అబ్బే! ఎవరిదీ కాదు!" అన్నాడు.

"ఇంతవరకు చెక్కిన తరవాత ఎవరిదీ కాకపోవడ మేమిటి?"

"అయినా నీకళ్ళ కెల్లాగ కనిపిస్తూందో చెప్పు చూదాము!"

"కోతిలా ఉంది!"

"నిజంగానే!"

"నిజమే!"

"కోతిమాత్రం కాదులే"

"అయితే ఆంజనేయ స్వామివారా?"

"కాదు"

"మరి ఎవరు చెప్మా!"

"దేవదాసి!"

"అయితే నేను కోతి నంటావా!"

మల్లన్న అల్లాగే తన విగ్రహం చెక్కుతూ "నువ్వేదో అప్సరస ననుకుంటున్నావు గాని నిజంగా కోతివే" అని రెట్టించాడు. దీనితో ఆమెలోని పరిహాసభావం అంతా పటాపంచలైపోయింది. ఆ తరవాత రంగనాయకి "ఓహో! మాటలు బాగానే నేర్చావే!" అని అతనికేసి చురచురా చూస్తూ అక్కడినుంచి బయలుదేరి ఆ దగ్గరగానే ఉన్న నాగమూర్తి భవనం వైపు గబగబా నడిచివెళ్లింది.

మల్లన్న ఆమె శరీర భంగిములు గమనిస్తూ అలాగే శిల్పం మలుస్తున్నాడు. ఆమెమీద పడిన పుష్యమాసోదయ కాంతిలో ఆమెమొలనూలి మువ్వలు, కర్ణతాటంకాలు, కాలి అందెలు తళతళ మెరిశాయి. మల్లన్న ఆమె చంచల శరీరభంగిములు గమనిస్తూ మధ్య మధ్య తాను మలిచే శిల్పంకేసి నిదానంగా పరిశీలిస్తున్నాడు.

శిల్పాచార్యుడు నాగమూర్తి భవనంచుట్టూరా ఉన్న ఉద్యానవనంలోని ఒక పొన్నతరువునీడలో నిలబడి మల్లన్న ఉలితో ఒక విగ్రహం మలుస్తున్నాడు. అతనిదృష్టి కనుచూపుమేరలో నడిచివెడుతూన్న రంగనాయకిని పరిశీలిస్తున్నది.

అప్పుడే రెండుగడియల పొద్దెక్కింది. అయినా మంచు కురవడంవల్ల ఆ పరిసరం అంతా పొగ కమ్మినట్లు దృశ్యాదృశ్యంగా భాసిస్తున్నది. మంచుబిందువులప్పుడప్పుడు చెట్ల ఆకులమీదినుంచి జారి నేలపై రాలుతున్నాయి. దూరంగా ఒకచోట కొంతమంది పిల్లలు చలిమంట చుట్టూరా జేరి చలి కాసుతున్నారు. చలిమంట పైకి లేచినకొద్దీ దూరంగా నృత్యంచేసే వారినీడలన్నీ దగ్గరదగ్గరగా గుమిగూడుతున్నాయి. ఆ చలిమంటవెలుగులకు మేలుకున్న పిట్టలు గూళ్ళలో కలకలారావాలు చేస్తున్నాయి. మల్లన్న అల్లాగే కనబడినంతవరకు రంగనాయకిని పరిశీలిస్తూ చెక్కుడుపని చేస్తున్నాడు. దూరంగా భవన ప్రాంగణంలో ఆచార్యునితో సంభాషిస్తున్నా, రంగనాయకి వైఖరులతని శిల్పవిన్యాసాలకు సహకరిస్తూనే ఉన్నాయి.

రంగనాయకి ప్రత్యక్షమయ్యేసరికి శిల్పాచార్యుని సర్వావయవాలు నేత్రాలై వికసించాయి. వస్తూనే రంగనాయకి ఒక వంకదణ్ణం పెట్టి, ఆచార్యుడు పూర్తిచేసిన మేనకావిశ్వామిత్రశిల్పం ఎంతో ఆశ్చర్యంగా పరిశీలించసాగింది. నాగమూర్తి సోగగా

వంగిన ఆమె నేత్రాంచలాలు తిలకించాడు. శిల్పం చూస్తూ, దానివిషయం గ్రహించిన ఆమె కపోలాలు ఎఱ్ఱబంతిపూరేకులు విరజిమ్మాయి. ఆచార్యుని కించుమించుగా ౭౫ ఏళ్లుండవచ్చును. అయినా ఆయన మంచిరూపసి లాగే కనిపిస్తున్నాడు. బంగారు సరిగంచు పనిగలవంగపండురంగు కాశ్మీరశాలువా కప్పుకున్న అతనిశరీరచ్ఛాయ ఆశాలువా కాంతులలో కలిసిపోతున్నది. మాట్లాడినప్పుడల్లా రత్నఖచిత కుండలా లాయన కపోలాలపై కదులుతున్నాయి. తాంబూలం నములుతూమధ్యమధ్యన ఆయన పండుతమలపాకుల ఈనెలు తీస్తున్నాడు. ఒక చెక్కుటమ్ముకొనకొరికి పెద్దపెద్ద పెదిమెలపై ప్రసరించే చిరునవ్వుతో ఆయన మెల్లిగా ఇల్లా అన్నాడు.

"రంగా! ఇవ్వన్నీ ఎందుకో తెలుసునా?"

"తెలియలేదు. అళియరామయలవారేమైనా కొత్త దేవాలయం కట్టిస్తున్నారా?"

"కాదు: యాచమనాయునింగారు విఠలస్వామివారి గోపురం అలంకరింప జేసి, ధనుర్మాసోత్సవం చేయిస్తున్నారు."

"అయితే మేళతాళాల సందడి బాగా ఉంటుందన్నమాట!"

"ఆహా! అందులో నువ్వుకూడా ఉన్నావన్నమాటే! సరేగాని, ఈ మేనకావిశ్వామిత్ర విగ్రహం బాగా వచ్చిందా?"

"ఏమో నాకేం తెలుసును. నే నెప్పుడైనా మేనకను చూశాను గనకనా?"

"నేను మాత్రం చూశానా! రంగా!"

"అబ్బో! మీకేం చాలా మందినే చూశారు! చూడకపోతే అచ్చుపోసినట్లింతబాగా చెక్కగలరా?"

రంగనాయకి అసూయగా ఆచార్యునివైపు ఓరకంటిచూపు చూసింది.

"అదేమిటి రంగా! నిజంగా నిన్నే మనసులో పెట్టుకొని నేనీ మేనకామూర్తి మలిచాను"

"నేనంతటి చక్కని చుక్కనా"

"నీవు సాక్షాత్తూ ఆ మేనకవే!"

"ఆఁ! చాల్లెండి మీ వేళాకోళాలు!"

"వేళాకోళాలు కాదంటే నమ్మవు గదా! నువ్వు ముమ్మాటికీ మేనకవే!"

ఆచార్యుని మాపు రంగనాయకి అనురక్తిమవైపు తిరిగించి. ఆమె సిగ్గుతో తలవొంచుకుని, కాలిబొటనవ్రేలితో నేలమీద వ్రాస్తూ మెల్లిగా యిలా ఎత్తిపొడిచింది.

"పోనీలెండి! నేను కోతిని మాత్రం కాను! నా కదే పదివేలు."

"అదేమిటి? నువ్వు కోతివని ఎవరన్నారు?"

రంగనాయకి తనకూ మల్లన్నకు మధ్య జరిగిన సంభాషణకు బాగా చిలవలు, పలవలు చేర్చి చెప్పింది. ఆచార్యునికి మల్లన్నమీద బాగా కోపం వచ్చింది.

"ఈ మధ్యన వీడి ధోరణి ఏమీ బాగాలేదు. నేనొకసారి పిలిచి కూకలేస్తాలే!"

"అది అలా ఎందుకులెండి! ఏదో మీదగ్గర విద్య నేర్చుకొని మీ పేరు నిలబెడితే చాల్లెండి."

ఆ పిమ్మట రంగనాయకి తికిగి పల్లబోయింది.

"అవునులే! నేనింత కష్టపడి నీవిగ్రహం చెక్కినందుకు బహుమతి!"

నాగమూర్తి రంగనాయకి దగ్గరగావచ్చి ఆమె చెక్కిలి ముద్దుపెట్టుకోబోయాడు.

"చాల్లెండి! మీ కోతిచేష్టలు!" అని రంగనాయకి అతన్ని తప్పించుకొని తుర్రుమని వీధిలోకి పారిపోయింది. ఆచార్యునికి ఆమె మాటల నిగూఢవ్యంగం సూటిగా గుండెల్లో నాటుకొంది!

౨

ధనుర్మాసోత్సవాలు బాగా దగ్గిరపడ్డాయి. సంక్రమణ పుణ్యకాలానికి స్వామి ఆలయగోపురాలంకారా లన్నీ పూర్తి అయిపోవాలి. ఆచార్యుని శిష్యు లందరు ఒక్కరొక్కరే తమకు వప్పగించిన ప్రత్యేకవిగ్రహా లన్నీ పూర్తిచేసి అచార్యుని కప్పగిస్తున్నారు. మల్లన్న కప్పగించినవాటిలో రెండుమూడు మూర్తు లింకా పూర్తి కావలిసేఉన్నాయి. ముహూర్తం దగ్గిరపడుతున్నకొద్దీ ఆచార్యునకీ విషయంలో ఆత్రత ఎక్కువైంది. ఏదో తనపని తాను చేసుకుపోతున్నాడుకదా అని ఈ మధ్యన నాగమూర్తి అతనిపని ఎంతజరిగిందో బాగా పరిశీలించ

లేదు. ఈ మల్లన్న తల్లిపోయిన దగ్గరనించీ ఆచార్యుని కేదో ఆవేదన కలిగిస్తూనే ఉన్నాడు.

మల్లన్న నాగమూర్తి కొక వేలువిడిచిన మేనల్లుడవుతాడు. వాళ్లది చాలాసామాన్యసంసారం. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోయిన మల్లన్నకు ఆచార్యుడే సంరక్షకుడైనాడు. మల్లన్న చిన్నప్పుడు చిట్టిచిట్టి మట్టిబొమ్మలు చేసి వాటితో ఆడుకునేవాడు. ఆచార్యుడతనిలో సునిశితమైన శిల్పప్రతిభ ఉన్నదని గ్రహించి, అతని నీ విద్యలో ప్రవేశపెట్టాడు. కాని మొదటినించీ అతనిశిల్పపద్ధతి అదోకతరహాగా తయారయింది. నాగమూర్తి శిష్యులందరితోను శిల్పంలో సౌందర్యము, లాలిత్యము, సంప్రదాయము, తుచ తప్పకుండా ఉండాలని నొక్కిచెబుతూండేవాడు. ఆశిల్పాలన్నీ మార్దవపూర్ణమైన సౌందర్యంతో తొణికిసలాడుతూఉండాలని అతని పట్టుదల. ఎట్టన్న మొదలయిన శిష్యులంతా విగ్రహాలన్నీ ఆయన చెప్పినట్టుగా అచ్చుపోసినట్లు తయారుచేసి ఇచ్చేవారు. వేషభాషలదగ్గరనించీ వారు నాగమూర్తిని అనుకరించేవారు. ఆత్మస్తోత్రపాఠాలలా ఉన్న ఆశిల్పాలు చూసి ఆచార్యుడు మురిసిపోతూ ఉండేవాడు. కాని మల్లన్న బాణీ అంతా అతనికేదో వికారంగా, తనశిల్పాలను వేళాకోళం చేస్తున్నట్టుగా ఉండేది.

ఆచార్యుడు తనభవన ప్రాంగణంలో ఎక్కడా అసౌందర్యంగాని, అమంగళచ్ఛాయగాని, విషాదనిశ్వాసంగాని చోరకుండా అతిజాగ్రత్తగా కాపాడుకునేవాడు. ఎక్కడైనా ఒక్క కాకిపిల్ల కూసినా అతని శ్రుతికుహరాలలో శూలంతో పొడిచినట్టుండేది. సకృత్తుగానైనా దౌర్భాగ్యంతో అల్లాడే దరిద్రులు కనిపిస్తే అతడు దూరదూరంగా తప్పుకుని ఒక్క నిమిషం కళ్లుమూసుకునేవాడు. ఎల్లప్పుడు పాముకుబుసాల వంటి జరిగంచువలువలు, ఉత్తరీయాలు ధరించి వాటిభారానికే అలిసిపోయి ఉసురుసురంటూ ఉండేవాడు. అతని స్వాప్నికశిల్పజగత్తులో వారసుందరీ సౌందర్యం ఒయ్యారంగా నృత్యం చేస్తూ కళ్లలో కలిసిపోయేది. ఆ వారకాంతల పాదకింకిణీ మంథరనాదం అతని అంతరాంతరాల్లో వీణానిక్వణనంలా మ్రోగి రాగప్రవాహాలతో వెల్లివిరిసేది.

నాగమూర్తి మధ్యాహ్నం భోజనం చేసి తాంబూలసేవ చేసి, హంసతూలికా తల్పంమీద మేనువాల్చి కొంచెంసేపు విశ్రమించాడు. తిరిగిలేచే సరికి మధ్యాహ్నం మూడుఝాములు తిరిగింది. నాగమూర్తి బద్ధకంతో జోగే కళ్లతో శీతాకాలం ఎండలో చలికాగుతున్నట్లు నిశ్చలంగా నిలిచిన పూలతీగలవేపూ, పొన్నతరువులవైపూ, నీడల్లో కలిసిపోతున్న నీరెండవైపూ చూస్తూ రెండుమూడు సారులు ఆవలించి చిటికెలు వేశాడు.

ఇంతలో లోపలికి నిశ్శబ్దంగా వచ్చి నిలిచిన ఎట్టన్న అతని భావనాప్రవాహానికి అడ్డు తగిలాడు.

"ఏం? ఎట్టన్నా! పనిఅంతా పూర్తి అయిపోయినట్లేనా?"

"ఆఁ అన్నీ అయినట్లే! ఇంకా మల్లన్న ఒకటి రెండు మూర్తులకు నగిషీపని చెయ్యాలనుకుంటాను!"

ఆచార్యునికి చిరాకు తలకెక్కింది. "ఒరే, తెల్లారితే ముహూర్తంగదా! ఇన్నాళ్లనించీ వీ డేమి చేస్తున్నట్టు?"

రంగనాయకి ఎన్నడూ ఎట్టన్న శిల్పాలదగ్గరికి రానైనా రాలేదు. అందుచేత ఇప్పుడతని కొక అవకాశం దొరికింది. ఆ లోపలికోపంతో చల్లగా ఇల్లా అంటించాడు.

"ఏమోనండి! ఏంచేస్తున్నాడో! అస్తమానమూ ఏవో రాళ్లు మలుస్తూనే ఉన్నట్లు ఉంటాడు మరి."

నాగమూర్తి ముఖం ధుమధుమలాడింది. ఎట్టన్న ఆవిషయం కనిపెట్టక పోలేదు.

"ఒరేయి! ఎట్టన్నా! పద! పని ఎంతవరకయిందో చూదాము."

ఇద్దరూ నడిచివెళ్లి మల్లన్న శిల్పాలు మలుస్తున్న పొన్నచెట్టు నీడకు జేరుకున్నారు. ఆచార్యుడు అతడు చెక్కిన శిల్పాలన్నీ చూసి ప్రస్తుతం మల్లన్న మలుస్తున్న విగ్రహం దగ్గర నిల్చున్నాడు. మల్లన్న తన తన్మయతలో వెనకాల నిల్చున్న గురుశిష్యుల నిద్దరినీ గమనించనే లేదు. హఠాత్తుగా అతనికీ క్రింది మాటలు ముళ్లలా గుచ్చుకున్నాయి.

"ఒరేయి! మల్లన్నా! ఇదేమిటిరా! ఈ వంకర టింకర బొమ్మ?"

మల్లన్న మేనమామ ముఖమైఖరి చూసి కంగారు పడి పోయాడు. ఉలితో సహా అతని దుర్బలశరీరము, సన్నని వేళ్ళు ఒక్కసారిగా వణికాయి. "ఇదుగో! అంతా అయిపోయింది... ఈ సాయంత్రంతో పని పూర్తిఅయిపోయినట్లే!"

"అయితే మాత్రం! ఈ దిష్టిబొమ్మలు నేనేం చేసుకోను! యాచమనాయునింగారిదగ్గిర నాకు మాట దక్కనియ్యవురా?"

"నే నేంజేశాను..."

"ఇంకా ఏంచేశా నంటా వేమిటి? నువ్వేదో ఉద్ధరిస్తున్నా వనుకున్నాను! చూసిచూసి, చివరికి పేడబొమ్మలబాణీ మొదలుపెట్టా వేమిటిరా?"

మల్లన్నకు తనసహాధ్యాయి ఎదట జరిగిన అవమానం మరీ దుర్భర మైపోయింది. ఎల్లన్న అతనికేసి "చూడు! నా తడాఖా!" అన్నట్లు చూశాడు. మల్లన్నకిది మరిఒక బాకుపోటయింది.

ఇంక ఊరుకోలేక మల్లన్న మూతి బిగించి, బింకంగా "పేడబొమ్మలబాణీ ఏమిటి?... ఏదో నాకు తోచినట్లు చెక్కాను." అన్నాడు.

"నీకు తోచినట్లు చెక్కడం ఏమిటిరా! నేను చెప్పినట్లు చెయ్యాలిగాని!"

మల్లన్నముఖం బాగా ఎర్రబడింది మళ్ళీ నాగమూర్తి అందుకున్నాడు:-

"నీ తోటివాళ్ళు—ఎల్లన్నా వాళ్ళూ ఇల్లాగే చేశారురా! నీ కింక జ్ఞానం ఎప్పటికి వస్తుందిరా?"

"ఆబాణీ నావల్లకాదు. నే నావిధంగా చెయ్యలేను."

ఒరే! ఇన్నాళ్ళకి ఇది చేతకాకపోతే ఇక లాభంలేదు. ఇహ ఇదంతా కట్టిపెట్టి, మీ నాన్నలాగ గ్రామపౌరోహిత్యం ప్రారంభించు! అది మీకుల వృత్తే!

మల్లన్న లోలోపలికోపం అంతా పైకి కనబడనీయకుండా ఎల్లన్నకేసి చూస్తూ ఇలా అన్నాడు:-

"ఏదో లేనివాళ్ళం! ఏంచేస్తాం— మానాన్నగారు గ్రామపౌరోహిత్యం చేసినా ఎన్నడూ భోగంవాళ్ళ వెనకాలనిలబడి తాళంమాత్రం వెయ్యలేదులే!"

నాగమూర్తికి, తనతండ్రి విజయనగర వేశ్యలకు గొల్లకలాపాలు, భామకలాపాలు నేర్పి అళియరామరాయ చక్రవర్తి ఆదరం పొంది అగ్రహారం సంపాదించిన విషయం తటాలున జ్ఞాపకం వచ్చింది. దానితో అతని కళ్ళు చంద్రనిప్పు లయ్యాయి! ఇక ఉండబట్ట లేక, "ఛీ! దౌర్భాగ్యుడా! నాయింట్లోతిని ఇంటివాసాలు లెక్కపెడతావురా! ఫో! నాఇంట్లోంచి లేచిఫో!" అన్నాడు. అంతటితో వూరుకోక మల్లన్న చెక్కే విగ్రహాన్ని కాలికొద్దీ ఒక్క తాపు తన్నాడు. అసలా తాపుమల్లన్నకు తగలవలసినదే! కాని మల్లన్న కొంచెం తప్పించుకోవడంచేత అది విగ్రహానికి తగిలింది. ఎల్లన్న నిర్ఘాంతపోయినట్లు చూస్తూ నిలబడిపోయాడు. మల్లన్న కన్నీళ్ళతో చరచరా ఆ భవనావరణం దాటి వెళ్ళిపోయాడు.

3.

మల్లన్న వెళ్ళిపోయిన తరువాత కొంతసేపటి వరకు నాగమూర్తిని పలకరించడానికి కూడా ఎవరికీ సాహసం కలగలేదు. కోపంవస్తే ఆయన కింక ఒళ్ళు తెలియదు. కాని కొంతసేపటికి అది అంతా తాటాకుల మంటలా చల్లారిపోతుంది. ఇప్పుడూ అల్లాగే జరిగింది. తీరా భోజనాలవేళ మల్లన్న తనపక్కన కనపడకపోయేసరికి అతనికి బాగా పశ్చాత్తాపం కలిగింది. ఆమర్నాడెల్లాగో అల్లాగ హనుమాన్మహోత్సవము, గోపురాలంకారము అన్నీ జరిగిపోయాయి గాని, ఆచార్యుని ముఖాన కత్తివాటువేసినా నెత్తురు చుక్కలేదు! ఆ వేళకూడా మల్లన్న ఇంటికి రాలేదు. ఇంక ఆతరవాత ఆయనకేమీ తోచక విజయనగరం అంతా వెతకవలసిందని శిష్యుల నందరినీ పంపించాడు. వారు విజయనగరవీధులు, ఆ పైన సందులు గొందులుఅన్నీ వెతికారు. ఎక్కడా మల్లన్న జాడ తెలియలేదు. తొందరపడి ఏదైనా అఘాయిత్యం పని చేశాడేమోనని నాగమూర్తికికంగారు పట్టుకుంది. ఆచార్యుని భార్య మల్లన్నని చిన్నపటినుంచీ పెంచి పెద్దవాణ్ణిచేసింది. పండుగరోజుల్లో మల్లన్న యింట్లో లేకపోవడంవల్ల ఆమెకు మతిపోయినట్లయింది. మంచి మంచి బట్టలూ అవీ ఇచ్చినా, మల్లన్న అవి అతిపొదుపుగా వాడుకుని, సామాన్యంగా చిరుగులబట్టలే కట్టుకుంటూఉండేవాడు. మల్లన్న ఎక్కడ ఏమి ఇబ్బందులు పడుతు

న్నాడోనని నాగమూర్తి లోలోపల చాలా బాధ పడ్డాడు.

చివరికి ఒకనాడు మల్లన్నవార్త మాచాయగా తెలిసింది. రాజధానీ నగరానికి సమీపంగా ఉన్న ఒక పల్లెటూళ్లో మల్లన్న ఉన్నాడనీ, అక్కడ అతను పిల్లల బొమ్మలు, చిన్న చిన్న విగ్రహాలు చేసి అమ్ముకుని జీవయాత్ర సాగిస్తున్నాడనీ ఒకవార్త వచ్చింది. వెంటనే నాగమూర్తి ఎర్రన్నను పిలిచి అతన్ని ఇంటికి తీసుకు రమ్మని పంపించాడు. కాని మల్లన్న అతనితో ఇంక విద్యానగరం రాదలచుకోలేదని ముక్తసరిగా చెప్పి పంపించేశాడు. ఆపైన ఆచార్యుడే ఒక మేనా ఎక్కి మల్లన్న ఉన్న గ్రామానికి వెళ్లాడు.

కానివెళ్లిన మరునాటి సాయంత్రానికే నాగమూర్తి మేనా తిరిగివచ్చేసింది. మేనాలోపల నాగమూర్తి జ్వరంతో మూలుగుతున్నాడు. అయన్ని జాగ్రత్తగా తీసుకువెళ్లి లోపల పడుకోబెట్టారు. భార్యవచ్చి మల్లన్నమాట అడిగింది. ఆచార్యుడు జ్వరంతో మూలుగుతూ మల్లన్న రానన్నాడని ఆమెతో చెప్పాడు. ఆమె, ఈవార్తవిని నిర్ఘాంత పోయింది. నాగమూర్తే వెడితే మల్లన్న రాకపోడని ఆమె అనుకుంది. పైగా నాగమూర్తి పెద్దజ్వరంతో తిరిగి వచ్చాడు. ఆమె దీనితో ఒక పెద్దనిట్టూర్పు విడిచింది.

క్రమంగా జ్వరం ఎక్కువైపోయింది. జ్వరం తగిలిన మూడవనాటి రాత్రి ఆచార్యునికిక ఒంటిమీద స్పృహ లేనట్లే కనిపించింది. ఆస్థితిలో ఆచార్యునికి ప్రయాణవృత్తాంతం అంతా మళ్లీ కళ్లకు కట్టినట్టు కనిపించింది.

మల్లన్న నివసించేది చాలా కుగ్రామం. అతడు ఉన్నగృహానికి ఇరుగుపొరుగున ఉన్న వాళ్లంతా చాలా సామాన్యసంసారులు. మల్లన్నది ఒక పూరి ఇల్లు. నాగమూర్తి అక్కడికి చేరుకునే సరికే సూర్యాస్తమానం అయింది. ఆయింట్లో రెండే గదులున్నాయి. ఒకదానిలో మల్లన్న స్వయంపాకం చేసుకుంటున్నాడు. రెండవదానిలో తన బొమ్మలు అన్నీ పెట్టుకున్నాడు. ఆపరిసరము, ఆయిల్లు చూసేసరికే ఆచార్యునికి ఒళ్లంతా జలదరించింది.

మల్లన్న ఉన్నదానిలో నాగమూర్తి కేమీలోటు చెయ్యలేదు. చాలా ఆప్యాయంగానే ఆదరించాడు. ఆచార్యుడతని శిల్పాలు చూద్దామని ఆరెండవ గదిలోకి వెళ్లాడు. గాని అంతా అంధకారబంధురంగా ఉంది. అక్కడ కూడా చిన్నబొమ్మలు కొన్ని అస్పష్టంగా కనిపిస్తున్నాయి. మల్లన్న దీపం వెలిగించుకు వస్తానని వంటగదిలోకి వెళ్లాడు. ఆచార్యుని ఎదురుగా ఒక పెద్ద విగ్రహం కనబడింది. కాని ఆచీకటిలో అది చాలా అస్పష్టంగా వుంది. ఇంతలో ఒక ప్రమిదలో దీపం వెలిగించి తీసుకుని వచ్చి మల్లన్న మెల్లిగా ఆ విగ్రహం ఎదుట ఉంచాడు.

ఆచార్యుడా విగ్రహం అంతా జాగ్రత్తగా పరిశీలించాడు. ఒక్కసారిగా అతనికి ముచ్చెమటలు పోశాయి. హృదయాని కొక వజ్రఘాతం తగిలినట్లయింది. అది ఒక భయంకరమైన భిక్షుక స్త్రీ విగ్రహం! ఆ దీనురాలు మశూచికంతో మరణవేదన పడుతున్న తన శిశువు నెత్తుకుని ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంటూంది. ఆ శిశువు శరీరం ఆనవాలైనా లేకుండా ఒళ్లంతా ఒత్తుగా మశూచికం పోసింది. తల్లి ఆరోగ్యంగానే ఉంది. అయినా ఆమె అపారమైన మాతృప్రేమతో ఆ శిశువును తన హృదయానికి హత్తుకుని విచారంగా ఆ శిశువు కళ్లల్లోకి చూస్తున్నది.

అది చూసీచూడ్డంతోనే ఆచార్యుని హృదయంలో అసహ్యభావము, భయము, ఒకదానితో ఒకటి పెనవేసుకుని నృత్యంచేస్తూ ఉవ్వెత్తుగా పొంగాయి. ఆతరవాత మరి అతడా విగ్రహం కని చూడలేకపోయాడు. భయంచేత అతని కాళ్లు వణికాయి. ఆ భయోద్వేగంలో అతడక్కడ నిలబడలేకపోయాడు. ఇక్కడికి రాగానే మొదట మల్లన్నని తిరిగి యింటికి రమ్మని ఆహ్వానించాడు. మల్లన్న "తరవాతఎప్పుడైనా వస్తా"నని మర్యాదగా చెప్పితప్పించుకున్నాడు. వెళ్లేటప్పుడు నాగమూర్తి మళ్లీ అతన్ని రమ్మని అడుగుదా మనుకున్నాడు గాని మరి అతని కామాటే జ్ఞాపకం రాలేదు. మేనా ఎక్కిన కొంతసేపటికే అతనికి పులకరం వచ్చినట్లయింది. క్రమంగా అది జ్వరంగా మారిపోయింది. జ్వరం వచ్చిన మూడవనాటి రాత్రికూడా ఆ విగ్రహం అతని కళ్లఎదురుగా నిలబడినట్టు కనబడింది. అతడు భయపడి కళ్లుమూసుకున్నాడు. ఆ రాత్రంతా భయంకరంగా కలవరిస్తూనే ఉన్నాడు.

ఆ మర్నాడు యథాప్రకారంగా వైద్యులు వచ్చి అతని నాడి పరీక్ష చేశారు. వారనుమానించినట్టే అయింది. నాగమూర్తి ఒంటిమీదా, ముఖం మీదా మశూచికం చిహ్నాలు కనబడ్డాయి. ఆ రాత్రికి అది మశూచిక మేనని స్థిర పడిపోయింది. మశూచికం అనే మాట అనేసరికి ఆచార్యుని మనస్సులో జ్వలిస్తున్న జీవితాశాజ్యోతి కాస్తా అంతరించిపోయింది. అతనికిక జీవించాలనే కోరికే కలగలేదు! అతడు మంచి రూపసి కావడంచేత చిన్నప్పటి నుంచీ ఈ వ్యాధి అంటేనే అతనికి విపరీతభయం. ఏ దురంత వ్యాధి వచ్చినా అతడింతగా భయపడి ఉండకపోను! జ్ఞానం వచ్చినప్పటినించీ ఎక్కడా లోపంలేని శరీరసౌందర్యం ఆరాధించి అన్వేషించే అతనికి వికృతశరీరంతో జీవించడంకంటె అలాగే మరణించడమే మంచిదనిపించింది! తన కీభయంకరవ్యాధే ఎందుకు రావాలి? అతడనేకవిధాలుగా ఆలోచించాడు. అతనికీప్రశ్నకి ప్రత్యుత్తరం దొరకలేదు. చివరికి విధి విధానం అజ్ఞేయమని అతడు సమాధాన పడ్డాడు.

క్రమంగా ఆనాటికానాడు మశూచికం ఎక్కువై అతని శరీరం అంతా అంద వికారంగా తయారయింది. అతని పరిస్థితి చూచి వైద్యులు కూడా భయపడ్డారు. ఆనాడే మల్లన్నకు కబురు వెళ్లింది. మల్లన్న వచ్చేసరికి వ్యాధి చాలా ముమ్మరంగా ఉంది. నాగమూర్తికి మల్లన్న వచ్చిన సంగతే తెలియదు. మల్లన్న ఎన్నడూ మశూచికం పడలేదు. మేనత్త వద్దని ఎంత బతిమాలినా వినక అతడాచార్యుని శయ్య విడవకుండా అహోరాత్రాలు పరిచర్య చేశాడు. అప్పుడప్పుడు స్పృహలేని స్థితిలోనే నాగమూర్తి ఎవరికో చేతులు జోడించి, నమస్కరించి లోలోపల ఏదో గొణుక్కునేవాడు.

వైద్యులది చూచి బాగా సంధించినదనీ, వ్యాధి చెయ్యిదాటిపోతున్నదనీ నిశ్చయించారు. ఆనాటి రాత్రి గడవటం కష్టమని అందరూ అనుకున్నారు.

కాని, అతికష్టంమీద ఆరాత్రి గడిచింది. మరునాడు అరుణోదయము, వైద్యుల మనస్సులలో ఆశోదయము ఒక్కసారిగా జరిగాయి. మల్లన్న ఆచార్యుని కేసి నిశ్చలంగా పరిశీలించాడు. ఆచార్యుడు మెల్లిగా కళ్లు తెరిచాడు. క్రమంగా వైద్యులకు ధైర్యం కలిగింది. మల్లన్న అతని దృష్టికి ఎదురుగా జరిగి కూర్చున్నాడు. నాగమూర్తి అతనివేపు కొంతసేపు చూసి, "మల్లన్నా! వచ్చావురా! నాయనా!" అన్నాడు. మల్లన్న సంతోషంతో మరీ దగ్గరగా జరిగాడు. ఆచార్యుడు ఒక్క నిట్టూర్పు విడిచి "మల్లన్నా! ఇంతకాలానికి ఈ శిల్పవిద్య లోతు తెలుసుకున్నానురా!" అన్నాడు. మల్లన్న ఈమాటకు కూడా సమాధానం చెప్పలేదు. అల్లాగే ఆచార్యుని వైపు చూస్తున్న అతని రెండు కళ్లల్లోను రెండు బాష్పకణాలు నిలిచాయి!



సభాపతయ్యగారి పదములు

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

విద్యానగర వినాశానంతరము ఆంధ్రసామ్రాజ్యలక్ష్మితో బాటు ఆంధ్ర కళాసరస్వతి రాజన్యాంతమై రాజ్యోపప్లవము లేని దక్షిణదేశమునకు వలస పోయినది. మధుర, తంజావూరు, పుదుకోట్టలలో నెలకొనిన తెలుగు నాయకరాజులు తమ యేలుబడి క్రిందికి వచ్చిన పచ్చని సీమలలో విద్యావ్యవహార వినోద ముఖ్యతంత్రముల నిర్వహణమునకై తెలుగు దేశమునుండి కవులను, గాయకులను, గాయనులను, అభినేత్రులను, శిల్పకారులను, వ్రాయసగాండ్రను నింకను రాజ్యాంగమునకు వలసిన యితరోద్యోగులను తమ వెంటఁ గొనిపోయి వారి కచట మాన్యములు, నగ్రహారములు నొసగి స్థిర స్వాస్థ్యములు కల్పించిరి. ముఖ్యముగా తంజావూరున రఘునాథనాయకుఁడు నతని కుమారుఁడు విజయరాఘవనాయకుఁడును వైష్ణవమతావలంబకులై చోళమండలమున దేవాలయ నిర్మాణములు గావించి పరమభాగవతోత్తములయి ప్రసిద్ధి వడయుట మాత్రమే గాక బ్రహ్మానంద సహోదరమయిన రసానందానుభూతికి రమణీయ సోపాన కల్పము లయిన సంగీత సాహిత్యాభినయముల నభిమానించి యాదరించి తమ యాస్థానములఁ గళాక్షేత్రములఁ గావించిరి. కవితాపట్టభద్రులు, సంగీత సరస్వతులు, అభినయ విద్యావిశారదులు నెందఱో రఘునాథాదుల వితరణము విని సత్కారములు వడయుటకై నాఁడు తెలుగుదేశమునుండి తంజాపురమున కరుదెంచిరి. రాజసత్కారములు వడసిన తెలుఁగు కుటుంబము లచటనే నెలకొని రాజాదరమునఁ దమకులవిద్యల నవలంబించుచు వచ్చినవి. తంజావూరునకు సమీపముననున్న శూళమంగళము, మెరట్టూరు, మూవనల్లూరు గ్రామములలో నాఁడు తెలుగు భాగవత కుటుంబములెన్నో నెలకొనినవి. శూళమంగళము 'కథకళి' సంప్రదాయము కూచిపూడి భాగవత సంప్రదాయమునకుఁ జెందినదని చెప్పుదురు.

నాయకరాజులు జరిపిన సంగీతనాట్యవినోదముల ధర్మమా! యని ద్రవిడదేశమున సంగీతకళయు, నృత్యకళయు, విరివిగా వ్యాప్తి చెందినవి. నాయకరాజుల కాలమునను, వారి తరువాత నేలుబడి గావించిన మహారాష్ట్ర రాజుల కాలమునను విరివిగాఁ బ్రదర్శింపఁ బడుచుండిన యక్షగానములు, వీథిభాగవతముల వలన బదకవిత ప్రజలకు సుపరిచితమయినవి. రఘునాథరాయల కాలమున తంజావూరునకు వచ్చియుండి యతని కుమారుఁడు విజయరాఘవ నాయకుని పయి వేలకొలఁదిఁగ బదములు పాడి, చోళమండలమును శృంగార రసప్లావితము గావించిన క్షేత్రయ్య మువ్వగోపాలపదముల కానాఁడు పలుకుబడి హెచ్చినది. ద్రవిడదేశమున నెలకొనిన తెలుఁగు కుటుంబముల వారు మాత్రమే కాక తెలుఁగు నేర్వని ద్రవిడ విద్వాంసులు పలువురు క్షేత్రయ్య పదములను సంప్రదాయ సిద్ధముగాఁ బాడి యభినయించుటకు నుత్సాహము చూపుచుండిరి. యక్షగానములఁ బ్రదర్శించుటయు క్షేత్రయ్య పదములు పాడుచు సంప్రదాయ సిద్ధముగా నభినయించుటయుఁ గొంతకాలము వఱకు సర్వసామాన్యము లయినవి. ఇందుచేఁ బ్రజాసామాన్యములో సంగీతాభిరుచి హెచ్చయి సంగీతమున కఖండ గౌరవము లభించినది. నేఁడు ద్రవిడదేశమున సంప్రదాయసిద్ధ మయిన కర్ణాటక సంగీతమును బాడఁగల వారు పలువురుండుటకు నాయకరాజులు సంగీతము నెడఁ జూపిన యాదరాభిమానములును, వారి కాలమునను, వారి తరువాతి మహారాష్ట్ర రాజుల కాలమునను బ్రదర్శింపఁబడుచుండిన యక్షగానములు, వీథిభాగవతములును, నభినయసహితముగాఁ బాడఁబడుచుండిన క్షేత్రయ్య మువ్వగోపాలపదములును మూలకారణము లని చెప్పక తప్పదు.

తంజావూరునకు సమీపమున నెలకొనిన తెలుఁగు కుటుంబములలో త్యాగయ్య కుటుంబ

మును, సభాపతయ్య కుటుంబమును ప్రసిద్ధములు. త్యాగయ్య రామభక్తుఁడై పరమ భాగవతోత్తముడై కీర్తనలు రచించి కర్ణాటక సంగీతమునకుఁ బ్రవర్తకుఁడు కాగా, సభాపతయ్య రాజగోపాలభక్తుఁడై మన్నారుగుడిలో క్షేత్రయపదములను, సంప్రదాయ సిద్ధముగాఁ బాడి యభినయించుచు దత్సంప్రదాయ ప్రవర్తకుఁడగుట మాత్రమే గాక స్వయముగా తన యిష్టదైవమగు రాజగోపాల నామాంకితములుగా క్షేత్రయ పదములను బోలిన పదములను రచించి పద రచయితగాఁ బదాభినయ ప్రవర్తకుఁడుగాఁ బ్రఖ్యాతి గాంచినాడు.

సభాపతయ్య త్యాగయ్య వలెనే ములక నాటి వైదిక శాఖకు జెందిన బ్రాహ్మణుఁడు. తంజావూరునకు సమీపముననున్న మూవనల్లూ రను బ్రాహ్మణాగ్రహార మితని స్వగ్రామము. పిదప నితఁడు తత్సమీపముననే యున్న ప్రసిద్ధ విష్ణుక్షేత్రమగు మన్నారుగుడి కేతెంచి యందలి రాజగోపాలస్వామిభక్తుఁడై తన్నామాంకితములుగాఁ గొన్ని శృంగారపదములను విరచించినాడు. వీరి స్వగ్రామము మూవనల్లూరగుటచే మూవనల్లూరు సభాపతయ్యయని, మన్నారుగుడిలోఁ జాలకాలము వసించిన వారగుటచే రాజమన్నారుగుడి సభాపతయ్యయని వీరు వ్యవహరింప బడుచుండిరి. భరతశాస్త్రమునందు వీరు మహాప్రవీణులయి యుండినట్లు తెలియుచున్నది. క్షేత్రయపదములను వీరు సంప్రదాయ సిద్ధముగా బాడి యభినయించు వారఁట! పదాభినయమే వీరిని బదరచయితగాఁ గూడఁ జేసి యుండు ననుటలో నాశ్చర్యము లేదు. క్షేత్రయపదములు వీరికి నిత్యానుసంధానమున నుండి శిష్యాధ్యయనములఁ బ్రతిదినమును నలగుచుండుటచేతఁ గాఁబోలు వీరి పదముల యందు క్షేత్రయపదముల ఛాయలు మిక్కిలిగాఁ గానవచ్చుచున్నది. వీరు షుమారు నూరేండ్లకిటీవలననగా క్రీ. శ 1850 సం॥ ప్రాంతమున నుండినట్లు తెలియుచున్నది. వీరిని గూర్చి యితర విశేషము లేవియుఁ దెలియవచ్చుట లేదు. వీరు శృంగార పదములను మాత్రమే గాక 'సీతాస్వయంవరమును' పాటలలో రచించిరి. చాలకాలమునుండి ద్రవిడదేశములో నెలకొని యుండిన తెలుఁగు కుటుంబమునకుఁ జెందిన వారగుటచే వీరి పదముల యందును త్యాగయ్య కీర్తనలందు వలెనే కొన్ని తమిళపదములు దొరలినవి.

వీరిని గూర్చిన యితర విశేషములకై యిటీవల భాగట్టాచేయఁగా పుదుక్కోట వాస్తవ్యులగు వృద్ధులొకరు వీరిని గూర్చి యీక్రింది కథ తెల్పిరి.

" సభాపతయ్యగారు సంగీతాభినయ శాస్త్రములలో మహావిద్వాంసులు. వీరు స్త్రీవేషము వేసి క్షేత్రయపదములను బాడి యభినయించువారు. సహజముగనే సుందర శరీరులయి చక్కని శారీరము గల సభాపతయ్యగారు చీరకట్టి స్త్రీవేషముతో పదము పాడి యభినయింపగా దాని గాంచిన పలువురు తమ యెదుట నిజముగా నొక కాంతయే యభినయించు చున్నదని భ్రమియించువారఁట! ఒకప్పుడు శరభోజీ మహారాజు భరతశాస్త్రాభినయములలో మేటియయిన వారెవరని కోరినను వారి యభీష్టము తీర్చి సత్కరించెద నని పలుకగా ననేకులు స్త్రీలు, పురుషులు తమ యభినయము చూపి రాజసన్మానము నొందగోరిరఁట! అపుడు సభాపతయ్య స్త్రీవేషముతో సభారంగమున నిలిచి స్త్రీవాక్యముగాపదముపాడి నాట్యము సేయఁగా నచటి వారెల్లరు నానాట్యము చేసినది స్త్రీయే యనుకొనిరఁట! అంత సభాపతయ్య తన వేషము నూడ్చి నిలుచుండఁగా రాజుతో సహా నచటి వారెల్లరు నాశ్చర్యము నొందిరి. ఎల్లర నట్లు ఆశ్చర్య పడునట్లు అభినయించిన సభాపతయ్యగారినే భరత శాస్త్రమున గొప్ప ప్రవీణులుగా నిశ్చయించి మహారాజు వారి యభీష్టము తెలిపినఁ దీర్తునని పలికిరి. సభాపతయ్య యేదో కాంతధనమునో, లేక మాన్యమునో కోరుకొనునని మహారాజు తలఁచినాఁడు. కాని పరమ భాగవతోత్తముఁడయిన సభాపతయ్య రాజాంతఃపురమున ననాదిగా వంశ పరంపరాను గతముగాఁ బూజింపఁ బడుచుండిన యొక శ్రీకృష్ణ విగ్రహమును జూపి తాను భక్తితో పూజాది విధులు నిర్వర్తించు కొనుటకై దానిని తనకు ననుగ్రహింప వలసినదిగాఁ బ్రార్థించిరఁట! ఈ ప్రార్థనను విని యా సభలో నున్న వారెల్ల తెల్లబోయిరి! మహారాజును నతడిట్టి కోరిక కోరునని యెఱుఁగని వాఁడగుటచే నిదివిని 'ఈ విగ్రహము నేమిచేసికొందురు? మఱేదైన గోరుకొనుడు. మీకు గోరినంత ధన మొసగెదను. అడుగు' డనగా సభాపతయ్య వినయముతో నమస్కరించి 'మహా

రాజా! ధనము నాకక్కఱలేదు. అది యశాశ్వతము. మీకడనుండి ధనము గొనిపోయినచోఁ దత్కారణమున నాకీ యభినయ విద్యపై నాదరము సన్నగిల్లవచ్చును. శ్రీకృష్ణానుగ్రహమున నా నేర్చిన విద్యను పలువురికి నేర్పి తన్మూలమున జీవనము గడుపుటలోనే నేను పరమానందము ననుభవించుచుందును. మోహవర్ధకములగు నీయైశ్వర్యములు నాకు వలదు. మీరు దయతో మోహనమూర్తి యగు నా శ్రీకృష్ణ విగ్రహము నొసగినచో దానిని నా దేవతార్చనలో నుంచుకొని ప్రతి దినము పూజించుకొనుచుందును. ఈ నాకోరిక న్యాయసమ్మత మగునేని నన్ననుగ్రహింపుడు.' అనెను. మహారాజు సభాపతయ్య కోరికలోని తీవ్రతను గుర్తించి వంశపరంపరానుగతముగాఁ దమ యంతఃపురము నలంకరించుచుండిన యా శ్రీకృష్ణ విగ్రహమును సభాపతయ్యగారికి బహూకరించి సత్కరించెనట! సభాపతయ్య యా శ్రీకృష్ణ విగ్రహమును ప్రతి దినము భక్తితో నారాధించుచుండువాఁడట! వారు పూజించుచుండిన యీ శ్రీకృష్ణవిగ్రహము ఇటీవలి వఱకు వారి యింటనే వారి సోదరుని కుమార్తె యధీనమున నుండి రెండుమూఁడేండ్లకు ముందు ఎనుబది యేండ్ల వయసున నామె పరమపదింపగా నామె యాస్తిపాస్తులతోఁ బాటు ఆ శ్రీకృష్ణవిగ్రహమును కూడ నామె దాయాదులెవరో కొనిపోయిరట!—

'నిధి చాల సుఖమా రాముని సన్నిధి సేవ సుఖమా' యని వితర్కించుకొని రాజసమ్మానము తిరస్కరించిన త్యాగయ్యకు, విద్యకు మెచ్చి విత్త మీయ వచ్చిన మహారాజును నిత్యపూజకై శ్రీకృష్ణవిగ్రహము నభ్యర్థించిన సభాపతయ్యకు— మనస్తత్వములలో భేదములేదు. త్యాగయ్య భక్తిపరవశుఁడై కీర్తనలు పాడి తన్మయత చెందఁగా సభాపతయ్య రసపరవశుఁడయి పదములు పాడి తన్మయత చెందినాఁడు. ఒక విధముగాఁ జూచిన త్యాగయ్య నాదబ్రహ్మోపాసకుఁడు. సభాపతయ్య కళోపాసకుఁడు. బ్రహ్మానందానుభూతిలో త్యాగయ్యకు సంగీతము సాధనము కాఁగా రసానందానుభూతిలో సభాపతయ్యకు నభినయవిద్య యంగ మయినది. భక్తిమార్గమున త్యాగయ్య యానందానుభూతిలక్ష్యసిద్ధికై ప్రయాణింపఁగా, సభాపతయ్య యభినయ కళామార్గము చేపట్టినాఁడు. మార్గములు భిన్నము లయినను నిరువుర లక్ష్యములు నొకటే!

సభాపతయ్య రచించిన పదములలో దీనిని ఆ వృద్ధుఁడే పాడఁగా విని తన్మయతఁ జెందితిని.

రాగము శంకరాభరణము – తాళము మిశ్రము.

పల్లవి

దారి జూచుచున్నది – నీదు ప్రియ
తరళాక్షి యోచిన్నది

అనుపల్లవి

వారిజ ముఖి నీవు – వచ్చువేళనుకొని
కోరికతో రాజ – గోపాల స్వామి నీ ॥దారి॥

చరణములు

వెన్నెల గాయఁగ – వేడ్క మీఱ మంచి
సన్నజాజి విరి – సరులును గంధము
పన్నీరుచెంబులు – పడకింటిలో నుంచి
వన్నెలాడి తల – వాకిట నిలిచి నీ ॥దారి॥
ఏ వగనైనను – ఎందు చప్పుడైన
నీవో యని యెంచి – నిలిచి తిరిగి చూచి
ఈ వగ చిత్తము – నిచట నిలిపినట్టి
భావం బెవరికి – బయలుగానీక నీ ॥దారి॥
పచ్చిపచ్చిగా – పదములు పాడుచు
వచ్చి రాజ – గోపాల స్వామీ నీవు
ముచ్చట లాడుచు – ముద్దులు పెట్టుచు
గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి – కూడుట దలఁచి నీ ॥దారి॥

* * * *

సభాపతయ్య రాజగోపాల నామాంకితములుగా రచించిన శృంగారపదములు ఏబదిమాత్రము క్రీ. శ. ౧౮౭౮ సంవత్సరము మార్చి నెలలో శ్రీ అ- వ- నృసింహాచార్యుల వారి శ్రీవాణీ నిలయ ముద్రాక్షరశాలయందు ముద్రింపఁ బడినవి. ఇందీ పదములకు శ్రీ. సీ. మా తిరుపతి వేంకటాచార్యులవారు సంగ్రహించిన యాంధ్ర వాక్య రూప మయిన నాయికా నాయకాది లక్షణములును, రసమంజరి యుదాహరణ శ్లోకములును నొసగఁబడి యున్నవి. ఈ పదములను బరిష్కరించి ప్రకటించుట లోను, ప్రతిపదమునకు నాయికా, నాయక రసభావాలంకారాది లక్షణములను నిరూపించుటలోను, బరిష్కర్త లెంతగా శ్రమ పడినదియు వారా గ్రంథమునకుఁ దొలుతఁ గావించిన ప్రకటనములవలనఁ దెలియఁ గలదు.

" ఈ పదములు రాజమన్నారు గుడిలో భరత శాస్త్రమునందు మహాప్రవీణు లయి యుండిన సభా

పతయ్య గారిచే గోపాల నామాంకితములు గాను, శృంగార రస ప్రధానములు గాను రచియింపఁ బడినవి.

శ్లో. సపం కాపి కవే ర్వాణీ హరి నామాంకితా యది, సా వాణీ సఫలా జ్ఞేయా నిష్ఫలాన్య సమాశ్రయా.

అనునట్లు ఇవి భగవత్పరములుగ నున్నవి గనుకను,

శ్లో. రసేషు శృంగార రసం ప్రధానం, హరే రధిష్ఠాన మిదం సజానేః.

అనునట్లు భగవత్ప్రీతి కరమయిన శృంగార రసాలంబనము మొదలయిన యనేక విషయములను దెలుపుచున్నవి. గనుకను, పండిత పామర రంజకములయి యుండును. మరియు ధర్మార్థ కామ మోక్షము లనెడు చతుర్విధ పురుషార్థ ప్రదము గాను నుండును. అని తలంచి భావజ్ఞేతరులకు సయితము విశదపడునట్లు ముందు ఉపోద్ఘాతమును, అవల రాగము, తాళము, పదము, నాయకి, నాయకుఁడు, రసము, సంచారీభావము, అలంకారమును ఒకటి వెంబడి నొకటి క్రమముగాను-కడపట రసమంజరీ శ్లోకో దాహరణములను జేర్చి-అతి ప్రయాసమునకు వెనుదీయక వ్రాసి అచ్చువేయించి ప్రచురించితిమి. ఇందు వ్రాయబడి యుండు లక్షణములు భరత రస ప్రకరణము లోని శ్లోకములకు తెనుగు తాత్పర్యము గాని వేరు కాదు-అలంకార లక్షణములను తెలుపునపుడు చంద్రాలోకములోని శ్లోకములను తెలుగు మాటలుగా మార్చి వ్రాసి యున్నాము. ఈ లక్షణములను సంస్కృతము నందు చూడవలె నన్న భరత రస ప్రకరణమును, చంద్రాలోకమును చూడవలయును* క్షేత్రయ గారి పదములు మొదలయిన వానిలో లక్షణోక్తము లయిన కొన్ని పదములను సంగ్రహించి యిందలి లక్షణములతోఁడ కూర్చి ముద్రింప యత్నించి యున్నాము. ”—

* * * *

మచ్చునకు సభాపతయ్య గారి శృంగార పదము లివి చూడుఁడు--

రాగము కాంభోజి - తాళము మిశ్రము

పల్లవి

అన్యాయముగ నే నపహూరు పాలైతి
అతివరో యేమందు నే

అనుపల్లవి

మన్నారు ంజగోపాల సామికి నాకు
కద్దని పలికేరు

చరణములు

ఆ సరసుడు ప్రీతిచేసి పిల్వగను - రోసము చూపితి నే
మానీములో నిది మరియాద కాదని - వేసారి మ్రొక్కి
[తి నే
దోసమెన్నక పలుకు మోసగత్తెల గేలి - చేసే కేమం
[దు నే
ఆస దీర నే ననుభవించక యయ్యయ్యో -
నక్క పల్లమన్న సామెత రీతిని ॥అన్యా॥ ౧
ఆటపాటలకై యాతనితో నేన్ను-మాటలాడి నందుకా
బోటుల కెదుట నీప్రొద్దు వానింటికి - పోయి వచ్చి
[నందుకా
సూటిగాను వాని చూచి నవ్వే యల - వాటుచేసి
[నందుకా
ఏటికే యాగేలి యే పాప మెరుగనే-
తాటిక్రింద పాలు త్రాగిన చందాన ॥అన్యా॥ ౨
ఏకమై గోపాలు డెనయ వచ్చెదనంటే - నీకిది తగ
[దంటి నే
కోక లెత్తిపట్టి కొంటితనము మాప - రాకు పో
[పొమ్మంటి నే
ఈ కారణమే మే యిది తెలియ వట్టి - పోకిళ్లు చేకొం
[టి నే
లోకము మాయను మాకుడు గలదటె-
చాకివాడు వృథా జానకి ననినట్లు ॥అన్యా॥ 3

* * * *

* శ్రీ విస్సా అప్పారావుపంతులు గారు ఇటీవల ఆంధ్ర గాన కళాపరిషత్తువారి తరఫున ప్రకటించిన క్షేత్రయపదములతోఁ జేర్చి ముద్రించిన ‘శృంగార రసమంజరి ’ ని రచించినదియు, క్షేత్రయపదములలోఁ గొన్నిటికి నాయికా, నాయక రసభావాది నిర్ణయము గావించినదియు, నీ పదములకు వివరణాదికములు వ్రాసి ప్రకటించిన శ్రీ. నీ. మా. తిరువేంకటాచార్యుల వారే యని తలఁపఁ దగి యున్నది. వేఱు విధమయిన ప్రామాణికాధారము లభించునంతవఱకు నీ యూహ సరియయినదే యనుటకుఁ బయి ప్రకటనము లోని వాక్యము యొక్క సాక్ష్యము చాలునను కొందును.

రాగము బిలహరి - తాళము మిశ్రము

పల్లవి

ఈ లాగు పాంథుడవు నీవు ఒంటిగాను
ఇప్పుడెచ్చటికి కేగేవు వేగను

అనుపల్లవి

మేలు పయోధరములు చేరి యెదుటను
మేలియగ గోపాల హరి యనుచును

చరణములు

చింత నుండెడి గుడి చాటు జేరక
శ్రమము దీర సుఖమొంద గోరిక
సుంత యీ తరువున జూచి యయిన నిలుపక
ఎంత సుఖము చేయు నీకొమ్మ యనుకోక ||ఈలాగు|| ౧

నీవు కట్టుకోక నిటు జారి యుంచక
నీవేళ భూసుర హితము మాట వినక
త్రోవ నడచుటకు తో డెవ్వరును లేక
ఈ వగ ముందు వెనుక యోచింపక ||ఈలాగు|| ౨

ఎవ్వరిందు రా వెరుగనట్టి తావు
జవ్వని నన్నొక్కతె నిందుగనినావు
అవ్వల నైన నిందు నిలువ లేవు
హరి హరి గోపాల యేల భ్రమసేవు ||ఈలాగు|| 3

* * * *

రాగము పంతువరాళి - తాళము ఆది

పల్లవి

రారా విడిదికి నొకసారి - రార చక్రధారీ

అనుపల్లవి

శ్రీ రాజగోపాల శౌరీ - చిత్తమునను దయయుంచి [మురారీ

చరణములు

అంగజ జనకా నిను దలచినదే
అట్టే దేహము పరవశ మయ్యేనిరా
పొంగి గుబ్బలివో పులకరించేనిరా
భోగి శయన మంచి సమయ మిదిరా ||రారా||

సోముని గేరు నీమోము జూచినదే
సొక్కి బాగ ముద్దిడ కోరేను రా
సామి నీవు మాటాడగా నీ
చక్కెర మోవాన పదరేనురా ||రారా||

ఆకు మడుపు లియ్యగాను నీ చెయి
సోకినంతనే కోక వదలెరా
ఏకాంతమున నిన్నెనయ గోపాల
జోకతోడ నీ లోకమె మరతురా ||రారా||

* * * *

భరత నాట్యాచార్యులై సంప్రదాయ సిద్ధముగా పదములను బాడి యభినయించి పదకవితకుఁ బ్రాణము బోసి ప్రచారమునకుఁ దెచ్చుటతో బాటు భాగవతులను దన సంగీతాభినయములచే రసానందానుభూతికిఁ దార్చుట మాత్రమే గాక, స్వయముగా పదములను రచించి తరువాతి తరముల వారికి గూడ నట్టి రసానందానుభూతి కల్పించి పదరచయితయై ప్రఖ్యాతి గాంచిన సభాపతయ్య తెలుగు వారికి చిరస్మరణీయుఁడు! ఉత్తరాంధ్రమున క్షేత్రయ్య, రాయలసీమలో సారంగపాణి, దక్షిణదేశమున సభాపతయ్య ఆంధ్ర సాహిత్య చరిత్రములోఁ బదకవితా శాఖకుఁ బ్రవర్తకులు.

సభాపతయ్యగారి పదము లన్నియు పూర్వ వివరణాదికముతో పునర్ముద్రణము పడయవలసి యున్నవి. వానికి వ్రాయబడిన వివరణము వంటిది క్షేత్రయ పదములకును, సారంగపాణి పదములకును గూడ నత్యంతావశ్యకమై యున్నది. ఈ పదములనెల్ల సంగీత విద్వాంసుల తోడ్పాటుతోఁ జక్కగాఁ బరిష్కరించి వివరణాదికముతో నొక సంపుటముగా ముద్రించినచో మూడు వందల యేండ్లుగా వర్ధిల్లిన పదకవితా స్వరూపము నొక్క చోటఁ జూడఁనగును. వీనిలోఁ గొన్ని పదముల నేని సంప్రదాయ సిద్ధముగాఁ బాడువారి తోడ్పాటుతో స్వరపఱచి ప్రకటించినచో సంగీత విద్వాంసులు, వాని బాడుటకును, పదకవిత బహుళ ప్రచారము పడయుటకును నత్యంతోపయుక్తము కాఁగలదు.

జయదేవుడు - పీయూషలహరి

శ్రీ వావిలాల సోమయాజులు

ఆంధ్రులకు అష్టపదు లంటే అపరిమితమైన అభిమానం. బహుకాలం నుంచీ సంగీత విద్వాంసులు గాన విద్యాప్రావీణ్యానికి గీతగోవింద గాన సామర్థ్యాన్ని ఒక ఒరపిడి రాయిగా నిర్ణయించి ఉంచటం గమనింపదగ్గ విషయం.

అష్టపదులకు ఏ తత్కృతికర్త ఉంచిన నామం గీతగోవిందం. గోవిందునిగురించిన గీతాలుగల ప్రబంధం కాబట్టి దానికీ పేరు ఉచితమని భావించి ఉండవచ్చును. అష్టపదు లంటే అంత అదరాభిమానాలను ప్రకటిస్తున్నా ఆంధ్రులు తద్రచయిత జయదేవుని గురించి విశేషంగా తెలుసుకున్నట్లు కనిపించదు.

మహాకవి జయదేవుడు అద్వితీయ మహాభక్తుడుగా పరిగణితు డైనాడు. భక్త చరిత్రలవల్ల ఆయన జీవిత విశేషాలు కొన్ని తెలుస్తున్నవి. క్రీ. శ ౧౫ వ శతాబ్దంలో చంద్రదత్తుడు కూర్చిన భక్తమాలలో జయదేవుని జీవితం కొన్ని సర్గలలో [౩౯-౪౭] వర్ణితమైంది. ఆయనను గురించిన కొన్ని జనశ్రుతులుకూడా దేశంలో ప్రచారంలో ఉన్నవి.

జయదేవుని బాల్యదశను గురించిన విశేషాలేమీ తెలియటంలేదు. విద్యార్థిదశలో గురువుల యొద్ద పక్షం మార్చి మరొక పక్షం విద్యాభ్యాసం[1] చేయటంవల్ల జయదేవుడికి పక్షధరమిశ్రుడనే పేరు వచ్చిందని కొందరంటారు. కాని యీ బిరుదం గీతగోవిందకారునిది కాదనీ, ప్రసన్న రాఘవకర్త అయిన మరొక జయదేవుడిదని తెలుస్తున్నది. గీతగోవిందంలో జయదేవుడు "పద్మావతీ చరణచారణ చక్రవర్తి' నని చెప్పుకున్నాడు. పద్మావతీదేవి ఆయనభార్య అనీ, దేవదాసి అనీ భిన్నాభిప్రాయా లున్నవి. ఇందులో ప్రథమాభిప్రాయాన్నే పండితలోకం అంగీకరించింది. బహుకాలం సంతానం లేక ఒక బ్రాహ్మణుడు జగన్నాథస్వామి నారాధించి ఒక పుత్రికారత్నాన్ని పొంది ఆమెకు పద్మావతి అని నామకరణం చేసి మహావిష్ణువుకు తప్ప నన్యుల కామె నీయనని నిశ్చయం చేసుకున్నాడట. ఆమెకు యుక్తవయసు వచ్చిన తరువాత పుత్రికను వెంటతీసుకుని ఆమెను దేవదాసిగా స్వామిపేర విడిచిపెట్టటానికి పురుషోత్తమ క్షేత్రానికి వెడుతుండగా జగన్నాథస్వామి సాక్షాత్కరించి 'ఓ భక్తశ్రేష్ఠుడా! నా కర్పింపదలచిన యీకన్యకను నా అంతరంగ భక్తుడైన జయదేవుడి కర్పించు. అదే నా కమితానంద మని పలికినాడట!" అప్పుడు పరివ్రాజక శ్రేష్ఠుడుగా ఉన్న జయదేవుడామెను స్వీకరింప నిరాకరింపగా తండ్రి 'ఇది భగవదాజ్ఞ' యని పుత్రిక నట నుంచి పోగా జయదేవుడామె శుశ్రూషను స్వీకరించి క్రమముగ స్నేహభావము పెంపొందిన పిమ్మట వివాహ మాడినటుల భక్తిమాలవల్ల తెలుస్తున్నది.

జయదేవుడు ఉపాస్యదేవత అయిన నారాయణమూర్తి కైంకర్యంకోసం ధనార్జన చేయటానికి[2] బృందావనం, జయపురం మొదలయిన ప్రదేశాలకు వెళ్లి తిరిగి వస్తుండగా దారిలో చోరులు ఆయన ధనాన్ని అపహరించి కాళ్లూచేతులు విరుగగొట్టి పోయినారట! ఒక ప్రభువు వేటకు వచ్చి ఆయన దుర్దశను జూచి రాజధానికి తీసుకొనిపోయి చికిత్స చేయించి

1 ప్రతిభ జనవరి ౧౯౩౮—'జయదేవుడు'—రాయప్రోలు సుబ్రహ్మణ్యము పే. ౨౦౯

2. "శిష్యుని పైగల వాత్సల్యంతో అతని దేశానికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడా శ్రేష్ఠిశిఖామణి స్వామికి తెలియకుండా పల్లకీలో దాచిఉంచిన ధనాన్ని బోయీలే అపహరించి జయదేవుని కాలుచేతులు విరుగగొట్టి యరణ్య మధ్యమున విడిచి పారిపోయినట్లు మరియొక కథ—గీతగోవిందము—పీఠిక ఎ. వి. నరసింహ పంతులు పే. ౧౨. (M. Adhi & Co—Madras-Publication 1911)

స్వాప్థ్యం చేకూర్చిన తరువాత పద్మావతితో ఆకవి అక్కడనే కాపురంచేస్తూ ఉన్నాడు. యతివేషాలు వేసుకొని వెనుకటి చోరులు ఆ రాజధానికి వచ్చినా తెలుసుకొనికూడా వారికి జయదేవుడు శిక్షచెప్పింప లేదట!

జయదేవస్వామిగా వేదవ్యాసులే నిజాంశతో తిందుబిల్వ గ్రామమున జనించినారని యొక ప్రతీతి యున్నది. జయదేవుడు పదునెనిమిది కోసుల దూరంలో ఉన్న గంగానదికి నిత్యమూ స్నానానికి వెళ్లి వచ్చేవాడట. గంగాదేవి ఆయన కష్టాన్ని జూచి ఓర్వలేక ప్రసన్నురాలై ఒకమాట "నీవు నిత్యమూ నా దగ్గరకు రాలేవు. నేనే నీ దగ్గరకు వస్తాను" అను కెందులి ప్రాంతానికి వెళ్లిందని మరొక కింవదంతి. తన కపకార మొనర్చిన చోరులు సాధువేషముల ధరించి తిరుగుచుండగా రాజభటులు వారిని పట్టుకొని నపుడు జయదేవస్వామివారికి రాజుసన్నిధిని, సన్మానమును కల్పించి పంపుచుండగా వారిని మార్గమధ్యమున పృథ్వి తనగర్భమున జేర్చుకొన, రాజభటులు వచ్చి విన్నవించినారట! అపుడు జయదేయస్వామి యా ప్రాంతమున కేగి గరుడవాహనుని ప్రార్థింప నాతడు ప్రత్యక్షమై ద్రోహులి మరల పుడమినుండి రప్పించి పంపినట్లు మరియొక కథనము వినిపించుచున్నది.

పద్మావతీదేవి పాతివ్రత్యమును బరీక్షింప నొకమారు సాత్యకిరాజు స్వామి ఇంటలేని సమయమునందు విచ్చేసి 'మీ భర్త దుర్జనులచే హతమైనా'డని ఒక యలీకవార్త వినిపింప నామె యాత్మహత్య చేసుకొనగా జయదేవస్వామి తిరిగివచ్చి కృష్ణసంకీర్తన మొనర్పగా నామె 'సుప్తిబోధిత' వలె మేల్కొనినట్లు మరియొక జనశ్రుతి వినవచ్చుచున్నది.

ఇట్టివి అభూత కల్పన లని త్రోసివేసినను స్వామి అసామాన్య శక్తిసంపన్నుడని అంగీకరించుట కెట్టి విప్రతిపత్తియును లేదు.

౨

జయదేవ మహాకవి జన్మదేశాన్ని గురించి పండిత లోకంలో భిన్నాభిప్రాయా లున్నవి. పండిత పరంపరలో అతడు ఉత్కల దేశస్థుడని ఒక అభిప్రాయం ఉంది. ఆయన వంగదేశంలో జన్మించాడని కొందరు విద్వాంసులు నిర్ణయించారు. జయదేవ కవి తన జన్మస్థలాన్ని గురించి ఏడవ అష్టపది ముద్రికలో "తిందుబిల్వ సముద్ర సంభవ రోహిణీ రమణేన" అని సూచించినాడు. కలకత్తా సర్వకళాశాలలో ఓఢ్ర పండితులు, శ్రీ వినాయక మిశ్రో మహాశయులు ఒకమారు శ్రీ శివశంకరులకు ఒక లేఖ వ్రాస్తూ3 జయదేవ కవి జన్మస్థానాన్ని గురించి ఇలా వ్రాసినట్లు తెలుస్తున్నది.

"జయదేవుడు ఉత్కలదేశంలోనే పుట్టినట్లు నిస్సందేహంగా చెప్పటానికి తగినంత ఆధారం లేదన వలసి వస్తుంది. అయితే ప్రతాపరుద్ర మహారాజు పదహారో శతాబ్దిలో రాజ్యంచేశాడు. ఆయన జగన్నాథ దేవాలయంలో దేవదాసీలు గీతగోవిందం తప్ప మరేదీ పాడకూడ దన్నట్లు ఒక శాసనంలో కనపడుతోంది. మహారాష్ట్రదేశంలో ఒకానొక వైష్ణవశాఖ వారి సంప్రదాయంలో జయదేవుడు ఉత్కలదేశంలో జన్మించాడనే ఉంది. ఇప్పటికీ ప్రతిసంవత్సరమూ జయదేవ గౌరవార్థం వేదువి గ్రామంలో 'మేలా' జరుగుచున్నది. కాబట్టి వంగదేశ విద్వాంసులు ఆ గ్రామమే కెందుబిల్వ మని అంటున్నారు."

ఈ లేఖనుబట్టి జయదేవుని జన్మస్థాన మిదమిత్థమని నిర్ధారితం కాలేదు. కానీ ఉత్కలదేశ గ్రంథకర్తలు జయదేవుడు 'తమవాడని' ఉద్ఘోషించినారు. గీతగోవింద ప్రతుల్లోనే కెంగుబిల్వానికి, తిందుబిల్వమూ, బిందుబిల్వమూ అనే రూపాంతరాలు కనిపిస్తున్నవి.

కొందరు జయదేవుని కెందుబిల్వమును వంగదేశంలోని వీరభూమి జిల్లాలోని కెందులి గ్రామమని భ్రాంతి పడినారు. అది అజయనదికి ఉత్తరతీరాన ఉన్నది. అజయ భాగల్పూరు జిల్లా దక్షిణాంశములో పుట్టి సంటాల్ పరగణా దక్షిణాంశములో ప్రవహించి తరువాత వీరభూమి, వర్ధమాన జిల్లాల మధ్యగా, తూర్పుగా వెళ్లి కాటోజార్ దగ్గర భాగీరథిలో పడుతుంది. కెందులికి కెందుభిల్వమని పాఠాంతరం. వీరభూమిజిల్లాకు ప్రధాన పట్టణమైన సురికి ఇది రమారమి తొమ్మిది క్రోసులదూరంలో ఉంటుంది.

౩. ప్రతిభలో 'జయదేవుడు' (సం ౨ సంచిక 3) అన్న వ్యాసంలో ప్రకటితము.

ఈ గ్రామంలో రాధాదామోదర విగ్రహాలు ఉన్నవి. అందువల్ల ఇది జయదేవుని జన్మగ్రామమై ఉంటుందన్న అభిప్రాయంతో తరువాత చారిత్రిక పరిశోధన జరిపినవారు ఏకీభవించటం లేదు.

వీరి అభిప్రాయంలో కెందులి ప్రాంతము పూరీ జిల్లాలోని రెహంగ్ వద్ద ఉన్న కెందులి సాసనము, కెందులి పట్నము, కెందులి దోళి మూడు గ్రామములలో కలసిన దేశము. ఇవి ప్రాచీనది ఒడ్డున ఉన్నవి. ఈ నది ఒరిస్సా దేశీయుల దృష్టిలో పరమ పవిత్రమైంది. ఈ నదిని ప్రాచీనమాహాత్మ్యమూ, పద్మ పురాణమూ సరస్వతీనది అని వ్యవహరించినవి. 'సాక్షాత్సరస్వతీ ప్రాచీ నాన్యథా నృపసత్తమా, క్రోశే, క్రోశేచ లింగాని తటే తస్యా మనోరమే' అనే కపిల సంహితలోని శ్లోకం ఇందుకు ప్రమాణము. కెందులి గ్రామసీమనుండి రెండు మైళ్ల దూరంలో కుశభద్రానది రెండు పాయలతో ప్రాచీనదిని కలిసే చోటును జనం త్రివేణీసంగమ మని వ్యవహరిస్తారు. కెందులి గ్రామంలో వాసుదేవ విగ్రహాలు నారాయణ నామంతో అనేకం కనిపిస్తున్నవి. ప్రాచీనది ఒడ్డున నిలిచి ఒకమారు సింహావలోకనం చేసేవారికి చైతన్య స్వామి కాలంలో పంచ మహాపురుషుల్లో ఒకడని ప్రసిద్ధిపొందిన అచ్యుతానందుడు సూన్యసంహితలో కెందులిని వర్ణించిన అతిశయ మంతా గోచరిస్తుంది. అందువల్ల జయదేవుని జన్మగ్రామం ఒరిస్సాలోని ప్రాచీనది ఒడ్డున ఉన్న కెందులి అని అనటం సమంజసం అని చరిత్రజ్ఞులు నిర్ణయించినారు4.

కెందులి వీరభూమి జిల్లాలోని అజయ నది ఒడ్డున ఉన్నదని కొందరు భ్రమపడి వ్రాయటానికి కారణాలు ఈరెండు క్రింది శ్లోకాలు.

"గోవర్ధనశ్చ శరణో జయదేవ ఉమాపతిః
కవిరాజశ్చ రత్నాని సమితౌ లక్ష్మణశ్చచ"
(వీరభూమి వివరణము)

"వాచః పల్లవయ త్యుమాపతిధరః సందర్భ శుద్ధింగిరామ్
జానీతే జయదేవ ఏవ, శరణశ్లాఘ్యోదురూహద్రుతేః
శృఙ్గారోత్తర సత్ప్రమేయ రచనై రాచార్య గోవర్ధన
స్పర్ధీకోపి నవిశ్రుత శ్రుతిధరో ధోయీ కవి క్ష్మాపతిః"
(గీతగోవిందం సర్గ ౧. శ్లో. ౪)

ఇందలి మొదటి శ్లోకమును నవద్వీపములోని సభామంటప భిత్తికమీద ఉండగా శ్రీ పాదసనాతన గోస్వామి చూచినట్లు వంగదేశంలో ఒక ప్రథ ఉన్నది 5 కానీ సనాతన గోస్వామి ఈ విషయాన్ని గురించి ఆయన గ్రంథాలల్లో ఎక్కడా పేర్కొన లేదు. అందువల్ల ఈశ్లోకాన్ని ఎవరో జయదేవుని వంగవాసిని చేయటానికి కల్పించిఉంటారు. "వాచః పల్లవ యత్యుమాపతిధర" ఇత్యాది శ్లోకాన్ని జయదేవ మహాకవి వ్రాసిఉంటాడని అనటానికి వీలులేదు. అది ఎవరివల్లనో గీతగోవిందంలో ప్రవేశించి ఉంటుంది. గీతగోవిందప్రబంధానికి ప్రప్రథమంలో వ్యాఖ్యానం వ్రాసిన కుంభరాణా పలికిన "ఇదానీం కవిః కవి గణనాయాం పరైరపి కవిశ్రేష్ఠ గణనీయోహం పరిగణిత ఇతి స్వప్రశంసార్థం క్షేపకమపి తత్కృతం శ్లోకం స్వగ్రంథస్యకుర్వన్నాహ" అన్నవాక్యం నేటి చరిత్రజ్ఞులపైఊహకు ఉపోద్బలకంగా కనిపిస్తున్నది. కుంభరాణా అభిప్రాయం కూడా దీన్ని ఎవరో గీతగోవిందంలో ప్రవేశపెట్టి ఉంటారనే.

కాబట్టి వంగదేశం జయదేవుని జన్మస్థానమని చెప్పటానికి ఎవ్విధమైన ఆధారమూ కనిపించడంలేదు. అతడు ఉత్కల దేశస్థుడనటమే సమంజసము. దీనికి అనుగుణంగా ప్రాచీనులు వ్రాసిన గ్రంథాలల్లో ప్రబలాధారాలు కనిపిస్తున్నవి. సంస్కృత భాషలో భక్తమాల గ్రంథాన్ని చెప్పిన చక్రదత్తుడు జయదేవుణ్ణి గురించి వ్రాస్తూ ఆయన వ్యాసభగవానుని అవతారమనీ, జగన్నాథనిలయమైన పూరీకి దగ్గరగా ఉన్న తిందు బిల్వ మతని జన్మగ్రామమనీ చెప్పినాడు. ఇదే అభిప్రాయాన్ని గ్వాలియర్ నవజీ, మహారాష్ట్రదేశీయుడైన మహాభక్తివిజయకర్త మహీపతీ పలికినారు. అస్సాంలోనూ, మహారాష్ట్రంలోనూ జయదేవుడు

4. Journal of the Kalinga Historical Research Society, March 1947.

(a) *Introduction To Kavi Jayadeva And In Gita Govinda*— *H. K. Mukarji*

(b) వీరభూమి వివరణము పే. ౧౯౬



2000 ఏళ్లకు ముందు.
మైసూరు
శాండల్ సబ్బు
"పరిశుద్ధతకు ప్రసిద్ధమైనది చందనమే"
మైసూరు గవర్నమెంటువారి ప్రాడక్టు

ఉత్కల దేశీయుడేనన్న ప్రతీతి. గదుని సాంప్రదాయ కులదీపికలో జయదేవుడు ఉత్కల దేశీయుడని వ్యవహృతము కావటమూ జయదేవుని జన్మదేశం ఉత్కలమునే నిరూపిస్తూ ఉన్నవి.

జయదేవుడు రాఢ దేశస్థుడని శ్రీసునీత కుమార చటర్జీ మతము.

3

జయదేవ మహాకవి కాలనిర్ణయమును గురించి కూడా భిన్నాభిప్రాయా లున్నవి. మేవాడ ప్రభువు కుంభరాణా గీతగోవిందానికి ప్రథమంలో వ్యాఖ్యానం వ్రాసినాడు. ఆయన క్రీ. శ ౧౪౧౯ వ సంవత్సరంలో సింహాసనాన్ని అధిష్ఠించాడు. అందువల్ల జయదేవ కవికూడా ఆప్రాంతం వాడై ఉండవచ్చునని ఒక అభిప్రాయం ఉన్నది. కొందరు జయదేవుడు రామానందుని శిష్యుడని ఉన్న ఒక ప్రవాదాన్ని ఆధారం చేసుకుని కొందరు ఆయన క్రీ. శ ౧౪ వ శతాబ్దంలో జీవించి ఉన్నాడు గనుక ఇతడు కూడా క్రీ. శ ౧౪వ శతాబ్దివాడని నారు. 'హృది బిసలతాహారో' అన్న జయదేవ శ్లోకాన్ని విద్యాపతి సంపూర్ణంగా ఒక గీతికలో అనుకరించటంవల్ల అంగుడు కొంచెం పూర్వుడై ఉంటాడని కొందరి అభిప్రాయం. వంగ వాఙ్మయ చరిత్రకారుడు విద్యాపతి క్రీ. శ ౧౩౮౦ ప్రాంతమువాడని నిశ్చయించినారు. పృథ్వీరాజు ఆస్థానకవి చాంద్ బర్దాయీ తన పృథ్వీరాజ రాసో గ్రంథంలో 'జయదేవ అఠంకవీ కబ్బిరాయం, జిన్హై కేవల్ కిత్తగోవిందగాయం' అని చెప్పినాడు. క్రీ. శ ౧౧౯౩ వ సంవత్సరాన టిరైన్ యుద్ధంలో పృథ్వీరాజు ఘోరీతో పోరాడి మృతినొందినాడు. కాబట్టి చాంద్ భట్టుకు జయదేవుడు పూర్వుడై ఉండాలి. జయదేవ లక్ష్మణసేనులు సమకాలికులన్న నిశ్చయంతో రాజేంద్రలాల్ మైత్రా జయదేవుడు క్రీ. శ ౧౧౦౧-౧౧౨౧ మధ్య కాలములోని వాడనీ, రామకృష్ణ ముఖర్జీ అతడు క్రీ. శ ౧౨౦౫ ప్రాంతంవాడని నిర్ణయించినారు. జయదేవ కవి కాలనిర్ణయమును శ్రీ కరుణాకర కార్ మహాశయులు మరియొక నూతన మార్గము ననుసరించి యొనర్చినారు. వారి మార్గము నూతనము. ప్రమాణములును నూతనములు. జయదేవ కవికిని లక్ష్మణసేనునికి ఎట్టి సంబంధమును వారి నిర్ణయమున పొడకట్టదు.

క్రీ. శ. ౧౬ వ శతాబ్దంలో ఉన్న కేశవ మిశ్రుడు అతని అలంకార శేఖరంలో

"ప్రాక్ ప్రత్యక్ పృథివీభృతోః
పరిషది ప్రఖ్యాత సంఖ్యావతాం
మహానీయాద్భుత తర్క కర్కశతయా
విచ్ఛిద్య విద్యామదమ్
యే కేఽప్యుత్కల భూపతే తవ
సభా సంభావితాః పండితాః
పత్రం శ్రీజయదేవ పండిత
కవి స్తన్మూర్ధ్ని విన్యస్యతి"

అని చెప్పినాడు. మహారాష్ట్రభాషలో ఉన్న కవిచరిత్రలో శా. శ ౧౪ వ శతాబ్దానికి పూర్వము పురుషోత్తమదేవుడు కళింగదేశాన్ని కటకం రాజధానిగా పాలించి ప్రజా హితాన్ని కోరి త్రికాండ శేషహారావళి, ఏకాక్షర కోశమూ వ్రాసినట్లు ఉన్నది. జగన్నాథస్వామి ఆలయంలోని తాళపత్ర లేఖనాలు (మద్లపంజి) కామార్ణవుడు అనే (క్రీ. శ. ౧౧౪౨-౧౧౫౬) ఉత్కలరాజు నిత్యమూ గీతగోవిందాన్ని వినకుండా భోజనం చేసేవాడు కాదని ఉంది. ఈ కామార్ణవుడు జయదేవుని శిష్యుడూ, సమకాలికుడూ. జయదేవుని గీతగోవిందాన్ని నిత్యమూ జగన్నాథాలయంలో చదవటానికి ఆజ్ఞాపించినవాడు. క్రీ. శ. ౧౧౪౦ - ౧౧౯౦ మధ్యన రాజ్యపాలనం చేసిన రెండవ రాజరాజుకు పురుషోత్తమదేవుడనే నామం ఉన్నట్లు పై లేఖనాలవల్ల తెలుస్తున్నది. అభినవ గీతగోవింద రచనచేసి ఈరాజు జయదేవ గీతగోవిందానికి బదులుగా తన కావ్యాన్ని జగన్నాథస్వామికి వినిపించవలెనని ఆజ్ఞాపించినాడనీ, అందువల్ల ఆనాటి ఉత్కల వైష్ణవలోకం పట్టుపట్టటంవల్ల తిరిగి రాజు జగన్నాథస్వామి కోరిక కారణంగా సంధికి వచ్చి మరల గీతగోవింద పఠనాన్నే ఆదేశించి, గీతగోవిందంలో ప్రతిసర్గాంతములలోనూ తన అభినవగీతగోవిందంలోని

శ్లోకం ఒకటిఉండేటట్లు చేసుకున్నాడనీ6 రామదాసు దార్ఢ్యభక్తిరసామృతము వల్ల వ్యక్తమౌతున్నది. ఈ పరిస్థితుల నన్నిటినీ సమన్వయించి శ్రీ కరుణాకర కౌర్ మహాశయులు మహాకవి జయదేవుడు క్రీ. శ. ౧౨వ శతాబ్ది వాడని నిశ్చయించినారు.

౪

జయదేవ మహాకవి ఇతర రచనలను గురించి శ్రీ రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దరువారి ఆంధ్రాష్టపది పీఠికలో ఇలా ఉన్నది. "ఈ కవియొక్క చంద్రాలోకము, రతిమంజరి, కారకవాదము, తత్వచింతామణి అను నితరగ్రంథములు వీరి అసమాన పాండిత్యమును తెల్పును. శృంగార మాధవీయ చంపు, కృష్ణదాసబిరుద నామముతో రచించిన వారికవియే కావచ్చును" ఇందులో ఉట్టంకితమైన విషయాలను చరిత్రజ్ఞు లంగీకరించటం లేదు. "చంద్రాలోకంలో సమాప్తివాక్యం ఇలా కనిపిస్తున్నది". ఇతి శ్రీపీయూష వర్ష పండిత శ్రీ జయదేవ విరచితే చంద్రాలోకాలంకారే అభిదా స్వరూపాభిధానో నామ దశమో మయూఖః" ఇతడు వంగదేశవాసి. సుమిత్రా మహాదేవుల తనయుడు. ప్రసన్న రాఘవ కర్త. చంద్రాలోక కర్త 'మహాదేవ తనయు'డనటానికి.

"పీయూష వర్ష ప్రభవం,
చంద్రాలోక మనోహరమ్
సుధా నిధాన మాసాద్య,
శ్రయధ్వం విబుధా ముదమ్.
జయంతి గాయక
శ్రీ మాన్మహాదేవాంగ జన్మనః
సూక్తం పీయూష వర్షస్య
జయదేవ కవేర్గిరః"—

అన్న వాక్యాలలో ప్రమాణం లభిస్తున్నది. జయదేవ మహాకవి భోజదేవ పుత్రుడు.

గీతగోవిందం జయదేవ మహాకవి రచన లన్నిటిలో ఉత్తమోత్తమమైనది. కవి దీనిని ప్రబంధమని వ్యవహరించాడు. ఆద్యంతాలు పరిశీలిస్తే గీతగోవిందంలో ఏక వాక్యత గోచరిస్తుంది. ఆలంకారిక లక్షణాలను అనుసరించి మహాకావ్యమని అనిపించుకోకపోవచ్చును. అయినా ఇది రసవత్తర మహాకావ్యమని అనటానికి ఎటువంటి సందేహమూ లేదు'

"యద్గాంధర్వ కళాసు కౌశల
మనుధ్యాయంచ యద్వైష్ణవం
యచ్ఛృంగార వివేక తత్వ రచనా
కావ్యేషు లీలాయితమ్
తత్సర్వం జయదేవ పండిత కవేః
కృష్ణైకతానాత్మనః
సానందాః పరిశోధయంతు సుధియః
శ్రీ గీతగోవిందతః"

అన్న వాక్యాలల్లో కవి రాధాకృష్ణుల అన్యోన్య ప్రేమను గానం చేసి అందలి పరమ శృంగార భావంలో విలీనులై కేవలులు కావలసిందని రసికలోకాన్ని హెచ్చరించినాడు. నవ విధభక్తి మార్గాల్లో— (౧) పితాపుత్ర (౨) రక్ష్య రక్షక (౩) ఆధారాధేయ (౪) శరీరాత్మ (౫) జ్ఞాతృజ్ఞేయ (౬) భోక్తృ భోగ్య (౭) స్వస్వామి (౮) భార్యాభర్తృ (౯) శేషశేషి— అష్టమమైన భార్యాభర్తృ భక్తిమార్గం గీతగోవిందంలో నిరూపిత మౌటంవల్ల దీనికి అష్టపది అనే నామం అబ్బి ఉంటుందా?

నేడు గీతగోవిందం జగద్విఖ్యాతి పొందిన మహాగ్రంథం. ఇది బహుకాలం క్రిందనే పాశ్చాత్య దృష్టి నాకర్షించింది. దీనిని సర్ విలియంజోన్సు, ఎడ్విన్ ఆర్నాల్డు మహాశయులు ఆంగ్లభాషలోనికీ, లాసన్ లాటిన్ భాషలోనికీ, రూకెట్ జర్మన్

---

6 మహీపతి భక్త విజయంలో సాత్వికి పరంగా కల్పించిన కథకు ఆధారం లేకపోలేదన్నమాట. గీతగోవిందాన్ని తీసి భక్తులను తన గోవిందకావ్యాన్ని చదవమని నిర్బంధించిన పురుషోత్తమదేవుని వల్లనే అటువంటి అంశం భక్తవిజయంలో ప్రవేశించి ఉంటుంది. అభినవ గీతగోవింద శ్లోకం ఒకటి గీతగోవిందంలో ప్రతి సర్గాంతంలోనూ చేర్చి చదివినారనటం కూడా అభూత కల్పన ఐఉండదు. నిర్ణయ సాగర ముద్రణాక్షర శాలవారి గీతగోవింద కావ్యం చివరన కనిపిస్తున్న "ఇత్థం కేలితతో విహృత్య యమునా కూలేసమం రాధయా, తద్రోమావళి మౌక్తికావళియుగే వేణీభ్రమం బిభ్రతి, తత్రాహ్లాది కుచ ప్రత్యాగ ఫలయో లిప్సావతోర్ హస్తయో— ర్వ్యత్యాసాః పురుషోత్తమస్య దదతుస్ఫీతాం ముదం సంపదమ్" అన్న శ్లోకం అందువల్లనే ప్రవేశించి ఉంటుందని పండితాభిప్రాయం.

భాషలోనికి అనువదించారు. ఉత్కలరాజు గీతగోవిందాన్ని అనుకరించి అభినవ గీతగోవిందాన్ని రచించినాడు. 7 'సంస్కృత భాషలో గీతగోవింద ప్రభావంవల్ల అనేక 'హర-గౌరులు' 'రామ-సీత'లు జన్మించినవి. అటువంటి వానిలో క్రీ. శ ౧౫. ౧౬ శతాబ్దులనాటి రాయ రామానందుని జగన్నాథ వల్లభ నాటకము, కృష్ణలీలామృతము, (కర్త-వనమాలి, అముద్రితము-౧౫ వ శతాబ్దము). క్రీ. శ ౧౭ వ శతాబ్ది నాటి యతీంద్ర రఘునాథసూరి ముకుంద విలాసము (అముద్రితము) ముఖ్యమైనవి. ఒరియాభాషలో పిండిక శ్రీచందనుని (క్రీ.శ ౧౭ వ శతాబ్దము) వసంత రసము, దిన కృష్ణదాసు (క్రీ. శ ౧౭ వ శతాబ్దము) అమృత సాగరబోలి, దేవ దుర్లభదాసు (క్రీ.శ ౧౬వ శతాబ్దము) రహస్యమంజరి మొదలైనవి అష్టపది ప్రభావం వల్ల జన్మించిన గ్రంథాలు. గీతగోవిందానికి లభించిన అనన్య సాధారణఖ్యాతి కారణంగా ఒరియాభాషలో దానికి అనేక పద్యకృతులు ప్రభవించినవి. ఈపద్యానువాదాలల్లో ప్రముఖమైనవి- ౧. రసవారిధి- బృందావనదాసు (క్రీ. శ ౧౫ వ శతాబ్దము) ౨. గీతగోవిందము—ఉద్ధవదాసు(క్రీ. శ ౧౬ వ శతాబ్దము-కమ్మరి) (3) త్రిలోచనదాసు—గీతగోవిందము (క్రీ. శ ౧౭ వ శతాబ్దము- అంబష్ఠుడు) (౪, ౫) సదానంద కవి సూర్య, ధనుర్ధర దాసుల గీతగోవిందములు(౧౭ వ శతాబ్దము). స్వల్పమైన సంస్కృత వ్యాఖ్యానంతో గద్యానువదితమైన గీతగోవింద ప్రతి ఒకటి కనిపిస్తున్నది. 8

గీతగోవిందం కావ్య బాహ్య స్వరూపాన్ని తిలకించి కొందరు అందులో నిరూపితమైన భక్తి మార్గాన్ని అవగతం చేసుకోలేక కేవలము శృంగార సంబంధమైన అసత్కావ్యంగా పరిగణిస్తున్నారు. అది పొరబాటు. ఒరియా దేశంలో భాగవత సమాజాలు, గీతగోవింద ప్రతిలేనిదే సంకీర్తనలు. ప్రారంభించవు, కృష్ణాష్టమినాడు కళింగంలోనూ, కార్తీక శు- ౧౧ నాడు పశ్చిమభారతంలో వల్లభ శిష్యులూ, గీతగోవిందాన్ని భక్తి తన్మయత్వంతో గానం చేస్తారు. జైనరాజు శ్రీ హర్షుడు కూడా 'క్రమసరోవర భ్రమణ సమయంలో గీతగోవిందాన్ని పాడించడం దాని ఆధిక్యానికి మరొక నిదర్శనం. విక్రమసేన మహారాజు సభలో సంగీత విద్వాంసులు గీతగోవిందాన్ని గానం చేసినట్టు చరిత్రలు చెప్తున్నవి.

గీతగోవిందం మొదట పశ్చిమా పభ్రంశభాషలో గానీ, ప్రాచీన వంగభాషలోగానీ పుట్టి సంస్కృత భాషలోనికి అనువదితమై ఉంటవని కొందరు విద్వాంసులు సంశయించినారు. 9 దీనికి ముఖ్యమైన కారణం అష్టపదులను బోలిన అవపుట్టములను మాత్రాఛందస్సులు ప్రాకృతపింగళములో కనుపించటము.

అష్టపదిలోని కలితను గురించి జయదేవ కవిచెప్పకొనిన,

'యది హరిస్మరణే సరసమ్మనో
యది విలాస కలాసు కుతూహలమ్
మధుర కోమల కాన్త పదావలీమ్
శృణు తదా జయదేవ సరస్వతీమ్'

అన్న వాక్యములు ఎంతో సమంజసమైనవి. భాగవతానికి ద్వాదశ స్కంధాలు వలెనే దీనికి ద్వాదశ సర్గములు. సర్గనామములు సాభిప్రాయములు-సామోద దామోదరము, క్లేశ కేశవము, ముగ్ధ మధుసూదనము ఇత్యాదులు. రసము శృంగారము. పది సర్గలవరకును విప్రలంభ శృంగారము, ఏకాదశ ద్వాదశ సర్గలలోని శృంగారము, సంభోగము. నాయకుడు గోవిందుడు. నాయిక రాధ.

జయదేవ కవి రాధ ఇంద్రాణి యైనట్లు జయదేవ స్వామి చరిత్రలో ఇలా ఉంది. 'తొల్లి ఒక

---

7 ఈ అభినవ గీతగోవింద ప్రతులు నేటికీ ఉత్కలదేశంలో దొరుకుతూవున్నవి. జగన్నాథస్వామి ఆలయంలో తిరిగి ఈ గీతగోవిందాన్ని ప్రవేశపెడతారేమో నభయంతో నరసింహ, కపిలేంద్ర ప్రతాప రుద్రదేవులు 'కేవలము గీతగోవిందాన్ని మాత్రమే జగన్నాథస్వామి వినవలె' నని శాసించినట్లు శాసన ప్రమాణములు కనిపిస్తున్నవట— *Vaishnavism In Orissa* పే 43

8 ఆంధ్రభాషలో గీతగోవిందానికి సంపూర్ణమైన అనువాదం శ్రీ రాజా వెంకటాద్రి అప్పారావుగారి ఆంధ్రాష్టపది. ముద్దుపళని కొన్ని అష్టపదులను అనుసరించింది. శ్రీ కొమాండూరి కృష్ణమాచార్యులవారు ఒక అష్టపదికి పద్యానువాదం చేసినారు.

9 మజుందారు గీతగోవిందము అనువాద పీ:క.

వ్వాడు స్వర్గరాజ్య రమయైన ఇంద్రాణి వైకుంఠ ధాముని దర్శించటానికి వెళ్లి అతని నవమన్మథ మన్మ థాకృతిని దర్శించి నంత మాత్రాన మోహబాణ పాత్రా లకు పాత్రై స్వామిని చూచి "ఓ దీనార్తి హరా! నన్ను నీ ఉత్సంగానికి ఆశ్రితురాలిగా చేయవే" అని ప్రార్థించింది. భగవంతుడు ఆమెను చూచి 'నేను సాధుసంత్రాణ శీలుడనై కృష్ణాఖ్యతో భూమిమీద అవతరిస్తాను. నీవు రాధగా జన్మించి నీ మనోరథసిద్ధి పొందుదువుగాక" అని అనుగ్రహించినాడు.10

గీతగోవిందానికి అనేక వ్యాఖ్యానాలు జన్మిం చినవి. వాటి అన్నిటిలో కుంభరాణా కృతమైన 'రసికప్రియ' మేల్తరమైనది. ఈ వ్యాఖ్యానంలో నిరూపితాలైన రాగాలనే కర్ణాటక గాయకులు ఆద రిస్తున్నారు. 11 పెనుగొండ సామ్రాజ్యాధిపతి తిరు మల రాయలకాలంలో గీతగోవిందానికి ఆంధ్రులు ఒక వ్యాఖ్యానం వ్రాసినారు. ఇందు అష్టపదులలోని భావములకు నాట్యశాస్త్రమును సమన్వయించుట విశేషము. ఆ ఆభావముల కనుగుణములైన అంగ న్యాస కరన్యాసాదికములు ఈ వ్యాఖ్యానమున ప్రత్యేకముగా నిరూపితములైనవి.

---

10 శ్రీ గీతగోవిందం —పీఠిక పే. ౭. (సంపాద కుడు. శ్రీ. ఎ. వి. నరసింహం పంతులు సం ౧౯౧౧)

11 జయదేవకవి— అష్టపదులు —శ్రీమాన్ వింజమూరి వరాహ నరసింహాచార్యులు, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, డిసెంబరు ౧౯౩౭, జనవరి ౧౯౩౮.

12 సంస్కృత వ్యాఖ్యానముతోను, ఆంగ్లాను వాదముతోను దీనిని శ్రీ కరుణాకర కార్ మహాశ యుడు కళింగ చారిత్రిక పరిశోధక మండలివారి పత్రి కలో సంపాదించి ప్రకటించినారు (సం ౧. సంచిక ౪ మార్చి ౧౯౪౭)

13. "*The real sportive dance of Krishna (Rasalila) with Radha at the head of the Gopis is fully shown in Gita-Govinda. This fully confirms that Piyusha Lahari is frist and Gita-Govinda is the second part of Rasalila. Piyusha Lahari is a supplement to Gita-Govinda*"

ॐ

జయదేవకవి కృతమైన 'పీయూషలహరి' నూతనంగా లభించింది. 12 ఇది ఒక గోష్ఠీప్రబంధము. సాహిత్య దర్పణంలలో చెప్పిఉన్న ఈ గోష్ఠి లక్షణా లన్నిటిలో కొన్ని పీయూష లహరికి పట్టినవి.

"ప్రాకృతైర్నవభిః పుంభి
ర్దశభిర్వాప్యలంకృతా
నోదాత్త వచనా గోష్ఠి
కైశికీ వృత్తి శాలినీ
హీనగర్భ విమర్శాభ్యాం
పంచషడ్యోషి దన్వితా
కామ శృంగార సంయుక్తా
స్యాదేకాంక వినిర్మితా"

ప్రాచీనకాలంలో జగన్నాథస్వామి ఆల యంలో అనేకములైన ఏకాంక నాటికలను ప్రదర్శిం చేవారు. పీయూష లహరినికూడా అటువంటి నాటక సమాజంతో కలిసి జయదేవుడు దీనిని ప్రదర్శించినట్లు పీయూష లహరిలోని "గోష్ఠి శ్రీ జయదేవ పండిత మహేః సావర్తతే నర్తితుమ్" అన్న వాక్యంవల్ల వ్యక్త మౌతున్నది. ఇటువంటి నాటక సమాజాలు నేడు కూడా అచ్యుతానంద సంప్రదాయులైన వైష్ణవుల్లో కనిపిస్తున్నవి. వీరు రాధను ప్రధాన నాయికగా గ్రహించి జగన్నాథస్వామి ముందు రాసక్రీడలు సలుపుతుంటారు.

పీయూష లహరికి కథావస్తువు గీతగోవింద కథా వస్తువే. రాధ ప్రధాననాయికగా శ్రీకృష్ణుడు రాస లీల నడపటము కథాంశము. అందువల్ల పీయూష లహ రిని గీతగోవిందానికి భూమికగా శ్రీ కార్ మహా శయుడు అభిప్రాయ పడినాడు.13 దీనినిబట్టి జయదేవ కవి ఈ రెండు రచనలను పురస్కరించుకొని రాస లీలా స్వరూపాన్ని పూర్ణంగా ప్రదర్శించినాడని ఊహింపవచ్చును.

కవి స్వోత్కర్షగా చెప్పుకున్న గీతగోవిందం లోని 'సాధ్వ మాధ్వీక! చింతా నభవతిభవతః' ఇత్యాదులను పోలిన శ్లోకాలు పీయూషలహరిలోనూ కనిపిస్తున్నవి. అందు కొక ఉదాహరణ:

"అశ్మద్రవీకరు మిమౌ సమర్థౌ,
చతుర్దిశా నామపి పిష్టపానామ్

అహం వచోభిర్జయదేవ నామా,
కరచ్ఛటాభిశ్చ తుషారధామా”
“పరుషాశ్మము గరగించుట, కిరువుర కే
యనువు గలుగు హృద్యవచో వి
స్ఫురణను నే జయదేవుడ, కరముల
చలువను దుషార కరుడ నెక్కుడురుని”14

కృష్ణ భక్త్యైకతానుడైన జయదేవకవి పీయూష లహరీ ప్రారంభంలో నటరాజు నుద్దేశించి క్రింది నాందీ మంగళ శ్లోకాన్ని చెప్పటం గమనింప దగ్గ విషయం.

“కింజల్క ద్యుతిపుంజ పింజర దళ
త్పంకేరుహ శ్రీవహామ్
శంపా సంపతి తాంసు మాంసల
శరత్కాదంబినీ డంబరమ్
లాస్యోల్లాసిత చండ తాండవ కళా
లీలాయితం సంతతమ్
చక్రప్రక్రమ వృత్త నృత్త హరయో
నిర్వ్యాజ మవ్యాత్ జగత్”
“పరితః కేసర పుంజ పింజర దళ
త్పంకేరుహా కారమై
దరశంపా రుచిరాంశు మాంసల
శరత్కాదంబినీ డంబర
స్ఫురణన్ పర్వత కన్యకా మృదు
నట త్ఫుల్లాస్య లాస్యాంచితం
బరుదౌ శంకర చండ తాండవము
నిర్వ్యాజమ్ము మిమ్మోముతన్15.

‘కోమలకాంత’ పదావళులతో, కైశికీ వృత్త్యు పేతమై, లాస్యోచితమై పీయూషలహరీ ప్రాచీనగోష్ఠీ ప్రబంధానికి ఒక ప్రముఖ లక్ష్యంగా ఒప్పుతున్న దనటం నిస్సంశయము.

౬

జగన్నాథస్వామి ఆలయంలో పీయూష లహరని వసంతంలో రూపించినారు. జయదేవుడు గీత గోవిందంలోనూ, పీయూష లహరిలోనూ నిరూపించిన ‘రాసలీల’ భాగవత పురాణాన్ని అనుసరించింది కాదు. భాగవత రాసలీల శరత్తులో జరుగుతుంది. జయదేవునికి మూలం బ్రహ్మవైవర్తము. అందులో రాసోత్సవాన్ని గురించి కృష్ణ జన్మఖండంలో ఇలా ఉంది “రాసోత్సవం మహాభద్రమ్యం సర్వేషాం హర్ష వర్ధనమ్, పూర్ణ చంద్రోదయే నక్తం వసంతే రాస మండలే........ఏకదా శ్రీహరిర్నక్తం వనం బృందా వనం యయౌ, శుభేశుక్ల త్రయోదశ్యాం పూర్ణ చంద్రోదయే మధౌ......యూథికా మాధవీ కుంద మాలతీ పుష్పవాయునా, వాసితం కలనాదేన మధు పానం మనోహరమ్”. ఈ రాసలీల మూడు దినాలు మాత్రము. భాగవత రాసలీల పంచశరద్రాత్రులు. జయదేవుని తరువాత జన్మించిన అనేక వైష్ణవ కవులు కూడా ఈ బ్రహ్మవైవర్త రాసమే అనుసరించారు.

జయదేవుని గీతగోవిందమూ, పీయూషలహరి అర్థం కావటానికి ఒరిస్సా వైష్ణవాన్ని గురించిన విజ్ఞానం కొంత అవసరము. కళింగదేశంలో క్రీ. శ. ౮ శతాబ్దములో ప్రవేశించిన మహాయాన బౌద్ధం క్రమంగా వజ్రయాన, సహజయానాలుగా రూపొందింది. క్రీ. శ. ౭౫౦ నాటి ఒరియారాజు ఇంద్రభూతి, చెల్లెలు లక్ష్మీంకర వల్ల సహజయానం ఆదేశంలో ప్రవేశించిందని ప్రతీతి. ఇంద్రభూతి జ్ఞానసిద్ధిలో జగన్నాథుని బుద్ధదేవునిగా స్తుతించినాడు. సహజయానాన్ని ప్రచారం చేసినవారు కౌపదాదులు ఓఢ్రదేశీయులు. వజ్రయాన, సహజయాన వైష్ణవాలు కలిసి ఓఢ్రదేశంలో నూతన వైష్ణవానికి దారితీసి ఉంటవి. దానికి ముఖ్యమైన ప్రవక్తలు—జయదేవుడు, రామానంద రాయలు. సహజయాన పంథీయులు జయదేవుణ్ణి ప్రథమ ప్రవక్తగానూ, నవరసికుల్లో ఒకడినిగానూ పరిగణిస్తారు. క్రీ, శ. ౧౫, ౧౬, ౧౭ శతాబ్దాలల్లోని ఓఢ్ర రచయితలు సరళదాసు, బలరామదాసు, అచ్యుతానందులు, పీతాంబరుడూ మొదలైన కవులు సహజయానాన్ని అనేక గీతాలల్లో ప్రశంసించారు.

రామానుజ మధ్వాచార్య లిరువురూ పూరీ జగన్నాథానికి వెళ్ళి వైష్ణవతత్వాన్ని ప్రచారం చేశారు. తరువాతి వాడైన జయదేవుడు వారిప్రభావం వల్లనూ అనాదినుంచీ వస్తూఉన్న ఇంద్రభూతి చెల్లెలు తెచ్చి పెట్టిన సహజయాన బౌద్ధ ప్రభావం వల్లనూ నూతన రాధాతత్వాన్ని సాధించి ప్రబోధించినాడు. దానిని స్వీకరించిక్రమంగా అద్వైతాచార్య, ఈశ్వరపూరీలకు

14. 15. శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యుని అనువాదములు.

గురువైన మహేంద్రపూరి వంగదేశంలో ప్రవేశపెట్టినాడు. ఆయన శిష్యుడైన ఈశ్వరపూరీ చైతన్య మహాప్రభువు శిష్యుడు. చైతన్యప్రభువు జయదేవుని భక్తి జ్యోతిని అందుకొని వంగవైష్ణవ ప్రపంచాన్ని ఉద్యోతితం చేశాడు. అందువల్ల వంగవైష్ణవానికి ప్రథమ ప్రవక్త జయదేవుడే అని నిరూపితమౌతున్నది.16

16. ఈ అభిప్రాయాన్నే సుకుమార సేన్ మహాశయుడు తన వ్రజబోలీ సాహిత్య చరిత్రలో ఈరీతిగా పలికినాడు.

"This outlook of PREMA which we find systematised already in Bhagavata Purana but which does not seem to have affected popular conception of Krishnaism in Bengal up to the 15 th Century A. D. We frist come accross in Bengal in the life of Mahendra Puri, who was the Guru of Advaitacharya, Isvara Puri and other cortemporaics of Chaitanya Deva. Isvara Puri wac the Guru of Chaitanya Deva. so the spirit of Mahendri passed unto Chaitanya Deva, to be developed into a wonder of the world" History of Braja Boli literature. P. 12.



కథానిక:

నమ్మిక

★

శ్రీ బలివాడ కాంతారావు

మూడేళ్ళ క్రితం విశాఖపట్నంలో ఒకనాటి సాయంత్రం నేనూ, ఒకస్నేహితుడూ మెయిన్‌రోడ్డుమీద పోతున్నాం. నా మిత్రుడు చప్పున ఆగాడు. నేను ఆగి చూసేసరికి సందు మొదలలో నిల్చొని వున్న ఒక వయస్సు మళ్ళిన వాడిని నమస్కరిస్తూ నే ధగ్గరగా వెళ్ళాడు. మా వాడిని అనుసరించాను. ఆయన అరవయ్యో పడిలో వుంటాడు. పొట్టి కాదు, పొడగరీ కాదు. బక్క మనిషి. నోరు యేదో మెత్తని పదార్థం చప్పరించటానికే పనికి వస్తుంది. చెవుల్లో వెంట్రుకలు మీసాల్లా తిరిగి బయటకు వచ్చుచున్నాయ్. ఫాలభాగంలో విభూతి పిండికట్లు అగీ అగపడనట్లున్నాయ్. సగం పండి పిలక చివర మెడమీద పడుతోంది. చేతి కుట్టుతో రిపేరీ చేసిన పొట్టి తెల్లని కమీజు, మాసీ మాయనట్టున్న పొట్టి పంచె కట్టుకున్నాడు. మా మిత్రుడు అంత వినయం కనపర్చకపోతే ఆయన యందు నా వైఖరి వేరేగా వుండేది. మావాడు సైగ చేస్తూ గట్టిగా అన్నాడు. "తమ కోసం నిన్న సాయంత్రం వచ్చాను. అమ్మగారు యింట్లో లేరని చెప్పారు," ఆయన చెవిదగ్గరగా చెయ్యి పోనిచ్చి వినపడలేదన్నట్లు వూపాడు. మా వాడు మెల్లగా చెవి దగ్గర నోరు పెట్టి ఆ మాటలే కామోసు వూదాడు. లోతులేని నూతిలో నుంచి మాట్లాడినట్లుగా "పని మీద బజారు వేపు వెళ్లా"నన్నాడు. ఈ సంభాషణ అర్థం చేసుకోటానికి అభినయం మూడుపాళ్లు పనిచేసి వుంటుంది.

మా వాడు నాతో అన్నాడు "రా - ఇప్పుడే వచ్చేద్దా' మని! నేను కాదనలేక వెంటపడ్డాను. సందురోడ్డు సిమ్మెంటుదైనా చెత్తా చెదారం లేకపోలేదు. ఆ సందులో నించి యింకో సందు వేపు తిరిగాం. ఇద్దరు జతగా నడవటానికి తగ్గ వెడల్పు. దుర్వాసన ఘోరంగా వుంది. జేబురుమాలు తీసి ముక్కు మూసుకొని పది గజాలు నడచి వుంటాను. తలుపులేని గుమ్మం దాటి వెళ్ళాం. ముందుగా అగపడింది చిన్న నుయ్యి. ఆ నూతికి వెనకాలే ఎత్తైన కుండీలో తులసి చెట్టు వుంది. ఆ వెనకను రెండు గుమ్మాలతో ఒక పెంకుటిల్లు వుంది. బిళ్ళ పెంకుతో వున్న ఆ యింటి కప్పు చూస్తుంటే వాన జల్లుకు ఆ యింట్లో బదులు వీధిలో కూర్చుంటే నయం అనిపిస్తుంది.

ఆ ముసలాయన గుమ్మం దాటి వెంటనే నూతి గట్టుమీద నున్న గోలెంలో నీరుతీసి కాళ్లు కడుక్కున్నాడు. మావాడు వేసుకున్నవి ఆకు జోళ్ళు కాబట్టి అక్కడే సులభంగా విడిచి పెట్టాడు. తటపటా యిస్తున్న నా వైపు మాసి ఫరవా లేదన్నట్టుగా చెయ్యివూపాడు. తుంగచాప వాకిట వేశాడు. బూటుకాళ్లు బయట పెట్టి ఒక చివరను కూర్చున్నాను. వెలుతురు బాగనే వుంది. ఆవు పేడతో కళ్ళాపి జల్లటం వల్ల పైన వుండిన దుర్గంధం లోన లేదు.

ఇద్దరికీ మధ్య మఠం వేసుక కూర్చున్న మావాడు కుడి అరచేతిని ఆయన యెదురుగా పెట్టాడు. బొక్క-

ఫ్రేముతో వున్న కళ్ళద్దాలు తగిలించి చాలా చిన్న చిన్న రేఖలను చూపిస్తూ చెప్తున్నాడు. ఈ పిచ్చి మా వాడి కెలా పట్టిందని ఆలోచించుకుంటున్నాను. ఇంతలోనే యింటిలో నుంచి ఒక పండు ముదుసలి వచ్చి "శంకరం మూడు రూపాయ లిచ్చి వెళ్ళాడు రా అబ్బాయ్" అంది. ఈ సంబోధన బట్టి ఆమె ఆయన తల్లిఅని నిర్ధారించుకున్నాను. చెప్పటంలో అలవాటుపడ్డదేమో ఆయన వెంటనే వుంచు అని సైగ చేశాడు. ఈ మాటలతో నా అనుమానం బలపడింది. మళ్లీ యింట్లోకి నడ్డివంచి వెళ్లిపోతున్న ఆ యెముకల పోగు వేపు చూస్తున్నాను. ఆ ముదుసలి తలను కప్పుతూ కట్టుకున్న అంచు లేని వస్త్రం కొన్నప్పుడు తెల్లదైనా రోజూ తెల్లవారకముందు స్నానం చేసేటప్పుడు తడవటం మూలాన కొంచెం గోధుమ రంగుగామారింది. ఆమె వెళ్లిపోతూ ఆగి తులసి చెట్టుకు ఒక మ్రొక్కు మ్రొక్కింది. ఇంతలోనే మా వాడు నాకుడిచెయ్యి లాగాడు. నేను ముఖంలో లీలగా విముఖత చూపించాను. ఎటూ మొగ్గని నా హృదయాన్ని ఒక్క అర్థవాక్యంతో ఆ వృద్ధుడు తనవేపు కొద్దిగా మొగ్గించుకున్నాడు. "ఆర్టిస్టిక్ హేండ్ లా వుం" దన్నాడు. ఈ యింగ్లీషు పదాలు నన్ను కొంత చకితుని చేసినా చెయ్యిచూపించాలనే కోరికతో పాటు, ఇదొక యెత్తా అనే సందేహం కూడ నాలో గుమ్మరించింది. ఈ అసందిగ్ధ పరిస్థితిని మావాడు గప్పున నా చేతిని లాగి ఆయన యెదగగా పెట్టటంతో హతమార్చాడు.

కొంత సేపు ముగ్గురం మూగపోయాం. "మీ బొటనవ్రేలు చూసే నేను ఆర్టిస్టిక్ హేండని చెప్పాను. చూశారా ఎలా నిటారుగా పొడుగ్గా వుండి చివర వంగి వుందో" అన్నాడు. నేను తలవూపక విధిలేక పోయింది. తరవాత ఒక్కొక్కటిగా రేఖలను చూపిస్తూ ఫలితాల్ని చెప్పుకొచ్చాడు. చెప్తున్నంతసేపూ నా దృష్టి చేతి మీద బాగా కేంద్రీకరించాను.

ఎడతెగని ఆలోచనలతో మెదడు పనిచేస్తూనే లేచేముందు మా వాడి చెవిలో పర్సు చాలా ఖాళీగా వుందని వూదాను. మా వాడు గంభీరంగా అన్నాడు. "ఒక దమ్మిడీ పుచ్చుకోడురా" అని. నా కంతా అయోమయం అనిపించింది. అప్పటి మట్టుకు యేమీ మాటాడకుండా మా వాడితో పాటు నేనూ ఒక వంక దండం పెట్టి శలవు తీసుకొని బయట కొచ్చాను. తరవాత చెప్పాడు - వచ్చే పింఛనుతో జీవిస్తున్నట్లు. ఆయనకు దిక్కూ, మొక్కూ ఆ తల్లే అనీ, జాతకాలకి తప్పించి యిటు వంటి చిన్నవాటికి డబ్బు పుచ్చుకోడనీ చెప్పాడు.

ఆ నెల రోజుల్లోనే ఆఫీసుకు ఐదు రోజులు శలవుపెట్టి నా జన్మస్థలానికి వెళ్ళాను. మా గ్రామం విశాఖపట్నానికి ఉత్తరంగా 80 మైళ్ళ దూరంలో ఒక నది వడ్డున వున్నది. ఆ నది సాధారణంగా హిందూదేశపు పటంలో కనపడదు. మా గ్రామం దగ్గరే ఆ నదిపై మూడు ఫర్లాంగుల వంతెనుంది. పదిహేనేళ్ళ క్రితం తెరచిన జమీందారు తన పేరు పెట్టుకున్నాడు. గానీ పాటక జనం "పెద్దేరువారాది" అంటారు ఈ నది మా జిల్లాకు పెద్ద నది కావటంవల్ల. మా నాన్న ఈ వూరి కరణం. వంశ పారపర్యంగా హక్కు వున్న ఉద్యోగంతో పాటు స్వంత సేరీ వుంది. ఒక నౌకర్ని, జత దున్నపోతులను పెట్టి వ్యవసాయం సాగిస్తూ వుంటారు. ఈ వూర్లో వ్యవసాయపు పనిపాట్లు చేసుకొని జీవించే కూలిజనం హెచ్చు. సామాన్యుల సంతానాలు ఆ సంస్కారాన్నే అలవర్చుకున్నయ్.

పామిస్టు చెప్పినపుడు యే గీత యేదో దేనివల్ల యేం ప్రయోజనమో యిటువంటి వన్నీ పరీక్షగా చూశానేమో వుబుసు పోక పోతే పొరుగింటి విధవావిడ చెయ్యిచూసి చెప్పాను. నా కొచ్చిన శాస్త్రం శూన్యం, కాని నోటి బుకాయింపు. ఆవిడ జీవితం చాల వరకు తెలుసు కాబట్టి నమ్మిక కలిగేటట్లు చేశాను. ఈ నోటా ఆ నోటా ప్రాకింది నేను చేతులు చూసిన సిదాంతి నయ్యానని. మొదట ఒకరు, తరవాత యిద్దరు రానురాను యిదివరకు చూడని మనుషులు కూడా వచ్చారు. వీళ్ళందరినీ వదిలించుకోడానికి నా తల పగిలిపోయింది. ఇప్పుడు నిజం చెప్పినా వీళ్ళకి శుద్ధ అబద్ధం అయిపోతోంది. బలవంతం క్రిందకు రాగానే లాభం లేదని ఒక షరతు పెట్టాను. "నేను డబ్బు పుచ్చుకోను. మీ రేమీ నన్నడగొద్దు. చెప్పిందేదో వినేసి వెళ్లి పొమ్మన్నాను" ఆత్రుతతో వున్న వారి తల లూగాయ్,

నిముషాల్లోనే నా కోతలు యేకష్టాల వూసు యెత్తకుండా చెల్లి పోయాయ్. ఎత్తినకష్టాలయినా చెప్పుకోతగ్గవి కావు.

నేను తిరిగి వెళ్లిపోయాక మళ్ళీ అక్టోబరు నెలలో మా వూరు వెళ్ళవలసి వచ్చింది. రైలులో మూడు గంటల ప్రయాణం. మా నాన్నకు బహు వ్యాపకాల వల్ల నీరసం చేసింది. చూట్టానికి రమ్మనమన్నారు. ఈ సారి మా నౌకరు మారటం గమనించాను. నన్ను చూడగానే 'దండం బాబూ నిబ్బగా సెప్పావు" అన్నాడు. ఏమిటి నిబ్బగా చెప్పానో కనుక్కోటానికి మా అమ్మ కేక వినబడటం వల్ల అప్పటికి వీలు లేక పోయింది. వీధిసావిడిలో వాలు కుర్చీమీద కూర్చొని కాఫీ త్రాగుతుంటే మా నౌకరు వచ్చి నా కాళ్ళ చేరువలో కూర్చున్నాడు. 'నీ పేరేమిటిరా' అని అడిగాను కప్పు క్రింద పెట్టూ. "లొట్టోడ్ని బాబూ" అన్నాడు.

ఈ ప్రాంతంలో కూలీ నాలీ చేసుకుని బ్రతికే పాటక జనాన్ని వాళ్ళ యింటి పేరు పెట్టి పిలుస్తారు. ఇంటి పేళ్ళే వాళ్ళకి వ్యావహారిక నామధేయాలౌతుంటాయి. అంచేత మానౌకరు "లొట్టై". అసలు పేరు కనుక్కునే అవసరం లేక పోయింది.

వీడి వయస్సు యించుమించు నా వయస్సంతే వుంటుంది. పాతికేళ్ల లోపు వాడైనా మనిషి చాలా బలిష్టంగా, నల్లగా భారీగా వుంటాడు. ముక్కు మొద్దుగా వుంది. పళ్ళు కొంచెం గోధుమ వర్ణంతో కాస్త వురవగా వున్నయ్. పాదాలు మొరటుగా పగుళ్ళు దేరి వున్నాయ్. తలకి మాసిన చింకి పంచె ముక్కతో చిన్న తలపాగ చుట్టాడు. ముక్కులోనూ, చెవుల్లోనూ చిన్న బంగారపు రింగులు అంటిపెట్టి వున్నయ్. మెడలో కాశీతాడు అక్కడక్కడ ముడులతో వుంది. ఈ నల్లటి తాడు వేసుకొనే వాడు గరిడీ విద్యలో ప్రవేశం వున్నవాడని చెప్పాలి. దుప్పటి గుడ్డతో కుట్టిన భుజం కలిగిన, చిరిగిన పొట్టి బనియను వేసుకొన్నాడు. ముడుకులు దిగని పంచె మరికాస్త మీదికి యెగగట్టాడు.

ఇదివరకు వీడి ముఖం చూసినట్టు జ్ఞాపకం వుంది. "ఇత్తనాలు పోసిన రోజుల్లో వచ్చి సెయ్యి సూసినావు కదూ బాబూ—నిబ్బగా అలాగే అయినదన్నాడు." ఇదివరకు ఈ వూళ్ళో చూసిన చేతుల మధ్య యీ చెయ్యి చూసినట్లు సరిగ్గా జ్ఞాపకం లేదు. ఏం చెప్పానో ఏమిటో నాకే అయోమయంగా వుంది. మళ్ళీ వాడిప్పుడు చెయ్యి చూడమని బలవంతం చేస్తే మొదట చెప్పినదానికీ, యిప్పుడు చెప్పినదానికీ యేటువంటి పోలికా వుండదని నాకు తెలుసు. అటువంటి పరిస్థితి వస్తే యేదో అబద్ధం ఆడి తప్పించుకోవాలనే సంకల్పంతోనే వున్నాను. మొదట్లోనే ఒక విసురు విసిరాను. "అబ్బే ! నాకు చేతులు చూట్టం తెలీదురా. నోటికొచ్చింది చెప్పాను." ఈ మాటలు నేను శుష్క హాసం చేస్తూనే అన్నాను. లొట్టై పకపక నవ్వి " లే బాబో ! నాతో పరాసకా లేంటి? సేతులు సూట్టం తెలీక పోతే నిబ్బగా యెలా సెప్తావు? "

ఆ నిజమేంటో నాకూ వినాలని లేక పోలేదు. నా ఆతృతకు తగ్గట్టు గానే వాడు మొదలు పెట్టాడు. "ఆ నాడు సెప్పినావు. నాను బతికి నన్నాలూ ఒక్క దాంతోనే వుంటానని. నాను ఆనాడు నమ్మలేక పోనాను. అప్పుడు దానికి మా సెద్ద తలతిరుగున్నాది. దాన్ని యిడిసిపెట్టి యిడాకులు తెంపేసుకోవాలనుకున్నాను. అప్పుడే బాబు యిలా సెప్పినావు "

నా కోతల పామిష్ట్రీకి యేదో విలువ వచ్చిందని 'అయితే యేం జరిగింది'ని, అనుబంధ ప్రశ్న వేశాను. లొట్టై తలపాగ చుట్టుకొని చెప్పాడు.

" నాకు ఒక్క పెళ్ళాం అంటే ఒక్క పెళ్ళమనే బాబు సెప్పినావు. నా సేతిలో అలా వుండబట్టి సెప్పినావు. సేతిలో యెల్లాగ వుంటే అలా జరగతాది గానీ మనం యింకో నాగ సెయ్యాలన్నా అవుతాదా? నాకు బగమంతుడు ఆలోసన పుట్టించినాడు. అదా పైదాయి కాదు. మేనమావఁ కూతురు. ఒకనాడు కాకపోతే మరోనాడు దాని మనసు మారి యేలుకోదా? నాకు సాలా మంది సెప్పినారు. దాన్ని మంచి కబుర్లుతో కంగదీసి కన్నోరింటి నుంచి తీసుకొచ్చినాను. పెట్టిన బంగారం అంకించుకుని బాగా తన్నేసి తగిలే మన్నారు. నాకు కోపమైతే వచ్చినాది. గానీ మళ్ళా ఆలోసించాను. నా గీతలో ఒక్క పెళ్ళావఁనే వున్నాది. దీన్ని గాని వదిలేసుకున్నానంటే ఆ బంగారం పిసర మావోళ్ళు అంకించేసుకుంటారు. కరువు రోజులా మరి—కడుపు కేసుకుంటే

మళ్ళా నా సేత్తో నేను రెండు తొలాల బంగారం గడిస్తానా? అది ఎర్రగా బుర్రగా వుండాది. నాను వదిలేస్తే దానికి మారాజు నాంటి మొగుడొస్తాడు. ఈలందరి మాటెని దాన్ని గాని వదిలేశానో రెండి దాలా సెడతాను. సేతులో వున్నాది. వదిలెయ్యాలన్నా యీలు పడతాదా? దాని కన్నారింటి కెళ్ళాను. ఇన్నాళ్ళాగ సెయ్యి సేసుకోకుండా మెల్లిగా వారం రోజులుండి మంచి కబుర్లతో మచ్చిక సేసినాను. ఒకంతట లొంగినాదా? మా వూరి కరణం బాబు కొడుకు పెద్ద సిద్ధాంతి. సెయ్యి సూసి ఒక్కాటే పెళ్ళవుని సెప్పినాడు. ఆ మారాజు సేతిలో వున్నది సెప్పినాడు. నివ్వెన్నన్నా నా దగ్గిరికే వస్తావు. ఆ గీతలో అలాగ వున్నాది."

నేను చప్పున "అదీ నమ్మిందా" అన్నాను.

"నమ్మక యేంచేస్తాది బాబో! సేతిలో వున్నది నిబ్బగా సెప్పినావు. కానీ యేగానీ పుచ్చుకుంటావు గనక నా యిచ్చకంగా అబద్ధాలు సెప్పటానికి."

నేను నా ఆలోచనలో వుంటుండే ఊఁకొట్టున్నాను. మళ్ళీ మొదలు పెట్టాడు. "దాని మనసేం తిరిగినాదో నాలుగు రోజులుండు మావాఁ కలిసి యెల్లిపోదా వన్నాది. అలాగే వున్నాను. వచ్చేసినాది. ఆయేళ నించీ కలిసీ మెలిసీ వున్నాం బాబూ. ఇప్పుడెల్లి దాన్కి సెప్పినాను ఆ బాబు వచ్చినాడని. దాని సరదా యింతా అంతా కాదు. బాబుకి మొక్కానని సెప్పమంది."

ఇంతలోనే లాట్టైకి పనితగలటం చేత వెళ్ళిపోయాడు. నేను చాలా సేపటి వరకు కుర్చీకి అంటుక పోయాను.

ఆ వేళ రాత్రి బాగా చీకటి పడ్డాక అంగటి గదిలో పరుపు మీద చారబడి బయట జరుగుతున్న గందరగోళం వింటున్నాను. మా యింటి యెదరగా అంగట మర్రిచెట్టుంది. దానికె కచేరీమర్రిచెట్టని పేరు. మా తాతల కాలంలో కోర్టు లెక్కలేకుండా వూరి పెద్దమనుషులు అక్కడ కూడి తగాయిదాలు తీర్చేవారట. మా తాత రోజూ చీకటి పడ్డాక వీధి అరుగు మీద ఒక ఆముదపు ప్రమిద దగ్గర పెట్టుకొని ఆ దీపపు కాంతిలో పురాణ కాలక్షేపం చేస్తుండే వారట. అంచేత వూరిలో చిన్నా పెద్దా సాయంత్రమైతే ఆ చెట్టు దగ్గర గుమిగూడే వారు. మా తాత చనిపోయాక అటువంటిదేమీ జరగక పోయినా వూళ్ళో వాళ్ళు వచ్చి కూర్చునే అలవాటు మాత్రం పోలేదు. ఇప్పుడు ఆముదపు దీపం బదులు హరికెన్ లాంతరు వెలుగుతుంటుంది. అక్కడ గుమిగూడిన కొందరు గ్రామప్రజల గొంతుకలే వింటున్నాను. ఒక గొంతుక: "ఆయనకు కలిగింది. అన్నమో అంబలో తింటున్నాడు. నాకులేదు. ఆయన అదృష్టం అది. నా కర్మ యిది. ఆయన్ని తిట్టే మనకేం వస్తాది. ఊరుకోరా. వాడికున్నాది మనకు లేదని యేడిస్తే రెండు కళ్ళూ పోగలవు."

ఇంకో గొంతుక: "ఆడు నలుగురి బుర్రా కొట్టున్నాడే అనుకో. మనం యెన్నన్నా ఆడు మానేస్తాడా? ఆడి పని ఆడు సేస్తాడు. సెయినీరా? ఎవడు బుర్ర కొట్టినా ఆ జానెడు పొట్టకే. యెలిపోయేటప్పుడు ఒక గుడ్డపాత కూడ తీసుక పోడు."

ఈ విషయం నాలుగ్గొంతుకలు కలిసి రసాభాస అయి చివరకు "మనం యెందుకిలాగ కొట్లాట్టం–అందరికీ పైన ఒకడున్నాడుగా" అని తేల్చేసి యీ విషయాన్ని ఆపేశారు.

తరవాత రేగిన విషయం డాక్టరు చేతకాని తనం వల్ల ఒక మనిషి చనిపోయాడని.

ఒకగొంతుక: ఆ వయిదిగుణ్ని యెందుకలా తిడ్తారు? ఆడికా యోగం వుండి సచ్చాడుగాని."

ఇంకో నాజూకైన గొంతుక: "ఇంజక్షన్ యివ్వటం వాడికి సరిగా చేతగాదు. ఏ కాలీజీలోనూ చదివినాడు డాక్టరు కాలేదు. సూది దండలో యిరిగిపోవటంవల్ల సెప్టిక్ అయి రోగి చచ్చిపోయాడు. జబ్బువల్ల కాదు."

ఇది మా నాన్న గొంతుకే.

ఇంతలోనే చటాలున లాట్టై గొంతుక వినిపించింది. బహుశః అభినయంతోనే యీ మాటలు అనుంటాడు "రా బాబో! ఆడి సేతిలో వున్నట్టు జరక్క మాన్తాదా? ఆడి–సేతిలో ఆయేళకి సావాలని వున్నాది – వయిదుగుడు కాదు – అరిఅర బెమ్మదులు రచ్చిస్తారా?" ఈ మాటలు వినగానే నా నవ్వులో నేనుండి పైన కబుర్లు వినలేదు. ఆ నవ్వు కొద్ది నిముషాల్లో ఆశ్చర్యంగా మారిపోయింది.

ముక్కు మీద వేలు వేసుకున్నాను. నోరు ఆవలించు కున్నాను.

ఆ మరుచటి రోజు ఉదయం రాత్రి సంగతి యెత్తి లొట్టితో చెప్పాను. అలా చాటుక తిర గొద్దని—

"ఉన్న మాట సెప్పితే వూరల్లా కోపమే— మన సేతిలో ఆ యేళకి మారకం సేరకపోతే సచ్చి పోతావాఁ?"

"సరేగానీ! నేను చేతులు మాస్తానని యెవరి తోనూ చెప్పకు."

"సాటుక తిరిగితే వున్నాది, నేకపోతే నేదా? ఇద్య బగమంతు డిచ్చినాడు. మా లాంటోలికి వూర కనే సెప్తావు. వున్నోమేనా మరి. మీ సెయి సూసు కోని మంచీ సెడ్డా తెలుసుకుండావు."

నేనింకా ఏమీ అనకుండానే గడ్డిబుట్ట, కొడవలి పట్టుకొని నవ్వు మొఖంతో "గుండెమీద గునపం పోటో—" అంటూ కూనిరాగాలు తీసుకొని వెళ్ళి పోయాడు.

ఈ సారి నేను వెళ్ళిపోయాక నెల రోజులలో బొంబాయి బదిలీ అయింది. అక్కడ మా దగ్గర బంధువు వుండబట్టి యిక్కడలా హోటళ్లలో బాధ పడక్కర్లేదు. బొంబాయి నుంచి తూర్పు కోస్తాలో వున్న మా గ్రామం రావాలంటే అధవా వంద రూపా యలు ఖర్చు పెట్టాలి. అంచేత కొన్నాళ్ల వరకూ యింటి ముఖం చూట్టం జరగదు. ఉత్తరాల ద్వారా వచ్చే భోగట్టాలలో అంతా యింటి గురించీ, చుట్టాల గురించీ గాని వూరి విషయం ఏమీ లేదు.

నేను ఆశించిన వుత్తరం బొంబాయి వెళ్ళాక రెండేళ్లకు వచ్చింది. మా నాన్న వూరి విషయం వ్రాశారు. ఆ విషయం విచారించ వలసినది. కలరా వల్లచాలా మంది చనిపోయారట. మా నాన్నకూ కూడా కలరా సోకిందట. పట్నంలో పేరున్న డాక్టరుకు మూడువందలవరకూ పోసి ప్రాణం నిలబెట్టు కున్నా రట. నేననుకున్నాను. యిలా డాక్టరుకు డబ్బు పొయ్యలేక యెందరు చచ్చారో అని. నా ప్రయా ణం యిప్పుడు అవసర మయ్యింది.

నన్ను చూడగానే మా నాన్న కన్నీరు తెచ్చు కున్నారు. నా రాక మా వాళ్లకు ఒక అప్రధానమైన విషయం కాదు. అప్పట్లో నా మట్టుకు నాకు యిందులో యే ప్రాధాన్యతా కనపడ లేదు. ఎంచే తంటే మా నాన్న మామూలుగా పుష్టిగానే వున్నారు.

భోజనం దగ్గర మా అమ్మతో మాటల్లో మాటగా తేచిపోయే ముందు "లొట్టి బావున్నాడా" అని అడిగాను. "ఇప్పుడు మనలో లేడు, నాయు డింట్లో వుంటున్నాడు. పాపం! వాడి పెళ్ళాం మొన్న కలరాలో చచ్చిపోయింది." అని చెప్పింది. చివరి వాక్యం వింటానికి నాకు కష్ట మనిపించింది. నే నొచ్చానని తెలిసి లొట్టె వచ్చి యేడ్చేటప్పుడు యేం సంజాయిషీ యివ్వాలో నాకు అంతుపట్ట లేదు. కొన్నాళ్ళు పోయాక నేను వచ్చుంటే అప్పటికి దుఃఖం కొంత దిగమింగే వాడేమో అట్టే గొడవ లేక పోయేది.

సాయంత్రం వీధిలోనికి వెళ్దామని బయలు దేరాను, బొంబాయిలో కీర్తింప బడని యీ దుస్తులకు యీ పల్లెలో కొంత కీర్తి రప్పిద్దామనే వుద్దేశంతోనే బయలుదేరాను.

వీధి చివరను లొట్టె కనిపించాడు. వాడి ముఖం అంత దూరంలో వుండగానే చూట్టానికి నాకు సిగ్గు వేసింది. ప్రక్కకు తిర్గి ట్రంకురోడ్డు వేపు పోతున్న వీధి లోనికి మళ్ళాను, లొట్టె నా వేపు పరుగెత్తి అంతదూరం నించే "దండం బాబూ" అంటూ కేకలు వేసుకు రావటం గుర్తించాను. నా మనస్సు చాలా ఆందోళన పడసాగింది. అను కోకుండా వేగంగా నడిచి పోతున్నాను. ఆవీధి దాటాక యిసుక త్రోవదాటితే గాని రోడ్డు చేరుకో లేను. ఆ త్రోవలో పడేసరికి లొట్టె చేరుకున్నాడు.

"కాఫీ వేళై పోతున్నాది గావాల. అంత జోరుగా యెలిపోతన్నావు బాబు."

ఆ గొంతుక పేలవంగా వినిపించింది. తొందర్లో "హాఁ" అని అబద్ధం ఆడాను. రోడ్డు మీద చిన్న పాక ఆవూరి కాఫీహోటలు. చవకగా దొరికే మేకపాలు, గొఱ్ఱెపాలతో కాఫీ, టీ లు తయారవుతుంటాయ్. ఆ హోటలుకు పోయే అవు సరం నాకు లేదు.

"బాబూ సాలా కాలానికి వచ్చినావ్! ఓ! నిబ్బగా సెప్పినావ్."

ఈ పరిహాసం నా వొళ్లు నొక్కివేసింది. వాడి నెలాగైనా వదిలించుకోవాలని గబగబ నడుస్తూనే "పాపం! వెళ్లు" అని గొణిగాను.

"అది ఆనాడే నీకు దండమని సెప్పమన్నది బాబూ! బాబు నానిదే యెలా సెప్పను?"

చచ్చే ముందు యిలా చెప్పమందేమో అని అనుకున్నాను. ఇంతవరకూ వాడి ముఖం వేపు నేను చూడ లేదు. నా యీ విముఖత్వం వాడికి కించ పరిచిందేమో యెదురుగా వచ్చి "ఇంటికెప్పు డెల్తారు బాబో" అన్నాడు. చిరాకుగా "యిప్పుడే" అని యింకో అబద్ధం ఆడాను.

"అయితే నేనూ అదీ కలిసొచ్చి బాబుని సూస్తాం. దానికి సూడాలని సాలా మనసుంది," అన్నాడు. ఈ మాటలతో నేను కొయ్యబారి పోయాను. నిలబడే "నీ పెళ్ళాం బ్రతికుందా" అన్నాను.

"ఉండక ఏమైపోతాది బాబో" అన్నాడు పెద్ద ముఖంతో.

"మా అమ్మ నీ పెళ్ళాం కలరాలో చచ్చిపోయిందని చెప్పిందిదా?"

"నా పెళ్ళాం కాదు. మా యన్న పెద్ద లొట్టోడి పెళ్ళాం. గొట్టాలమ్మ వచ్చిన దగ్గిర నించీ సచ్చిపోతాను సచ్చిపోతా ననేది. అలాగే సచ్చిపోనాది."

నేను స్తబ్ధుడనై నిలుచున్నాను. మా అమ్మ పెద్ద లొట్టోడి విషయం ఎందుకు చెప్పిందని ఆలోచిస్తుంటే లొట్టె నవ్వుతో ముఖం వికసింప చేసుకొని చెప్పాడు. "అసుట్టు మీరొచ్చినారే ఆ వారం రోజుల్లోనే మా మావ జబ్బుపడి పోనాడు. బక్కబడుగు వున్న కొంప పెద్ద లొట్టోడికి మీ పనప్ప సెప్పి అదీ నాను కలిసెల్లినాం. అక్కడ సోది గొప్పల దాకా వుండిపోనాను." "సరే! తిరిగివచ్చాక మా పనిలో చేరక పోయావా?"

"మాయన్న మీ కాడ వుంటా నన్నాడు. ఎవుడైతే యేంటని నాను రెడ్డోరింట్లో కుదిరినాను."

మా అమ్మయెందుకలా చెప్పిందో అర్థమయింది.

"మీ యన్న ఎందుకు మా నేశా" డన్నాను.

"మొన్న పంటకి ఒక పుట్టెడు ధాన్నం యెచ్చు సెయమన్నాం. బాబు ఒప్పుకో లేదు, నాయుడోలు పుట్టెన్నర ఇప్పిస్తా మన్నారు. ఆల్లోకి యెలిపోనాడు బాబూ" అన్నాడు.

తరవాత వాడి పెళ్లాం జబ్బుగురించి చెప్పుకొచ్చాడు. "మా వదిన్ని వల్లకాడికి తీసుకెల్లి యింటికొచ్చే టప్పటికి గొట్టాలమ్మ పట్టుకున్నాది. అందరూ యిదీ మా వదిన నాగ సచ్చిపోతాదన్నారు. యిరుగు పొరుగోలు వాకిటేసే మన్నారు. నాను ఒద్దంటే ఒద్దన్నాను. నాకు సాలా దయిరం వున్నాది. నా గీతలో నా కొక పెళ్ళావనే వున్నాది. దానికీ అదే దయిరం. ఒంటి మీద సొత నున్నప్పుడు నన్ను చూసి నా సెవులో అన్నాది. "నాను సచ్చిపోనంటే సచ్చిపోను. ఆ బాబు సెప్పినాడు. కదా నీకు నా నొక్కర్తినే నని." వయిదుగుడు ఏదో సూరి పోసినాడు. మా వదిన కేసిన మందేనా అది! ఆడికొమాట దక్కిపోవాలని గానీ— నా సేతిలో వున్నట్టు జరక్క మానాదా? బెతికింది. ఇంకా పనిపాటల్లోకి యెల్లనేదు. అప్పుడు నుంచీ బాబుని సూడాలని మా యెత పడుతోంది."

నేను నిలువునా నీరై పోయాను. కొంత సేపటి వరకూ నా నోరు పెగల్లేదు.

"సరే! నడు మీ యింటికి వెళ్దా మని" ఆనందంతో అంగలు వేసీ లొట్టె వెంటపడ్డాను.



విస్మృత కవీంద్ర నీరాజనము

★

శ్రీ ఈయుణ్ణి వెంకట వీరరాఘవాచార్యులు

కాలగర్భమున నిలీనులై, విస్మృతిధూళి ధూసరిత కీర్తికాయులైన మిథిలాదేశసంస్కృతకవులను కొందఱను గూర్చి యిట ప్రసంగింపబడును:

౧. కృష్ణానన్దఠక్కురుడు—
(క్రీ. ౧౮ వ శతాబ్ది)

మిథిలాదేశాధీశ్వరుడగు మహారాజ మాధవ సింహ (క్రీ. శ. ౧౭౭౫ - ౧౮౦౭) ప్రభువునకు జ్యేష్ఠకుమారుడు కృష్ణానందుడు. మిక్కిలి చిన్నతనముననే యీ రాజకుమారుడు స్వర్గవాసి యగుటచే నీతనికి సింహాసనాధిరోహణభాగ్యమే పట్టలేదు. ఈ కుమారకవిరచనగా నొక్కపద్యము మాత్రము 'విద్యాకరసహస్రక' మను సుభాషితమధుకోశమున లభించుచున్నది. దామోదరాసక్తచిత్తయగు నొక భర్తురాలి కంఠోక్తి కృష్ణానందుని యీ క్రింది శ్లోకమున ప్రకటింపబడెను:

శ్లో. 'నిన్దతు నామ ననన్దా,
హసతు సపత్నీ, పతి స్త్యజతు,
ఉచ్చైరిదం వదామో,
మమసఖి దామోదరః సకలమ్.' (౪౭౮ పద్య)
—('ఖిన్నవలాసం. కృష్ణానన్దఠక్కురస్య')

౨. కృష్ణపత్యుపాధ్యాయుడు:
(క్రీ. ౧౮ శతాబ్ది)

మైథిలుడగు కృష్ణపతి 'సకరార్థి' కుటుంబమునకు జెందినవాడు. ఈపండితుని 'అన్వయలాపిక' అను రఘువంశవ్యాఖ్య క్రీ. ౧౭౮౨ లో (శక. ౧౭౦౪) పూర్తిచేయబడెను. కావున నీతడు క్రీ. ౧౮ వ శతకమున నుత్తరార్ధమునకు చెందు ననదగును. తత్కృతు లింకనేమైన నున్నవో, లేవో తెలియదు. ఆయనపేరున మూడు శ్లోకములు మాత్రము లభించినవి.

౧. భ్రమరాన్యోక్తి—
'కతి సన్తి లతా విపినే కుసుమ-
స్తబకానమితాః ఖలు పల్లవితాః
ప్రతిచమ్పక చన్దననీపవనీ-
నవపఙ్కజనీ మధుసంవలితాః,

౨. 'సుచిరం కుసుమేషు పరిభ్రమతా,
నచ మాలతి కాపి తథా మిలితా,
మధుపేన పునర్మధుపానవిధౌ

హృదయే న యథా భవతీ కవితా' (విద్యా. స. ౨౭ పు. ౧౫౨ ప.) 'పత్నీసం. కృష్ణపత్యుపాధ్యాయస్య'.

పైపద్యములకు ప్రతిగా— సమకాలికుడే కావలయు—ఇంకొక కవి రచించిన యీక్రింది పద్యములు 'విద్యాకరసహస్రకము'న పాదజ్ఞాపికలో నొసంగబడినవి:

"కేనచిదన్యేన కవినా ఇత్థం వర్ణితమ్.—

౧. 'కతి సన్తి లవఙ్గలతా లలితా,
నవకోరకితా ధరణీసుతలే,
కతి బన్ధురగన్ధ భృత స్తరవో
గురవో నివసన్తి గిరౌ మలయే.

౨. అయి మాలతి! సౌరభసారవినిర్-
జితసంవికసత్కమలానిలయే,
మధుపానవిధౌ మధుపస్య పునర్
భువనే భవతీ మహమాకలయే'- (విద్యా. ౨౭ పు.)

౩. జ్యోత్స్నాభిసారికావర్ణనము—
'గగనే బహుగర్జతి వారిధరే,
పరిసర్పతి సర్పఫణానికరే,
పరివల్గతి రక్షిజనప్రకరే
తమసా పరిలుప్తదిశః ప్రకరే.

౪. భవనాదనురాగవశా దనయా,
నవకజ్జ్వవిలోకనయా చలితమ్,
కరుణావరుణాలయ తే తపస-
స్తరుణా గురుణా సహసా ఫలితమ్.' - (పల్లీసం. కృష్ణపత్యుపాధ్యాయస్య'.)

—విద్యా. స. ౭౨ పు. ౪౧౩ ప,)

పైశ్లోకములు రెండు నొకటిగా ముద్రింపబడినవి.

3. విశ్వేశ్వరోపాధ్యాయుడు :
(క్రీ. ౧౭ వ శతాబ్ది)

విశ్వేశ్వరమిశ్రుడు (లేక ఉపాధ్యాయుడు) మిథిలా దేశమున విఖ్యాతమగు 'హరిఅమ్మయ' వంశమునకు చెందినవాడు. కుముదినీదేవి యాతని ధర్మపత్ని. ఈయన దర్భాంగరాజవంశమునకు బంధువు. ఈ క్రింద సూచింపబడు రఘుదేవమిశ్రసరస్వతి యను విఖ్యాత విద్వత్కవి విశ్వేశ్వరుని తనయుడు. విశ్వేశ్వరుని కృతి 'స్మృతిసముచ్చయ' మనుధర్మశాస్త్రగ్రంథము. రాధాకృష్ణవర్ణనాత్మకమగు నొక చక్కని శ్లోకమతని కృతముగా నుపలబ్ధమైనది:

'కూలే కాచిత్తపనదుహితుర్నిర్జనే నీపమూలే,
మూర్తిః పీతామ్బరవలయి తాలేఖి కేనాఙ్గనేన,
ద్రాఘ్లాగ్నా యదవధి పునస్తచ్ఛవిర్లోచనాస్తే
శ్యామా కౌరస్తదవధిమయా పశ్యతే విశ్వమేతత్'
—(విద్యా. స. ౯౫ పు. ౫౬౦ ప.-'పల్లీసం. విశ్వేశ్వరోపాధ్యాయస్య'.)

౪. రఘుదేవమిశ్రసరస్వతి :
(క్రీ. ౧౭ వ శతాబ్ది.)

పైని పేర్కొనబడిన విశ్వేశ్వరమిశ్రునకు కుముదినీదేవికి తనయుడు. రఘుదేవమిశ్రుని కనుజుడు సదానందుడు. దిగ్దంతులవంటి జగన్నాథ పండితరాయలు మొదలగు మహామహులతోపాటుగ నీతడును 'షాజహాన్' (పాలన—క్రీ. ౧౬౨౮-౫౮) దర్బారు నలంకరించి, యక్కడనే సార్వభౌమప్రశంసాత్మకముగ 'బిరుదావళి' యను సుదాత్తకృతిని రచించి, చక్రవర్తి నుండి 'సరస్వతి' యను బిరుదము నందెను. నిరుపమాన మనోజ్ఞమగు నీ బిరుదావళిని కవి తనయనుజుడగు సదానందమిశ్రున కంకితమొనరించెను.

రఘుదేవుని పత్ని రంభాదేవి. వీరి కిరువురు తనయులు— సచలమిశ్రుడు (భవానీనాథమిశ్రుడు), మోహనోపాధ్యాయుడు. వీరిరువురు నఖండవిద్వాంసులే.

రఘుదేవమిశ్రుని 'బిరుదావళి' వ్యాఖ్యాన్విత ముగ కొంతకాలము క్రిందట కాశీనగరమున ప్రకటింపబడెను. స్వయందౌత్యమును వర్ణించు నీ మనోహర శ్లోకము సుభాషితకోశమున లభించుచున్నది—

శ్లో. 'ఉచ్చైస్తనస్త మభిగమ్య ఘనం తవాహ
మభ్యాగతోఽస్మ్యతిథిరేష పయోధరార్థీ,
వక్తుం త్రపా, తదపి వచి మ్మవిమూరబన్ధోః
కాఠిన్యమస్తి చ పయోధరయో ర్మమాపి.
—(విద్యా. స. ౭౭ పు. ౪౪౯ ప.— 'రఘుదేవమిశ్రాఖ్య- శ్రుతిధరస్య.')

పైపద్యమున కనుబంధింపబడిన కవినామముతో 'శ్రుతిధరస్య' అనియునుండుటచే రఘుదేవమిశ్రునకు 'శ్రుతిధరుడు' అని బిరుదమున్నట్లు తోచును. వినిన దానిని విస్మరింపని శేముషీ సంపదగలవాడని పైబిరుదమున కర్థము. క్రీ. శ. ౧౨ వశతాబ్దియందు విలసిల్లిన వంగదేశాధీశ్వరుడగు లక్ష్మణసేను నాస్థానము నలంకరించి, 'పవనదూత' మనుమనోహర కావ్యమును రచించినకవిచక్రవర్తి ధోయీకవికి 'శ్రుతిధరు' డని బిరుదమున్నట్లు—

'శృంగారోత్తరసత్ ప్రమేయరచనై రాచార్య
గోవర్ధన—
స్పర్ధీకోఽపి న విశ్రుతః శ్రుతిధరో
ధోయీ కవి క్ష్మాపతిః.'

అను గీతగోవిందశ్లోకమునుబట్టి తెలియుచున్నది.

౫. సచలమిశ్రుడు:
(క్రీ. శ ౧౮ వ శతాబ్ది)

భవానీనాథమిశ్రుడని యాతని మొదటిపేరు. 'సరిసవ' మండలమునందలి 'పహితోల్' (PAHITOL గ్రామవాస్తవ్యుడు. పై రఘుదేవ మిశ్రునకు రంభాదేవికి తనయుడు, తరువాత పేర్కొనబోవు మోహనోపాధ్యాయున కగ్రజుడు. సచలమిశ్రుని గురువు చిత్రధరోపాధ్యాయుడు. ఈ చిత్రధరుడు 'మజ్గరౌనీ' గ్రామవాసియు, శకటగ్రంథనిర్మాణ దక్షుడునగు

గోకుల నాథోపాధ్యాయునకు దౌహిత్రుడు. ధర్మ శాస్త్రమున కూలంకషవైదుషీ భూషితుడగు సచల మిశ్రుడు నాడు బీహారురాష్ట్రమున నున్నతన్యాయస్థానమున ప్రధానన్యాయాధీశుడు (Chicf Justice) x కొంతకాలము బహుసమర్థతతో నుద్యోగము చేసెను. అభియోగ విచారణానంతరమున సంస్కృతమున నీయన రచించిన (తీర్చినతీర్పులు) పరిష్కారములు 'బీహారొత్కలగవేషణ పరిషత్పత్రిక' లో (Journal of the Bihar and Orissa Reseach Society 1920) ప్రకటింపబడినవి. విస్మయజనకమగు నీయన ప్రౌఢపాండిత్యమునకలరి, పూనానగరమున మాధవరావు నారాయణపీష్వ సచలమిశ్రుని పల్లకిని స్వయముగా తన భుజస్కంధముపై నెత్తుకొని మోసెనట! సచల మిశ్రుని తీర్పులలో కొన్నిటికాలము క్రీ. ౧౬౯౪ (=శకము. ౧౬౧౬.) ఈయన రచించిన 'ఆర్యాసప్తశతీవ్యాఖ్య' నీతని మునిమనుమడగు కే. శే. కేశిమిశ్రుడు ప్రకటించెను. సచలమిశ్రకృతము లగు నీక్రింది శ్లోకములు సుభాషితకోశమున లభించినవి.—

౧. 'దూరప్రసారిగుణతః
కేవల మన్తర్మధురస ప్రవణమ్.
కలయసి కిమస్య సరళే
కేతకకుసుమోపమానస్య.

—(విద్యా. స. ౧౦౦ పు. ౫౯౩ప.—'సచలమిశ్రస్య')

౨. భవసాగరతరణోపాయము—

'రే చిత్త! చిన్తయ చిరం చరణౌ మురారేః,
పారం గమిష్యసి యతో భవసాగరస్య,
పుత్త్రాః కళత్రమితరే సుహృదః సఖాయః,
సర్వం విలోకయ సఖే! మృగతృష్ణికేవ.

—(విద్యా. స. ౧౩౫ పు. ౯౧౩ప—'సచలమిశ్రస్య')

౩. భగవదనుగ్రహస్తుతి—

'మయ్యేవ జీర్ణతాం యాతు, యత్ త్వయో పకృతం హరే,
నరః ప్రత్యుపకారార్థీ, విపత్తిమధికాంక్షతి.'

—(విద్యా. స. ౧౩౬ పు. ౯౧౯ ప. సచలమిశ్రస్య)

౯. మోహనోపాధ్యాయుడు :
(క్రీ. ౧౮ వ శతాబ్ది)

దర్భాంగ మండలమునందలి 'సరిసవ' గ్రామవాసియే యీతడును. రంభాదేవీ-రఘుదేవ మిశ్రులకు కుమారుడు, పైని పేర్కొనబడిన సచల మిశ్రున కనుజుడు. ఈయన రచించిన కృతి 'రాధానయన ద్విశతీ కావ్యము' నీతనిముని మనుమడు కొన్నియేండ్ల క్రిందట ముద్రింపించి, ప్రకటించెను.

క్రీ. ౧౬౮౯ లో పూర్తిచేయబడిన చతుర్భుజుని 'రసకల్పద్రుమము'న నుదాహరింపఁబడిన మోహన మిశ్రుఁడు మోహనోపాధ్యాయునికంటె భిన్నుఁడు, పూర్వుఁడు నని యెఱుఁగఁదగును.

ఉపలబ్ధములగు మోహనోపాధ్యాయుని పద్యములు నాలు గిట నుదాహరింపఁబడును :

1. సింహాన్యోక్తి—

శా. 'యూనాం యేన విభిన్నవారణఘటా
కుమ్భోచ్ఛలన్మౌక్తిక -
శ్రేణీభిః పరిపూరిత స్తటభువో
భూమీభృతాం కోటిశః,
తస్యైవాద్య నివాససీమ్ని కలభాః
క్రీడన్తినిః సాధ్వసం,
హా రీన్ద్రస్య జరాతురస్య యదహో
జీర్ణో జిగీషారసః.'

—(విద్యా. స. 6 పు. ౩౧ పు. మోహనోపాధ్యాయస్య;)

రసికజీవనమ్ 111 434 ప.—కవి నామరహితము; రత్నభాండాగారమ్. 242 పు. ౮౭ ప.—కవి పేరు లేదు.)

2. సింహాన్యోక్తి :—

శా. 'ఏతస్మిన్నపి నే మయూ బలవతా
నాజ్ఞాపితాః కే మృగాః,
కస్మైవా న ఫలం పికీర్ణముచితం
రోషస్య తోషస్య చ,
సోఽహం మూషకమద్య బన్ధనగుణ-
చ్ఛేదార్థ మభ్యర్థయే,
నాస్థాం సోఽపి కరోతి దగ్ధహృదయం
ద్వేధా న కిం భిద్యసే.'

—(విద్యా. స. 8 పు. ౩౮ ప.—
'మోహనోపాధ్యాయస్య.')

3. (అ) చంపకాన్యోక్తి—

'సాధారణ తరుబుద్ధ్యా
మయా న బద్ధస్తవాలవాలోఽపి,

లజ్జయసి మామిదానీం
చమ్పక ! భువనాధివాసిభిః కుసుమైః'

—(విద్యా. స. 51 పు. ౨౫౫ ప.-
'మోహనోపాధ్యాయస్య'

జల్హణుని 'సూక్తిముక్తావళి', 112 పు. ౯౦ ప. 'పద్యరచన', 93 పు. ౮ ప; 'సుభాషితరత్నాకర', 245 పు. ౧ ప; 'సు. ర. భాండాగార'- 238 పు. ౬౮ ప. కాని, క్రీ. 1257 లోఁ బూర్తి కావింపఁబడిన జల్హణుని సంధానగ్రంథములోఁ బైశ్లోకము కానవచ్చుటచే నీపద్యము పూర్వకవికృతమే కాని, మోహనోపాధ్యాయునిది కాదని కంఠోక్తముగా నుడువఁదగును.)

3. (అ) కుముదినినిగూర్చి అన్యాపదేశము—
'మిత్రోదయేఽపి కుముదిని ! విహసనస్యైవ,
గోష్ఠాకరే వికాసం వహసి సదైవ.'
—(విద్యా. స. 143 పు. ౧౬౦ ప.—
'మోహనశర్మణః'.)

౭. ధీరేన్ద్రోపాధ్యాయుఁడు
(క్రీ. ౧౮ వ శతకము)

క్రిందటి శతాబ్దమున మిథిలాదేశమున కలంకార ప్రాయులగు సంస్కృతవిద్వద్బ్రాహ్మణులలో నొకఁడు ధీరేన్ద్రపండితుఁడు. దర్భంగమండలము నందలి 'యమసము'గ్రామ మీయన వాసస్థానము. మహావిద్వాంసుఁ డగుటచే నీయనయే స్వయముగా తన తటాకమునకు సంబంధించిన 'చాతుశ్చరణ యజ్ఞము' చేయఁగలిగెను. మఱియు రజతతులాభారము తూగి, రజతతులాదాన మొనరించెను. ఈతని రచనలుగా నీక్రింది పద్యములు లభించినవి.—

1. భ్రమరాన్యోక్తి :
'భవతీం హృదయే వినిధాయ చిరా
దివా (వతాః?) పరిఘాయ లతా లలితా,
భవదీయ మమన్ద మమన్ద రసం
సరసం పరిపాతు మలిః కమితా,'

2. 'సవిధే తవ సమ్ప్రతి తేన కథం
కథమప్యథవా దివసా నమితాః,
యదినైవ వికాసమురీకురుషే,
వద మాలతి కాఽస్య గతిర్భవితా.'
-('ధీరేన్ద్రోపాధ్యాయస్య')
—(విద్యాకరసహస్రకమ్, 23పు. ౧౨౬ప.)

పైశ్లోకములు రెండును పొరపాటున కాఁబోలు ఒక్క శ్లోకముగా పై సంధానగ్రంథమున ముద్రింపఁబడినవి.

3. నాయకుని శృంగారచేష్టలను గూర్చి సఖితో నాయిక పలుకుట.—
'కుసుమాపచయాయ పురోపవనే,
నవమల్లిఘనే గత మద్య మయా,
పతితోఽలిగణః స కురఙ్గమదే
మధురస్యతిసౌరభ లుబ్ధతయా.'

4. 'అపసారిత ఏవ స పాణియుగే-(?)
న తదాకరుణేన సఖి త్వరయా,
తనతుద్వ్యజితం యదురోభవయోః
రుచితం నఖచిహ్న పరంపరయా.'
—(ధీరేన్ద్రోపాధ్యాయస్య.')
—(విద్యాకరసహస్రకమ్. 113పు. ౬౬౫ప.)

5. 'కతిచిద్దివసాని తయా గమితా-(?)
ని గృహే తవ సఙ్గమరోచనయా,
కతిచిద్విపినే నలినీశయనే
వచనేన పికీమదమోచనయా.'

6. 'నవనేఽపి రతి ర్భవనేఽపి నయం,
ప్రతిరూప వినిర్జితరోచనయా,
కరుణావరుణాలయ కిం క్రియతా
మరుణాయతపఙ్కజలోచనయా.'
—(ధీరేన్ద్రోపాధ్యాయస్య)
—(విద్యా. స. 113పు. ౬౬౯ప.)

7. దీపికాన్యోక్తి—
'మన్దిర తిమిర మపాకురు
దీప ! హిమాంశుం కిమాక్షిపసి?
భవనాద్ధ(ద్వ?) పిండ్మనాగపి
పవనాత్పరిశీల యాత్మనమ్.' -('ధీరేన్ద్రో పాధ్యాయస్య.')
—(విద్యా. స. 127పు. ౭౫౯ప.)

౮. హాల్లీశశర్మ :
(క్రీ. 19 వ శతాబ్ది)

హాల్లీశ పండితరత్నము దర్భంగ మండలము నందలి హరినగరవాసి. క్రీ. శ. 1850 ప్రాంతముల జీవించినయీవిద్వదవతంసముమహావైయాకరణుఁడు, తాంత్రికమూర్ధన్యుఁడు, ధర్మశాస్త్ర నిష్ణాతుఁడునై విఖ్యాతినందెను. పైన పేర్కొనఁబడిన ధీరేన్ద్రోపాధ్యాయున కితఁడు సమకాలికుఁడు. బహుశః హల్లీశుఁడు ధీరేన్ద్రుని కాశ్రితుఁడో, అన్తేవాసియో కావచ్చును. ధీరేన్ద్రుని ఘనతను ప్రశంసించు నీక్రింది పద్య మొకటి మాత్రము హల్లీశుని రచనగా లభించినది—

'న కోఽపి చాతుశ్చరణే సమర్థో,
న రాజతీయాసు తులాసు యోగ్యః,
తవైవ ధీరేన్ద్ర ! గుణైరుదారై
ర్విరాజతే సమ్ప్రతి తీరభుక్తిః' ('హల్లీశశర్మణః.') —(విద్యా. స. 147పు. ౯౫౫ప.)

కథానిక:



అబ్బాయి చదువు

★

శ్రీమతి కె. శ్యామల

వెంటపడ్డాడు. వెళ్లవయ్యా అని గొంతుక చించుకొన్నా వెళ్లడు. వెళతావా లేదా అని హోదా పురస్కరించుకొని డబాయించినా వెళ్లనిదే! 'బాబుబాబు' అంటూ చేతులు నలుపుతూ కూడానే వచ్చాడు. ఎంతసాహసం? పదిగంటల నుండి రాతిగోడలమధ్య కిరాతిలా కాగితాలతో పోటాడి అలసిపోయిందేమో ప్రాణం. కాసిన్ని టీ నీళ్లు పోసుకొందామని తను స్థానం కదిలి వచ్చింది. స్వర్గానికి వెళ్లినా విడాకులు తప్పవన్నట్టు వదిలితేనా? పైగా తన మహాభాగ్యపు టీ నీళ్ల బిల్లు చెల్లిస్తాడా? అంతకంటె అప్రతిష్ఠ మరేముంది? పరువూ ప్రతిష్ఠా నాలుగు నాళ్లపాటు నిలబడాలా? లేక తాలూకాఫీసు గుమస్తా గాడికి టీ నీళ్లపాటి గతి లేదనా? ఏమి టాతని ఆంతరంగికం? మరునాటినుండి ఫలానా గుమస్తాకి 'టీ యిప్పించానోయి' అని స్వంత డబ్బా వాయించుకొంటాడు. అదేదో చరిత్రాత్మకమైన సంఘటనల్లే. అంతటితో సరా? అఫీసులో పకపకలు! వికవికలు. ప్రాణానికి తికమకలు! ఛీ! ఛీ! పోటిగుమస్తా లేమిటి, బంట్రోతులేమిటి 'కప్పుకర్తి రాయుడు' అనే నామకరణము, కాదు, బిరుదు అయాచితంగా ప్రసాదించరూ? ఎంత బలవంతాన వాడిని కొడని స్వంతడబ్బులు—అణా తక్కువ అరవైఏడు రూపాయిలలోని విన్ని-ఇవ్వగలిగాం. రామరామ. ఈ గుమస్తాగిరి ధరించి స్వతంత్రంగా కాసిన్ని టీ నీళ్లు గొంతుకలో పోసుకోడానికి అర్హత లేకపోయింది. అంతటితో రభస అంతమైనా ఒకపాటి అందంగా వుండేదే? పాతకోటు చిల్లుజేబులోని కరింబీడీ అందించుకొందామని సోడా దుకాణం దగ్గరకు వెళితే అక్కడికే తయారే! కట్టుకొన్న పెళ్లాం చుట్టూ ఏ మగాడూ అలా తిరగడేమో! పెట్టమారి మగళ్లకంటె కనా కనిష్ఠమైపోయిం దీగుమాస్తా రాయిళ్ల బ్రతుకు. తగుదునమ్మా అని పదిరూపాయిల కాగితం గాలికి రెపరెపలాడిస్తాడా? ఎంత తేలికయి పోయిందీ గుమాస్తారాయిళ్ల ఆయుర్దాయం. అసలు తేలిక చేసుకున్నదీ గుమాస్తా రాయిళ్లేనేమో!

తన కళ్లెదుట మొన్నమొన్న గుమాస్తాలయిన కుర్రకారు ఎంత విలాసంగా వుంటోంది. గంటగంటకీ వరండామీద నిలబడి సిజర్ సిగరెట్లు ఊదిపారేస్తున్నారు షోకుగా. ఎప్పుడూ సిల్కులాల్చీలు ఒయ్యారంగా అలంకరించుకొంటున్నారు. మరి తనకెప్పుడూ తాతలనాటి పాతకోటే. బహుశా శ్రీమంతులయి వుంటారా కుర్రగుమాస్తాలు!

వారు శ్రీమంతుల సంతు. మరి శంకరం మాటేమిటి? తనతోబాటు ఉద్యోగంలో ప్రవేశించాడు. తనకెంత జీవనాధారం వుందో శంకరానికి అంతే. ఎటొచ్చీ తాను పెద్దగుమస్తా. అయినా శంకరం ఎంత నిర్విచారంగా ఉల్లాసంగా ఉంటున్నాడు. యువక గుమాస్తాలను సరిసమానంగా వెలిగించేస్తున్నాడు ప్రభ. సంసారంలో కూడా శంకరానికేమీ చినుకూ చీదర వున్నట్టు తోచదు. ఏమిటీ చిదంబర రహస్యం?

* * *

సుబ్రహ్మణ్యంకి ఇద్దరు మగపిల్లలు. ఒక ఆడమ్మాయినీ. సంతాన రేఖ కొంతవరకు బాగానే వుంది. సరదాగా ఏ జ్యోతిష్కుడికి చేయి చూపినా ఈ విషయాన్ని చెబుతూనే వున్నారు. కాగా, తనకు పెద్ద సమస్యైనా, ఏ జ్యోతిష్కుడూ చెప్పలేకపోతున్నదైనా ఒకటే ఒకటి. పెద్దబ్బాయి తెలివి తేటలే ఈ సమస్యని తెచ్చిపెట్టింది. కొడుకు తెలివితేటలు తండ్రికో తీరని సమస్య రేపెడుతూన్నదనడం విచిత్రంగానే తోస్తుంది. సుబ్రహ్మణ్యంలాంటి వాళ్లకివినా.

స్కూలు ఫైనల్ చదువుతున్నాడు. పట్టుమని పదిహేనేళ్లుండవ్. మొనమొన్ననే వయోల్బణం తగ్గించడానికి దరఖాస్తు చేశాడు. పదిహేను రోజులకి పబ్లిక్ పరీక్షలు. ప్రతీ సబ్జెక్టులోనూ ఫస్టుమార్కు వస్తోంది. స్కూలు ఉపాధ్యాయులెన్నోసారులు తన సమక్షంలో అభినందనలు చేశారు. కొడుకంత గొప్పగా చదువుతుంటే ఏ తండ్రికి ఆనందంగా వుండదు? సుబ్రహ్మణ్యంకి ఆనందం లేదు ఆక్రందం తప్ప. స్కూలు ఫైనల్ స్కూలుఫస్టుగా ప్యాసవుతాడు. ఖాయం, ఎల్లిరణమ్మెకాదు, జయమూ ఖాయమే. మరి? కాలేజి చదువు చెప్పించాలి. ఎల్లాగ? ఎల్లాగో తెలిస్తే, దారిదొరికితే కొడుకు ప్రయోజకత్వానికి సుబ్రహ్మణ్యం ఆనందించేవాడే. తీరని పెద్దసమస్యలోపడి గుంజాటన పడడం దేనికి! రజిత సువర్ణపతకాలు సంపాయించిన జ్యోతిష్కులు చుక్కలు లెక్కపెట్టడానికి దిక్కులు చూడవలసిన గతేమిటి?

అబ్బాయి చదువుసంగతి గుర్తుకురాగానే సుబ్రహ్మణ్యం కలం ఆగిపోతుంది. నీరసంగా నిస్పృహతో రాతిగోడలమధ్య ఆఫీసుఆవరణలోని శూన్యాన్ని చూస్తాడు. పది నిమిషాలపాటు ఆగిపోయినకలం సాగిపోదు. అదే అవస్థ ఇప్పుడూ కలిగింది. సుబ్రహ్మణ్యంకి. లంచమిస్తున్న వ్యక్తిని వదిలించుకొని కుర్చీమీద కూర్చుండగానే అబ్బాయి చదువుగుర్తువచ్చింది. దేభ్య మొహం పెట్టి పక్క గుమాస్తాలవంక చూశాడు.

'అయ్యా!'

పరధ్యాన ప్రవాహం కెరటాల మధ్యనుంచి ఉలిక్కిపడ్డాడు. కాకీవస్త్రధారి కవరు చేతి కందిచ్చి వెళ్లిపోయాడు.

తంతివచ్చింది! గుండెలు గుభేలు మన్నయ్. టేబిలుమీద ఫయిల్స్ పేజ్సు ధభేలు మన్నాయి. కొంపదీసి ఉద్యోగం ఊడిందని గాలేదుగదా అన్నంత పర్యంతమూ బేజారయిపోయాడు. తన జీవితానికి మునుపు తంతివచ్చిన సాహానపోలేదు. ఇప్పుడెక్కడనుండి వచ్చిందో? ఏమని వచ్చిందో? ఏమి ఉపద్రవం రానున్నదో? రకరకాలు భావశకటాలు పరుగు తీశాయి సుబ్రహ్మణ్యంచిన్న మెదడులో.

చీకట్లు కమ్మిన కళ్లకి వణికే చేతులు చించితీసిన కాగితం మసకగా కనిపించింది. అక్షరాలు అలుక్కుపోయినట్లున్నాయి. మెల్లిగా బలవంతంగా కళ్లు విప్పక చూశాడు.

'రాఘవయ్య. సీరియస్.

రెండే రెండు మాటలు. ఉస్సురనుకొన్నాడు పట్టపగ్గాలు లేకుండా పొంగి పొరలివచ్చిన ఆవేగపు ఉప్పెనలు తగ్గుమొహంపట్టాయి. పూర్తిగామాత్రం పోవటంలేదు.

* * *

రాఘవయ్య మొదట్లో సామాన్య సాధారణ కుటుంబీకుడే! ఎటొచ్చీ యుద్ధపురోజుల్లో బాగుపడ్డ వాళ్ళలో వొకడు. పెద్దమ్మాయి సావిత్రి పెళ్లి బీదరికంలోనే చేశాడు. కాగా తతిమ్మా ఇద్దరమ్మాయిల పెళ్లిళ్లు నాలుగురాళ్లు సంపాయించిననాడు చేశాడు. ఒకటికంటె రెండు, రెండుకంటె మూడు ఎక్కువయినట్టె ముగ్గురమ్మాయిల సంసారాలు క్రమంగా హెచ్చుస్థాయికి చేరుకున్నాయి. ముగ్గురమ్మాయిల పెళ్లిళ్లుచేసి కాపరాలకు పంపించిన ఏడాదికి రాఘవయ్య భార్య స్వర్గస్థురాలయింది

తల్లి మరణ సందర్భాన వచ్చిన కూతుళ్లు తండ్రిని ఎవరిమట్టుకు వాళ్లే తమయింటికంటే తమ యింటికి వచ్చివుండమని మారామూ, గారామూ చేశారు. కాని రాఘవయ్య సుతరామూ ఇష్టపడలా. తండ్రి మనస్తత్వమేమిటో ఒక్క కూతురికీ, ఒక్క అల్లుడికీ బోధపడిందికాదు. ముసలాయన ఏదో అంటే ఏదో అనుకున్నారు. అజాపజా చూచేవాళ్లు మరెవ్వరున్నారు, మేము పరాయి వాళ్ళమా అని సావిత్రి నొక్కి మరీ అడిగింది. ససేమి రానంటే రానన్నాడు. ఎందాకని బ్రతిమాలుతారు. కార్యకలాపాలు అయిన వారంరోజులకి ఎవరి ఇళ్లకి వారు పోయేరు. ఇరుగూపొరుగూ, అమ్మాయిలమీద దాడి చేశారేకాని వారికేం తెలుసీ రహస్యం? లోకంకనుక చెప్పకొన్నారంటే చెప్పకున్నారు. అందువల్ల రాఘవయ్యకాని రాఘవయ్య కూతుళ్లకి గాని ఏమీ కొరత రాలేదు. కండూతి తీరిన లోకమే తమాయించుకొంది కొన్నాళ్లకి.

పక్కింటివారు గొప్పసనవంతులే. రానురాను చితికి పోయారు. ఇంటి యజమాని కన్ను మూసిం తర్వాత ఆయనతోబాటు ఆస్థిపాస్థులకి రెక్కలు వచ్చాయి. యజమానురాలు పురాణకాలం నాటిమనిషి. మాయా మర్మాలు తెలియవ్ పాపం. వావివరసలు అల్లుకొని ఎందరో చుట్టాలు పక్కాలు వచ్చేవారు గౌరవభంగం కారాదని ఆయమ యథోచిత సత్కారాలు చేసేది. పర్యాయంగా యజమాని మిగిల్చిన ఆదా కాస్తా బంధువుల హోదాకి సరిపోయింది. ఈనాడు దరిద్ర పిశాచి ఒడిలో ఆతల్లీ కూతుళ్లు దురవస్థల పాలయి జోగుతూన్నారు. ఇప్పుడీ కుటుంబానికి నా అన్న చుట్టాలే లేరు. పస్తులుపడి మాడుతున్నా ఆదరించేవారే అగపడరు, చీదరించేవారే కాని.

భార్యవుండగానే ఆకుటుంబం మీద రాఘవయ్య కోవిదమైన అభిమానము పుట్టుక వచ్చింది. మానవజీవితంలో రకరకాల ఘట్టాలు అనుభవించిన మనిషే. తానొకప్పు డటువంటి స్థితిలోంచి పైకి వచ్చాడు. కాగా పక్కింటివారు ఉన్నత శిఖరాల మీదనుంచి అధః పతనం చెందారు. ఎన్నోవిధాల తల్లీకూతుళ్ల అవస్థలుచూసి పరితపించేవాడు. మొసలి కన్నీరు నించడముకాక సాయసంపత్తులా మెలిగే వాళ్లు, భార్యపోగానే పక్కింటివారు బాగా ఆకర్షించారు రాఘవయ్యని. ఒకనాటి భవంతి అమ్మడు పోగా పూరిగుడిశలో ఈదురో మంటూవున్న వారికి తనయింటిలో ఆశ్రయమిచ్చాడు. తనకీ అవసాన సమయంలో వారే ఆసరా. మంచికీ చెడుకీ రాఘవయ్యని కనిపెట్టుకునే వుంటున్నారు వారున్నూ.

పక్కింటి వారమ్మాయి లీలంటే రాఘవయ్యకి పంచప్రాణాలున్నూ. పట్టుమని పదేళ్లు లేనిదే లీల ఇటు తనకీ అటు తల్లికీ ఎంత మెళుకువతో పరిచర్యలు చేస్తోంది! లీలయొక్క భవిత్యం కోసమే ఏవేవో కలలు కాంచేవాడు రాఘవయ్య.

అంతిమ ఘడియల్లో అటు నిరుపేదల్ని ఆదరించినట్టూ అవుతుంది, తన్ను తాను ఆదరించుకొన్నట్టూ అవుతుందని. రాఘవయ్య కార్యరంగాన్ని ఆమోదించి ఆనందించింది వొక్క పెద్దమ్మాయి సావిత్రి. తతిమ్మా ఇద్దరు కలవారి కోడళ్లు. తండ్రి యెందుకలా డబ్బు పరాయివాళ్ళపాలు చేయాలని గుసగుసలే! తనయల మనస్తత్వాలు కూడా గ్రహించాడు రఘవయ్య. ఆచారాల పేరిట తప్పని సరిగా కుమార్తెల యింటికి వెళ్ళి నాలుగేసిరోజు లుండవలసి వచ్చింది. అప్పుడు తారతమ్యాలు తెలిసివచ్చాయి రాఘవయ్యకి.

మొదట రెండవఅమ్మాయి ఇంటికివెళ్లాడు. కస్సుబుస్సులతోనే గడిచాయి నాలుగురోజులున్నూ. ఇదెందుకువచ్చింది రా దేవుడాయనే అమ్మాయి ప్రవర్తిస్తే. వెళ్లిపోయేటప్పుడు మాత్రం కలుపుగోలుతనంగా వుండమన్నది. ఆ వుండమనడానికి అంతరార్థమేమిటో రాఘవయ్యకి అర్థమయింది. చిరునవ్వు మొహంపెట్టి 'ఈసారి అలాగేలే' అనేసి వచ్చేశాడు.

రెండవమ్మాయి నయమనిపించింది, మూడవమ్మాయి. మొహమాటం విడిచి అడిగేసింది. ఎందుకా పరాయివాళ్లకి డబ్బుతగలేయడం. మేము కూతుళ్లము కామా అంటూ ఏమేమో కల్లోలం పెంచేసింది. ముక్కుమూసికొని మూడురోజులు గడిపాడు రాఘవయ్య.

సావిత్రి — పెద్దమ్మాయి, ఇంటికి వెళ్లడం త్వరలో కుదరలేదు రాఘవయ్యకి.

కారణం పెద్దమ్మాయి సంసారం ఆర్థికదుస్థితిలో వుండటమే. అయినా తనకి పెద్దమ్మాయి బాగా అద

రణ చేసింది. పెద్దమ్మాయి ఇంట్లోనే వుండిపోదామని నిర్ధారణకుకూడా వచ్చాడు. కాని ఎందుకో అలా చేయలేకపోయాడు.

కావలసిన సంబంధం కాకపోయినా, కావలసిన సంబంధంలాంటిదే. వేలువిడిచిన మేనరికం. చదువుకొన్నవాడుకదాయని చేశాడు సావిత్రిని సుబ్రహ్మణ్యంకి రాఘవయ్య. మావగారిపట్లకూడా ఏవీ లావాదేవీలు లేకుండా వున్నాడు సుబ్రహ్మణ్యం.

* * *

తంతిరాగానే గాలికబురు నిజమయింది. మావగారికి జబ్బుచేసింది. పైగా సీరియస్! అధికారిగారి సెలవు తీసికొని సుబ్రహ్మణ్యం ఇంటి మొహం పట్టాడు.

'అబ్బాయిని కాలేజీలో చదివించాలండోయ్ సుబ్రహ్మణ్యంగారూ!'

దారిలో ఎదురైన స్కూలుటీచరు చెప్పడంతో మరింత విభ్రాంతి కలిగింది రాఘవయ్యకి. తప్పనిసరిగా 'అలాగేనండి.' అన్నాడు ముక్తసరిగా.

అన్నాడేకాని ఆ 'అలాగే' అన్నది 'ఎలాగో తన కేమాత్రం తోచదు. దారితెన్నూ కనిపించదు. వేడి నిట్టూర్పు విడిచి దిగాలు మొహంతో ఇంటికి చేరుకొన్న సుబ్రహ్మణ్యం తంతివార్త కాస్త ముచ్చటించాడు సావిత్రితో.

పిడుగు మీదపడ్డట్లయింది సావిత్రికి. పెంచి పెద్దచేసినపితృశ్రీ వయసుమళ్లినవాడు. ఏమో! ఏరోజు ఎటువంటిదో? అనుభవించవలసిన సుఖదుఃఖాలేమిటో అనుభవించేశాడు. కన్నతల్లి కాలంచేసి నాలుగేళ్లు కావస్తోంది! ఒంటరిగావున్నాడు! పరాయివాళ్లు రోగాలప్పుడూ ఎంతని పాకులాడతారు. రక్తసంబంధం రక్తసంబంధమే. ఆరుమూడైనా వెళ్లి ఆపత్సమయాన ఆదుకోవాలి. అప్పుడే తనకు పితౄణం తీరినట్టు.

'మరివెళ్లాలండి.' ఆత్రుతగా అంది.

పెళ్లాన్ని పుట్టింటికి పంపడమే ఒక పెద్దసమస్య సుబ్రహ్మణ్యంకి. అదిగో అదిగో అంటే పదిరోజులకి కాని తిరిగి రావడంపడదు. అయినా భగవంతుడు మేలుచేసి మావగారికి నిమ్మళిస్తేనే. తీరుబడి లేకచస్తూన్న ఈ మహోద్యోగపు హోదాలో తనకి భార్య వచ్చేవరకు స్వయంపాకయోగం పడుతుంది. ఏ యోగమూ తన జీవితంలో లేనప్పుడు ఇదేదో యోగం పడుతుంటే ఉబ్బితబ్బిబ్బయిపోవాలేమో! తండ్రికి జబ్బు చేసినప్పుడు పంపించకపోవడమూ పాడిగాదు. లోకం గేలిసేయడం మాట అటుంచి సుబ్రహ్మణ్యంకే నచ్చడంలా.

'సరేవెళ్లిరా!'

గత్యంతరం లేక సమాధాన మిచ్చాడు.

'సరేకాదండి. మీరూ రావాలి. మావగారాయిరి.'

సావిత్రి మరొక పార్లమెంటరీ ప్రశ్న వేస్తుందనుకోలేదు సుబ్రహ్మణ్యం.

'నేను రావడం కుదరదు.' అన్నాడు సుబ్రహ్మణ్యం. ఆఫీసు అవస్థలలో సగంపాలు పంచుకొంటూనే వుంది సావిత్రి. ఎనిమ్మది గంటలకే వంటపని చేయడమూ రాత్రి తొమ్మిది గంటలవరకు భర్త ఆగమనం కోసం వీధిగుమ్మంలో నిరీక్షించడం రోజురోజూ పరిపాటు పాతమే. ఇప్పుడు వేరే ఎందుకు రావడం కుదరదన్నది, సావిత్రి తరిచితరిచి విషయాన్ని విరిచి విభజించి విమర్శించ నక్కరలే. అయినా పితృమూర్తికి వృద్ధాప్యంలో జబ్బుచేసిందన్న వార్తవల్ల కలత చారిన ఆమె హృదయంలో పర్యావలోకనశక్తి సన్నగిల్లివుండాలి.

'మావగారి జబ్బుకంటె ఆఫీసా?' అని ప్రశ్నించిందంటే సావిత్రి ఆంతర్యమదే.

'పుట్టడం చావడం మామూలే. ఏమీ కొత్తదనం లేదు అందుకోసం ఆరాటపడాల్సిన అగత్యమూ లేదు. నేను వచ్చినంతలో మీ నాన్న జబ్బుతగ్గేదీ లేదు. రానంతలో ఎక్కువయేదిలేదు. కాదంటె విధిగా హాజరుకావలసింది ఆఫీసే! ఆఫీసు!!'

వేదాంతాన్ని సూచించి మరీ యోచించి సమాధానం చెప్పాడు సుబ్రహ్మణ్యం. మరి గత్యంతరమే లేదనో భర్తమాట కెదురే ఆడరాదనో గాని సావిత్రి మరి మాటాడ లేకపోయింది. అదే పదివేలుగా ఆత్మానందం పొందాడు సుబ్రహ్మణ్యం—

* * *

బండి దిగింది. తొలిద్వారం దాటేవరకూ సావిత్రి మనసు మనసులోనే లేదు. తండ్రి కే

వుందని ఆరాటమే. వీధి చావడిదాటి గదిలో అడుగు పెట్టగానే సావిత్రి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయాయి.

రొప్పుతూ రోజుతూ బక్కచిక్కిన అస్థిపంజరం మంచంమీద కనిపించింది. ప్రక్కగా నిలబడ్డ లీల విసనకఱ్ఱ వేస్తోంది. అంతటి ఉపద్రవం కలిగి ఇంతవరకూ తెలియజేయనందుకు సావిత్రికి కష్టమేకలిగింది.

'ఎలావుంది నాన్నా!'

బిక్కుబిక్కుమంటూన్న హృదయంతో జాలిచూపులతో అడిగింది తండ్రిని సమీపించి.

'వచ్చావా అమ్మా...'

అతి కష్టంమీద రాఘవయ్య పెదవులు కదిలాయి. తండ్రి అవస్థ. తలచుకొంటె సావిత్రిగుండెలు గతుక్ గతుక్ మన్నాయి. మాటలు కూడా రావడానికి ఓపికలేదు. లీల, లీలతల్లి తప్ప అక్కడ మరెవ్వరూ లేరు. సావిత్రి ఈపాటికి చెల్లాయిలు వచ్చివుంటారనుకొంది. న్యాయానికి దూరంలో వున్న తన కంటెముందు రావాలిమరి. పైగా చింతా చీకూ లేని సంసారాలువారివి. తనదో? ఒక్కక్షణం గడప దాటితే సాగదు. అబ్బాయి చదువులో వుంటాడు. ఆయనగారు స్వయంపాక యోగాన్ని సాధకం చేస్తుంటారు. చిన్నబ్బాయి ఇంకాగుణింతాల డిప్పకాయి. సరిపిల్ల చంక నేవుంటుంది. మరి చెల్లాయిలో? సిరిసంపదలు గలవారు. స్వగృహాల్లోవున్నవారున్నూ. పదిమంది ఆసరా వున్నవారు. పైగా దాస దాసీజనాలు. వారికేం?

అనుకొన్న ప్రకారం చెల్లాయి లెందుకురానిదీ తెలియలా సావిత్రికి. లీలనిపిలిచి సంగతి సందర్భాలడిగింది. తామేదో దూరగ్రామంలో ఉద్యోగస్థాయిలో వున్నారుకనుక సెలవుదొరక్క రావడంపడదేమో అని ఇంతవరకు కబురంపించ వద్దన్నాడట రాఘవయ్య. మిగతా ఇద్దరికీ కబురుపంపించారట. అయినా రాలేదు. పాపం సమయానికి లీలావాళ్లమ్మ వుండబట్టి సరిపోయింది కాని—

ఎక్కడలేని అభిమానమూ పుట్టుకవచ్చింది లీలంటే సావిత్రికి. లీల మంచి చలాకీ పిల్ల విషాదపు మబ్బుతెరలు మోహంలో తారాడుతున్నా ఏమా కళాకౌతుంలు! చిలిపికన్నులలో వేయి వెలుగులు ప్రసరిస్తున్నట్టే. పైగామాటకారి. ఇంటిపనుల్లో మెళకువలలో అప్పుడే ఆరితేరింది, లీలంటే ఏమో తెలియరానంత ఆకర్షణ కలిగింది సావిత్రికి. ఏవో పాతవరసలుపెట్టి లీల అత్తా అని పిలుస్తుంటే సావిత్రి ఆనంద పారవశ్యంలో తండ్రిజబ్బు మాటే మరిచిపోగలుగుతుంది. ఆ పిలుపులో ఏదో కమ్మదనము, తీయందనమూ మేళవించి హృదయవీణలో కరుణతంత్రుల్ని కదుపుతోంది. సావిత్రి తండ్రి గొప్ప ఉపకారం చేస్తున్నాడని తలపోస్తోంది.

రెండురోజులు గడిచాయి. చెల్లాయిలిద్దరూ వచ్చారు. బూజువారిన గృహంలో మరోసారి ఆనంద కళికలు వెలిశాయి. కాని ఆనందంలో తండ్రి మరణావస్థ ఒకటే కారుచీకటి తెరల్ని కదలిస్తోంది.

సాయంత్రం డాక్టరు వచ్చాడు. ఆయన ధర్మాసుపత్రి వైద్యుడే. గవర్నమెంటు జీతం పుచ్చుకొనే వ్యక్తే. అయినా డబ్బు గుంజడం మానడు. కోటామందుల్ని గ్లూకోజులాంటి పదార్థాలని బజారులో దొరకనిరోజుల్లో నాలుగింతలకి రోగులకు విక్రయించిన ధర్మాత్ముడు. ఏమైనా ఆ ఆపత్కాలంలో ఆపల్లెటూరికి ఆయనే దైవం అటుచూసిటుచూసి డాక్టరు పెదవి విరిచాడు. వెళ్లిపోయాడు.

మూగనోములు పట్టి ముగ్గురు కూతుళ్ళూ తండ్రి మంచంచుట్టూ నిలబడ్డారు. ఒకవైపున లీల, మరోవైపు ఆమెతల్లి. ఇంకా ఇరుగు పొరుగునూ.

'లీ—లా' ఉన్నట్టుండి రాఘవయ్య పలికాడు అందరూ విస్తుపోయారు. అమ్మాయిల కాగ్రహమూ వచ్చింది. సావిత్రి మరేమీ అనుకోలేదు. అవసాన సమయంలోనూ లీలా నామస్మరణమేనా; కూతుళ్లు లేరా అని అందరకీ దుగ్ధ. ముసలాడిపిచ్చితనం, మూర్ఖత అని, పరిపరివిధాల భావాలు పరుగులెత్తాయి అక్కడ వాళ్లకి.

'అబ్బాయిని... చదివించు... లీలని... పెళ్ళి......"

అంటూ తాళంచెవి అందిచ్చాడు సావిత్రి వైపు చూస్తూ రాఘవయ్య. తాళంచెవి ఎవరందుకొంటున్నదీ కనబడనేలేదు రాఘవయ్యకి. కళ్లుమస

కలు కమ్మాయి. అంతే. అనంత వాయువుల్లో కలిసి పోయాయి రాఘవయ్య ప్రాణవాయువులు.

* * *

సుబ్రహ్మణ్యానికి తప్పిందికాదు ప్రయాణం. పెద్దబ్బాయిని వెంటేసుకొని వచ్చాడు. వచ్చిరాగానే వీధిలో ఇద్దరు తోడల్లుళ్లు కూర్చున్నారు. తనరాకతో వారిలో ఏమీ సంచలనం కలగలేదేమో అనుకొన్నాడు. కలెక్టరుగారు వస్తే తాను భయవిభ్రాంతులు చూపేటంతగా కాకపోయినా, గుడ్డిలో మెల్ల, ఇంటికి పెద్దల్లుడు కనక తన రాకను చూసి తోడల్లుళ్లు లేస్తారనుకొన్నాడు. లేవలేదు, సరికదా వారి ముఖాల్లో కళాకాంతులు లేవు. నిశితంగా చూస్తే కరడుకట్టిన నిగూఢ మూకీభావం వారిలో తాండవిస్తోంది. ఏమిటో యనుకొన్నాడు. కాని, సుబ్రహ్మణ్యానికి మావగారి మరణానికి అల్లుళ్లిద్దరూ బాధపడుతున్నారనే భావం కలిగింది. తన కావయసు తీరిన మావగారి మరణం అతిదుఃఖనీయమైనదిగా తోచక పోయినా తోడల్లుళ్లకైనా తోచడం మంచిదే అనుకొన్నాడు. మావగారి ఆత్మకాస్త శాంతిస్తుందని.

నడవాగుమ్మం దాటి లోన అడుగుపెట్టాడు. చిన్న మరదలుపిల్ల కనిపించింది. ఒక్కసారి పురాభావాలు గుర్తుకువచ్చాయి సుబ్రహ్మణ్యానికి. కొంటె కోణంగి మరదలుతో తాను ఎంత వేళాకోళంగా ప్రవర్తించిందిన్నీ తన్ను చూసీ చూడగానే ఆ మరదలు పిల్ల లోపలికి వెళ్లడం మనస్సు చివుక్కుమన్నది.

ఇదంతా తండ్రి మరణానికి విషాదమేనా? కాక కలవారి కోడలును కదా అని అహంభావమా? ఏమో! ఆమెగారి భర్త ధనవంతుడు. గ్రామంలో అతని మాటకి పెద్దచెలామణీ. వేడి పొంగుల యువక రక్తం అతనిలో ఉరకలు వేస్తోంది. ఆ గ్రామంలో అతన్ని పెద్దలు పిన్నలు తలమానిక మల్లే చూస్తారు. ఇదంతా ఆ బాపతు ఆడంబరమే అనుకొని సుబ్రహ్మణ్యం అక్కడో పడక కుర్చీవుంటే ఘటాన్ని వాల్చాడు. పదేళ్లమ్మాయి పాద ప్రక్షాళనార్థం నీళ్లు తెచ్చి పెట్టింది. ఆమెముఖంలో విషాదమూ లేదు ప్రమోదమూ లేదు. నిర్మలత్వంమాత్రం జీరాడుతోంది. ఎవరైవుండాలీ అమ్మాయని తటపటాయించాడు. మావగారింటిలో అమ్మాయీ ఆమెతల్లీ వుంటున్నారని విన్నాడేకాని చూచివుండలేదు. సుమస్తాగిరి కదలని స్త్రీకదూ అత్తవారంటికి రావడానికి! అత్తగారు పోయినప్పుడేమి వచ్చాడో మళ్లీ మావగారు పోయినప్పుడిప్పుడు వచ్చాడు. ఆ అమ్మాయే ఈ అమ్మాయి అయివుంటుం దనకొంటూ పాదప్రక్షాళనాదికాలు పూర్తిచేసుకొని ఉస్సురని కూలబడ్డాడు.

పెద్దమరదలు చావడిలో పచారుచేయడం చూసిన సుబ్రహ్మణ్యానికి మరింత బాధకలిగింది. ఆమె ఎప్పుడూ తనంటే ప్రాణమిచ్చేది. అప్పుడప్పుడు ఆదరణలో సావిత్రి ఏమరినా ఈ మరదలే జ్ఞాపకంచేసేది. సిగ్గుబిడియాలకు లోనుగాక తనకు కనిపించడం కిన్నెర కంఠాన్ని వినిపించడమూ జరిగేది. అటువంటి దిప్పుడామెలో తనంటే నిర్లక్ష్యం వున్నట్లు తోచింది. నిర్లక్ష్యానికి తన దరిద్రముకదా కారణమనుకొన్నాడు. మరుక్షణంలోనే తండ్రిమరణం వల్ల ఇప్పుడామె విషాదంతో వున్నట్లు భావించుకొని తమాయించుకొన్నాడు. మరదళ్లు తోడల్లుళ్లు ఇంత గంభీరత చాటడం ఆకళింపుకువచ్చిన సుబ్రహ్మణ్యానికి కేవలమది రాఘవయ్యస్మృతి విచారమే అయివుంటుందని పించలేదు. ఏదో తన్నా అనిష్టతగానూ చిన్నగానూ చూసినట్లు గ్రహించాడు. అందుకేమీ అవమానం కలగలేదు సుబ్రహ్మణ్యానికి. డబ్బున్నవారు వారు! గ్రాసవాసాలకి సాక్షిలేనివాడు తాను. విభిన్నతర హాలకి పొత్తుకుదరడం కష్టమే అనుకొన్నాడు.

'భోజనానికి లేవండి,' అన్నది ఆ పదేళ్లమ్మాయే, అంతవరకూ సావిత్రి కనిపించ లేదన్న బెడద భోజనందగ్గర తీరింది. స్వయంగా సావిత్రి వడ్డిస్తోంది. తతిమ్మా మరదళ్లు వంటపనుల్లో మసలుతున్నట్టే కనిపించరు. అవును, దాసీలతో సంసారాలు సాగించుకొంటున్న వారు ఎంత ఇదైతే మాత్రం వంటలు పెంటలు మాడాలా! సావిత్రి వుండనేవుందిగా పాకకళాప్రవీణ!

'ఏమిటి సంగతులు?' భోంచేస్తూ ప్రశ్నించాడు సుబ్రహ్మణ్యం.

'ఏమున్నయ్యండి. మీ మావగారు అయిదు వేల రూపాయలు నిల్వవుంచారు.'

ఆశ్చర్యంగాని మరేవిధమైన భావముగాని కలగ లేదు సుబ్రహ్మణ్యంలో. కలగవలసిన అవసరమూ

లేదు నిజానికి. సావిత్రి అలా అనుకోలేదు. ఎక్కడ? ఏమిచేశారిప్పుడు? అని ప్రశ్నిస్తాడనుకొంది. అటువంటి ప్రశ్న వేయకపోవటం సావిత్రి ఉత్సాహమంతా ఎగిరిపోయింది.

'అబ్బాయి చదువు—'

అర్థోక్తిగా సావిత్రి అనటంతో ఏమిటాయని తలపైకెత్తిచూశాడు. సావిత్రి నవ్వుతోంది, అయిదువేలూ పెద్దమ్మాయికిచ్చి అబ్బాయిని చదివించమని చెప్పుతుంటూ రనుకోలేదు. ఏదో అమాయికంగా అబ్బాయి చదువుగురించి కలలుకొంచు తున్న మనస్తత్వం ఆలా ఊహింపనిచ్చి వుంటుందని అభిప్రాయం సుబ్రహ్మణ్యంకు. కొన్నేపటికి విప్పిచెప్పేసింది సావిత్రి. అయిదువేలూ సావిత్రికి చెల్లటమనీ, తానాదరిస్తోన్న లీలను పెద్దబ్బాయికి పెళ్లిచేయటమని రాఘవయ్య వీలునామా వ్రాశాటని. రాఘవయ్య స్వార్జితము, కష్టార్జితమున్ను, అతనికా పాటి హక్కు వున్నది.

ఈ రహస్యం వినగానే మొదట ఆనందమయిపోయింది సుబ్రహ్మణ్యంకి. అబ్బాయి చదువుసాగుతుందని; కాలేజీలో చదివించటమూ, ఆపైన ఏ మెకానికల్ కోర్సులో పంపించటమూ చేయవచ్చు. అప్పుడు అబ్బాయికి తనకుమల్లే పాడు గుమస్తాగిరి కాక పెద్ద ఉద్యోగమేదో వస్తుంది. పోతూపోతూ, మామగారు మంచి పనిచేశాడని సంతోషమయిందంటే సుబ్రహ్మణ్యం మానవమాత్రుడు కాడా? మరదళ్లకి కట్నాలు కానుకలిచ్చి పెళ్లిచేశాడు. తానటువంటివి ఆశించనూలేదు. ఇవ్వనూలేదు. ఇప్పుడీ అవకాశం కల్గించటంలో విస్మయపడాల్సినదేమీలేదు. సావిత్రి మీద పక్షపాతమూ తతిమ్మా అమ్మాయిలమీద అసహ్యతలేదు రాఘవయ్యకి. అందరికి సమంగానే ముట్ట చెప్పేడు. కాదంటే 'రూపేణా' మాత్రం భేదం.

ఆమాటకువస్తే చిన్నమ్మాయిల గురించే రాఘవయ్యగారికి కూడా ఖర్చయింది, సుబ్రహ్మణ్యం అబ్బాయిని చదివించటం ఎలా అనే ఆందోళన దీనితో విచ్చిపోయిందని పరమానందం పొంది మూడునిమిషాల్లో భోంచేయటం ముగించాడు. అనంతరం సావిత్రితో అబ్బాయి భవితవ్యం ఎలా ఉంటుదో ముచ్చటించాడు.

అబ్బాయికి చదువుకో దారి ఏర్పడిందని ఆదంపతులిద్దరూ గాలిమేడలు కట్టుకొని అందులో హంసతూలికలపై కేరింతలాడారు—

ఆ వేళ తతంగాలన్ని అయిపోయాయి. వెళదామా, ఉందామా అని సందిగ్ధంలో ఊగులాడుతున్నాడు సుబ్రహ్మణ్యం. ప్రక్కరుగుమీద తోడల్లుళ్ళిద్దరూ కూర్చునేవున్నారు. వచ్చిన నాలుగు రోజులనుండి చూస్తున్నాడు, మరదళ్లలో గాని తోడల్లుళ్లలో గాని పూర్వపు సాన్నిహిత్యం మారగొన లేకపోయాడు.

'అన్నీ బాగానే వున్నయ్. గాని రాఘవయ్య గారు వొక్కవిషయంలోనే పొరబాటు చేశారు."

స్తంభానికి జారబడి కూర్చున్న పెదమనిషి ఈ మాట అనగానే సుబ్రహ్మణ్యం 'ఏమిటండీ అది' అని ప్రశ్నించాడు. ఆ వ్యక్తి అన్నాడంటే ఏదో వుందనే ఆతని అభిప్రాయం. ఊరిలో నలుగురికీ పెద్ద. చిన్న తగవు, పెద్దతగవు తీరుస్తుంటాడు. అటువంటి పెద్దమనిషి అన్నాడంటె అదేదో తెలిసికోవాలని జిజ్ఞాస కలిగిందంటే ఏమీ ఆశ్చర్యములేదు.

'అఁ! ఏమున్నదండీ. చూడండి అంతా సమానమే. కాక ఒక్కకడుపున పుట్టినవారే కదండీ.' ఆయన అనేది ఏమిటో చటుక్కున అర్థంకాక అవధానం చేసేవాడలే వింటున్నాడు సుబ్రహ్మణ్యం.

'ఏదో సమంగా చెప్పేస్తే వదిలిపోయేది—' అని ఆయన తనవంక తీక్ష్ణంగా చూడటంలో ఆంతరమేమిటాయని యోచన చేయసాగాడు సుబ్రహ్మణ్యం 'ఏమిటండది'-అగాథాన్ని విప్పకోలేక అడిగాడు.

'అబ్బే ఏముందండి. ముసుగులో గుద్దులాటలు వుండకూడదని నా పద్ధతి. లోపల లోపల బాధపడి ఏమి ప్రయోజనం చెప్పండి. రేపన్ననాడు మనలో మనకు వివాదాలు వస్తే ఎట్లాగండి?'

సుబ్రహ్మణ్య మేమీ మాటాడలేదు. పెద్దమనిషిమాటలలోని చమత్కారం ఎందునిమిత్తమో తెలీక ఎదలో సంజాటన.

'ముసలాయన ఏమిచేస్తే ఏమిటెండి. లోకం హర్షిస్తుంది. మాలాటివాళ్లం సంతోషిస్తాం. ముగ్గురూ సమంగా పుచ్చుకోవటం మంచిది."

సంగతి అర్థమయింది సుబ్రహ్మణ్యానికి. మామగారు చనిపోతూ వ్రాసిన వీలునామావల్లనే ఈ రభసంతా. తోడల్లుళ్లు ఈయనచేత చెప్పించి ఫలితాన్ని చూస్తారన్నమాట. బాగుంది. ఈపాటిదానికి పెద్దమనుష్యులూ లౌకిక ప్రబోధనలున్నూ. నిజమే - ధనవంతులైన తోడల్లుళ్లకి తాను డబ్బు పంచకపోటం అన్యాయమే. అధర్మమే. న్యాయాన్నే తాను జీవితంలో అడుగడుగునా ఆశిస్తున్నాడు కనుక డబ్బు మూడువాటాలు చెయ్యడమే శ్రేయోదాయకం. ఆమాటకువస్తే తానెప్పుడూ మామగారి డబ్బు ఆశించే వుండలేదు. తులమో పలమో దక్కించుకొన్నది వారే. అప్పుడు లేని దుగ్ధ ఇప్పుడెందుకు?— ఆలోచనలపై

ఆలోచనలు సుబ్రహ్మణ్యాన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. అడుగుతున్న పెద్దమనిషికి సమాధానం చెప్పకుండానే లోపలికి వెళ్లాడు. సమాధానమివ్వకుండా లోపలకు వెళ్లడంతో తగవరి గ్రామపెద్ద అయిన పెద్దమనిషి కనుగుడ్లురిమి చూశాడు.

సహజంగా మగవాళ్లకున్నంత సహనం ఆడవాళ్లకి వుండదు. నాగరికత, విజ్ఞానమూ, అనేవి నోచుకోనప్పుడు వేరే చెప్పనక్కరలేదు. ఎంత ఓపిగ్గా వుందామన్నా చెల్లాయిల సూటిపోటి మాటలకి సావిత్రి హృదయం అట్టుడికినట్టుడికిపోతోంది.

"పెళ్లిళ్లకు మీకు కట్నాలు కానుకలిచ్చాడు. మాకేమైనా ఇచ్చాడా నాన్న? మీ కెందుకీ చూపోపనితనం?" అన్నదో లేదో సావిత్రి. రెండవచెల్లాయి విరుచుకుపడింది.

'అవునమ్మా. మాకు ఇంటినిండా డబ్బు మూలుగుతుందని మీ బాగుని చూట్టానికి చూపోపనితనమే మరి.'

ఈ మాటలలో యథార్థత, ఎత్తిపొడుపు రెండూ మూర్తీభవించాయి. సావిత్రిమనస్సుకి నొప్పికలిగింది.

'మా కెందుకులే అమ్మ. నాన్నకి నీవు అభిమానపు కూతురివి. ఆప్యాయం కలదానివిన్నీ. నీవే వుంచుకోవమ్మ ఆడబ్బు.'

'అందుకనేగా.ముందుగా వచ్చిపడింది. ఎప్పుడు నాన్న పోతాడా, డబ్బుకాజేదామా అనేగా ఆరాటం.'

'అసలు నాన్నే వ్రాశాడో, ఇదే___'

సంభాషణ హద్దులు దాటుతోంది. వినరాని మాటలు వినవలసివచ్చినందుకు సావిత్రిలో అభిమానపు తెరలు పుట్టుకువచ్చాయి. ఎక్కడలేనీ ఉక్రోషమూ రోషమూ కలిగాయి.

'చిల్లిగవ్వయినా నాకక్కరలేదు. ఇదివరకల్లా ఎల్లా బ్రతికామో ఇప్పుడూ అల్లాగే జీవించగలం.' అంటూ లేచింది సావిత్రి కూర్చున్నదల్లా. అక్కచెల్లెళ్ల సంభాషణ అప్పటికి చావడిలోకి వచ్చివున్న సుబ్రహ్మణ్యం విన్నాడు. నిలువునా క్రుంగిపోయాడు.

నాలుగురోజులనుండీ మరదళ్లూ, తోడల్లుళ్లూ ఎందుకు పరస్పరంగా వుంటున్నదీ అర్థమవుతూందిప్పుడు. చలాకీగా బావా అని పరిహాసాలాడే పెద్దమరదలిప్పుడు తన్ను చూడడానికే బాధపడుతోంది. సరి, చిన్నావిడ మూతి విరుచుకొంటోంది. ఇదివరకెంత చనువుగా వుండేది! అన్నగారూ అన్నగారూ అని సగౌరవంగా తన్ను మర్యాదచేసే తోడల్లుళ్లు ఇప్పుడు ఎడమొహమూ పెడమొహమున్నూ. అదంతా రాఘవయ్య మరణించడంవల్ల దుఃఖమనుకున్నాడు. కేవలం మరణించడంవల్లకాదు వీలునామా వొకటి సృష్టించి మరణించడంవల్లనే మూతివిరుపులని తెలిసింది. అంతకీ అయిదువేలే ఆదికారణం.

అబ్బాయిని హాయిగా చదివించుకుందామని తానుబలాటపడిందానికి అయిదువేలే ఆదికారణం. తాను పెద్దసమస్యగా భావించినది పరిష్కారమార్గం పట్టిందనుకొన్నాడు. టెక్నికల్ కోర్సుకి పంపించి అబ్బాయికి ఇంజనీర్ పదవివస్తుందని మధురస్వప్నాలు కాంచి రెండురోజులు కాలేదు. ఏది ఆధారంగా గాలిమేడలు నిర్మించికొన్నాడో ఆ ఆధారానికి భూకంపం సంభవించింది.

డబ్బుకారణంగా సోదరుల్లోనూ సోదరీమణుల్లోనూ అంతఃకలహాలు బయలుదేరడాన్ని సహించలేకపోయినాడు. కలకాలంగా కావలసింది పరస్పరం సామరస్యమే. అశ్వరమైన ఐశ్వర్యనిమిత్తాన బంధుత్వాలు తెగతెంపులు చేసుకోవడమా?___

లోపలనుండి బైటికి సుబ్రహ్మణ్యం రావడంతోనే న్యాయసంధానకర్త, పెద్దమనిషికి, ఆశ్చర్యం కలిగింది, అతనిచేతిలోని వీలునామాపత్రాలు చూడగనే.

'అయ్యా! న్యాయమే మనకు కావలసింది.' అనడమూ, సుబ్రహ్మణ్యం వీలునామాపత్రాలు చించివేయడమూ ఒకేసారి జరిగాయి. పెద్దమనిషి దిగాలుపడి చూస్తున్నాడు.

'ఇద్దర్నీ పుచ్చుకొమ్మనండి.'

అంటూ మెట్లుదిగాడు సుబ్రహ్మణ్యం. వెనకాలే అబ్బాయీ, సావిత్రీ, అడుగులో అడుగువేశారు. వారి వెనువెంటనే లీల, లీలతల్లి కూడా ప్రయాణమవడం పెద్దమనిషిగొంతుకలో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది. జటకా ఎక్కుతున్న సుబ్రహ్మణ్యం పాదాలమీద గాలికెగిరివచ్చిన వీలునామా పత్రాల ముక్కలు పడ్డాయి.

నాటిక :

పరిహాటి

మొదటి రంగము

(డాక్టరు గిరి ఇంట్లో కన్‌సల్టింగ్ రూమ్)

గిరి : వెనక్కు తిరుగు. ఊపిరి పీల్చు. విడు. మళ్లీ విడు. ఊఁ. ఈ చీటి ఇంజెక్షన్ తీసుకు రేపు పొద్దున్న రా.

౧ రోగి : ఏం జబ్బు బాబూ—

గిరి : నీకు కావాల్సింది రోగం పేరా, మందా? వెళ్లు. తర్వాత అతను ఎవరు? నీ కేమిటి?

౨ రోగి : ఈ చెవి అంతా వాచిపోయిందండి.

గిరి : చెప్పక్కర్లే. చెవిచూపించు. ఊఁ. కాంపౌండరుకు ఈ చీటి చూపించు మందు వేస్తారు. ఊఁ. ఇంకెవరు?

ఇతనొకడేనా ఉంది. టైమయిపోయింది. ఊఁ. నీకేమిటి జబ్బు చెప్పు.

3 రో : బాబూ నిన్న రేలనుంచీ కడుపులో నొప్పిగా ఉంద్దండి. మొన్న పొద్దుటేల మా అయ్యగారింటికి అడావిడిగా ఎల్లాల్సి వచ్చి మా ఇంటి దాన్ని త్వరగా బువ్వెట్టే అన్నానండి—

డాక్టర్ గిరి : ఔనులే. ఇప్పుడా సోదంతా ఎందుకు. ఇప్పుడున్న బాధ ఏమిటో చెప్పు.

రోగి : అదే బాబూ సెప్పొస్తున్నా, కాస్త ఓపిక పట్టండి బాబూ. ఆ పటాన మా ఇంటిది అంది—

గిరి : (విసుగ్గా) సరేగాని, అడిగిన మాటలకు జవాబు చెప్పు. కడుపులో నొప్పి అంటే ఎల్లా ఉంది?

రోగి : కడుపులో నొప్పి ఎరుగరు బాబూ? అవున్లేండి డాక్టర్లు, మీకే బాద లుంటాయి.

డా : ఉష్. ఎక్కడో సోది రాముడివి దొరికావు. అదికాదయ్యా, పేగు మెలివేసినట్టు నొప్పా, జిగటవిరేచనాలనొప్పా, లేక పొత్తికడుపు బిగవేసుకుపోయినట్టు నొప్పా—

రో : ఆఁ. ఆఁ. మీరు సెప్పినవన్నీ ఉన్నాయి బాబూ. నిన్న పొద్దున్న, అల్లా, దాన్ని బువ్వెట్టమని సెప్పి సుట్టగాల్చుకొంటూ—

డా : మాట్లాడక నోరుతెరు, ఈ థర్మామీటరు నోట్లో పెట్టుకో, అటూ, మెరిసేవ్వవు, కొరక్కు, నాలిక క్రిందపెట్టు. ఊఁ. చెయ్యి ఇలా తే, ఊఁ, థర్మామీటరు ఏది.

రో : కడుపులో నొప్పి సేతిలోనూ ఆ గాజు పుల్లలోనూ ఏం తెలుస్తది బాబయ్యా.

డా : ఏమీ తెలియదనుకొంటే ఇక్కడికెందుకొచ్చావ్?

రో : అదికాదు బాబయ్యా, కాస్త నా బాధ ఇవరంగా ఇనండని సెప్పుకుంటున్నా.

డా : నీ పేరేమిటి? (ప్రిస్క్రిప్షన్ రాస్తూ)

రో : ఎంకయ్యంటారండీ నన్నెరగరు బాబూ.

డా : కాంపౌండర్! ఇంకా అక్కడెవరన్నా ఉన్నారా? నాకు టైమైపోయింది, డ్రైవరును పిలిచి కారు సిద్ధం చెయ్యమను. ఈ మనిషికి ఈ ప్రిస్క్రిప్షన్ మందు కలిపియ్యి. (రోగితో) ఇవాళ మూడుసార్లు, రేపు మూడుసార్లూ, తీసుకో. అన్నం తినకు. బత్తాయి రసం, గ్లూకోజ్, పాలు కాచి నిమ్మకాయతో విరగదీసి ఆ నీటూ పుచ్చుకో. జ్వరం ఉంది, కదలకుండా పడుకో. ఎల్లుండిపొద్దున్న కనబడు.

రో : ఏటి బాబయ్యా జ్వరంకూడా ఉందీ! చేతికి తెలటం లేదే, ఉంది గామోసు లెండి. అయితే మూడు రోజులు కదలకపోతే మాకుగడిసే దెట్టా బాబూ. గ్లూకోజ్ ఏపనుండి తెచ్చుకోను బాబూ!

డా : తెచ్చుకోకపోతే రోగం అనుభవించు, సరేగాని. నీతో టైం వేస్టు చేసుకోనేందుకు నాకు వీలు లేదు. కాంపౌండర్...

కాం : ఆఁ, కాసు సిద్ధంగానే ఉందండి, అబ్బాయిగారు నలతగా ఉన్నారట, ఇంట్లో ఒక సారి చూసి వెళ్లమని అమ్మగారు చెప్పారండి.

డా : మళ్లీ వచ్చి చూస్తాలే.

రో : బాబూ, కడుపులో నొప్పి వచ్చినప్పుడు తెరలు తెరలుగా...

డా : జోనులే. అన్నీ తగ్గుతాయి, మందు తీసుకొని వెళ్లి చెప్పినట్లు చేయి. కాంపౌండర్ ఇతనిదగ్గర ఫీజు పుచ్చుకో, నే వస్తున్నా. (నిష్క్రమణ)

రో : అది కాదు బాబుగారు. అయ్యో! ఇవ కుదురా ఎల్లాగే!

కాం : ఆన్నీ వింటారులే, రా. గా. మందు సీసా తెచ్చావా, కన్సల్టింగ్ చార్జి అయిదు రూపాయలు ముందియ్యి.

రో : సీసా ఎక్కడదయ్యా, ఇన్ని సీసాలున్నయి ఓటియ్యి లేప్రా, మళ్లీ తెచ్చిత్తాలే.

కాం : కన్సల్టింగ్ చార్జి అయిదు రూపాయలు ముందియ్యి.

రో : (కోపంగా) ఏంచార్జి, ఏటయ్యా జటింగు చార్జీ, మాటనాన్న సరిగ్గా ఇనడాయన—నాకు ముందర ముష్టి ముండితోను అదేవరస...

కాం : (కోపంగా) నువ్వు రోగం నయంచేసికోవటాని కొచ్చావా, ఇక్కడ దెబ్బలాడేందుకు ఒచ్చావా? తైటికి గెంటించమంటావా?

రోగి : (కోపంగా) గెంటిస్తావ్, ఎందుకయ్యా గెంటించటం? నేనేం దెబ్బలాటకు రాలే. రోగం నయం చేసుకోటానికే వచ్చా—వస్తే మటుకు!

కాం : మటుకు లేదు గిటుకు లేదు. వస్తే బిల్లు ఇచ్చి మందు తీసికెళ్లు.

డా ! (మళ్లీ ప్రవేశించి) ఏదీ ఇక్కడ లాన్సెట్ పత్రిక ఉండాలి ఎక్కడ పడేశావ్. ఇత డింకా వెళ్లలే.

రో : చూడు బాబూ, ఈ కాంపౌండరు గెంటిస్తానంటాడు, నే నేం చేశానని చెప్పు.

కాం : కాదండీ. కన్సల్టింగ్ ఫీజు ఐదూ ఇమ్మంటే టింగు ఫీజు అయినా గియినా ఏమిటంటాడు.

రో : కాదు బాబూ. నాకు నోరు తిరగక సింగు ఫీజన్నా. కావలిస్తే రూపాయో అర్ధో తీసికోమనండి, నేను మాత్రం వద్దన్నా నా?

కాం : సీసా లేదట.

డాక్టరు : సరేలే ఒక సీసాలో పోసి ఇచ్చి, ఇయ్యగల్గిందేదో పుచ్చుకో. ఏదీ, పత్రిక ఇక్కడ చెత్తలో పారేశావా!

రో : బాబూ, బత్తాయి కాయలు, అదేదో కోజు కొనాల్సిందేనా బాబూ—

డా : నీ యిష్ట మబ్బాయి. రోగానికి వైద్యం చెప్తాను గాని నీ తక్కిన విషయాలు ఆలోచించేందుకు నాకు తీరిక లేదు. కాంపౌండర్! మెడికల్ బుక్ షాపులో, టైఫాయిడ్ డైసిగ్నండ్, అని కొత్త పుస్తకం వచ్చింది. వెళ్లి తీసుకురా. ఊఁ. నే వెళ్తున్నా.

రోగి : బాబూ జ్వరం ఉందంటూరా, చారు తినకూడదూ.

డా : కాంపౌండరు చెప్తాడు అడుగు (వెళ్తాడు)

రోగి : అయ్యో రోగుల మాటే ఇన్పించుకోడే, నీ డాక్టరు బంగారంగానూ.

కాం : ఆయన బంగారమే అయ్యాడులే— నీలాంటి వాళ్లు ఎక్కువ దొరక్కపోబట్టి. సరేలే ఈ మందు తాగు.

రోగి : సీసాలో ఇయ్యమన్నారు గాదయ్యా! సరేలే ఇయ్యి తాగుతా. (తాగి) అబ్బ ఇసం చేదు.

కాం : ఊఁ. తియ్యటి మందులు కావాలి, ఖర్చు లేకుండా కావాలి.

రోగి : ఏటయ్యా నీ గొడవ. ఇదిగో రూపాయి తీస్కో! (టంగున పారేస్తాడు) నీ డాక్టరు దణ్ణాన, నీ దణ్ణాన పడిఉండేందుకు రాలే మేం ఇక్కడికి. ఎంత కరువు మడిస్తైనా తెలివైనోడూ అస్తవానిగల్లో డని వచ్చాం గాని లేకుంటే—

కాం : సరేలే ఇచ్చే దేదో ఇచ్చి నెమ్మదిగా వెళ్లు.

రో : (కోపంగా) ఐతే డబ్బు తీసుకొని డాక్టరుగా రిమ్మన్న సీసా మందూ ఇయ్యవా?

కాం : (నవ్వి) భలేవాడివే నే. సరే ఇదుగో మందు తీసుకపో.

రో : ఎల్లొస్తాగాని, బాబూ ఒక్క మాట సెప్తున్నా. నిజంగా మీ మందుతో నా కడుపునొప్పి సేత్తో తీసేసినట్టు చాలామటుకు తగ్గింది. మీ కిచ్చిన డబ్బుకు ఋనం తీరదు. నిజవే, అయితే కొంచెం మనుసులని మనుసులుగా సూట్టం— వాళ్ల కష్టసుఖాలు కొస్త గమనించటం కూడా నేర్చుకోమని మీ డాక్టరుకు చెప్పుబాబూ. ఇంత పెగ్గిఉన్న డాక్టరు, ఆమంచి కూడా ఉంటే మాలాటోళ్లం సుఖపడిపోతాం. ఎల్లొస్తాలే.

కాం : శీఘ్రంగా వెళ్లిరా. మళ్లీ రాకు.

రో : మంచిమాట సెప్పావ్, డాక్టరు దగ్గిరికి మళ్లీ రానక్కర్లేదనే నేనూ కోరుకొనేది. (వెళ్తాడు)

(డాక్టరు భార్య కామేశ్వరి ప్రవేశిస్తూ)

కామే : కాంపౌండర్, అక్కడ మీ అయ్యగారున్నారా.

కాం : లేరండీ. బైట కాంపులకు వెళ్లారు.

కామే : అబ్బాయికి సుస్తీగా ఉందని చెప్పావా ?

కాం : చెప్పానండీ. మళ్లీ వచ్చి చూస్తానన్నారు.

కామే : మళ్లీ వచ్చి చూస్తానన్నారూ. బాగుంది. ఇంటి విషయం, నా విషయం ఇంత మాత్రంగా ఆయనకు పట్టింది. సరేలే, నువ్వు బజారెళ్లి కొస్త సరుకులూ, కూరలూ తెచ్చి పడేసి వెళ్లు. ఇదిగో జాబితా. మర్చిపోయూ, కుర్రాడికి హార్లిక్స్ కూడా తీసుకురా.

కాం : నాకు తీరిక లేదండీ.

కామే : ఎల్లాగయ్యా. నీకు తీరదు, మీ అయ్యగారికి తీరదు, ఆ డ్రైవరుకు తీరదు.

కాం : అదంతా నాకు తెలియదండి. నేను ఆస్పత్రిలో కాంపౌండింగ్ పనికి చేరాను. గాని ఇంటిపనులకు గాదండి.

కామే : బాగా నేర్చారులే అందరూను. ఇల్లొకటీ, వైద్యం ఒకటీ అని ఇక్కడ రెండుగా లేవు. ఆయనకేమీ పట్టవు, అల్లా ఏమీ పట్టనట్టు చూస్తూంటే మీరూ మరీ ఎచ్చిపోతున్నారు. మా ఉప్పు తింటూ మాకు పనిచేసి పెట్టటానికే ఇదౌతారే.

కాం : నేను ఎవళ్ల ఉప్పూ తినటం లేదండీ, నాకు నేనే బజారులో కొనుక్కుని తింటున్నానండి.

కామే : ఆయన చూడనట్టు ఊరుకొని అలుసిచ్చేటప్పటికి కళ్లు నెత్తిమీది కొస్తున్నాయి. తిండికి లేదు బాబూ అంటూ చేరావు. ఇక్కడ పైరాళ్లు నాలుగు చేతికి చిక్కటంతో, నన్నే ఎదిరిస్తున్నావు. ఇన్నాళ్లూ తెచ్చిన వాడివి, ఇవాళ తేవటానికి ఏం వచ్చింది ?

కాం : అమ్మా, డాక్టరుగారి దగ్గిర కాంపౌండర్ పనికంటే చేరాను. నేనూ బ్రతికి చెడ్డ కుటుంబంలో వాడినే. ఇన్నాళ్లూ ఏదో మాట తీసేయలేక చేస్తూ వచ్చాను. మేం అదంతా గతిలేక చేస్తున్నాం అనుకోటం, మీకు పరిపాటి అయిపోయింది. మా మీద అథార్టీ చేయకండి.

కామే : అతివాగుడు వాగక చెప్పిన పనల్లా చేసి నెమ్మదిగా ఉండగల్గితేనే ఈ ఇంట్లో అడుగు పెట్టు, లేకపోతే అవతలికి నడు.

కాం : ఓ, శుభ్రంగా నడుస్తాం. డాక్టరుగారు చెప్పేదాకా ఆగవలసినదే కాని—ఆయనైనా మీ మాట కాదని బ్రతికే దుందిగనుకనా ?

కామే : నోర్మూసుకొని అవతలికి నడు.

కాం : నడుస్తానమ్మా నడవ కెక్క [illegible]. ఆ రోగి వెంకయ్య డాక్టరుగారికి నిదానం లేదనే ఉపదేశంచేసి పోయాడు. మిమ్మల్ని చూస్తే ఏమంటాడో. అల్లాగే నే చెప్పేదీ ఒక మాట ఉంది. మీకు ఈ ఇంట్లో అథార్టీ చెయ్యటం అలవాటయిపోయింది, దాని కష్ట నష్టాలు—మా విషయాల కేంలెండి—మీ కుటుంబం విషయంలోనే మీకు తెలిసి రావటం లేదు. డాక్టరుగారు ఎల్ల కాలం ఇల్లా భరించగలరని అనుకోకండి. కొంచెం మిమ్మల్ని మీరు సంబాళించుకొని—ఆయన్ని సరిచూచుకోక పోయారా—ఆ మాట నే నెందుకులెండి అనటం—

కామే : (అతి కోపంగా) ఏ మాటా అనక్కర్లేదు వెళ్లిరా.

(మోటార్ హారన్ చప్పుడు, డాక్ట. ప్రవేశం. కాంపౌండరుతో)

డాక్ట : ఏమయ్యా పుస్తకానికి వెళ్లి వచ్చావా ?

కామే : (కోపంగా) ముందు అతగాడి జీతం ఎంతో అతగాడి కిచ్చేసి పంపించెయ్యండి—ఆయన గారి బోడి నౌకరీలు చెయ్యడట. మానుకొంటాడట.

కాం : బోడి నౌకరీ అని నే ననలేదు.

డా : ఏమయ్యా మానేస్తా నన్నావా?

కాం : (గాద్గదికంతో) డాక్టరుగారూ, నేను కాంపౌండరుగా మీ దగ్గిర చేరాను. కాంపౌండరుగా మీకు ఎప్పుడైనా అసంతృప్తికరంగా ప్రవర్తించానా?

డా : ఇప్పు డేమయిందీ?

కాం : (కళ్ల నీళ్లతో) బజారు కూరలూ, సరకులూ, తేవటం నాకు నిజంగా నామర్దాయేనండి— అది ఇక చెయ్య నన్న మాట నిజమే. అంతమాత్రానికి నా కూడు తీసేస్తే తీసేయ్యండి.

కామే : ఎవరి ఉప్పు తినటం లేదుగా నువ్వు. ఇప్పుడు కూడు తీసెయటం దగ్గరకు వచ్చిందేం?

కాం : ఎందుకులెండి, ఇన్ని మాటలు. డాక్టరు గారూ, నమస్కారం, వెళ్లివస్తాను. నా జీతం ఇష్టం ఉంటే తర్వాత పంపించండి.

డా : మానటం విషయం తర్వాత చూద్దాం, ముందు పుస్తకం తీసికొనిరా, బజారు సరకులు నువ్వు తే నక్కర్లేదులే.

కాం : చిత్తం. వస్తున్నానండి.

డా : కామూ, ఏమిటిది?

కామే : ఏముంది! మీ రిచ్చిన అలుసే! ఇక్కడ సంపాదన మరిగి మరోదారులు వచ్చాయి, అయ్యగారికి. రోజూ తెచ్చేవాడు ఇవాళ బజారు సరుకులు తెమ్మంటే తెగనీల్గి, నన్ను నానా తిట్లుతిట్టి పోయాడు. మీకు ఇంటివిషయం పట్టదు.

డా : (కోపంగా) హుమ్, అపురూపం సొద! అయినా కాంపౌండరుకి యింటి పనులు చెప్పొద్దని ఎన్నిసార్లు చెప్పాను. ఇల్లు ధాటి చేస్తే ఏ కాంపౌండరు ఆగుతాడు?

కామే : అవును నా ధాటిలాగే ఉంటుంది, ఇంటి మొహం ఇల్లాలి మొహం చూస్తేనే మీకు మండు కొస్తుంది. ఇంటి సరుకులు, మీరూ లేక, మీ నౌకర్లూ లేక—ఇంక ఆడదాన్ని నేను బజార్న పడాలా. వాళ్లు నన్ను నానా మాటలూ అంటూంటే వాళ్లను మీరు గదమాయించటం పోయి ఎదురు నన్నే తిట్టండి.

డా : నేను ఇంట్లోకి వచ్చేటప్పటికి ఏదో ఊపిరాడకుండా ఇల్లా తికమకలు పెట్టావేం? పొద్దున్న లేచినప్పటినుంచి పేషంట్లూ, వైద్యం, తీరిక అనేది కనిపించకుండా సతమతమౌతూ, ఒక్క నిముషం ఇంట్లో కులాసాగా సేదతీరుకొందామనుకొంటే, ఎక్కడా నీకు నా విషయమే పట్టదు.

కామే : మీకు ఇల్లు పట్టదు. మీ వైద్యం ఏమిటో, మీ రేమిటో తప్ప ఇల్లు, పెళ్లాం పిల్లలూ, ఉన్నారనీ, వీళ్ళూ మనుష్యులే ననీ, వీళ్ల కష్టసుఖాలు చూడాలనీ మీకు అనిపించనే అనిపించదు- కుర్రాడు ఆ మాదిరిగా పడిఉంటే

డా : ఎల్లా ఉన్నా డిప్పుడు జ్వరం ఉందా?

కామే : ఇప్పుడూ అజకొచ్చింది. ఏదో దేముడు చూడబట్టి బ్రతుకుతున్నాం గానీ—ఇప్పుడు నెమ్మదిగానే ఉంది. పక్కవాళ్లింటికి ఆడుకోటానికి వెళ్లాడు.

డా : మరి నన్ను ఎందుకు వేధించినట్టు? నేను వెళ్లిపోవాలి. వంట అయిందా?

కామే : ఇప్పుడే అయిపోతుంది ఆగండి.

డా : పోనీ ముందర కాస్త కాఫీ కాచి ఇయ్యి.

కామే : అల్లాగే.

డా : (అబ్బా అంటూ కుర్చీలో కూలబడి మెడికల్ జర్నల్ తిరగేస్తూ ఉంటాడు)

(డాక్టరు గిరిగారూ అంటూ డాక్టరు రామస్వామి ప్రవేశిస్తాడు)

గిరి : ఎవరు. డాక్టరు రామస్వామిగారా రండి. ఇదుగో, ఇద్దరికీ కాఫీ తీసుకురా?

రామ : ఇప్పుడు కాఫీ వద్దులే బాబూ. వేళ మించి త్రాగటం నాకు అలవాటు లేదు. కులాసాగా, ఉన్నావా? అయితే ఒక పనిమీద వచ్చాను బాబూ. నువ్వు నా కళ్ల ముందర వైద్యం ప్రారంభించినా, నీ దగ్గిర వైద్యంలో నేను నేర్చుకోవలసిన సంగతులు ఎన్నో ఉన్నాయి. ఇంతకూ అసలు పని ఏమిటంటే నా పేషంటు ఒకళ్ల విషయంలో, చాలా సీరియస్ గా టర్న్ అయింది. నిన్ను తీసికెళ్లి చూపించాలని

వచ్చాను. ఆ రోగం నా చెయ్యి దాటిన వ్యవహారం. వాళ్లు, అవటానికి అంత ఉన్నవాళ్లు కారుగానీ, నీ ఫీజు మొదలైన ఖర్చులన్నీ పూర్తిగా ఇచ్చుకొని, నువ్వు చెప్పిన వైద్యం తు, చ, తప్పకుండా చేస్తామన్నారు. నిన్ను అర్జెంటుగా తీసి కెళ్దామని వచ్చాను.

గిరి : ముందు చూసివద్దాం పదండి. (ఇద్దరూ నిష్క్రమిస్తారు)

కామే : ఇదిగోనండి కాఫీ! ఏరీ, వెళ్లిపోయారు. ఇంటి దగ్గర కాఫీ తాగే టైం కూడా లేదు. తన వంటి సంగతి పట్టదు. తన యింటి సంగతి పట్టదు. అస్తమానం కేసులూ, వైద్యం, వైద్య పుస్తకాలూ— హూ! ఖర్మ!

రెండవ రంగము

(రమ ఇల్లు. ఆర్టిస్టు హరి సుస్తీగా ఉంటాడు. రమ పరిచర్యలు చేస్తూ ఉంటుంది.)

హరి : హుష్. ఉక్క బెట్టేస్తుంది. మొహం మీద ఈ తడిగుడ్డ ఏమిటి? ఛస్ తీసి అవతల పారెయ్. అబ్బ! గొంతుక ఆరిపోతోంది. కొంచెం కాఫీ ఉంటే తీసుకురా.

రమ : ఈ బార్లీ నీళ్లు తాగు.

హరి : రమా! నేనసలే ఛస్తూంటే నీకు మరీ చంపాలని ఉందా? నాకా బార్లీ గీర్లీ వద్దని ఎన్ని మాట్లు చెప్పాను. ముందు కాఫీ తీసుకురా.

రమ : కాఫీ అన్నిమాట్లు తాగితే మరీ పైత్యిస్తుంది.

హరి : పైత్యిస్తే మరీ మంచిది. ఇంకా మంచి బ్రిలియంట్ ఆర్ట్ వస్తుంది. ఎదురు చెప్పి విసిగించక...

రమ : కాదు హరీ. నా మాట విను. ఈ బార్లీ కాస్త తాగు.

హరి : ఇల్లా తే. (గిన్నె విసిరి దూరంగా కొట్టాడు) అయిందా! ఇప్పటికైనా విసిగించక కాఫీ తెచ్చిపెట్టు. ఏవీ ఇక్కడి సిగరెట్లు. ఏవీ? (కోపంగా) రమా! నేను సుఖంగా ఉండాలని నీకు లేదా?

రమ : సరే అయితే ఇవిగో సిగరెట్లు. కాఫీచేసి తెచ్చి పెడతాను.

హరి : ఆ రంగులు, బ్రష్షులూ, బొమ్మా ఇక్కడ పెట్టివెళ్లు. ఆ కిటికీలు తెరిచెయ్యి! కాస్త శుభ్రమైన ఆకాశం, చెట్లూ కనబడనియ్యి.

(ఈలవేసుకొంటూ బొమ్మకు రంగులు వేస్తూంటాడు—దగ్గు వస్తుంది)

హాష్. ఛి. ఛీ. ఎధవబొమ్మ ఇల్లా తయారయింది. ఇన్స్పిరేషన్ లేదు పాడు లేదు. రమా— ముందు కాఫీ తీసుకురా. (దగ్గుతూ) హుహ్వా హువా.

(బైటతలుపు చప్పుడు. రమ లోపల్నించి వస్తున్నా అని కేక)

హరి : ఎవడేవాడు. నేనింకా ఇక్కడ ప్రాణం తోటే ఉన్నాను తెలుసునా?

రమ : అసభ్యంగా మాట్లాడకు హరీ. రామస్వామిగారు పెద్దడాక్టరును తీసుకొచ్చి నట్టున్నారు.

హరి : ఎవరా పెద్దడాక్టరు. నారోగం కుదిర్చే మొహం ఎవడున్నాడోయ్.

రమ : హరీ. వాళ్లముందర నీ దురుసుదనం చూపించకు. అల్లా అయితే అక్కర్లేదని ఇప్పుడే పంపించేస్తాను.

హరి : పంపించెయ్ ఎవరొద్దన్నారు. హుష్. అబ్బ, విసిగించేశావ్. సరె రానీ లోపలికి.

రమ : (తలుపు తీస్తూ) రండి లోపలికి రండి.

(డాక్టర్ గిరి, డాక్టర్ రామస్వామి ప్రవేశం.)

రామ : ఇల్లా కూర్చోండి గిరిగారూ. ఆ కుర్చీ ఇల్లా మంచందగ్గిర వెయ్యమ్మా. అదేమిటోయ్ హరీ అల్లా లేచి కూర్చొని మళ్లీ ఎగ్జర్ట్ అవుతున్నావ్? అవి తీసెయ్యమ్మా.

హరి : ఉండనీ. డాక్టర్లకు అడ్డంగా ఉన్నయ్యేమో గాని నాకేమీ లేవు.

రామ : నీ మంచి కోరి చెప్తున్నాం హరీ. కాస్త నెమ్మదిగా ఉన్నాక నాల్గురోజుల్లో నీయిష్టం వచ్చినట్లు బొమ్మలు గీయవచ్చు. ఓహోహో. ఏం బాగుందోయి బొమ్మ. చూడండి గిరిగారూ. ఎంతగొప్ప ఆర్ట్.

గిరి : నాకు ఆర్ట్ విషయాలు తెలియవు. మంచి బొమ్మే నేమో. ఈయన పేరేమిటి? హరిగారా. కొంచెం పడుకోండి.

హరి : నేను పడుకోను. నన్ను చంపకండి సార్. రోగంతో కంటె డాక్టర్లతో ఎక్కువ చచ్చిపోతున్నాను.

గిరి : ఆ సిగరెట్లు మీరు కాల్చినవేనా ?

హరి : నేను కాక రమ కాలుస్తుందనుకున్నారా. అహ్హహ్హా (అని నవ్వుతాడు. దగ్గ తెర వస్తుంది)

గిరి : కొన్నేపు మాట్లాడకండి.

హరి : (దగ్గుతో నే) నేను మాట్లాడుతాను. నేను పోరొక్కను. ఈ డాక్టర్ల కిదె జాడ్యం. ప్రతి రోగిమీదా అధార్టీ చెయ్యటం తమ జన్మహక్కను కొంటారు.

గిరి : సరె. టెంపరేచర్ చూడనియ్యండి.

హరి : నిమిష నిమిషానికీ ఎందుకూ? ఇందాకటి టెంపరేచరు చెప్పు రమా.

రమ : వస్తున్నా.

రామ : అట్లా కాదు బాబూ, కొంచెం నామాట విను.

గిరి : పోని అక్కర్లేదు లెండి. ఇందాకటి టెంపరేచరెంత ?

రమ : (లోపల్నుంచే) ౯ గంటలకు తీసిన ప్పుడు ౧౦౨ ఉంది. సాయంత్రానికి మళ్లీ హెచ్చు తోంది.

గిరి : డయిట్ ఏమిస్తున్నారు?

రమ : (లోపల్నుంచే) బార్లి, ఫ్రూట్ జ్యూస్.

హరి : అబద్ధాలాడకు. నేను కాఫీ సిగరెట్లు తప్ప ఏమీ తీసుకోటం లేదండి. రమా నుంచు ముగ్గురికీ కాఫీ తీసుకురా.

రామ : రెండు చాలమ్మా. నేను తాగను.

రమ : (కప్పులతో ప్రవేశించి) కాఫీ తీసుకోండి డాక్టరుగారూ.

గిరి : ఇప్పుడు మీకున్న బాధ ఏమిటి ?

హరి : అనవసరమైన ఇద్దరు డాక్టర్ల అతిథాగురు.

గిరి : మాట్లాడక వెనక్కు పడుకోండి.

హరి : ఏమిటయ్యా, నా రోగం నువ్వు కాదు బ్రహ్మదేవుడు వచ్చినా కుదర్చలేడు. ఏమిటది, చెప్తాంటే—ఆ స్టెతస్కోపు గుండెలమీదనుంచి తీసెయ్యండి. ఏమిటి మీ జులుం.

రామ : బాబూ, హరీ. నువ్వు సర్వస్వతంత్రుడవే గాని మరీ అంత విరగబడకు. కొస్త పరీక్ష చెయ్యనియ్యి.

గిరి : ఊఁ. ఫరవాలేదు, రామస్వామిగారూ! ఇంకా స్కోప్ ఉంది.

హరి : అబ్బా. ఏదీ కాఫీ ఏదీ. అహ్హహ్హా! తాగనంటూనే ఈ రామస్వామిగారు నా కాఫీ కాస్తా తాగేశారు.

రామ : (నవ్వుతూ) అయ్యో. పరధ్యానంగా అంతపని చేశాను కాబోలు. అయినా నువ్వు కాఫీ తాగకూడదు.

హరి : రమా, నాకో కప్పు కాఫీ తీసుకురా, పో. నిలొచ్చేవు. ఏమిటి ఈయన మళ్ళీ ఇంజెక్షను తీస్తున్నాడు?

గిరి : రామస్వామిగారూ, ఆ చెయ్యి కొంచెం కదలకుండా పట్టుకోండి.

హరి : అబ్బో! అబ్బా! నా వెన్నెన్ను — నాకు ఇష్టంలేకుండా నన్ను బాగ చెయ్యటానికి నీకేం అధికారం ఉంది డాక్టర్.

గిరి : నీ బాధా, సౌఖ్యమూ. కాదు నాకు కావలసింది. నీ రోగం లక్షణమూ, అది కుదరటమూ.

హరి : అంతే! నా సౌఖ్యం అక్కర్లేదూ! నా ప్రాణం పోయినా నీకు చింత లేదు.

గిరి : నిజానికి లేదు. నేను నిజాయితీగా చెయ్యగల్గింది చేశానా లేదా అనే నా చింత.

హరి : అరి కర్కోటకుడా! అరెరె! కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. రమా, నీమీద కన్నేసి నన్ను చంపేసేందుకే ఏదో మందిచ్చాడు. ఇల్లారా — తల అనుకో.

రామ : డాక్టరుగారు మందిస్తే ఏమిటీ గొడవా, అసంగతపు మాటలూ.

రమ : మీ రేమనుకోకండి. ఏమీ లేదు హరీ. ఇదిగో నీ తల అనుకొనే కూర్చున్నాగా.

గిరి : ఏమీ కంగారు పడకండి. కొన్నేపు రెస్టుగా పడుకొంటాడు. ప్రిస్క్రిప్షన్ రాసి ఇస్తాను.

నాలుగు గంటల కొకసారి మందు తాగించండి. కాఫీ ఇయ్యొద్దు. ఫ్రూట్ జ్యూస్ ఇయ్యండి. ఫరవాలేదు, సాయంత్రం మళ్లీ ఇంజెక్షన్ ఇస్తా. ఆ బొమ్మలు గిమ్మలూ ఏమీ పనికిరావు. ఏ ఎక్సైటుమెంట్ రానీయకుండా చూడండి.

రమ : అల్లాగేనండి. రామస్వామిగారూ మాట (మెల్లగా) ఈ ఏభై వారి కియ్యండి.

గిరి : సరే వస్తాను. రామస్వామిగారూ వస్తున్నారా.

రామ : పదండి వస్తున్నా.

రమ : సాయంత్రం వస్తారు కాదూ.

గిరి : ఆ వస్తాను.

మూడవ రంగము

(వారంరోజులు పోయాక. రమ యిల్లు. ప్రవేశం గిరి)

రమ : రండి డాక్టరుగారూ లోపలికి రండి. ఇల్లా కూర్చోండి.

గిరి : నాకు కూర్చోటానికి టైం లేదు. ఏరీ ఈ ఆర్టిస్టుగారేరీ! లేచి తిరుగుతున్నారా? కాస్త తేరు కొని దొరకు వచ్చారుగదా, మీ రిల్లా అశ్రద్ధచేస్తే మొదటికే రాదూ? నే పడ్డశ్రమ వృథా అయిపోదూ?

రమ : అతన్ని వాళ్లవాళ్లు వచ్చి ఇంటికి తీసుకు పోయారు.

గిరి : వాళ్లవాళ్లేమిటి — వేరే ఇల్లేమిటి — మీరు వాళ్లవాళ్లు కారూ —

రమ : (నవ్వుతూ) డాక్టరు గారూ - కూర్చోండి. మీ రీ పిధి పేరు కూడా ఎప్పుడూ ఎరుగుండా ఉన్నట్టు రనుకుంటాను.

గిరి : పిధి పేరేమిటి ?

రమ : (నవ్వుతూ) కూర్చోండి డాక్టరు గారూ. అంత టైమ్ లేకుండా నిత్యం సతమతం అయితే — మీ విషయం మీరు చూసుకోటం ఎప్పుడు. (ఇప్పుడే వస్తా అంటూ లోపలికి పోతుంది)

గిరి : ఎందుకూ నే వెళ్ళిపోవాలి. (కుర్చీలో కూర్చుంటూ) హుష్ అబ్బా! ఒక్క నిముషం రెస్టు తీసుకొంటేనే బాగుండేట్టుంది.

రమ : (ప్రవేశిస్తుంది) ఈ కాఫీ కొద్దిగా తీసుకోండి.

గిరి : (లేవబోతూ) ఎందుకండీ. ఇప్పుడు మీకే శ్రమ! నా పేషెంటూ ఇక్కడలేదు. ఇంకా నా కవతల పను లున్నాయి.

రమ : పనులుంటాయి డాక్టరుగారూ! కాని, మీ విషయం మీరు చూసుకోరేం, అల్లా విశ్రాంతి లేకుండా పనిచేయటం - డాక్టర్లు మీరే మీ ఆరోగ్యం చూసుకోర ! అయ్యయ్యో, మాటల్లో పడ్డాను. కాఫీ చల్లారి పోతూంది తాగండి.

గిరి : (కాఫీతాగి) అబ్బా ప్రాణం లేచివచ్చినట్లుంది. వెరీమెనీ థాంక్స్. ఇక్కడ కూర్చుంటే ఇల్లాగే కూర్చుండిపోతానేమో. ఆ బొమ్మ ఎవరిదండీ? ఆ ఆర్టిస్టు గీసిందేనా ?

రమ (సిగ్గుతో) అదా. అది నాదే. అది అతను నన్నే మోడల్‌గా పెట్టుకొని గీసేవాడు. అన్నట్లు మీ ఫీజు పూర్తిగా చెల్లించలేక పోయాను. ఆ బొమ్మ తీసుకొని నన్ను క్షమించ గలుగుతారా.

గిరి : దీనిమీద ధర రు. ౧౦౦౦ అని ఉంటే?

రమ : (నవ్వుతూ) ఉందిలెండి. గిట్టుబాటు అయితే గియితే, హరి దానికి కట్టిన ధర అది. ఆ గిట్టుబాటు ముందు యుగాల కెప్పుడో. ఆ ఆశతోటే, ఆ అహంకారంతోటే, అతను తన విలువను కట్టుకొంటాడు. ప్రస్తుతం లోకానికి దాని వెల పావులా చెయ్యదు. నిజానికి అది ఇయ్యటం మిమ్మల్ని మోసం చెయ్యటమే (నవ్వుతుంది)

గిరి : (తెల్లబోతూ) నాకు ఈ బొమ్మల విషయం, ఆర్టు విషయం ఏమీ తెలియదు. కాని ఇదేదో చాలా గొప్పగా ఉన్నట్లుంది. ఇది నేను భరించలేను.

రమ : (నవ్వుతూ) నారూపమే కదా అనా, మీ సంకోచం.

గిరి : (తడబడుతూ) ఛా. ఛా. కాదు కాదు. అసలు మీ రూపం గనక నేనెరిగి నా కా ఆకర్షణ — కాని మిమ్మల్ని ఈ బొమ్మల్లో లా తెలుసుకోలేక పోతున్నాను.

రమ : ఉండండి, అన్నట్లు. మీ బొమ్మ కూడా స్కెచ్ గీశాడు. మీకోసం రాకపోతే చూపిస్తా - ఇదుగో ఇక్కడే ఉంది.

గిరి : నా బొమ్మనా ఇది? నాలాగే ఉన్నట్లుంది. కాని ఏదో వింతగానూ ఉంది. ఈబొమ్మను చూస్తూంటే ఏదో తెలియని ఆకర్షణ కలుగుతూంది. కానీ కోపమూ కల్గుతూంది.

రమ : అయ్యో, మీ మనస్సుకు నొప్పి కల్గించానే! ఇల్లా ఇయ్యండి దాచేస్తాను.

గిరి : కాదు. ఇదీ పుచ్చుకొంటాను ఇయ్యండి. టైమయింది వెళ్లి వస్తాను. అబ్బా! ఇక్కడినుంచి కదలాలని అనిపించటం లేదే.

రమ : (నవ్వుతూ) కదలకండి. కొంచెం విశ్రాంతి తీసుకోరాదా?

గిరి : విశ్రాంతి! నా మనస్సుకు ఎక్కడా విశ్రాంతి లేదు. ఉంటే వైద్యంలోనే. ఇప్పుడిప్పుడు అదికూడా లేనట్టే కనిపిస్తోంది. హూ!

రమ : అతను గీసిన బొమ్మలు ఇంకా ఉన్నాయి చూస్తారా?

గిరి : (సంకోచంగా) ఇప్పుడు కాదు.

రమ : (ఉల్లాసంగా) మీరు మళ్లీ ఎప్పుడు వస్తారు గనుక. అయినా అన్నీ నా బొమ్మలే లెండి. మాడక్కర్లేదు.

గిరి : ఎక్కడున్నాయి.

రమ : ఆ గదిలో ఉన్నాయి.

గిరి : చూద్దాం పదండి.

నాల్గవ రంగము

(మరికొన్నాళ్లకు. డాక్టరు గిరి యిల్లు.)

డా రామస్వామి :— గిరిగారూ. డాక్టరు గారూ.

కామే : ఇంట్లో లేరండి. ఎవరు, రామస్వామి బాబుగారా! బాబూ లోపలికి రండి.

రామ : నేనేనమ్మా, ఈయన లేరూ.

కామే : లోపలికి రండి, కూర్చోండి బాబూ.

రామ : ఏమమ్మా అల్లా ఉన్నావు. గిరిగారు ఇంట్లో ఉండే వేళేనే! ఇప్పుడు ఎక్కడికి వెళ్లారు?

కామే : బాబూ. ఏం చెప్పమన్నారు. వారు ఇల్లు మొగం చూచి వారం రోజు లయింది.

రామ : వారం రోజులా, ఊళ్లో లేరా?

కామే : మీ కింకా తెలియదా బాబు? ఆరు నెల్లబట్టి వారికి ఇల్లూ వైద్యమూ ఏమీ పట్టటం లేదు. కారు అమ్మక మయిపోయింది. ప్రాక్టీసు అంతా జారిపోయింది. మాకు ఇల్లు గడవటమే దుర్భరమైపోయింది.

రామ : ఏమిటమ్మా; గిరిలో ఈ మార్పేమిటి? ఏమయాడు, ఎక్కడికి వెళ్లాడు! వైద్యం తప్ప మరో ప్రమేయం ఏమీ అతని కుండేది కాదే! మేం ఎవళ్లం కుదర్చలేని రోగాలకూ అతన్నే తీసికెళ్లేవాళ్లం. అంత తెలివైనవాడు—

కామే : బాబూ, ఏం చెప్పను! అక్కడెవరో రమ అనే ఆవిడ ఉందట. ఎప్పుడూ వారి ఉనికి అక్కడేట! నాలుగు రోజులనుంచి పిల్లవాడికి జ్వరం! పాపం మా కాంపౌండరుగారే, ఆయన దగ్గర నేర్చుకొన్న ఆ మందులూ, ఈ మందులూ ఇంట్లోనే పిల్లడికి తాగించి వైద్యం చేస్తున్నాడు. ఇంకో డాక్టర్ని కిచ్చుకొనే తాహతు కూడా మాకు లేకుండా పోయింది. ఒకప్పుడతన్ని నానా మాటలూ ఆడి నేనే వెళ్లగొట్టబోయాను. పాపం ఇప్పుడతనే మా స్థితి చూసి మమ్మల్ని ఆదుకొంటున్నాడు.

రామ : అయ్యయ్యో ఇదేం ఖర్మమమ్మా.

కామే : నే చేజేతులా చేసుకొన్న ఖర్మ. ఆయనకు వైద్యం మీది అపేక్ష ఇంటిమీద ఉండేది కాదు. ఇంటిగొడవే ఆయనకు పట్టేదికాదు. అది నామీద నిర్లక్ష్య మనుకొని నేనూ రెచ్చిపోయి నా చికాకుతో ఆయనకు మరింత చికాకు కల్గించేదాన్ని. వైద్యంలో చికాకునుంచి, ఇంట్లో విశ్రాంతి కల్గించే మెళుకువలు తెలిసికోలేక, నా చికాకే ప్రధానంగా పెట్టుకొని ప్రవర్తించాను. ఆ విశ్రాంతి ఆయనకు ఆపీధిలో తప్ప దొరకలేదు. ఈ సావాసం సంగతి తెలిసి మరింత రెచ్చిపోయి ఆయనకు మరింత నష్ట కల్గించాను తప్ప, తిప్పుకో లేకపోయాను. ఇప్పుడు కాళ్లమీద పడి బతిమాలు కొందామన్నా ఆయన నాకు కంటికే కనబడకుండా పెట్టున్నారు.

రామ : అయ్యయ్యో! ఎంతవరకు వచ్చింది. రమా! ఆఁ! ఆ వేళ నేను తీసికెళ్ళిన యిల్లే. ఔను, ఆఁ! ఆర్టిస్టుకోసం తీసుకెళ్లాను. అతను ఎప్పుడో ఈ ఊరు విడిచి వెళ్లిపోయాడు. అంటే-అమ్మా, అయితే నీ కాపురంలోకి ఈ హాలాహలం నేనే తెచ్చిపెట్టా

నన్న మాట. గిరి ఇలా అవగలడని ఊహించనన్నా ఊహించలేకపోయాను. ఆయన్ను చూస్తే వైద్యం దృష్టి తప్ప, వేరు లోకదృష్టే ఉన్నట్టు నాకెప్పుడూ కనిపించలేదు. ఛా! ఛా! తెలియక ఎంత పాపం చేశాను!

కామే: బాబూ మీరు చేసిందేమీ లేదు. నేను చేతులారా చేసికొన్నదే.

రాము: అమ్మా, ఒకమాట చెప్తా. అట్లాంటి ప్రజ్ఞావంతులు తమ సుఖం తాము చూసుకోలేరు. తమ శాస్త్ర తృష్ణలో నిమగ్నులయి ఇతరం చూసుకోలేరు. కాని జీవి సుఖం గోర్తాడు. ఆసుఖం ఇతరులు ఆయాచితంగా వాళ్లకు సర్దుబాటు చెయ్యాలి. అల్లా సమకూరని నాడు ఆ శాస్త్ర తృష్ణకూడా మనిషిని నీరసింపజేసి విసిగించి సుఖం ఎక్కడ లభ్యమైనా చాలుననీ, సదసద్వివేచనకూడా మర్చిపోయి ఊబిలో పడిపోతారు. కాని, ఇంకా చిన్నదానివి, ఇది కేవలం నీ తప్పనను.

కామే: నా తప్పే, బాబుగారూ! ఇందులో చిన్నతనమేమీ లేదు. ఆయన నాయందు మొదట అనురాగంగానే ఉండేవారు. కాని స్వసుఖంగాని ఇతరుల సుఖంగాని చూడగల దృష్టి ఆయనకుండేది కాదు. ఆయన అనురాగం పరిపాటి అయిపోయిన విషయంగా తీసుకొని, నన్ను సుఖపెట్టడానికి తను స్వయంగా ఎందుకు కృషి చేయరా, తన వైద్యంపై ఉన్న మమకారం నామీద ఉండకూడదా, అని తెలివితక్కువగా చిరాకు పరాకులతో ప్రవర్తించే దాన్ని. కాని ఇంతగా ఇది అవుతుందని అనుకోలేదు. చెయి జారేక కానీ తెలిసి రాలేదు.

రాము: ఆగమ్మా! ఆగు. నేను వెళ్లి చూసి వస్తాను.

కామే: బాబూ! అధమం పిల్లడి కోసమైనా ఒకసారి వచ్చి వెళ్లమని చెప్పండి.

రాము: ఇప్పుడే వెళ్లి వస్తానమ్మా! ఆరి భగవంతుడా! ఎంత పని జరిగింది!

ఐదవ రంగము

(రమ ఇల్లు)

గిరి: ఓహో. ఏం హాయిగా పాడావు రమా!

రమ: మీరు మీ యింటికెళ్లి వారం రోజులయిందికదా, ఇప్పుడైనా ఒకసారి వెళ్లి రండి.

గిరి: ఏం, నన్ను చూస్తే విసుగ్గా ఉందా? అవునులే ఉన్నదంతా అయిపోయిన తర్వాత అల్లాగే అనిపిస్తోందేమో! రమా, నువ్వు నా కర్థమవటం లేదు. మనిషిలో ఎక్కడా కటుత్వము లేదు—కాని ఎక్కడా హృదయ మిచ్చినట్లు కనపడవేం! పోనీ ఆ ఆర్టిస్టునైనా నువ్వు నిజంగా ప్రేమించావా?

రమ: నిజం చెప్పమంటారా?

గిరి: చెప్పు.

రమ: ఇంకెవరితోనైనా చెప్పకపోదును. కాని మీరు హరికన్న అర్భకులు. అందుకని మీతో చెప్తాను.

గిరి: హరీ! ఔను హరిని ప్రేమించావా— అప్పుడు చూస్తే నువ్వు అతన్నెంతో ప్రేమించావని అనుకున్నాను. కాని అతను వెళ్లినప్పుడు నీలో ఏ విచారమూ లేదు. అతనికి అంత సౌఖ్యం చేకూర్చటానికై పాటుపడినదానవు—అంతలోనే అతన్ని ఎల్లా మరిచిపోయావ్?

రమ: సౌఖ్యం చేకూర్చటం, ప్రేమా, ఒకటేనా?

గిరి: కాదా?

రమ: (నవ్వుతూ) మరి అయితే ప్రేమించలేదని ఎందుకనుకొంటారు?

గిరి: ప్రేమించిన దానివైతే—

రమ: ఒక టడుగుతాను చెప్తారా?

గిరి: ఏమిటి?

రమ: మీదగ్గిర కొచ్చిన రోగుల విషయంలో మీ దృష్టి, రోగి ఆరోగ్యం చేకూర్చటం మీద ఉండేదా, లేక రోగిని ఆదరించటం, కష్టసుఖాలు—మరేవైనా మీకు లెక్కకు వచ్చేవా?

గిరి: నాకు రోగి ఆరోగ్యమే ముఖ్యం. అతని కష్టసుఖాలు ఆలోచిస్తే వైద్యమే చేయలేను.

రమ: అల్లాగే ఎదుటివాడి క్షేమం, మంచీచెడ్డా అన్నీ ఆలోచించి, కేవలం ఎల్లకాలం సుఖమే చేకూర్చగలరా?

గిరి: సుఖం చేకూర్చటంలో ఇవన్నీ భాగాలు కావా?

రమ: కావు. హరి అంత రోగంతో ఉన్నా అతనికి ఉల్లాసం కావాలంటే డాక్టరు వద్దన్న సిగరెట్లు, తాగనిచ్చేదాన్ని. కాఫీ తాగనిచ్చేదాన్ని. ఎంత ఆయాసంలో ఉన్నా, అతను చిత్రం గీసుకోవాలంటే అన్నీ అమర్చిపెట్టేదాన్ని—కాని, ఎన్నడూ అతని చేతకు అభ్యంతరం చెప్పలేదు—

గిరి: ఏ చేతకూ అడ్డు చెప్పకపోవడం ప్రేమా?

రమ: అదే నేననేది. ఔనా, చెప్పండి?

గిరి: రమా! ఏమిటిది! కావాలని నా మనస్సు విరుస్తున్నావా?

రమ: లేదు. ఇప్పుడు రామస్వామిగారు వస్తే, ఇంటివిషయం మాట్లాడేందుకైతే చూడను పొమ్మన్నారు జ్ఞాపకం ఉందా.

గిరి: ఔను. పొమ్మన్నాను.

రమ: బిడ్డకు సుస్తీగా ఉందని చెప్పాడు, విన్నారుకదా?

గిరి: అది కామేశ్వరి కల్పన. అబ్బా! ఆ యింటి విషయం ఎత్తకు—

రమ: అదే, నేనూ ఆలోచిస్తున్నాను. మనుష్యులు తమకు తెలియకుండానే తమ్ము తాము ఎంత మోసం చేసుకుంటారో, ఇతరుల నెంత మోసగిస్తారో అని ఆలోచిస్తున్నాను.

గిరి: రమా! నిన్ను ఆజన్మాంతం ప్రేమించగలను.

రమ: (నవ్వి) మరి నేను మిమ్మల్ని ప్రేమించలేకపోతేనో?

గిరి: రమా! ఇన్నాళ్ళ చర్యా అంతా నటనేనా! నువ్వు నన్ను ప్రేమించటం లేదా?

రమ: (నవ్వి) హరిని ప్రేమించానా చెప్పండి.

గిరి: ఏమో ప్రేమించావేమో. లేకపోతే అతని బొమ్మలు ఇంత అప్యాయంగా దగ్గిర ఎందుకుంచుతావ్.

రమ: ఎవళ్ళనీ ప్రేమించలేని మనిషిగానే నా రూపచిత్రణలో అతను వ్యక్తపరిచాడు. ఆనాడు బొమ్మలో మీకు తెలియలేదన్నారే, అది అదే! అయినా, అతనియ్య వలసిన డబ్బుకోసం ఉంచుకో కూడదా?

గిరి: ఆ బొమ్మలు పావలా ఖరీదు చెయ్యవు అనవూ!

రమ: ఇవాళ చెయ్యకపోవచ్చు, కాని వెయ్యి రూపాయలు ఇచ్చి, మీరే ఒక చిత్రం కొని ఇక్కడే అట్టేపెట్టి ఉంచారా లేదా?

గిరి: రమా, నువ్వు డబ్బుకు మనిషివా?

రమ: (నవ్వుతూ) ఎందుకు కానూ? మీ వైద్యం కోరిన వారి దగ్గిర మీరు నిక్కచ్చిగా డబ్బు పుచ్చుకోలేదా? నేను మనస్సుకు ఉల్లాసమూ, సౌఖ్యమూ, కల్గించేందుకు డబ్బు పుచ్చుకొంటే నేనా తప్పు!

గిరి: అగీ ఇదీ ఒకటేనా? హృదయ మక్కర లేదా?

రమ: మీ రోగులకు హృదయం, జీవితం, కష్టం సుఖం ఉన్నాయేమో మీ రెన్నడైనా పాటించారా? కేవలం రోగిష్టి పదార్థాల లాగ చూడటం తప్ప, మనుష్యులలాగా ఎన్నడైనా వాళ్లను ఆదరించారా?

గిరి: రమా! ఇవాళ అన్నీపోయి బికారి నయ్యాననా ఈ మాట లంటున్నావ్? ఏమిటే ప్రసంగం?

రమ: అదీ నిజమే ననుకోండి. మీ చేతిలో దమ్మిడీ లేకపోతే నేను మిమ్మల్ని పోషించటం మీరు ఒప్పరు కదా.

గిరి: ఛీ! డబ్బు, డబ్బు! వెధవ డబ్బు! ఇవాళ వైద్యం చేస్తే మళ్లీ వేలు గడిస్తాను.

రమ: గడిస్తారు నిజమే. కాని అప్పుడు నేనెందుకు, నేను మళ్లీ మునుపటి ఇల్లాలు లాగా మరొక పీడగా తయారవనా?

గిరి: చాలు రమా, చాలు! తల వాచేటట్లు చేస్తున్నావ్. ఇది నిజంగా నీ ఊహా, లేక తమాషాకి ఇల్లా అంటున్నావా? నిజంగా చెప్పు. నీకు నా మీద ప్రేమ లేదా?

రమ : ఉందని అబద్ధ మాడమంటారా ?

గిరి : పోనీ అబద్ధమే ఆడు.

(బైట కామేశ్వరి కంఠం—అమ్మా రమాదేవి గారిల్లి దేనా ?)

రమ : ఎవరు వారు (గుమ్మంలోకి కదుల్తుంది)

కామే : నే నెవరి నైతే ఏం—డాక్టరు గారిక్కడున్నారా? ఈ అబ్బాయి వారబ్బాయి. వారు నా మొహం చూస్తే బిడ్డవంక కూడా చూడరు. ఈ బిడ్డను కాస్త చూపించి వైద్యం చేయించండమ్మా. మీ ఋణం జన్మ జన్మాల తీర్చుకొంటూ ఉంటాను.

రమ : అమ్మా లోపలికి రండి.

కామే : వద్దు. వారికి కోపం వస్తుంది. బిడ్డను చూపించండి చాలు.

గిరి : కామూ—ఇప్పుడు బిడ్డ నిల్లా తెచ్చావ్ ఏమిటీ వేషం.

కామే (దీనంగా) బిడ్డ స్పృహలో లేడండి. మందిచ్చి బాగుచేయండి. చాలు—మిమ్మల్ని మళ్ళీ వేధించం.

గిరి : ఆఁ! ఏమిటిది ? అబ్బాయి ఇట్లా ఉన్నాడేమిటి? ఇక్కడ ఇంజక్షనైనా మందులు లేవే!

కామే : కాంపౌండరుగారు మీ బేగ్‌లో ఏవో కొన్ని మందులేసి ఇచ్చారు. ఇంజక్షను సూదులు కూడా బెట్టారు—

రమ : లోపలికి పదండమ్మా. నేను ఇప్పుడే వస్తాను. (బైటికి వెళ్తుంది)

గిరి : కామూ! ఎన్నాళ్ళబట్టి ఇల్లా ఉన్నాడు?

కామే : నిన్నటిబట్టి.

గిరి : పెట్టె ఏదీ. ఈ సూది స్టెరిలైజ్ చేసిందేనా.

కామే : అన్నీ మంచివే అని చెప్పారు.

గిరి : ఈ మందు కాస్త పనిచేస్తుంది. పిల్లడు కదలకుండా కాస్త పట్టుకో.

(పిల్లవాడు కాస్త ఏడుస్తూ నాన్నా అని ఏడుస్తాడు)

కామే : మా నాయన ! మా నాయన !

(రమ ప్రవేశించి)

రమ : డాక్టరు గిరిగారూ ! కింద టాక్సీ సిద్ధంగా ఉంది. అబ్బాయిని డిస్పెన్సరీకి తీసుకు వెళ్ళండి. ముందు పదండి, ఈవిడా వస్తున్నారు. గుడ్ బై డాక్టర్

గిరి : రమా, మళ్ళీ వస్తాను.

రమ : వద్దు డాక్టర్. గుడ్ బై. మిమ్మల్ని మళ్ళీ చూడను. ముందు పదండి. (గిరి వెళ్తాడు) అమ్మా మీ భర్తగారి మనస్సు పూర్తిగా మారగల స్థితిలో ఉంది. నేను ఇవాళ ఆయన మనస్సులో పెద్ద తుపానులు రేగించాను. అదను కనిపెట్టి మీరు ఆయన్ని సరిదిద్దుకోండి. వారు కోరేది జీవితంలో అతి స్వల్పమైన మనశ్శాంతి మాత్రమే. సమయం ఎరిగి అది సరిగ్గా సమకూర్చుకొంటూ నిత్యం రాగలిగ్గారంటే—మళ్లీ వారికి పునర్జన్మ కల్పించి, వారి ప్రతిభకు దోహదమిచ్చిన వారవుతారు. నేను మీపట్ల ద్రోహం చేయలేదు. కాని పరిస్థితుల వైషమ్యానికి నన్ను క్షమించండి. క్షేమంగా వెళ్ళిరండి.

కామే : అమ్మా, నువ్వు నిజంగా దేవతవు. నీ ఋణం తీర్చుకోలేను.

రమ : (నవ్వుతూ) దేవతను కాను! వెలయాలిని! నాకిది పరిపాటే! వెళ్లిరండి.

వి. డి. ప్రసాదరావు.

ఊహాగోష్ఠి :

విరహ విషాద నిషా హామేషా-
శ్రీ శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

★

'సీరపాణి'

కృష్ణశాస్త్రిగారు తిరిగి సాహితీసమితి మహాసభలకు అధ్యక్షతవహించబోతున్నారని తెలిసింది. తొలి సందేశ మేదైనా యిప్పించుతారేమో ననే అభిలాషతో, ఒకసారి వారి దర్శనం చెయ్యాలని అనుకున్నాను. అయితే వా రెక్కడ వుంటున్నదీ తెలిసింది గాదు.

'ఆకులో నాకునై, పూవులో బూవునై,
కొమ్మలో గొమ్మనై, నును లేత రెమ్మనై,
ఈ అడవి దాగిపోనా'

అన్నారు, వెనక శాస్త్రిజీ; అది యే అడవైందీమాత్రం సెలవిచ్చారు కారు. ఆ సంగతి ముందు భోగట్టా చేశాను. మిత్రులవల్ల యీ క్రిందివివరాలు తెలుసుకున్నాను.

వెనక వర్డ్స్‌వర్తు మహాకవి ప్రపంచంమీద విప్లవించి, కంబర్‌లాండ్ దుర్గమారణ్యసీమలో ప్రవేశించినట్టే, శాస్త్రిజీ కూడా విప్లవించి, మద్రాసు త్యాగరాజనగర్‌లో, చీమలు దూరని చిచ్చడవీ, కాకులు దూరని కారడవీ అయిన, చెట్లు లేని, 'రాజమన్నారు గార్డెన్సు' నామక ఘోరారణ్యంలో, తారురోడ్లమీద ఎలుగ్గొడ్లులా పరుగెత్తే ఓటిబస్సులు మినహా ఇతర మృగబాధ లేమీ లేని ఒక ప్రాంతంలో, పర్ణశాలను—పర్ణశాలను కాకపోతే, ఎలెక్ట్రిక్ లైట్లూ, ఫ్లషౌట్లూ వున్న సిమెంటుశాల నే ననుకోండి—అద్దెకు తీసుకుని, దుర్భరమైన వనవాసక్లేశం అనుభవించుతున్నారని చెప్పారు.

కృష్ణశాస్త్రిగారి దర్శనానికి వెళ్లడమంటే మొదట్లో చాలా భయమే వేసింది. ఏమంటే:

'ఎవ్వరని ఎంతురో నన్ను? ఏ ననంత
శోకభీకరతిమిర లోకైకపతిని!
కంటక కిరీటధారినై కాళరాత్రి
మధ్య వేళల జీమూతమందిరంపు
గొలువుకూటాల, నేకాంతగోష్ఠి దీర్చి,
దారుణ దివాంధగోదనధ్వనుల శ్రుతుల
బొంగి యుప్పొంగి యుప్పొంగి పొరలిపోవు
నా విలాపనిబిడ గీతికావళి వి
రావముల నర్ధరాత్రిగర్భమ్ము, మఱియు
మఱియు భీషణకాళిమోన్మత్తగాగ
జేయుతటి, నన్ను మీరు వీక్షింపలేదొ!'

అన్నారు శాస్త్రిగారు. అలాంటి వ్యక్తిని చూడటానికి వెళ్లడమంటే, నిజంగా, గుండెలు తీసినబంటుగా వుండాలిగాని, అస్మదాది సామాన్యమానవమాత్రులు తెగించదగ్గవిషయమా? అయితే చివరికి ఒక ధైర్యం తోచింది. ఎప్పుడో కలియుగాంతమై "కాళరాత్రి" వచ్చినప్పుడుగదా ఆయన ముళ్లకిరీటాలు బెట్టుకోవటాలూ, మొండికత్తులతో కోసుకోవటాలూనూ; వెంటనే వెళ్లి కలుసుకుని వచ్చేస్తే మరేం ప్రమాదం లేదనుకున్నాను.

శాస్త్రిజీ ఒకపట్టాన చేజిక్కే సామాన్యఘటం కాదు. ఊరా నాటా ఉపన్యాసకుడు, ఉపన్యాసకుడుగా, అభ్యుదయరచయిత; అభ్యుదయరచయితగా, అనభ్యుదయ కవి; కవిగా గాయకుడు; గాయకుడుగా, ప్రణయోపాసి; ప్రణయోపాసిగా, విరహి; విరహిగా, దుఃఖి; దుఃఖిగా, ఆనందమయుడు; ఆనందమయుడుగా, అలంకారప్రియుడు; అలంకారప్రియుడుగా కుడ్యాలంకారశాస్త్రజ్ఞుడు; శాస్త్రజ్ఞుడుగా, విశ్వాసవాది; విశ్వాసవాదిగా, బ్రహ్మసామాజికుడు; సామాజికుడుగా, విప్లవవాది; విప్లవవాదిగా, నిరాశావాది; నిరాశావాదిగా, నిరంతరకీర్తికాముడు; నిరంతరకీర్తికాముడుగా, నిర్నిద్ర ప్రచారకుడు; ప్రచారకుడుగా మహావ్యవస్థానిర్మాత; నిర్మాతగా, నిష్ఠుర విధ్వంసకుడు. విధ్వంసకుడుగా పునర్నవప్రతిష్ఠాపకుడు— ఇలా సాహిత్యపరిషత్తునుంచి సాహితీసమితికీ, సాహితీసమితినుంచి

నవ్యసాహిత్యానికి, నవ్యసాహిత్యంనుంచి అభ్యుదయ పథానికీ, అభ్యుదయపథాన్నుంచి తిరిగి సాహితీసమితికీ, విచిత్రాభాసంగా, సింహావలోకనంగా, ముక్తపదగ్రస్తంగా, చెంగుచెంగున దూకుతూ, పొదలు, వనములును, గుహలు, నగములును, దిశలు జొచ్చి, మినుపుడుము లనక పరిభ్రమించుచుతూ, ఏరంగంలోనూ అందకుండా, ఎక్కడికక్కడ కిచురించి తప్పించుకు ఊడాయించుతూ వుంటారు.

నేను వెళ్ళేసరికి ఆయన ముందుహాల్లో కూర్చుని వున్నారు. చేతిలో, లంకాకుచుట్ట వెలుగుతోంది. ఆ చుట్టతో ఆ సద్బ్రాహ్మడు పడుతున్న యమయాతన వరూధినీ ప్రవరుల తంతులో వుంది — దాని ఘాటుకు తట్టుకోనూ లేరు, అవతలికి వదిలించుకోనూ లేరు. అది, మాటిమాటికీ పైకొని అధరాన్ని చుంబించటానికి ప్రయత్నించుతోంది. ఆయన "హా! శ్రీహరీ!" అని పైకి కేకలెట్టడం లేదు గాని, ఎడమచేతి మునివేళ్లతో ముట్టీముట్టకుండా బుగ్గపుచ్చుకుని అవతలికి త్రోసెయ్యటానికి ప్రయత్నించుతున్నారు. ఈలోగానే, దాని శృంగారసౌరభాల ఘుమాయింపుతో, ఉక్కిరిబిక్కిరై, పొడిదగ్గు దగ్గుతున్నారు.

ఆయనచుట్టూ, ఒక తండా కవికుమారులు కూర్చుని యేదో కవితాగోష్ఠి నడుపుతున్నారు. అంత మందిలో వుండికూడా, నన్ను గడపలో చూసీచూడడమే, 'రండి! రండి! అన్నగారూ!' అంటూ ఆప్యాయంగా లేచివచ్చి ఆహ్వానించారు.

ఆయన సహృదయత్వమూ, సహృదయానికి ప్రతిచిహ్నంగా వున్న తెల్లటి గ్లాస్కోలాల్చీ, పొంకమైన ఆ విగ్రహమూ, అంత వయసులో వుండికూడా, నెత్తికి పట్టుకుందామన్నా ఎక్కడా మచ్చుకేనా ఒక వెండిపోగు దొరక్కుండా నల్లనీలాల నిగనిగలతో అత్యంత ప్రతిభావంతంగా పోషించుకొస్తున్న 'నీలాలనింగి' లాంటి ఆ తలకట్టూ, ఆ మందహాసమరీచులూ, పదహారేళ్ల బాలాకుమారుడులా చూడ ముచ్చటగా వున్నారు.

ఎంత, బాలాకుమారుడులా వున్నా, ఆ వయసు పెద్దమనిషి, నన్ను పట్టుకుని, "అన్నగారూ!" అనటం కొంచెం చికాకే వేసింది. ప్రతీకారంగా, "నమస్తే గురూజీ!" అనేదామనుకున్నానుగాని, అది సాహితీసమితి మర్యాదనేమాట జ్ఞాపకం వచ్చి సర్దుకున్నాను.

'యేదో గోష్ఠిలో వున్నట్టున్నారు. పోనీ మరో పర్యాయం వచ్చి కలుసుకుంటానులెండి' అన్నాను మామూలు మర్యాదకు.

'ఫరవాలేదు అన్నగారూ! వీళ్లంతా మనవాళ్లే; యువకవులు; దినదినం ఇలాగే యేవేవో, పాటలూ, పద్యాలూ వ్రాసుకొచ్చి వినిపించిపోతూవుంటారు. చూశారూ! చిత్రం' —

'చూళ్లేదండీ — ఏ చిత్రం?'

'చిత్రం కాదండీ — వీళ్లున్నారు చూశారూ, వీళ్లంతా చాలా కట్టుదిట్టంగా కవిత్వం చెప్పగల సమర్థులేనండీ! మనవాళ్లని మనం ఆదరించంగాని వీళ్లంతా ఎలాంటి మెరికల్లాంటి కవికుమారులనుకున్నారేమిటి? నిజానికి వీళ్లలో ఒక అరడజను మందైనా రవీంద్రనాథ్ టాగూర్లూ, సుప్రాతిక డజనైనా వల్లతోల్‌తో పోటీ చెయ్యగలవారూ, డజనుమందైనా సుబ్రహ్మణ్యభారతితో కుస్తీ బట్ట గలవాళ్లూ వున్నారు!'

ఆ 'ఫాల్‌స్టాఫ్' గణిత మేధస్సు నాకు బోధపడలేదు. అసలు అక్కడ వున్నవాళ్లు డజనుకు మించి లేరు. సుబ్రహ్మణ్యభారతితో కుస్తీబట్టే డజనుమందీ పోతే, తక్కిన ఇద్దర్నీ తట్టుకోవలసిన మిగతా పదిహేనుమందీ ఏ గాలిలో అదృశ్యంగా వుందీ అర్థంకాక తికమకపడుతున్నాను. శాస్త్రిగారి వంటి మహామహుల దగ్గర్నుంచి అంత తేలిగ్గా మహాకవిపట్టాలు — వాఙ్మాత్రకమైనవే అనుకోండి — కొట్టెయ్యగలుగుతున్నారంటే ఆ యువకులంతా ఎలాంటి ఘటికులో! అలాంటి మహాకవులను ఒక తండాతండా శిష్యులుగా కలిగి వున్న శాస్త్రిగారిని ఏ ఫాయాలో గౌరవించాలో అవగతం గాక కంగారై నిల్చున్నాను.

వాళ్లంతా శాస్త్రిగారి అభిప్రాయం గ్రహించికాబోలు, తమంత తామే లేచి, 'సెలవిప్పించండి మళ్లీ రేపు వచ్చి దర్శనం చేస్తా' మంటూ ఎక్కడివాళ్లక్కడ వెళ్ళిపోయారు — ఎవరి కాయితాలు వాళ్లు ముడుచుకుని.

ఇద్దరం వెళ్లి అక్కడున్న చెరొక కుర్చీలోనూ కూలబడ్డాం.

'శాస్త్రిగారూ! వాళ్లలో నిజంగా ఆరుగురిదాకా టాగూర్లున్నారా ఏమిటండీ?' అని అడిగాను. టాగూర్ని స్వయంగా యెప్పుడూ ముఖాముఖి చూడనివాణ్ణి గావటంచేత, నిజంగా వున్నారు గాబోలు నని అనుమానమేసింది.

వల్లీవల్లని ప్రియుడులా చేతిలోవున్న లంకాకు చుట్టను, నాజూగ్గా అలా ఒక చిన్న ముద్దుబెట్టుకుని, చిట్టిచిట్టి చిలిపి చిరునవ్వులు, చిన్నిచిన్ని పొగమబ్బులచాటున మరుగుపడి కనుపించకుండా పోయేలాగు, సన్నసన్నగా పొగ వదుల్తూ:

'ఇదుగో అన్నగారూ ! ఒక్కమాటకు సమాధానం చెప్పండి—మనవాళ్ళను మనం ప్రోత్సహించాలంటారా అక్కర్లేదా ?'

'అయ్యో ఎందుకు అక్కర్లేదండీ, తప్పకుండా ప్రోత్సహించాలి. వాళ్లని మనం ప్రోత్సహించకపోతే వాళ్లిమాత్రం మన్నెందుకు ప్రోత్సహించుతారు?'

'అదే నేను చెప్పేది. ఇవాళ వాళ్ళని నేను మహాకవు లన్నాననుకోండి ; వాళ్ళ యువకహృదయాలు సంతోషించుతై. మంచినిచ్చి మంచి తెచ్చుకోమన్నారు పెద్దలు.'

'అలానా అండీ, పెద్ద లన్నమాట గనక, బహుశా ! అది, మంచిమాటే అయివుండాలి'

'అసలు ఒకడు వ్రాసిన కవిత్వాన్ని గాని, ఒకడు అన్నమాటనుగాని, కాదనటానికి ఈ ప్రజాస్వామికయుగంలో మన కేమిటండీ అధికారం? వాక్స్వాతంత్ర్యం వుండాలా అక్కర్లేదా?'

'కావాలి కావాలి స్వామీ! అక్కర్లేకపోవట మేమిటి? - వాణిజ్యస్వాతంత్ర్యమే వుండాలని బ్లాక్ మార్కెట్ ప్రముఖులు ఒక చెంప మహోద్యమాలు సాగించుతూవుంటే, వాక్స్వాతంత్ర్యం అక్కర్లేకపోవడ మేం కర్మ. వాక్స్వాతంత్ర్యమే గాదండీ, కాయకర్మల స్వాతంత్ర్యంకూడా వుంటం మంచిది, ఎందుకేనా.'

'అయినా మీకు తెలీదు గానీండీ—పొరపాటున, లేనిపోని అధికారాలు నెత్తినేసుకుని ఆ యువకులు వ్రాసినవి గనక బాగుళ్ళేదని, కాస్త చప్పరించామంటే యేమిటి జరుగుతుందో మీకేమన్నా తెలుసా?'

'తెలీదుగానీండీ—బహుశా అదేదో ప్రమాదమే అయివుండాలనుకుంటాను'—

'రేపు ఉదయం వాళ్లంతా వచ్చి, నినాదాలు చేస్తూ, నా యింటిముందు ప్రదర్శనాలు జరపరే! కొంతమంది నిరశనవ్రతాలుకూడా ప్రారంభించితే ప్రారంభించవచ్చు.

'అయ్యో బాబోయ్!—అలాగైతే వాళ్లందర్నీ బాగా పొగుడుతూవుండాల్సిందేనండి!— మన కెందుకొచ్చిన రభస.'

'అసలు అదికాదు. వాళ్ల ప్రమాదంమాట అలా వుంచండి; మనవాళ్లని మనం పైకి తెచ్చుకోకపోతే, పరాయివాళ్ళెవళ్లు పైకి తెస్తారండీ! మొదటినుంచీ మన ఆంధ్రకవులు పాడైపోయింది ఎందుకనంటారు?'

'పాడైపోయారని నాకు తెలీదుగానీండీ—పాడైపోతే బహుశా పెద్దవాళ్లు చెప్పినమాట వినకనే పాడైపోయివుండాలి.'

'మీరు చెప్పినట్టు పెద్దవాళ్లు చెప్పినట్టు వినకపోతే పిల్లలు పాడౌతా రనుకోండి—ఇక్కడ నేను మాట్లాడుతున్నది పిల్లలసంగతి గాదు, కవుల సంగతి. మన కవులు ప్రచారం లేక పాడైపోయా రంటున్నాను.'

ఆయన నేనుచెప్పినమాటను కాదనకుండా, ఎంతో మర్యాదగా తన అభిప్రాయాన్ని అలా తెలియజేశారు. అందుచేత నేనూ ఆయనఅభిప్రాయాన్ని కాదనగూడ దనుకున్నాను.

'మీరన్నమాట ముమ్మాటికీ నిజమేనండీ, ప్రచారం లేకే పాడైపోయారు. వాళ్ల వ్యవహారాలన్నీ నలుగురికీ తెలిసేట్టు బాగా ప్రచారం చేసివుంటే ఇంత ఇదిగా పాడైపోయేవారు కాదు,' అన్నాను.

ఆమాట విని ఎందుకో నావంక అదోలా తెల్లపోయి చూశారు.

'ప్రచారం లేక పాడైపోయింది ఒక్క మన ఆంధ్రకవులేనా, ఇతరదేశాల్లోకూడానా అండీ?' అని అడిగాను.

'ఇతరదేశాలవారి కేమండీ, వాళ్లవాళ్లని వాళ్లు నిక్షేపాల్లా పైకి తెచ్చుకుంటారు. ఇటు దక్షిణాదిన గానివ్వండి, అటు వంగదేశంలో గానివ్వండి, అక్కడ సీమల్లోగా నివ్వండి, యే కాస్త గజ్జెరు మొక్క బుట్టినా ఎంతప్రచారం జరుగుతుందో చూడండి! ఇది కలియుగమనీ, గాంధీయుగమనీ, ఆటంయుగమనీ, అడివిగోలయుగమనీ అంటారుగాని, నిజానికి, యిది ప్రచారయుగం; ఇక్కడ ప్రతిభావ్యుత్పత్తుల ప్రమేయమేలేదు. ప్రచారం చేసుకోలేని ఏ వ్యక్తిగాని, సంస్థగాని, ఈనాడు ఏవిధంగానూ పైకి రాలేరు. ఈ విషయాన్ని తెలుసుకునే, సాహితీసమితి అలాంటి బందోబస్తులన్నీ చేసుకుంది.

'బందోబస్తులంటే యేమిటండీ గ్రామరక్షణదళాలను యేర్పాటు చేయించారా?'

'మీ విలేఖరు లెప్పుడూ ప్రతివిషయాన్నీ రాజకీయ తగాయదాలదృష్ట్యా తప్ప సారస్వతదృష్ట్యా అర్థం చేసుకోకపోవటం చాలా విచారకరం. రక్షణదళాలను కాదండీ, ప్రచారదళాలను ఏర్పాటుచేశాం.'

'చక్కనిపని చేశారు! ఆ ప్రచారదళాల వివరాలేమిటో కొంచెం తెలుపుతారా?'

'నిజంగా, సాహితీసమితి, ఆంధ్రసారస్వతరంగంలోకి యేదైనా ఒక క్రొత్త సాంప్రదాయాన్ని

తీసుకువచ్చి, ఆంధ్రకవులను ఉద్ధరించిందంటే, అది యీ ప్రచారదళాల సాంప్రదాయ మొక్కటే. మా సంఘంలోవున్న సభ్యులంతా, ముగ్గురేసీ, నలుగురేసీ కలిసి చిన్న చిన్న కూటములుగా పనిచేస్తారు.'

'మీరు పనిచేసే ప్రత్యేకకూటమిలో ఎవ రెవరున్నారండీ?'

'మాది అగ్రనాయకుల కూటమి. స్వామీజీ, నేనూ, మునిమాణిక్యం, బాపిరాజు వగైరా ఇలాంటి వాళ్లంతా వున్నాం.

'మీ అగ్రనాయకకూటమిలో సత్యనారాయణ గారు కూడా ఉన్నారా అండీ?'

'ఇదుగో అన్నగారూ! ఒక్కమాట చెబుతాను వినండి. నలుగురినీ మంచిమాట చేసుకుని నలుగురిచేతా మంచివాడనిపించుకోడం, ఆ విశ్వనాథాయనకి చేతగాదండీ; "అసలు నావంటి మహాకవి యీ భారత భూమిని మరొక డేడీ?" అంటూ—పోనీ, చాటునా మాటునా గాకుండా—పబ్లికు రేడియోలో, బహిరంగంగా సవాల్ చేస్తూ, పోట్లాటకు సిద్ధంగా కూర్చునే ఆరకంమనిషితో ఎవళ్లకిమాత్రం ఎలా పొత్తుకుదురుతుంది చెప్పండి'

'తమకుమాత్రం ఆమాత్రంకు స్త్రీపట్లు చేతగావా అని'

'ఎజ్బె ఆమనిషికుందు సుతారపు సున్నితపు పంజాపట్లూ, ఫరేదాఫరేబాలూ, ఇవన్నీ రంజించవండీ. ఇంతెందుకు ఒక్క విషయం చూడండి! ఎంత మోటరకం కాకపోతే, ఈ ఇరవయ్యో శతాబ్దంలో రామాయణం రామాయణం మళ్లా యెత్తి వ్రాయడానికి పూనుకున్నా డంటారు? ఎంతసేపూ పెద్దబాడితచెక్కుడే తప్ప, నాజూకుతనమంటూ 'పోగరు,' పనంటూ చేతగాందే!

'పెద్దబాడిత మోయలేనుగానీండి, ఆ నాజూకు 'పోగరు' పనేమిటో నాకూడా కాస్త నేరుపుతారూ?'

ఆయన నావంక అదో పరమానందంగా చూశారు—'ఏమిటండోయ్! అన్నగారూ! మీరు కూడా మా భావకవుల్లో జేరిపోదా మనుకుంటున్నారా ఏమిటి? చేరితే చేరండి, సాహితీసమితిని నవీనపద్ధతుల్లో తిరిగి పునరుద్ధరించుతున్నాం. పూర్వంలాగా, బారు లాల్చీలూ, వల్లెవాట్లూ,కత్తెరగిరజాలూ, ఇవన్నీ అక్కర లేదులెండి—ఆ నిబంధనలన్నీ తీసేశాం!

'నేను కొంచెం బద్ధకంమనిషిని లెండి; సాహితీ సమితిదాకా సాగివచ్చే, ఓపిక లేదుగానీండి, భావకవిత్వం అల్లటానికి చిన్న చిట్కా యేదేనా వుంటే సెలవిప్పించండి. ఏవో రెండు విరహాగీతికలు వ్రాసి మా యింటావిణ్ణు కొంచెం తమాషా చెయ్యాల నుకుంటున్నాను.'

'చెప్పే సెయ్యాలంటారు ?—'

'వ్యాపారరహస్యం కాకపోతే'

'భావకవిత్వం వ్రాయటంవంటి తేపూచీపనీ, తేలికపనీ, మరోటి లేదనుకోండి. ఏమీ లేదండీ—మీరు, జీవితంలో, దినదినం అనేకవస్తువులు కావా లనుకుంటారు. సిల్కు సూటు కావాలనుకుంటారు, మంచి పుస్తకాల బీరువా కావాలనుకుంటారు; రేడియో సెట్టు కావా లనుకుంటారు. వీటిలో ఏ వొక్కటే మనకి లభించవు. ఆ లభించని ప్రతిపదార్థమూ మనకు కావ్యవస్తువే! ఆవస్తువును ఒక దివ్యసుందరితో పోల్చి, అంపకుండా ఆకాశంలో ఎగిరిపోతోందని ఒక విరహాగీతిక వ్రాసెయ్యాలి; ఇంతే రహస్యం. ఇలా మొదలెడితే ఉదయంనుంచి సాయంత్రంవరకూ, కనీసం ఒక నూరు కావ్యాలన్నా తేలిగ్గా వ్రాసెయ్యొచ్చు.

'చాలా చిత్రంగా వుందండి—ఏదీ, ఒక ఉదాహరణకూడా యిప్పించండి.'

'ఇదుగో! లంకాకుచుట్టే వుందనుకోండి; ఇది నాకు కావాలి; ఏ బ్లాక్ మార్కెట్ కారణంగానో లంకాకు చుట్టలు, ఓనాడు బజార్లో దొరకవనుకోండి; ఆపళంగా దానిమీద ఇలా ఒక విరహాగీతిక వ్రాసెయ్యాలి :

'మెఱుగు చామనచాయ నెమ్మేనితోడ
నామనోవీధి విహరించినావు చెలియ!
విరహధూమనిశ్వాసముల్ విడచి నీవు
జిల్లుమని వల్ల నాగుండె ఝల్లుమనియె.
అంతు లేనట్టి కోర్కెల నటమటించి
ఆర్తి చలియించిపోవు నా అధరసీమ
చెమ్మగిలు నీదు చెక్కిలి జేర్చి, నన్ను
తనియజేయవు! కోపమా తరళనయన!'

ఇలా, ధోరణిగా ఎన్ని విరహాగీతికలైనా వ్రాసెయ్యొచ్చు!'

'నాకు లంకాకుచుట్ట అలవాటు లేదుగానీండి—కాఫీమీద ఒక విరహాగీతిక సెలవిప్పించండి!'

'అమ్మమ్మా! మాటలధోరణిని మరిచేపోయాను సుమండీ!—ఎంత అపచారం జరిగిందీ!— ఇద్దరం చెరో గుక్కెడూ కాఫీగరళం సేవించుదాం!' అంటూ లోపలికి వెళ్లారు.

"గరళమే తిందు కడుపార" అన్నమాటకు అర్థమేమిటో అప్పుడు తెలుసుకున్నాను. లోపలనుంచి

రెండు కప్పుల్లో కాఫీ పోసుకొచ్చి ఒక కప్పు నాకు అందించి రెండో కప్పు ఆయన త్రాగుతున్నారు. ఆ విషాన్ని అతి ఆప్యాయంగా "అమృతమట్లు సేవించటం" కూడా కళ్లారా చూశాను. ఆ గుక్కెడు గరళమూ సేవించి :

"మఱచి విశ్వము
మఱచి మేనే
మఱచి సర్వము"—తనను, తానే,—

శాస్త్రిగారు, నెమ్మదిగా "కన్నులు మూసి" చుట్ట దమ్ము లాగుతూ సమాధిలోకి వెళ్తున్నారు.

'శాస్త్రిగారూ!'

'ఆఁ!—'

'మీ భావకవుల అనాదికులగురువుల గురించి, వివరాలేమైనా యిప్పిస్తారా?'

'భావకవుల అనాదికులగురువులు, ఇక్కడ భారతదేశంలో వుండే వంగ వైష్ణవస్వాములు గాదండీ. వాళ్లంతా అక్కడ సీమలో వుండే తెల్లదొరలే—బైరన్, షెల్లీ, కీట్సు, వర్డ్స్‌వర్తులని మహర్షిచతుష్టయం. వాళ్ళ నలుగురిలోనూ బైరన్ను విశిష్టసాంప్రదాయంగా అంగీకరించరు.'

'ఎందుచేతనండీ?'

'ఆయన కేవలం సాహిత్యప్రపంచాన్ని అంటి పెట్టుకొని వుండేవాడు కాదు. మధ్యమధ్య కలం అక్కడ పారేసి కత్తిపుచ్చుకుని, అటు యవనదేశాలకీ, అక్కడికీ, యుద్ధాలకు బయలు దేరి, కులం చెడ్డాడు.'

'తక్కిన ముగ్గురి సంగతి యేమిటండీ?'

'తక్కిన ముగ్గురూ మూడు పంథాలలో విప్లవించారు.'

'ఎవరిమీద?—ఎందుకు?'

'ఎవరిమీదా? ఎందుకూ? అని అడగటానికి ఇవి ఏమన్నా రాజకీయ విప్లవాలనుకున్నారా ఏమిటి? -ఇవి సారస్వత విప్లవాలు—వీటికి ఎవరిమీదా, ఎందుకూ? అంటూ వుండదు. రాజకీయవాదులకూ, సారస్వతోపాసకులకూ వుండే తేడా ఇక్కడే వుంది. రాజకీయవాదులు ముందు ఏదో వకోటి దృష్టిలో పెట్టుకుని, ఎవరిమీదనో ఒకరిమీద విప్లవిస్తారు. విప్లవించేది కలిగివుంటే ఒకరిమీదనో, అరమీదనో విప్లవించటం కుంచితా ప్రాయమని మా భావకవుల అభిప్రాయం. అందుచేత సమిష్టిగా మొత్తం ప్రపంచం యావత్తుమీదా విప్లవం చేస్తారు. మరొక విశిష్టత యేమిటంటే, దీనికో ప్రయోజనం అంటూ వుండకూడదు-నిష్కామకర్మగా వుండాలి; కళకోసమే కళ—విప్లవం కోసమే విప్లవం.'

'సరే! ఆ ముగ్గురి విప్లవపంథాలూ ఏమిటో సెలవిప్పించండి.'

'ప్రకృతి వేదన, విరహ వేదన, మరణ వేదన—వీటిలో వర్డ్స్‌వర్తుది ప్రకృతి వేదన; కీట్సుగారిది విరహ వేదన; షెల్లీది మరణ వేదన. నేను ఈమూడు పంథాలనూ ముప్పిరిగా పేని, ఒక మహా వేదనను సృష్టించాను.'

'బహుశా! అర్జునుడికి కలిగిన మహా విషాదంలాంటి దనుకుంటాను.'

'మళ్లీ అటు యుద్ధాలవైపూ, శంఖాలు పూరించటంవైపూ పోకండి—అదంతా విశిష్టసాంప్రదాయం కాదు. దీట్లో "మరణశయ్యలు పరుచుకొని" ప్రాయోపవేశం చెయ్యటమే తప్ప, ఇతరత్రా యుద్ధాదివ్యాసంగాలేమీ పనికిరావు. ఈ మరణ వేదనా సాంప్రదాయాన్ని సృష్టించిన మహాపురుషుడు షెల్లీ :

'Death is here, Death is there,
Death is busy every-where,
All round, within, beneath,
Above is death—and we are death.
First our pleasures die, and then
Our hopes and then our fears; when
These are dead, the debt is due,
Dust claims dust—and we die too.'

—DEATH-Shelley.

అని ప్రబోధించారు షెల్లీ. నేను అంతకంటే ఇంకొంచెం నాజూగ్గా :

'నా కుసుమ్సులు లేవు
నా కుగాదులు లేవు'—అనీ
'ఏను మరణించుచున్నాను...'
'నా మరణశయ్య పరచుకున్నాను నేనె!
నేనె నాకు వీడ్కోలు విన్పించినాను!'

అని ఇలా వ్రాశాను.'

'షెల్లీగారు అసలు ఇలాంటి ప్రాయోపవేశ విప్లవానికి పూనుకోవటానికి కారణమే లేదంటారా?'

'మీరేదో, గతి తార్కిక భౌతికవాదం గోడవలో ఆలోచిస్తున్నారు. భావకవిత్వానికి అలాంటిదేమీ వుండదండీ—కళకోసమే కళ—మరణించటం కోసమే మరణించటం—అదో మహాకళ.'

'నేను ఈ విషయం మరోలా విన్నానులెండి.'

'ఏమి టంటారూ?'

అప్పట్లో ఇంగ్లండులో పారిశ్రామికవర్గం ప్రబలి, భూస్వామికవర్గాన్ని తుక్కుక్రింద ఊకుతోందనీ, ఆ ఆబోతుల పోరాటంలో ప్రజానీకం, మధ్య, లేగదూడల్లా నలి బిలైపోయారనీ, తాను ఏమి చెయ్యటానికీ తోచక షెల్లీ ఇలా మృత్యువునైపు తిరోగమించాడనీ అన్నారులెండి.'

'వట్టిది వట్టిది; అవన్నీ గిట్టనివాళ్లు చెప్పే మాటలు—అలాంటి వాదానికి ఆధారమేదైనా వుంటే చూపించమనండి.'

'అయితే

'*The fiery mountains answer*
each other,
Their thunderings are echoed
from zone to zone,
The tempestuous oceans awake
one another,
And the ice-rocks are shaken
round Winter's throne
When the clarion of Typhoon
is blown.'

—LIBERTY-Shelley.

అన్నారేమిటండీ షెల్లీ!'—

'వట్టిది వట్టిది— ఇవి షెల్లీ వ్రాసిన మాటలు గావు—ఇదేదో ప్రక్షిప్తమై వుండాలి'

'పోనీలెండి! ఇక కీట్సు గారి విప్లవం సంగతి సెలవిప్పించండి.'

'కీట్సు గారు ఈ ప్రపంచానికి వున్న అందచందాలన్నీ నశించాయనీ, మరమ్మతుకుకూడా ఆస్కారం లేకుండా చెడిపోయిందనీ, ఇక దీంతో లాభం లేదనీ అన్నారు.'

'*Glory and loveliness have*
passed away'—

'పాడయిపోయినమాట నిజమే ననుకోండి; మరి గత్యంతరం ఏమి సెలవిచ్చారూ?'

'కవిత్వపు రెక్కలమీద లేచి, భూమిమీది నుంచి ఆకాశానికి ఎగిరి, మబ్బులచాటున వుండే దేవకన్యలతో సరస సల్లాపా లాడా లన్నారు.

'*Away ! away ! for I will*
fly to thee,
Not choriated by Bacchus
and his pards,
But on the Vieuless wings
of Poesy,
Though the dull brain
perplexes and retards;
Already with thee, tender
is the night,
And haply the Queen-Moon
is on her throne,
Clustered around by all her
starry Fays;
But here there is no light.

—ODE TO NIGHTINGALE-Keats.

దీన్నే నేను మరికొంచెం ఉదాత్తంగా చెప్పాను :
'పక్షి నయ్యెద జిన్ని బుక్క నయ్యెదను,
మనుప నయ్యెద జందమామ నయ్యెదను,
మేఘ మయ్యెద వింత మెఱుపు నయ్యెదను
....
కలవిహంగమ పక్షముల దేలియాడి
తారకామణులలో దారనై మెఱసి
మాయమయ్యెదను నా మధుర గానమున !

తెలిమబ్బుతెరచాటు చెలి చందమామ
జతగూడి దోబూచి సరసాల నాడి

దిగిరాను, దిగిరాను దివినుండి భువికి'—
అని వ్రాశాను.

'అవును గాని శాస్త్రిగారూ! ఆకాశానికి ఎగరటానికి అప్పటి కింకా విమానాలు రాలేదా ఏమిటండీ? పోనీ చేటలు గట్టుకునైనా ఎగిరితే బాగుండేది, పక్షులయ్యేకంటే.'

'అదుగో! మళ్లా దైహికవిప్లవానికి నడుస్తున్నారు. ఇదంతా కేవలం మానసికమైందిగా వుండాలి.'

'అన్నట్టు శాస్త్రిగారూ అసలుసంగతి అడగటం మరిచేపోయాను సుమండీ?'

'ఏమిటి ?'

'ఆ ఊర్వశి...అల్ల రేమిటండీ.'

'ఇదుగో! అన్నగారూ నే నొక్కమాట చెబుతాను వినండి; మనవాళ్ళకు కేవలం అజ్ఞానమనుకోండి. కాస్తంటే గంపంత చేస్తారు. అసలు విషయమేమిటో అర్థంచేసుకోకుండా! నేను ఒక మధుర ప్రపంచాన్ని ఊహించాను; అది మనకు అందటం లేదని దాన్ని ఒక దేవకాంతగా ఊహించి, విరహగీతాలు వ్రాశాను. అక్కణ్ణుంచి మనవాళ్ళంతా నామీద యేవేవో అభాండలాలన్నీ లేవదీశారు'.

'కాదుటగా, అదేమో ఒక కామినీ పిశాచమనీ, అది మొదట కీట్సునుబట్టి కొంతకాలం ఏడిపించిం

దనీ అతగాడు 'లాబెల్లీడేమ్ శాన్సుమెరిసీ' (*La Belle Dame Sans Mercy*) అంటూ గోలపెట్టి, గోలపెట్టి చివరికి చనిపోయాడనీ, అనంతరం—'

'అనంతరం నన్నావహించిం దంటారూ—'

'అబ్బే! నే ననటంలేదు. అల్లా చెబుతా రంటున్నాను.'

'చెబుతారు చెబుతారు. లోకులు కాకు లన్నారు అందుకే.'

'పోనీలెండి అంటే అన్నారు. ఇంతలోకే మీకు వచ్చిన నష్టమేమిటి లెండి-ఆసంగతి పోనీండి-ఇప్పుడికముందు తమ క్రొత్త వ్యాసంగ మేమిటి?'

'నేను ఒక్కమాట చెబుతాను వినండి అన్నగారూ! నేను సాంప్రదాయవాదిని; ఏ క్రొత్త వ్యాసంగాన్ని చేపట్టినా, అది మామూలు మా భావకవుల పాత సాంప్రదాయంలోకి మలచుకోవలసిందే గాని, లేనిపోని డొంకదోవలకు పోయేవాణ్ణి కాదనుకోండి.'

'ఏమిటండీ ఆ సాంప్రదాయం?'

'విరహావేదనా సాంప్రదాయం.— ఇప్పుడు మరో దివ్యసుందరిని చేపట్టాలని విరహావేదనతో తపస్సు చేస్తున్నాను. ఆ తపస్సు ఫలించితే మరో మహాకావ్యం వ్రాస్తాను.'

'మళ్లా యీ క్రొత్తఊర్వశి యెవరు స్వామీ?'

ఆయన యేదో సమాధిలోకి వెళ్ళిపోతున్నట్టు నెమ్మదిగా కనులు మూసుకుంటూ, ఏదో దివ్యదర్శనం చేస్తున్నట్టు మంద్రస్థాయిలో అన్నారు:

'ప్రజాహృదయం'—

'ఆఁ! యేమిటి గుమాజీ?'—

'ప్రజాహృదయం—అదుగదుగో నవోదయ సుందరి! చిరుగజ్జెల జిలుగుసవ్వడులతో గగనపథాన నృత్యం చేస్తున్నది. అదుగో, గగనంనుంచి నెమ్మదిగా దిగివచ్చి కట్టెదుట కనుపించుతున్నది; ఆలింగనంలోకి అలుముకుందా మంటే, అందకుండా మృగతృష్ణలా దూరదూరంగా పరిక్రమించుతున్నది.

ఏడజనిన మనోహరిజాడ లఱసి
కలగు హృదయంబు, నెమ్మది చలన మొందు,
కనులు మూసిన, లోకమోహన మనోజ్ఞ
మూర్తి, చిఱునవ్వు నవ్వుచు మ్రోల నిలుచు.

అయ్యయ్యో! అన్నగారూ! చూడండి! చూడండి! దుర్భరం! ఎలా ఎగిరిపోతున్నదో చూడండి!— హా సఖీ!

కిలకిలని నవ్వు చెలులలో కలసిమెలసి
పూవుపై, మబ్బుపై, చిన్ని పుల్గు వగుచు,
ప్రసవకోమల రమణీయపథము బట్టి
పోవుచుందువు లావణ్యమూర్తి వీవు.

ప్రేయసీ! ప్రేయసీ!
ప్రియుడనే, ప్రేయసీ!
వేయికన్నులు దాల్చి
వెదకుచున్నానే
నల్లమేఘాలలో
నాయమా దాగంగ

తల్లడిలవో నన్ను
తలచిరావో!
మెఱుపువై, ఒయ్యారి
మెఱుపువై కాన్పించి,
అఱసినంతనె, మబ్బు
తెరల దాగితివా!'—

అంటూ కళ్లనీళ్లు గారుస్తూ ఒళ్లుమరిచి ఉన్నారు.

'శాస్త్రిగారూ! శాస్త్రిగారూ!' అంటూ గబగబా భుజంతట్టి పలకరించాను

దృగంచలాలలో కన్నీరు విడుస్తూ, నెమ్మదిగా కనులెత్తి చూసి, గద్గదఖిన్నకంఠంతో:

'ఏమిటి అన్నగారూ?' అన్నారు.

'ఈ స్థితిలో మిమ్మల్ని బాధపెట్టటం సమంజసం కాకపోయినా, నాకు ఒకటి రెండు విషయాల్లో కొంచెం భోగట్టా కావలసివుంది. దయవుంచి రెండు నిమిషాలు ఓపికపట్టండి.'

'అడగండి'—

'మీ రచనలద్వారా సాంఘికమైన ప్రయోజనాన్ని దేన్నయినా సాధించారా?'

'భావకవులకూ, సాంఘికప్రయోజనాలకూ సంబంధ మేమిటి?'

'ఈమధ్యను మీరు అభ్యుదయకవు లయ్యారు కాదూ.'

'వట్టిమాట—నాపంథా నే నెప్పుడూ మార్చుకోను—అభ్యుదయ రచయితలే నన్ను అధ్యక్షుడుగా రమ్మంటే వెళ్లాను'

'రాజమహేంద్రవరం సమావేశంలో మీరు కవులకు ప్రజాదృష్టి యేర్పడాలని ప్రసంగించారనుకుంటానే'

'ఇప్పుడుమాత్రం కాదంటున్నానా?—ప్రజాహృదయ దివ్యసుందరి ఆలింగనంకోసం నేను పడుతున్న విరహవేదనంతా ఒకచెంప చూస్తూకూడా మళ్లా అలా అడుగుతా రేం?'

'తెలుగుభాషకు తమరు మహత్తరమైన సేవజేశా రనుకుంటాను.'

'ఆంధ్రభాషామహార్ణవాన్ని వడకట్టి జపతావళానికి అనువుగా ఒక నూటెనిమిది ముత్యాలను సేకరించాను.'

"ఆ తావళం ఏం జేశారు?"

'తీరా చూస్తే అందులో కూడా సంస్కృతశబ్దాల తళతళ తప్ప, తెలుగు మెఱుగు లేమీ కనుపించలేదు. అందుకే ఆ తావళాన్ని ఒక నమస్కారం చేసి అక్కడ దేవుడిపీటమీద వుంచేసి, ఇప్పుడు మళ్ళీ వ్యావహారిక భాషామోహనను ఆలింగనం చేసుకోవాలని విరహా వేదనతో అటమటిస్తున్నాను!"

'విరహాసమాధిమాట ఒక్క క్షణం అలా దూరంగా వుంచండి స్వామీ!— రేపటి సాహితీ సమావేశాల్లో చర్చించబోయే ప్రధాన కార్యక్రమమేవిఁటండీ.'

'మా సమావేశాలకు ఒక ఉద్దేశమూ, కార్యక్రమమూ అంటూ ఏదీ వుండటానికి వీల్లేదండీ—కళకోసమే కళ—సమావేశంకొరకే సమావేశం.'

'అధ్యక్షపదవికోసమే—అధ్యక్షపదవి అన్నమాట!'

'లేకపోతే—ఎందు కంటారూ?'

ఎందుకో, ఆయనకే తెలియంది నాకుమాత్రమెలా తెలుస్తుంది?

'క్షమించండి శాస్త్రిగారూ—ఆలస్యమైంది; అభినందనాలు తెలియజేయటం మరిచేపోయాను.'

'అభినందనా లేవిఁటి అన్నగారూ?—దేనికి?'

'తమ రీమధ్య మహాకవు లయ్యారని తెలిసి చాలా సంతోషించాను.'

'అదేవిఁ టండోయ్!— ఏదో పేచీ తెస్తున్నారే—ఎవ రన్నారు?'

'తమరే అన్నట్టు విన్నాలెండి.'

'బలేవారే! ఎవరితో?'

'ఆయ నెవరో బందరుమనిషితో అన్నారట.'

'ఆ బందరుమనిషి చేసే పనులన్నీ ఇలానే వుంటై. ఆ అన్న దేవిఁటో తనే అన్నా ననగూడదూ—మళ్లీ నేనన్నా ననట మేవిఁటి? ఇవే మరి, చేతగాని ప్రచారాలంటే ఏవిఁటి?'

'అధ్యక్షపీఠాన్ని అధిష్ఠించటానికి కైసేతలు వగైరా ముగించుకోవాలనే తొందరలో వున్నట్టున్నారు. సెలవు దయచేయించండి వెళ్ళొస్తాను.'

భారత భూగర్భ శాస్త్ర పరిశోధన

గత నూరేళ్ళ చరిత్ర

ఈమధ్యన భారత భూగర్భ శాస్త్ర పరిశోధక సంఘం శతవార్షిక వర్ధంతి జరుపుకొన్నది. ఈనూరు సంవత్సరాలలోను ఈసంఘం ఎన్నో అమూల్యములైన ఖనిజాల ఉనికి కనుగొని, తద్వారా దేశసౌభాగ్యం పెంపొందించింది. ఇంకా ఎన్నో అమూల్యఖనిజాలు కనుగొనడానికి తగిన అవకాశాలు కూడా కలిగించింది. ఇంతేకాక ఈసంఘం అగాధమైన భూగర్భాన్నిగురించి కూడా అమూల్య పరిశోధనలు జరిపింది. దేశీయ ఖనిజసంపత్తు ఎంత ఉన్నదో కనుగొని, ఆసంపదను దేశాభివృద్ధికోసం వినియోగించడమే ఈసంఘోద్దేశ్యము. భూగర్భశాస్త్రసంఘం చేసిన ఉత్తమపరిశోధనలు అనేకం ఉన్నాయి. పి. యస్. బోసు మయూరభంజ్ సంస్థానంలో మంచి ఇనుముగని ఉన్నవిషయం కనిపెట్టాడు. ఇంతకు పూర్వమే డి. హెచ్. విలియమ్స్ రాముగర్‌లో ఒక గొప్ప బొగ్గుగని కనిపెట్టాడు. ఈసమయంలోనే డబ్లియు కింగ్ సింగరేణి బొగ్గుగనులు కనిపెట్టడంకూడా జరిగింది. ఆయా ప్రదేశాలలో ఉన్న అమూల్యఖనిజాల స్వభావం భూగర్భశాస్త్రం ద్వారా పరిశీలించవచ్చును. అతిజాగ్రత్తగా పరిశోధన జరిగినప్పుడే ఆయా భూగర్భపరిస్థితులు మనకు స్పష్టంగా తెలుస్తాయి.

అందుచేత ఈనూరుసంవత్సరాలనించీ భారతీయ భూగర్భ పరిశోధక సంఘం (*Geological sur-*

ey of India) దేశం అంతా పరిశీలించి ఒక భూగర్భశాస్త్రపటం తయారు చెయ్యడానికి ప్రయత్నించింది. ఇప్పటికి ఈపటం తయారుచెయ్యడం చాలా వరకు ముగిసిందనే చెప్పవచ్చును. అయితే ఒరిస్సా, బస్తరు, అస్సామ్, హిమాలయప్రాంతాలలోమాత్రం ఈపని ఇంకా పూర్తికాలేదు. గడిచిన అయిదేళ్లలోను ౩౦ వేల చదరపుమైళ్ల విస్తీర్ణం గల ప్రదేశం పరిశీలించి ఒక పటం తయారుచేశారు. ఈవిధమైన పరిశీలన ఇంతటితో ఆగిపోయేది కాదు. ఎప్పటికప్పుడు విస్తృతదృష్టితో మళ్లీ కొత్త కొత్త పటాలు తయారు చేసుకుంటూనే ఉండాలి. ఇది ఎప్పటికీ నిత్యనూతనంగా జరుగుతూండవలసిన పనే.

ఖనిజాలకోసమే కాక, మరి ఒక ముఖ్యవిషయం కోసం కూడా ఈపరిశోధన జరుగుతూంటుంది. నూతులు మొదలయిన భూగర్భంలోఉండే నీటివసతులు కనిపెట్టడానికికూడా ఈపరిశోధన ఉపయోగిస్తుంది. ఇంతేకాక భూకంపాలువచ్చే అవకాశాలు గుర్తించడంద్వారా,ఆయాజలాధారాలపైకట్టే ఆనకట్టలనిర్మాణానికికూడా భూగర్భపరిశోధన అవసరం.

౧౯వ శతాబ్దంలో భూగర్భపరిశోధక సంఘం బొగ్గుగనులు కనిపెట్టడానికే తన యావచ్ఛక్తీ వినియోగించింది. అయితే, అప్పుడప్పుడు బంగారు, మైకా, మాంగనీసు, పెట్రోలియమ్ మొదలయిన వాటి గనుల విషయంలోకూడా కొంత పని జరిగింది. ౨౦వ శతాబ్దంలో ఆర్థికదృష్ట్యా ఈఖనిజాల కోసం మరింత గట్టి పరిశోధన జరిగింది. క్రమంగా డైమండ్ డ్రిల్లింగ్ (*Dimoud Drilling*) విధానం ద్వారా సింగభూమ్‌లో రాగిపరిశ్రమ అభివృద్ధి చెందింది. భారతదేశంలో జరిగిన ఉక్కు, ఇనుము పరిశ్రమల అభివృద్ధికూడా భూగర్భశాస్త్రపరిశోధనల ద్వారానే జరిగిందని చెప్పాలి. సింగభూమ్‌లోని క్రోమైట్ పరిశ్రమకు, అల్యూమినియమ్ గనులకు భూగర్భపరిశోధన బాగా చేయూత ఇచ్చింది. దీనివల్లనే క్రమంగాసింగభూమ్‌లో అల్యూమినియమ్ కరిగించే పరిశ్రమ ఏర్పడ్డది.

౨౦ఏళ్ల క్రిందట భారతదేశంలో ౧౯ కోట్ల రూపాయల ఖరీదయిన ఖనిజసంపత్తే ఉత్పత్తిఅయింది. ప్రత్యేక సంస్థలే ఈపని తలపెట్టినా, భూగర్భశాస్త్రపరిశోధనల సహాయంవల్లనే ఈఅభివృద్ధి జరిగిందని అనాలి.

శాస్త్రీయ పరిశోధన :

ఈదేశంలో జరిగిన పరిశోధనలవల్ల శాస్త్రజ్ఞులు ఇండియా, 'ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, దక్షిణ అమెరికా అంటార్కిటికాలను కలిపే భూభాగం ఒకటి ఉండేదనీ, ఈభూభాగం అంతా సముద్రంలో మునిగిపోయినదనీ తెలుసుకొన్నారు. ఈవిషయం డబ్లియు, టి, బ్లాన్‌ఫోర్డ్ లండన్‌లో ౧౮౯౯లో జరిగిన భూగర్భశాస్త్రపరిషత్తుకు అధ్యక్షత వహించినసందర్భంలో వెల్లడించారు. ఈవిషయమే తరవాత వెగ్నర్ కనిపెట్టిన కాన్టినెన్టల్ డ్రిఫ్ట్ (*continental Drift*) సిద్ధాంతానికి దోహదం ఇచ్చింది.

ఇలాగే ౧౮౯౭ లో ఓల్డామ్ పండితుడు ఆసంవత్సరంలో అస్సామ్‌లో సంభవించిన భూకంపాన్ని గురించి జరిపిన పరిశోధనలవల్ల భూగర్భాన్ని గురించిన అపూర్వవిషయాలెన్నో తెలిశాయి.

మనదేశంలో జరిపిన భూగర్భపరిశోధనలవల్ల సివాలిక్, బెలూచిస్థాన్‌కొండల అడుగున అతిప్రాచీన జంతువుల అస్థిపంజరాలెన్నో దొరికాయి. వీటివల్ల ఎన్నెన్నో జంతు, మానవ పరిణామ విశేషాలు శాస్త్రజ్ఞులకు స్పష్టంగా తెలిశాయి. ఈపరిశోధనలు జంతుశాస్త్రాభివృద్ధికెంతో ఉపకరించాయి. ఇంతేకాక శాస్త్రజ్ఞులు ఇప్పటి ఏనుగుజాతికి పూర్వం ఇంకొకవిధమైన ఏనుగుజాతి ఉండేదని కనుగొన్నారు. అతిప్రాచీనమైన ఈజాతి ఏనుగులు ఇప్పటి ఏనుగులకంటె బాగా పెద్దవిగా ఉండేవనీ, వీటి దంతాలు బాగా సుదీర్ఘంగా పెరిగేవనీ భూగర్భశాస్త్రజ్ఞులకు తెలిసింది. ఈజంతువులకు సంబంధించిన వివరాలన్నీ ప్రపంచంలోని అనేక వస్తుప్రదర్శనశాలల్లో భద్రపరిచారు. సివాలిక్ వస్తుప్రదర్శనశాలలో ఇప్పటికీ ఈప్రాచీన జంతువుల అస్థిపంజరావశేషాలు పరిశీలించవచ్చును.

౧౮౬౪లో హిమాలయభూగర్భాన్నిగురించి కొన్ని పరిశోధనలు జరిపారు. ఈవిషయంలో హెచ్. బి. మెడ్లికాట్ ఒకచిన్న గ్రంథం ప్రచురించాడు, ఈపరిశోధనలు గంగా రావీ నదులమధ్యనున్న హిమాలయ భూభాగగర్భంలోనే ఎక్కువగా కేంద్రీకరించారు. ఇవి జరిగినతరవాత భూగర్భశాస్త్రజ్ఞులనేకులు ఈవిషయంలో తమశక్తిని కేంద్రీకరించారు. వీరి అందరి కృషివల్ల హిమాలయ భూగర్భం చాలా క్లిష్టమైనదనీ, దీనిలో అనేక శాస్త్రీయ రహస్యాలున్నాయనీ శాస్త్రజ్ఞులు గుర్తించగలిగారు.

౧౮౯౩లో హాలండ్,మద్రాస్‌లో ఒక విచిత్రమైన రాయి కనిపెట్టాడు. ఇది గ్రానైట్ రాయి. దీనిలో హైపర్‌స్థీన్ అనే ఖనిజం కనిపించింది. ఇలాగే కలకత్తాలో జాబ్‌క్రానిక్ అనే ఆంగ్లేయుని సమాధిలోకూడా ఇటువంటి రాయి దొరికింది. అప్పడీరాతికి ఆ ఆంగ్లేయునిపై గౌరవంకొద్దీ క్రానికైట్

అని పేరు పెట్టారు. ఇది శాస్త్రదృష్ట్యా చాలా ముఖ్యమైన రాయి. ఆతరవాత ఈజాతిరాళ్ళన్నిటికీ ఈపేరే పెట్టారు. ఈవిషయంలో హాలండ్ ప్రచురించిన గ్రంథం భూగర్భశాస్త్రంలో చాలా ముఖ్యమైనది.

భారతదేశ భూగర్భశాస్త్రాభివృద్ధికి అప్పుడప్పుడు అనేక విఘాతాలేర్పడ్డాయి. ౧౯౦౩ మొదలుకొని ౧౯౧౦దాకా ఈశాస్త్రసంఘానికి పర్యవేక్షకుడుగా ఉండిన సర్ థామస్ హాలండ్ ఈ పరిశోధన సంఘాన్ని బాగా అభివృద్ధికి తీసుకువచ్చాడు. అప్పుడు దేశీయులు, ప్రభుత్వము, ఈయన చేసిన పని ఎంతో ప్రశంసనీయంగా ఉన్నదని అభినందించారు. కాని ౧౯౩౧ తరవాత ఈసంఘం వ్యయకర్తనానికి గురిఅయి బాగా క్షీణించిపోయింది. అప్పుడెంతో మంది ప్రధానోద్యోగుల పదవులు తగ్గించివేశారు. మళ్లీ ద్వితీయ ప్రపంచ సంగ్రామందాకా ఈసంఘం ఇల్లాగే ఉండిపోయింది. ద్వితీయప్రపంచసంగ్రామంలో మళ్లీ ఖనిజాల అవసరం ఎక్కువైంది. అప్పుడు తిరిగి ఈసంఘం బాగా కోలుకోసాగింది. అయినా మంచి అనుభవంగల శాస్త్రజ్ఞుల కొరత అల్లాగే ఉండిపోయింది.

గడచిన ౧౦సంవత్సరాల్లోను జరిగిన అభివృద్ధివల్ల ఇప్పటికీ శాస్త్రపరిశోధకసంఘంలో ౧౭౦మంది పరిశోధకులున్నారు. వీరిలో ౧౩౬ మంది భూగర్భశాస్త్రజ్ఞులు. మిగిలినవారందరు రసాయనాది శాస్త్రాల్లో నిష్ణాతులయినవారు. ప్రస్తుతావసరాలనుబట్టి ఈశాస్త్రజ్ఞుల సంఖ్య పెట్టించాలని భారతప్రభుత్వం ఆలోచిస్తున్నది. భారతవిస్తీర్ణతలో ౧౦వ వంతు విస్తీర్ణతగల ఇంగ్లండులో నూరుగురు భూగర్భశాస్త్రజ్ఞులున్నారు. ఇందుచేత, మనదేశ వైశాల్యం దృష్ట్యా మనకున్న ప్రస్తుత శాస్త్రజ్ఞుల సంఖ్య ఎంతమాత్రము చాలదనే అనాలి.

ప్రస్తుతం ఈ శాస్త్రపరిశోధనశాఖను మూడు విభాగాలుగా విభజించారు. వీటిలో మొదటిశాఖ ఆయా స్థలాలలో ప్రాథమిక పరిశోధన జరుపుతుంది. రెండవశాఖలోని సాంకేతిక నిపుణులాయా పరిశోధనలను గురించి తమసలహాలిస్తారు. మూడవ శాఖలోని భూగర్భశాస్త్రనిపుణులు ఆయా పరిశోధనలు కొనసాగిస్తారు. ఈమూడు శాఖలవారు బాగా పరస్పర సహకారంతో పనిచేస్తూ ఉంటారు.

దీన్నిబట్టి చూస్తే యుద్ధాత్పూర్వంకంటె ఇప్పుడీ సంస్థ ఎంత బాగా అభివృద్ధి చెందిందో గ్రహించవచ్చును. భూగర్భశాస్త్ర ప్రత్యేక నిపుణుల శాఖ ఇటీవలనే బాగా అభివృద్ధిపొందింది. ఈసంఘం మొదటినించీ అంతర్జాతీయ దృక్పథంతోనే వ్యవహరిస్తున్నది. దీనిలో పనిచేసిన జర్మనీ, ఇటలీ, ఫ్రెంచి, ఇంగ్లిష్ శాస్త్రజ్ఞుల సంఖ్యను బట్టే, భారతీయుల సంఖ్యనుబట్టే ఈవిషయం గ్రహించవచ్చును. ఇప్పుడీ సంఘంలో పని జేసేవారు చాలామంది భారతీయులే. వీరు తమ పూర్వులు ప్రారంభించిన పరిశోధక గౌరవం నిలబెట్టుకుంటూ పరిశోధనలో బాగా ముందుకు చొచ్చుకుపోతున్నారు. వీరి పరిశోధనవల్ల భారతదేశ ఖనిజసంపదతోబాటు ఖ్యాతి, గౌరవము కూడా దినదినాభివృద్ధి పొందుతున్నాయి.

('సండే స్టాండర్డు' వ్యాసానికి కృతజ్ఞతతో)

గ్రంథవిమర్శనము

అతడు—ఆమె

రచన: వుప్పల లక్ష్మణ రావు.

[ప్రకాశకులు : కొమర్రాజు వినాయకరావు, రామచంద్రరావురోడ్డు : విజయవాడ. వెల : మూడు రూపాయలు.]

ఇది భార్యాభర్తల దినచర్యరూపంలో ఉన్న ౨౮౦ పుటల నవల. భార్య ఎమ్. ఏ. పరీక్షలో ఉత్తీర్ణురాలయిన విద్యాధికురాలు. ఈమె పేరు శాంత. భర్త పేరు చిదంబర శాస్త్రి. ఇతడు సీమలో బారిష్టరు పరీక్ష ఇచ్చి చెన్నపట్టణంలో ప్రాక్టీసు పెట్టాడు. ఇద్దరికీ స్నేహం కలిసింది. క్రమంగా రిజిస్టరీ వివాహాలు చేసుకుని సంసారాలు ప్రారంభిస్తారు. వీ రిద్దరు తమ వివాహజీవితానికీ, ప్రాపంచిక జీవితానికీ మధ్యన ఉద్భవించిన సన్నివేశాలు తమ దినచర్యా రచనల ద్వారా తెలియజేస్తారు. భార్యాభర్తలు తమ తమ పూర్వ ప్రేమానుభూతులు నిస్సంకోచంగా ఒకరితో ఒకరు చెప్పుకుంటారు. వీరి ప్రేమజీవితాలలో పెద్దపెద్ద అఘాతా లేవీ సంభవించవు. చిన్న అభిప్రాయభేదం వచ్చినా చివరి కది సమసిపోతుంది. మొట్టమొదట పెద్దపెద్ద జమిందారుల కేసులుపట్టి బాగా డబ్బుగడించిన శాస్త్రి, చివరికి కొంత పశ్చాత్తాపపడి జమిందారులచే పీడితులయిన రైతాంగం తరఫున వాదించడానికి సీమకు బయలుదేరతాడు. ఈ బయలుదేరడమైనా ముందు ముందు దీనివల్ల తనకు లాభించగలదనే దృష్టితోనే జరిగినట్టు కనిపిస్తుంది.

భార్యాభర్తలిద్దరు ఉన్నత మధ్య తరగతిలో, కలిగినకుటుంబాలలోనివారు. రచయిత ఈ నవలలో వీరి జీవితాలల్లో వచ్చే ఎగుడిగుడులు, కష్టసుఖాలు మొదలయిన చిన్న చిన్న సన్నివేశాలు చాలా స్వాభావికంగా చిత్రించారు. ఒక ఉన్నత, మధ్య తరగతికుటుంబానికి చెందిన న్యాయవాది జీవిత సంఘటనలు తెలుసుకోవాలంటే ఈ నవల చాలా ఉపకరిస్తుంది.

అయితే ఈ నవలలో అధునికమైన ఒక సాంఘికసమస్యగాని, వ్యక్తి జీవితంలో కలిగే సంఘర్షణ గాని కనబడదు. అందుచేత మధ్యమధ్య వచ్చే సరికి క్రమంగా నవల చదివే ఆసక్తి తగ్గిపోతుంది. ఈ నవలలోని ప్రధానవ్యక్తులు శాస్త్రి, అతనిభార్య, జీవితంలో సామాన్యమైన కష్టసుఖాలకు తట్టుకుంటూ చివరికి జీవితం ఖులాసాగా గడిపివేసే వ్యక్తులలాగే కనిపిస్తారుగాని, అంతకంటె వీరిలో ప్రత్యేకత ఏమీ కనబడదు.

ఇద్దరు వ్యక్తుల కథనాలద్వారా కథ నడిపిస్తూ నవల రచించడం విదేశీయ వాఙ్మయాల నవలలో కనిపిస్తుంది. కాని తెలుగులో ఈవిధమైన ఫక్కీకి ఇదే మొదటి గ్రంథమని అనాలి. ఈ రచనావిధానం కొత్తదైనా రచయితదీనిలో కృతకృత్యు లయినారు.

ఆంధ్రదేశంలో సాహిత్యస్థాయికి చెందిన నవలలు ఇటీవలనే కొంచెం కొంచెంగా బయలుదేరుతున్నాయి. మన దేశంలో బయలుదేరిన నవలలదృష్ట్యా చూస్తే 'అతడు— ఆమె' మంచి నవలగా పరిగణించవచ్చును. ఈ నవలలోని వ్యావహారికశైలి సహజంగా జాతీయంగా ఉన్నది. తెలుగునవలా పరిణతి గ్రహించగోరే వారందరికీ ఇది తప్పక పఠించవలసిన పుస్తకము.

మధుమావతి మొదలైన నాలుగు కథలు

[డాక్టరు నేలటూరు వెంకటరమణయ్య గారు వెల ౨-౦-౦

వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, ర, మల్లికేశ్వరస్వామి గుడిసందు లింగిచెట్టివీధి, మన్నడి, మదరాసు]

ఇది మధుమావతి, కంపిలిరాయలు, ప్రతీకారము, ఛత్రగ్రాహి అనే నాలుగు ఆంధ్ర చారిత్రిక కథల సంపుటము.

మన ఆంధ్రచరిత్రలో నవలలకు, కథలకు అనువైన ఇతివృత్తాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. అయితే ఈవిధమైన చారిత్రిక ఘట్టాలు తీసుకొని సరియైన చారిత్రికదృష్టిలో రచనలు చేసేవారు చాలా తక్కువగా ఉన్నారు. అపారమైన మన చారిత్రిక సంపదను వాఙ్మయంద్వారా తెలుగువారి కందిచ్చి, వారిలో జాతిగౌరవము, సంప్రదాయాభిలాష ఇనుమడింప జెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మధుమావతి ఈదృష్టితో రచించిన కథల సంపుటి.

శ్రీ డాక్టరు నేలటూరి వేంకటరమణయ్యగారు సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు. వీరి కథలలో అంతటా నిశితంగా సృజించిన చారిత్రిక వాతావరణం కనిపిస్తుంది. వీరు కథలలో ఆయా ఘట్టాలలో వాడిన పాదూవాహులు, పాపోసు, పుట్టకోట, పైదజవాను మొదలయిన పదాలు ఆయా కాలాల చరిత్ర వాతావరణం సృజించడానికి బాగా తోడ్పడుతున్నాయి. వీరు వాడిన ఉదాత్త గ్రాంధికశైలికూడా ఆయా ఇతివృత్తాలకు తగినంత హుందాతనం చేకూర్చేదిగానే ఉన్నది.

అయితే ఈకథలలో అక్కడక్కడ, మహమ్మదీయ బలాలు దండెత్తి వచ్చినప్పుడు నిపుణులైన స్త్రీ చారిణుల శృంగార ప్రభావంవల్ల హిందూరాజులు మహమ్మదీయుల రహస్యాలు తెలుసుకుని తద్ద్వారా వారి నోడించినట్లు కనిపిస్తున్నది. ఈ సంఘటనలు చరిత్రప్రసిద్ధాలనడానికి తార్కాణాలు లేవు. ఒకవేళ ఉన్నా ఇవి ఆయా రాజుల పౌరుషస్ఫోరకాలు కాజాలవు.

శ్రీ వేంకటరమణయ్యగారు వ్రాసిన నాలుగు కథలలోను 'ఛత్రగ్రాహి' లో కథకకౌశలం కనిపిస్తున్నది. మిగిలిన కథలలో కథకకౌశలం అంతగా కనబడదు. అయినా ఆయా కాలాలమర్యాదలు, ఆచారాలు తెలుసుకోదలిచినవారికి ఈ కథాసంపుటి బాగా ఉపయోగిస్తుంది.

పుస్తక ముద్రణాదికాలు చక్కగా ఉన్నాయి. పుస్తకంచివర ఇచ్చిన ఆయా ప్రాచీనపదాల వివరణ పట్టిక పాఠకులకు చాలా సహాయకారిగా ఉన్నది. ప్రకాశకులు ఇంకా చారిత్రికవాఙ్మయానికి ప్రోత్సాహం ఇవ్వగలరని ఆశిస్తున్నాము.

భాషా పరిశోధన ప్రయోగ విశేషములు

[శ్రీ నిడదవోలు వెంకటరావు ఎం ఏ. నెం. ౨, ఆలంగత్తాపిళ్ల వీధి, ట్రిప్లికేను, మదరాసు.]

ఇది ఆంధ్ర భాషా పరిశోధన ప్రయోగ విశేషాలను గురించిన ౭౨ పుటల గ్రంథము, దీనిలో శ్రీ వేంకటరావు గారు ౮౦ తెలుగు ప్రయోగాల సాధుత్వాసాధుత్వాలు కూలంకషంగా చర్చించారు. ఇది క్రౌనుసైజులో ౭౨ పుటల గ్రంథమైనా, ఆంధ్రభాషా సంప్రదాయ జిజ్ఞాసువులకిది చాలా అమూల్యమైన గ్రంథము. ఇందులో వీరు ఆయాపదాల సాధుత్వాసాధుత్వాలే కాక 'నూలిపున్నము' మొదలైన పదాల నిజమైన అర్థంకూడా వెల్లడించారు. ఈ పుస్తకంలో అంతటా చిరకాలంనించి వీరు చేస్తూన్న ఆంధ్రభాషా పరిశోధన నిశితానుభవం బాగా వ్యక్తమవుతున్నది.

ఈప్రయోగాలన్నీ జాగ్రత్తగా పరిశోధించిన వారికి చెళ్లపిళ్లకవీంద్రులు చెప్పిన "తెలుగున కున్న వ్యాకరణ దీపము చిన్నది" అన్నమాట స్ఫురణకు వస్తుంది.

ఉదాహరణకు వీరు చూపించిన సౌదామనీ, సౌదామినీ పదాలు పరిశీలిద్దాము. సౌదామని వ్యాకరణశాస్త్రసాధువైన పదము. దీనికి నన్నయభట్టారకుని ప్రయోగం శ్రీ వెంకటరావుగారే చూపించారు.

అయితే వెనువెంటనే కొలని గోపరాజు సింహాసన ద్వాత్రింశతిలోని సౌదామినీ అనేప్రయోగం కూడా శ్రీ వెంకటరావుగారే ఇచ్చారు. 'సౌదామని' అని అనడం కంటె సౌదామిని అనడంలో ఎక్కువ సౌకర్యం ఉండడంవల్ల వ్యావహారికంగా ఇల్లాంటి ప్రయోగాలేర్పడి ప్రామాణికకవుల గ్రంథాలలో ప్రవేశించి ఉండవచ్చును.

అపూర్వమైన ఆంధ్ర భాషా పరిశ్రమ చేసి శ్రీ వెంకటరావు గారే ప్రయోగ విశేషాలు సేక

రించినందుకు తెలుగుపండితలోకం వారియెడ కృతజ్ఞమై ఉండగలదు.

అయితే ఇంతమాత్రంచేత వారి కర్తవ్యం ముగిసిపోలేదు. తెలుగువ్యాకరణం నేటి కదారి, తెన్ను లేకుండా ఉన్నది. భాషాశాస్త్ర దృష్టితోను, వ్యాకరణశాస్త్ర దృష్టితోను మనభాష కొక సమగ్ర వ్యాకరణం నిర్మించుకోవాలి. అంతవరకు శ్రీ వెంకటరావుగారి పరిశ్రమకు సాఫల్యం సిద్ధించదని తోస్తున్నది.

శ్రీ కామాక్షీ పంచశతి

[ముదిగొండ వీరభద్ర మూర్తి. అమర సాహితి: గుంటూరు. వెల: ౨-౮-౦]

ఇది మూకార్య్ళకు శంకరులు సంస్కృతంలో రచించిన మూక పంచశతికి శ్రీ ముదిగొండ వీరభద్ర మూర్తిగారు రచించిన కవితానువాదము. ఈ అనువాదం తాము చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి సలహాపై భావానువాదంగానే నిర్వహించామని కవి పీఠికలో వ్రాశారు.

మూక పంచశతి సంస్కృతవాఙ్మయంలో సుప్రసిద్ధమైనది. భావానువాదం చెయ్యడంవల్ల తెనుగులో కొంత గ్రంథం తప్పనిసరిగా పెరుగుతుంది. అయినా శ్రీ వీరభద్రమూర్తిగారు కొన్ని కొన్ని చోట్ల మూలానికి మెరుగులు పెట్టినట్టుగా ఈ గ్రంథం పద్యాల్లోకి అనువదించారు.

అక్కడక్కడ వీరు చక్కని తెలుగునుడికారం ప్రదర్శించినా మొత్తంమీద వీరికి సంస్కృత ప్రాయమైన శైలిపై అభిమానం ఎక్కువ. ఇంతేకాక సంస్కృతసమాస నిర్మాణంలో కూడా వీరికి అభిమానం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ క్రింది పద్యాలనుబట్టి వీరి అనువాదపాటవం గ్రహించవచ్చును.

"కనుబొమతీవవింటి నొసికమ్మున
కంచుట యేమి చంద్రభూ
షణు వరమౌని రాజ్యసుఖ సంపదకు
న్నిను నిల్పుటేమి యె
ల్లను నిమిషమ్ములో నొక విలాస బలమ్మన
దీర్చెనమ్మ! నీ
కనుగొనజెట్టి యెట్టి
మొనగాడ! కదే! జగదేకపావనీ!"

"పన్నిటన్ జలకమ్ము లార్చి నొడలన్
పాటీర గంధమ్ములం
ది న్నా కొంపు సుపాణిపెట్ల హావణించేన్
వెన్నెల న్నించె నిం
కెన్నో! చల్లని చేతలన్ దనిపె తల్లీ!
నీ కటాక్షమ్ము తా
పౌన్నత్యమ్మున సంస్మృతిం పసలు మా
యం దెంత వాత్సల్యమో!"

ఈ క్రిందిపద్యంలో వీరి సంస్కృత విమిశ్ర పద్యగమన వైఖరి పరిశీలించవచ్చును.

రక్షాదక్షము సర్వలోకములకున్
రాజీవ శిక్షాచణ
ముత్క్షీణ ద్యుతి రమ్యమున్ విభుధ గమ్యమ్మున్
మగున్నమ్యమున్
మోక్షస్థానము వేద వేల్లన కళా ముగ్ధమ్ము
మా తల్లి కా
మాక్షీదేవి యడుంగునోయి సయిదోడా!
పండెరా పుణ్యముల్"

కామాక్షి పంచశతినుండి ఇలాంటివి ఎన్ని పద్యాలైనా ఉదాహరించవచ్చును. శ్రీ వీరభద్రమూర్తిగారు ఉభయభాషల్లోను చక్కని విద్వత్తుగల పండిత కవులు. ఆంధ్ర కవితాభిమానుల కిది తప్పక పరించవలసిన ఉదాత్తకవితారచన.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad